ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 13-8-2017 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 4

రూ. 6-00 పేజీలు 16+24+32 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



- తొలిసారిగా జన్యు సవరణలతో మానవ పిండం అభివృద్ధి
- వ్యాధికారక పరివర్తనల తొలగింపు
- పరిశోధనలో పాలుపంచుకున్న కశ్మీర్‌వాసి సంజీవ్ కౌల్

కోరుకునే లక్షణాలతో పిల్లలు

దిల్లీ: ఎలాంటి పిల్లలు కావాలి? అని ఎవరైనా అడిగితే..! చంద్రుడు, ఇంద్రుడు.. ఇలా మనం చెప్పే పేర్ల జాబితాకు హద్దులే ఉండవు. మరి నిజంగా చంద్రుడంత అందంగా పిల్లలు పుడతారా? అంటే అవుననే అంటోంది తాజా పరిశోధన. ఇప్పటివరకూ కలగా మిగిలిన ఈ ఆశలకు నేనున్నానంటూ ఊపిరిపోస్తోంది. అమెరికా నిపుణులు చేపట్టిన ఈ సంచలన పరిశోధనలో కశ్మీర్‌కు చెందిన సంజీవ్ కౌల్ పాలుపంచుకోవడం విశేషం. తొలిసారిగా వీరు జన్యు సవరణలతో ఓ పిండాన్ని అభివృద్ధిచేశారు. వ్యాధికారక జన్యు పరివర్తనలను 'జన్యు సవరణ పరిజ్ఞానం' సాయంతో వీరు విజయవంతంగా తొలగించారు. ఫలితంగా భవిష్యత్తు తరాలకు ఈ ప్రమాదకర జన్యువులు సంక్రమించేందుకు వీలు లేకుండా అయింది. మరో కీలక అవరోధాన్నీ ఈ పరిశోధనలో అధిగమించారు. జన్యుసవరణ అనంతరం ఇదివరకు పిండంలోని కొన్ని కణాల్లో ఇంకా వ్యాధికారక పరివర్తనలు కనిపించేవి. ప్రస్తుతం వీటిని లేకుండా చేయగలిగారు. "కోరుకునే లక్షణాలతో పుట్టే పిల్లలు (డిజైనర్ బేబీస్)" ఈ పరిశోధనతో పూర్తిగా సాధ్యం కాకపోయినా.. తొలి అడుగులు పడ్డాయని మాత్రం చెప్పొచ్చు. ఈ తరహా ప్రయోగాన్ని చేపట్టేందుకు చైనా ఇదివరకే ప్రయత్నించింది.

క్రిస్పార్‌క్యాస్-9 సాయంతో...

తాజా పరిశోధనలో క్లస్టెర్డ్ రెగ్యులర్లీ ఇంటెర్‌స్పేస్డ్ షార్ట్ పాలింద్రోమిక్ రిపీట్స్ (క్రిస్పార్‌క్యాస్-9) సాంకేతికతను ఉపయోగించారు. ఇది గుండెపోటుకు కారణమయ్యే ప్రాణాంతక పరివర్తనలను పూర్తిగా తొలగించడంలో క్రియాశీలంగా పనిచేసింది. ఓ మానవ పిండంపై ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ఇదే తొలిసారి. దీంతో భిన్న వ్యాధుల జన్యు పరివర్తలపైనా దీన్ని ప్రయోగించేందుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతానికి ఈ పిండాలను మానవుల్లో ప్రవేశపెట్టడంలేదని పరిశోధనలో పాలుపంచుకున్న అమెరికా, దక్షిణ కొరియా, చైనా నిపుణులు తెలిపారు. అయితే ఈ పిండాల్లో కొన్నింటిని (మిగతా 2లో)



విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో జనావాసాల మధ్య తిష్టవేసిన కోతులు

మర్కటం.. మహాకష్టం

జనావాసాల్లోకి వానరాలు

- వస్తువులు లాగేస్తూ, పెంకులు పీకేస్తూ హల్‌చల్
- భయంతో ప్రమాదాలకు గురవుతున్న జనాలు
- పంటపొలాల్లోనూ కిష్కింధకాండే

వనాలను వీడి జనావాసాల్లోకి వస్తున్న వానరాలు క్రమంగా సంతతి పెంచుకుంటూ దాదాగిరి చెలాయిస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను దర్జాగా దోచుకెళ్తుంటాయి. ఇంటి పెంకులను పీకేస్తున్నాయి. పంటపొలాల్ని పాడు చేస్తున్నాయి. వీటివల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఏటా 50వేల హెక్టార్లకు పైగా పంటనష్టం జరుగుతుందని అంచనా. సుమారు రూ.150కోట్ల వరకు రైతులు నష్టపోతున్నారు. కోతుల బాధ భరించలేక ప్రధాన పంటల సాగు నుంచి వైదొలగుతున్నారు.

– ప్రత్యేక కథనం 11లో

జలరవాణా జోష్!

- ముక్త్యాల-విజయవాడ మార్గంలో పనులు ప్రారంభం
- తొలిదశలో 90 కిలోమీటర్ల పొడవైన నావిగేషన్ ఛానల్
- రూ.98 కోట్లు మంజూరుచేసిన కేంద్ర ప్రభుత్వం

ఈనాడు – అమరావతి

శాతావాహనుల కాలంలో వాణిజ్యపరంగా ఓ వెలుగువెలిగిన అమరావతి మళ్లీ పూర్వపు కళను సంతరించుకునే దిశగా పరుగులు పెడుతోంది. ఇందులో భాగంగా ఇక్కడ జలరవాణాను పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి చాలాఏళ్లు ఇక్కడ జలరవాణా ఓ వెలుగువెలిగింది. కాలువల్లో పడవలు ఒయ్యారంగా కదలాడేవి. ఆ తర్వాత కాలంలో వివిధ కారణాల వల్ల ఈ మార్గం మూతపడింది. అమరావతి రాజధాని కావడం, చౌకైన, పర్యావరణ అనుకూలమైన జలరవాణాను ప్రోత్సాహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో.. జాతీయ ఉపరితల జల రవాణా మార్గం-4లో పనుల హడావుడి మొదలైంది. ఈ పనులన్నీ సాఫీగా సాగితే సరకు రవాణా, పర్యాటకుల పడవుల రాకపోకలతో ఈ ప్రాంతానికి కొత్తశోభ సమకూరనుంది.

దేశంలోని వివిధ నదులు, ప్రధాన కాలువల్లో 111 జాతీయ ఉపరితల జల రవాణా మార్గాలను అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా.. 2016లో జాతీయ ఉపరితల జలరవాణా చట్టాన్ని తీసుకువచ్చింది. 111 జల రవాణా మార్గాల్లో.. 106 కొత్తగా గుర్తించినవి. ఐదు పాతవి. వీటిలో కాకినాడ నుంచి పుదుచ్చేరి వరకు 1,078 కిలోమీటర్ల పొడవున ఉన్న జాతీయ ఉపరితల జలరవాణా మార్గం-4 ఒకటి. ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి మీదుగా వెళుతుంది. ఇందులో ఎక్కువ భాగం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. ఈ మార్గం అభివృద్ధిలో భాగంగా తొలి దశలో ముక్త్యాల-విజయవాడ మధ్య కృష్ణా నదిలో నావిగేషన్ ఛానల్ (నౌకలు ప్రయాణించే కాలువ) తవ్వకం పనులు మొదలయ్యాయి. దీన్ని ఫేజ్-1 ప్రాజెక్టుగా చేపట్టారు. ముక్త్యాల-హరిశ్చంద్రపురం మధ్య నావిగేషన్ ఛానల్, టెర్మినళ్ల నిర్మాణం వంటి పనులన్నీ పూర్తిచేసి... వీలైనంత త్వరగా ఈ మార్గంలో రవాణా ప్రారంభించాలని జాతీయ ఉపరితల రవాణా మార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృతనిశ్చయంతో ఉంది. ఫేజ్-1 ప్రాజెక్టు కోసం ఐడబ్ల్యూఏఐ రూ.98 కోట్లు మంజూరు చేసింది. కృష్ణా నదిలో ముక్త్యాల నుంచి విజయవాడకు మధ్య దూరం సుమారు 90 కిలోమీటర్లు. ఈ రెండింటి మధ్యలో (మిగతా 2లో)



కాలువలో ఇసుక తవ్వుతున్న డ్రెడ్జింగ్ యంత్రం

ప్రయోజనాలెన్నో..

- ముక్త్యాల-విజయవాడ జలరవాణా మార్గం సిద్ధమైతే... దానిలో వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన బార్జ్‌లు నడుస్తాయి. బార్జ్‌ల్లో స్వయంగా నడిచేవి (సెల్ఫ్ ప్రొపెల్డ్), టగ్‌లతో (ఇంజిన్‌లతో) లాక్కుని వెళ్లేవి ఉంటాయి.
- ప్రయాణికుల రవాణా, పర్యాటకుల విహార యాత్రల కోసం మర పడవలు, విలాసవంతమైన పడవలు నడుపుతారు.
- కృష్ణాజిల్లాలో జగ్గయ్యపేట చుట్టుపక్కల సిమెంటు పరిశ్రమలు ఎక్కువ. ముక్త్యాల టెర్మినల్ అక్కడికి దగ్గరగా ఉంటుంది. ఆటెర్మినల్‌లో సిమెంటు బస్తాలు బార్జ్‌ల్లో నింపి, హరిశ్చంద్రపురం టెర్మినల్‌లో దించుతారు. అక్కడి నుంచి రాజధానికి సరఫరా చేస్తారు.
- వీటీపీఎస్ నుంచి బూడిదను (ఫ్లైయాష్‌ను) సిమెంటు పరిశ్రమలకు సరఫరా చేయవచ్చు. గుంటూరు జిల్లాలో సున్నపురాయి ఎక్కువగా దొరుకుతుంది. సిమెంటు పరిశ్రమలకు దాన్ని సరఫరా చేయవచ్చు.
- జగ్గయ్యపేట నుంచి రాజధానికి రోడ్డు మార్గంలో రవాణా చేయాలంటే సుమారు 140 కిలోమీటర్లు వెళ్లాలి. అదే జల రవాణా మార్గంలో 70 కిలోమీటర్ల ప్రయాణంతోనే రాజధానికి చేరుకోవచ్చు. రోడ్డు మార్గంలో రవాణా చేసేందుకయ్యే ఖర్చులో మూడో వంతు ఖర్చుతోనే జలరవాణా చేయవచ్చు.

ఉద్దానం ఉసురు తీస్తున్న ఇకోలి

- ప్రమాదకరంగా మారిన బ్యాక్టీరియా
- నాటుకోళ్లు, జంతువుల్లోనూ మూత్రపిండాల వ్యవస్థ ధ్వంసం
- ఏయూ పరిశోధనలో వెల్లడి

2లో

విశాఖ ఇల్లు సెప'రేటు'

- స్థిరాస్తి ధరలు 24% పెరుగుదల
- దేశంలోని అన్ని నగరాల కంటే ఎక్కువ



బ్రిటన్‌లో తెలుగు బాలుడి 'ప్రజ్ఞ'

- మెన్సా ప్రజ్ఞా లబ్ధి పరీక్షలో ఐన్‌స్టీన్ కంటే ఎక్కువ స్కోర్ సాధించిన యశ్వంత్

2లో

వెండి తెరపై నిప్పుల కుంపటి!

- అగ్నిమాపక నిబంధనలు పాటించని సినిమా హాళ్లు
- 60 శాతం థియేటర్లకు నిరభ్యంతర పత్రాలే లేవు
- అంతర్గత అలంకరణ కోసం మండే స్వభావం అధికమున్న పదార్థాల వినియోగం

3లో

బ్రిటన్‌లో తెలుగు బాలుడి 'ప్రజ్ఞ'

ఈనాడు, హైదరాబాద్: బ్రిటన్‌లో నివసిస్తున్న తెలుగు విద్యార్థి బండి యశ్వంత్(12) ప్రతిష్ఠాత్మక మెన్సా ప్రజ్ఞా లబ్ధి (ఐక్యూ) పరీక్షలో 162 స్కోర్ సాధించాడు. ఈ పరీక్షలో సాధించే అత్యధిక స్కోర్ ఇదే. మేధస్సును పరీక్షించి సభ్యత్వం ఇచ్చే బ్రిటన్‌కు చెందిన మెన్సా ఇంటర్నేషనల్ సంస్థ ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ ఐక్యూ పరీక్షలో ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ సాధించిన స్కోర్ 160. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని కొలకలూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దంపతులు బండి కృష్ణమోహన్, మాధవీలతల కుమారుడు యశ్వంత్. తెలుగు, ఆంగ్లం, ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్ భాషల్లో యశ్వంత్ మాట్లాడగలడు. లాటిన్ కూడా కొద్దిగా తెలుసు. ప్రస్తుతం రష్యన్ భాష నేర్చుకుంటున్నాడు. సైన్స్, గణితం, అంతరిక్ష శాస్త్రం అంటే అత్యంత ఆసక్తి అని.. పారిశ్రామికవేత్త కావాలన్నది తన లక్ష్యమని యశ్వంత్ పేర్కొన్నాడు. ఏడో తరగతి పూర్తి చేసిన యశ్వంత్ వచ్చే నెలలో ఎనిమిదో తరగతిలోకి ప్రవేశించనున్నాడు.

రేపటి నుంచి కోస్తాకు భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: కోస్తా జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 16 వరకు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగైదు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం రాయలసీమ, తమిళనాడు మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడిందని, ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి ఏర్పడిందని వివరించారు.

కరగని ఐస్‌క్రీమ్‌ని అభివృద్ధి పరిచిన పరిశోధకులు

టోక్యో: ఐస్‌క్రీమ్ అంటే ఇష్టపడని వారు ఉండరు. కానీ పెట్టె నుంచి తీసి తినేలోపే అది కరిగిపోతుంటుంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు జపాన్‌లోని కనజావా యూనివర్సిటీ పరిశోధకులు కొత్త పద్ధతిని ఆవిష్కరించారు. ఐస్‌క్రీమ్ ద్రవీభవన స్థానం పెంచడం ద్వారా తినేప్పుడు కరిగిపోకుండా ఉండే ఆస్కారం ఉంటుందని వారు గుర్తించారు. ద్రవీభవన స్థానం పెంచిన ఐస్‌క్రీమ్‌ను గది ఉష్ణోగ్రత వద్ద మూడు గంటల పాటు, హెయిర్ డ్రైయర్ సాయంతో అయిదు నిమిషాల పాటు వేడి గాలిలోనూ ఉంచి పరీక్షించినా అది కరగలేదు. స్ట్రాబెర్రీస్ నుంచి తీసిన పాలీఫినాల్ ద్రావణాన్ని ఐస్‌క్రీమ్‌కు కలపడం ద్వారా కరగకుండా ఉంటుందని యూనివర్సిటీ పరిశోధకులు తోమిహిస తెలిపారు.

ఉద్దానం ఉసురు తీస్తున్న ఇకోలి

న్యూస్‌టుడే- ఏయూ ప్రాంగణం (విశాఖపట్నం)

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం మూత్రపిండాల వ్యాధికి మూల కారణాలు వెల్లడయ్యాయి. ప్రజలే కాదు.. కొన్ని జంతువులు సైతం ఈ వ్యాధి పీడితులేనని తేలింది. భూమి లోపలి విషతుల్యమైన లోహాలు, ఇకోలి బ్యాక్టీరియా కారణంగానే నీరు, వాతావరణం కలుషితమై వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యుల పరిశోధనలో తేలింది. ఏయూ సైన్స్ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య డీఈ బాబు నేతృత్వంలోని ఏడుగురు పరిశోధక విద్యార్థుల బృందం 2015 డిసెంబరు నుంచి పరిశోధన ప్రారంభించింది. 300కు పైగా నమూనాలను సేకరించింది. ఉద్దానం ప్రాంత నీరు, ఆహార పదార్థాల ప్రయోగాల విశ్లేషణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకొచ్చాయి. బహిరంగ మూత్ర విసర్జన వల్ల ఇకోలి బ్యాక్టీరియా వాతావరణంలో వేగంగా విస్తరించి కొత్తవారికి వ్యాధి సోకుతోంది. చివరకు కొబ్బరి నీళ్లు సైతం హానికారక జాబితాలో చేరడం తీవ్రతను తెలియజేస్తోంది. వరి పంటకు మాత్రం ఎలాంటి ప్రమాదం లేకపోవటం కొంత ఉపశమనమే. బయట ప్రాంతాల నుంచి దిగుమతవుతున్న కూరగాయాల్లోనూ ఎలాంటి విషపూరిత పదార్థాలు బయటపడ లేదు.

ఎలా నిర్ధరణకొచ్చారంటే...

ఉద్దానంలోని నీరు, కొన్ని రకాల చేపలు, కూరగాయలు, కొబ్బరిబొండాలు, చిట్టెలుకలు, ఎలుకలు, కుందేళ్లు, నాటుకోళ్లపై ఏయూ బృందం పరిశోధించింది. అక్కడ భూగర్భజలంలో భారలోహాలు విషతుల్యమైనవిగా మారాయని వెల్లడయింది. అక్కడ వినియోగంలో ఉన్న నీరు, ఆహార పదార్థాలను విశాఖకు తీసుకొచ్చి నాటుకోళ్లు, కుందేళ్లు, ఎలుకలపైనా బృందం ప్రయోగించింది. దీన్ని బయో ఎక్యుమలేషన్ విధానం అంటారు. కొంతకాలానికి వీటిల్లోని మూత్రపిండాలు సైతం దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఈ పరిశోధనాంశాలను ఇటీవల హార్వర్డ్ విశ్వవిద్యాలయ నిపుణుల దృష్టికి కూడా తీసుకెళ్లారు.

హద్దులు విస్తరించుకుంటూ...:

సుమారు 18 ఏళ్ల కిందట ఉద్దానంలో ఈ వ్యాధి ఉనికి వెలుగులోకి తెచ్చింది. గతంలో కొన్ని గ్రామాలకే పరిమితమైన ఈ వ్యాధి కవిటి, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని వంద గ్రామాల్లోనూ కనిపిస్తోంది. ఇద్దవానిపాలెం, బల్లిపుట్టిగ, చిన్నబల్లిపుట్టిగ, వరక, రాజపురం, కొత్తపుట్టిగ, యర్రగోవింద పుట్టిగ, తిప్పని పుట్టిగ, అగ్రహారం, చినశ్రీరాంపురం, పెద శ్రీరాంపురం, బోరివంక, బలరామపురం, గొల్లగంటి, మెట్టూరు, కవిటి ఇలా పలు గ్రామాలలో సమస్య తీవ్రంగా ఉంది.



మూత్రపిండాల వ్యాధి వల్ల కుందేలు మూత్రాశయంలో నిలిచిన మూత్రం
★ రక్తస్రావానికి గురైన కోడి కాలేయం



ఉద్దానం ప్రాంతంలో ప్రవహించి సముద్రంలో కలుస్తున్న ఏరు

పరిశోధన విషయాలివి..

- శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల మధ్య ఉద్దానం విస్తరించి ఉంది. కొన్ని గ్రామాలు సముద్రతీరంలో ఉన్నాయి. మహేంద్రగిరుల నుంచి ప్రవహించి సముద్రంలో కలుస్తున్న సెలయేళ్లు, వాటిల్లోని కలువ పూలు, చప్పనీటిలో అడుగున ఉండే మట్టలు, బొమ్మిడాయిలు వంటి చేపలు, భూగర్భజలం, నాటు కోళ్లు, కొబ్బరిబొండాలు, మునగ, పనస కాయలు ఇలా చాలావాటిల్లో విద్యార్థి బృందం పరిశోధించింది. మహేంద్రగిరుల్లో బాక్సైట్, ఇనుము సహా పలు ఖనిజాలు అధికంగా ఉండడం వల్లనే ఇక్కడి భూమిలో వాటి శాతం ఎక్కువ ఉండొచ్చని తేలింది.
- మనిషి మాదిరి మూత్రపిండాల వ్యవస్థ ఉన్న కుందేళ్లు, చిట్టెలుకలపైనా పరిశోధించారు.
- మాంగనీసు, ఐరన్, అల్యూమినియం, స్ట్రాన్షియం, బేరియం, క్రోమియం, కాపర్, జింక్, గాలియం తదితర 20 లోహాలను భూమి లోపల గుర్తించారు. అల్యూమినియం, స్ట్రాన్షియం తదితర నాలుగైదు ప్రమాదకర లోహాలు భూమిలోపల క్లోరైడ్‌తో కలిసి నీటిలో చేరుతున్నాయి.
- ఇనుము నీటిలో కరగదు. క్లోరైడ్‌లో కరిగి ఫెరిక్లోరైడ్‌గా మారుతుంది. నీటిలో ఉన్న సోడియంక్లోరైడ్‌తో కలిసి అల్యూమినియం క్లోరైడ్‌గా మారుతోంది. మామూలుగా అల్యూమినియం నీటిలో కరగదు. ఇది కోర్లైడ్‌తో కలిస్తేనే నీటిలో కరుగుతుంది. ఇలా భూమిలోపల నీటిలో కరిగి బోర్ల ద్వారా బయటకొస్తోంది. ఈ నీటిని తాగిన వారు లోహ కాలుష్యం బారిన పడుతున్నారు. ఇది వారి మూత్రపిండాలపై ప్రభావం చూపుతోంది. ఈ నీటి ద్వారా పెరిగిన మునగ, పనస, కొబ్బరి ఉత్పత్తులూ విషతుల్యమవుతున్నాయి.
- ఈ నీరు ఊరిన ఏరుల్లో జీవించే బొమ్మిడాయిలు, మట్టలు, సవళ్లు, ఇంగిలాయిలు, మార్పుల వంటి చేపల్లోనూ ఈ లోహాలు చేరుతున్నాయి. వీటిని తిన్నవారి మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి.

లోహ ప్రభావంపై జాగ్రత్త



శరీరంలో లోహ ప్రభావం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మూత్రపిండాల వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి మెటల్ కీలేషన్ చేస్తే వ్యాధి చాలావరకు చికిత్సకు లొంగుతుంది. ఎంతవరకు మూత్రపిండం దెబ్బతిన్నదో గుర్తించాలి. మూత్రపిండం పునర్ వినియోగానికి రీజనరేషన్ ప్రక్రియ ద్వారా శరీరంలో పోయిన కణాలను తిరిగి ఉత్పత్తి చేయాలి. ఈ విషయంలో మరిన్ని ప్రయోగాలు చేయాల్సి ఉంది. ఉద్దానంలో రోగ పీడితుల నుంచి ఇతరులకూ వ్యాధి సోకే పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై అప్రమత్తత అవసరం. ఏయూలోకానీ, ఉద్దానంలోకానీ ప్రత్యేక పరిశోధనశాలను ఏర్పాటుచేయాలి.

–ఆచార్య డి.ఇ.బాబు, ప్రిన్సిపల్, సైన్స్ కళాశాల, ఆంధ్రవిశ్వవిద్యాలయం.

- పంటలకు అమ్మోనియం సల్ఫేట్, నైట్రేట్ వంటి వాటిని ఎరువుగా ఉపయోగిస్తారు. ఇవి భూమి లోపల ఉన్న లోహాలతో సమ్మిళతమై ప్రభావం చూపుతున్నాయి. తద్వారా ఆహార ఉత్పత్తులు లోహ కాలుష్యాలవుతున్నాయి. ఉద్దానంలోని వరి పంటలో మాత్రం ఈ ప్రభావం కనిపించలేదు.
- నాటుకోళ్లలోని మూత్రపిండాలు కూడా దెబ్బతింటున్నాయి. వాటి కాలేయాన్ని ఆహారంగా తీసుకున్న వారిలో వ్యాధి తీవ్రత కనిపిస్తోంది.

తక్షణం చేయాల్సినవి

- వ్యాధి పీడితులు మాంసం, చేపలు తినడాన్ని మానేస్తే మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు. అక్కడి కొబ్బరినీళ్లు తాగడం, పనస, మునగ తక్కువ తీసుకుంటేనే మంచిదని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం నూరుశాతం అమలు చేయాలి.

పుట్టి ముంచుతున్న బ్యాక్టీరియా

ఉద్దానంలో అపరిశుభ్ర వాతావరణం వల్ల ఇకోలి బ్యాక్టీరియా వృద్ధి చెందుతోంది. ఇది వ్యాధి పీడితుల్లోకి ప్రవేశించి మూత్రపిండాల కణాలను తినేస్తోంది. దీనివల్ల లోపల రక్తస్రావమవుతోంది. మూత్రవిసర్జన నాళం కుచించుకుపోతోంది. మూత్రంలోని యూరిక్ యాసిడ్ వెనక్కి వెళ్లి రక్తంలో కలుస్తోంది. క్రమేణా రక్తంలో దీని శాతం పెరుగుతోంది. వ్యాధిగ్రస్తులు బహిరంగ మూత్ర విసర్జన చేసినపుడు వెలువడిన ఇకోలి బ్యాక్టీరియా ఇతరులకు సోకుతోంది. ఉద్దానం నుంచి వ్యాధి ఇతర ప్రాంతాలకు వేగంగా విస్తరించడానికి బహిరంగ మలమూత్ర విసర్జన కూడా ప్రధాన కారణమని తేలింది.

- ఉద్దానంలోని చిన్న చిన్న జంతువుల మూత్రపిండాలు, కాలేయాలకు లోహ కాలుష్య ప్రభావం వల్ల శరీరం లోపల రక్తస్రావమవుతోంది. ఇకొలి బ్యాక్టీరియా వృద్ధి చెంది మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి.
- లోహ కాలుష్యం వల్ల మనుషులు, జంతువుల్లోనూ కాల్షియం సమస్య ఉత్పన్నమవుతోంది. కాళ్లు లాగడం, జిల రావడం వంటి లక్షణాలు, చలి వణుకుతో జ్వరం వస్తోంది.

విశాఖ ఇల్లు సెప'రేటు'!

- స్థిరాస్తి ధరలు 24% పెరుగుదల
- హైదరాబాద్, విజయవాడలే కాస్త నయం
- అప్పులతో అల్లాడిపోతున్న స్థిరాస్తి రంగం
- ఆర్థిక సర్వేలో విస్తుగొలిపే అంశాలు

ఈనాడు, అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో విశాఖపట్నం ఇప్పుడు ఖరీదైన నగరంగా మారిపోతోంది. ఇక్కడ స్థిరాస్తి రంగంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే అక్షరాలా చెప్పిన మాట ఇది. దేశంలోని ప్రధానమైన 50 నగరాల్లోని స్థిరాస్తి ధరల్లో పెరుగుదల సరళిపై అధ్యయనం చేసే 'ఎన్‌హెచ్‌బీ రెడిడెక్స్' గణాంకాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ 50 నగరాల్లో ప్రధానంగా 30 నగరాల్లో స్థిరాస్తి ధరలు బాగా పెరుగుదల నమోదు చేసుకున్నాయి. వాటిలో అత్యంత ఎక్కువగా ధరలు పెరిగింది ఒక్క విశాఖపట్నంలోనే. మిగిలిన నగరాలకు అందనంత దూరంలో ఇక్కడ ఇళ్ల ధరలు పెరుగుతున్నట్లు నివేదిక వెల్లడించింది. 2015-16 చివరి త్రైమాసికం నుంచి 2016-17 చివరి త్రైమాసికం మధ్య ఏకంగా విశాఖపట్నంలో 24% ధరలు పెరిగాయని ఆర్థిక సర్వే పేర్కొంది. తదుపరి స్థానంలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నిలిచింది. అయితే ఆ నగరంలో ధరల పెరుగుదల 16శాతమే. హైదరాబాద్ నగరంలోనూ స్థిరాస్తి ధరలు పెరిగినా విశాఖతో పోల్చితే చాలా తక్కువే. అక్కడ ఇళ్ల ధరల్లో పెరుగుదల కేవలం 2.5శాతమే నమోదు చేసుకుంది. విజయవాడలో అయితే అది ఒక శాతంలోపే ఉంది. ముంబయి నగరంలోనూ ఇళ్ల ధరల పెరుగుదల్లో పెద్దగా మార్పులేదు. ఇక్కడ 2.9%, దిల్లీలో 4.8, చెన్నైలో 9.9% ధరలు పెరిగాయి. పొరుగునున్న బెంగళూరులో 7% ధరలు పెరిగాయి. ఇక బిహార్ రాజధాని పట్నాలో అయితే -7.1% ధరలు తగ్గాయని ఆర్థిక సర్వే పేర్కొంది.

అప్పులతో స్థిరాస్తి కుదేలు.. విశాఖపట్నంలో ఇళ్ల ధరల పెరుగుదల గణాంకాలు చూసి స్థిరాస్తి రంగం దూసుకెళ్తోందనుకోవడం పొరపాటే. దేశ స్థిరాస్తి రంగం గడ్డుపరిస్థితి ఎదుర్కొంటోందని ఆర్థికశాఖ విడుదల చేసిన ఆర్థిక సర్వే పేర్కొంది. ముఖ్యంగా స్థిరాస్తి రంగంలో అప్పులు కుప్పల్లాగా పేరుకుపోతున్నాయట. రియల్ ఎస్టేట్ రంగంలోని నిర్మాణదారులు బ్యాంకుల వద్ద కుప్పలుతెప్పలుగా అప్పులు చేశారు. నిర్మాణదారుల నుంచి రూ. 83వేల కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉన్నాయని సర్వే పేర్కొంది. 2006-07లో ఈ బకాయిలు రూ. 25వేల కోట్లు మాత్రమే. ఇక స్థిరాస్తి రంగం నుంచి బ్యాంకులకు నిరర్థక బకాయి(ఎన్‌పీఏ)లు విపరీతంగా పెరగుతున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. ఫలితంగా బ్యాంకులు కూడా స్థిరాస్తి రంగానికి రుణాలివ్వడంలో తగ్గుదల నమోదవుతోందని తెలిపింది. 2010లో 57 % బ్యాంకులు స్థిరాస్తి రంగానికి రుణాలిస్తే 2016లో అది 24 శాతానికి పడిపోయిందని పేర్కొంది. గత మార్చి నెలాఖరు వరకు దేశంలోని వాణిజ్య షెడ్యూల్ బ్యాంకులకు 8.6 ట్రిలియన్ రూపాయల హౌసింగ్ బకాయిలు వసూలు కావాల్సి ఉందట.



అమ్మకాలు నేలచూపులు.. దేశంలో స్థిరాస్తి రంగంలో అమ్మకాలు దారుణంగా పడిపోయాయని ఆర్థిక సర్వే పేర్కొంది. దేశంలోని ప్రధానమైన 8 నగరాల్లో గతేడాది ఐదేళ్ల కనిష్ఠ స్థాయికి ఇళ్ల అమ్మకాలు పడిపోయాయని ఈ సర్వే తెలిపింది. గతేడాది 2,45,000 యూనిట్ల అమ్మకాలు మాత్రమే జరిగాయి. 1,76,000 యూనిట్ల నిర్మాణాలే ప్రారంభమయ్యాయి. గత మూడేళ్లతో పోల్చితే ఇది 64% తక్కువట. దీనికి ప్రధాన కారణం స్థిరాస్తి ప్రాజెక్టుల్లో తీవ్రమైన జాప్యం, కాలయాపన, పెద్ద నోట్లు రద్దు ప్రభావం కూడా ఒక కారణమని తెలిపింది. స్థిరాస్తి రంగంలో విదేశీ పెట్టుబడులు తగ్గాయి. 2015-16లో 4.6 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వస్తే, గతేడాది అది కేవలం 1.9 బిలియన్ డాలర్లకు పడిపోయిందని ఆర్థిక సర్వే తెలిపింది.

పాక్ స్వాతంత్ర్య వేడుకలకు చైనా ఉపప్రధాని

ఇస్లామాబాద్: చైనా ఉపప్రధాని వాంగ్ యాంగ్ పాకిస్థాన్ స్వాతంత్ర్య వేడుకలకు హాజరు కానున్నారు. చైనా అధ్యక్షుడు షి జిన్ పింగ్ సూచన మేరకు ఉపప్రధాని వాంగ్‌యాంగ్ ఉన్నతాధికారుల బృందంతో పాకిస్థాన్ 70వ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నట్లు పాక్ విదేశాంగ శాఖ తెలిపింది. ఆగస్టు 14న జరిగే జెండా ఆవిష్కరణ వేడుకలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నారు.

గ్రహం అనుగ్రహం

13-8-2017 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
షష్ఠి రా. 7-55 తదుపరి సప్తమి
అశ్విని నక్షత్రం: తె. 4-30 తదుపరి భరణి
అమృతఘడియలు: రా. 9-34 నుంచి 11-06 వరకు
వర్జ్యం: రా. 12-39 నుంచి 2-11 వరకు
దుర్ముహూర్తం: సా. 4-44 నుంచి 5-34 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-45; సూర్యాస్తమయం: సా. 6-25

కోరుకునే లక్షణాలతో పిల్లలు!

(మొదటి పేజీ తరువాయి)

మరికొన్ని రోజులు పెరగనిస్తామని వివరించారు. పిండాల్లో వ్యాధికారక జన్యువులను తాము గుర్తించగలిగామని, వాటిని సమర్థంగా సవరించగలిగామని తెలిపారు. ఈ జన్యువులు భవిష్యత్తులో గుండె గోడలను మందంచేసి.. గుండెపోటుకు దారితీసేందుకు కారణమవుతాయని వివరించారు.

అన్ని వయసుల వారిపైనా ప్రభావం

'పరివర్తన చెందిన జన్యువులు అన్ని వయసుల వారిపైనా ప్రభావం చూపిస్తాయి. యువతలో ఒక్కసారిగా గుండె కొట్టుకోవడం ఆగిపోతున్న కేసుల్లోనూ వీటి పాత్ర ఎక్కువే. ఓ తరానికి చెందిన ఓ కుటుంబంలోని వ్యక్తులకు వీటిని సంక్రమించకుండా అడ్డుకుంటే మంచి ఫలితాలుంటాయి'అని ఓహెచ్‌ఎస్‌యూ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అధ్యాపకుడు, ఓహెచ్‌ఎస్‌యూ నైట్ కార్డియోవాస్కులర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కౌల్ తెలిపారు. 'ఎట్టకేలకు వ్యాధికారక జన్యువులను భవిష్యత్తు తరాలకు సంక్రమించకుండా అడ్డుకునే దశకు వచ్చాం. అధునాతన జన్యు సవరణ ప్రక్రియలు, మూలకణ సాంకేతికతలతోనే ఇది సాధ్యపడుతుంది. లక్షలాది మందిపై ఈ పరిశోధన ప్రభావం చూపుతుంది'అని పరిశోధనలో పాలుపంచుకున్న సాల్క్ ఇన్‌స్టిట్యూట్ జీన్ ఎక్స్‌ప్రెషన్ లేబరేటరీ అధ్యాపకుడు జాన్ కార్లోస్ ఇస్పిసువా బెల్మోంట్ తెలిపారు. 'జన్యు సవరణ ఇంకా శైశవ దశలోనే ఉంది. దీంతో ఈ పరిశోధనలు సురక్షితమైనవిగా, ప్రభావవంతంగా ఉండాలి. నైతిక విలువలను పరిగణలోకి తీసుకుంటూ అత్యంత అప్రమత్తతతో వీటిని కొనసాగించడం అవసరం'అని ఆయన అభిప్రాయపడ్డారు.


ఆ స్థలాలకు వారసత్వ జాబితాలో చేర్చే స్థాయి ఉందా?

కేంద్ర పురావస్తుశాఖ ఆరా

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని శాలిహుండం, గుంటుపల్లి, అమరావతి మహాస్థూపం, నాగార్జునకొండ, శంకరం, గండికోటలకు ప్రపంచ వారసత్వ కేంద్రాల జాబితాలో చేర్చే అర్హత ఉందో లేదో చెప్పాలని కేంద్ర పురావస్తుశాఖ నిర్దేశకుడు ప్రవీణ్‌కుమార్ మిశ్రా ఆంధ్రప్రదేశ్ పురావస్తుశాఖ సూపరింటెండెంట్‌కు లేఖ రాశారు. వీటన్నింటినీ ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చాలని కోరుతూ అఖిల భారత పంచాయతీ పరిషత్ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు లేఖ రాశారని, అందులో పేర్కొన్న వాటికి ఆ స్థాయి ఉందో లేదో చెప్పాలని సూచించారు. ఇందులో పేర్కొన్న స్థలాల్లో దేన్నికైనా ఆ స్థాయి ఉందని భావిస్తే తాత్కాలిక జాబితాలో చేర్చడానికి వీలుగా ప్రతిపాదనలు పంపాలని నిర్దేశించారు.

మహిళల మెదడులే ఎక్కువ క్రియాశీలం

వాషింగ్టన్: పురుషులకన్నా మహిళల్లో మెదడులోని ఎక్కువ ప్రాంతాలు క్రియాశీలంగా ఉంటున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. ఏకాగ్రత, స్వీయనియంత్రణ, భావనలు, ఆతురతకు సంబంధించిన ప్రాంతాల్లో ఈ ప్రభావం బాగా కనపడుతోందని అంటున్నారు. అమెరికాలోని ఆమెన్ క్లినిక్స్‌కు చెందిన పరిశోధకులు 46వేలకుపైగా మెదడు చిత్రాలను అధ్యయనం చేసి ఈ విషయాలను వెల్లడించారు. మెదడుకు సంబంధించి పురుషులు, మహిళల మధ్య ఉండే వ్యత్యాసాలను తెలుసుకునేందుకు.. అల్జీమర్స్ లాంటి వ్యాధులు వల్ల ఎవరెవరికి ఎలాంటి ముప్పు కలుగుతుందో గుర్తించేందుకు ఈ పరిశోధన జరిపారు. మహిళల్లో ఏకాగ్రత, ఉద్రేక నియంత్రణ, ఇతర భావోద్వేగపరమైన అంశాలకు సంబంధించిన ప్రాంతాలు..పురుషుల్లో దృశ్యపరమైన, సమన్వయానికి సంబంధించిన ప్రాంతాలు క్రియాశీలంగా ఉన్నాయని తెలిపారు. సింగిల్ ఫోటాన్ ఎమిషన్ కంప్యూటెడ్ టోమోగ్రఫి సాంకేతికత సాయంతో మెదడులో రక్తప్రవాహాలను పరిశోధకులు పరిశీలించారు. ఆరోగ్యంగాఉన్న 199 మంది వలంటీర్లు, 26,683 మంది రోగులపై ఈ అధ్యయనం నిర్వహించారు. మెదడులోని 128 ప్రాంతాలను విశ్లేషించారు.



ముక్త్యాల–విజయవాడ జల మార్గం పటం

జలరవాణా జోష్!

(మొదటి పేజీ తరువాయి)

62 కిలోమీటర్ల మేర ప్రస్తుతం నావిగేషన్ ఛానల్ తవ్వకం పనులు మొదలుపెట్టారు. 2018 డిసెంబరు నాటికి తొలిదశ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది లక్ష్యం.

30 లక్షల ఘనపు మీటర్లు తవ్వాలి.. వెయ్యి టన్నుల సరుకు రవాణా సామర్థ్యం కలిగిన బార్జులు తిరిగేందుకు వీలుగా జల రవాణా మార్గాన్ని అభివృద్ధి చేయాలన్నది లక్ష్యం. దీనికి నావిగేషన్ ఛానల్ లోతు 2.2 మీటర్లు ఉండాలి. వెడల్పు... కాలువ అడుగున 45 మీటర్లు, ఉపరితలంలో 70 మీటర్లు ఉండాలి. ఈ ప్రమాణాలకు తగ్గట్లుగా ముక్త్యాల నుంచి హరిశ్చంద్రపురం వరకు నదిలో నావిగేషన్ ఛానల్ ఏర్పాటు చేయాలంటే.. సుమారు 30 లక్షల ఘనపు మీటర్ల ఇసుక, మట్టి తవ్వాల్సి ఉంటుంది. ముక్త్యాల-హరిశ్చంద్రపురం రీచ్ పనుల్ని ఐఎంఎస్ షిప్పింగ్ సంస్థకు, చామర్రు-హరిశ్చంద్రపురం మధ్య రీచ్‌ని కోస్టల్ కన్సాలిడేటెడ్ స్ట్రక్చర్స్ లిమిటెడ్ (సీసీఎస్ఎల్) సంస్థకు అప్పగించారు. సీసీఎస్ఎల్ మేలో పనులు ప్రారంభించింది. ఇప్పటివరకు 46 ఘనపు మీటర్ల తవ్వకాలు జరిపింది. ఐఎంఎస్ సంస్థ జూన్‌లో ప్రారంభించి, ఇంత వరకు 34 ఘనపు మీటర్ల ఇసుక తవ్వకాలు చేసింది. ప్రస్తుతం కృష్ణా నదికి వరదల సమయం కావడంతో... పనులు నిలిపివేశారు.

మూడు చోట్ల కార్గో టెర్మినళ్లు.. తొలిదశ (ఫేజ్-1) జలరవాణా మార్గం అభివృద్ధిలో భాగంగా ఇబ్రహీంపట్నం, ముక్త్యాల (కృష్ణా జిల్లా), హర్చింద్రపురం (గుంటూరు జిల్లా) వద్ద సరకు రవాణా (కార్గో) టెర్మినళ్లు నిర్మిస్తారు. విజయవాడలోని దుర్గాఘాట్, భవానీ ద్వీపం, కృష్ణా జిల్లాలోని వేదాద్రి, గుంటూరు జిల్లాలోని అమరావతి వద్ద ప్రయాణికుల రవాణా కోసం నీటిలో తేలియాడే (ఫ్లోటింగ్) టెర్మినళ్లు నిర్మిస్తారు. ఒక్కో కార్గో టెర్మినల్ నిర్మాణానికి 8 ఎకరాల నుంచి 10 ఎకరాలు అవసరమవుతుంది. జెట్టీలపై 'రైట్స్' సంస్థ ప్రస్తుతం సర్వే నిర్వహిస్తోంది.

నిధులు వెచ్చించేది ఇలా.. జాతీయ జలరవాణా మార్గం-4లో ఆంధ్రప్రదేశ్‌లో వెళ్లే భాగం వరకు సంయుక్తంగా చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. దీనికోసం ఒక ప్రత్యేక వాహక సంస్థ (ఎస్పీవీ) ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉంది. ఎస్పీవీ విధివిధానాలు, ఎవరికెంత వాటా ఉండాలి వంటి అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. ఆ ప్రక్రియ కొలిక్కి వచ్చేలోగా... ఫేజ్-1 ప్రాజెక్టుకి అవసరమైన నిధులు విడుదల చేసేందుకు కేంద్రం ముందుకువచ్చింది. రూ. 98 కోట్లు విడుదల చేసింది. దానిలో రూ. 48.96 కోట్లు డ్రెడ్జింగ్ పనులకు, రూ. 43.05 కోట్లు టెర్మినళ్ల నిర్మాణానికి, రూ. 1.89కోట్లు నావిగేషన్ పరికరాలకు, రూ. 1.55 కోట్లు ఇతర అవసరాలకు వెచ్చించనున్నారు.

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	22.1	31.2
అనంతపురం	23.4	32.7
తిరుపతి	23.7	35.2
కర్నూలు	24.5	30.4
ఖమ్మం	25.0	31.0
గుంటూరు	25.0	34.0
విజయవాడ	25.8	32.5
రాజమహేంద్రవరం	26.0	30.0
విశాఖపట్నం	26.0	33.0
కడప	26.0	35.0
ఒంగోలు	26.1	33.3
నరసాపురం	26.4	30.2
తాడేపల్లిగూడెం	27.0	31.0
సూర్యాపేట	27.0	34.0
శ్రీకాకుళం	27.5	35.0
నెల్లూరు	28.0	36.0

ఇదీ సంగతి!



జబ్బుపడ్డ పిల్లలతో వచ్చినా, కనటానికి వచ్చినా తప్పనిసరిగా ఎవరి ఆక్సిజన్ వాళ్లు తెచ్చుకోవాలి.

వెండి తెరపై నిప్పుల కుంపటి!

ఈనాడు – అమరావతి



ఆంధ్రప్రదేశ్‌లోని అనేక సినిమాహాళ్లలో అగ్నిమాపక చర్యల డొల్లతనం ఫలితంగా వినోదం మాటున ప్రమాదం పొంచి ఉంటోంది. అంతర్భాగాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వినియోగించే కొన్ని రకాల అలంకరణ సామగ్రిలో వాడే ముడి పదార్థాలు త్వరగా మండే స్వభావం కలిగినవి కావడంతో ఎక్కడ చిన్న నిప్పురవ్వ ఎగిసినా క్షణాల్లో మంటలు విస్తరిస్తున్నాయి. థియేటర్ భస్మీపటలమవుతోంది. తాజాగా ప్రకాశం జిల్లా చీరాలలో సురేష్‌మహల్ థియేటర్ దగ్ధమవ్వడానికి ఇదే కారణమైంది. మరోవైపు అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకోకుండానే కొనసాగిస్తున్నారు. నిరభ్యంతర పత్రాలు ఉన్నప్పటికీ తగిన అగ్నిమాపక చర్యలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

ప్రాణాలు మింగేసే పొగ: సినిమాహాళ్లలోని సీట్లు, కార్పెట్ల తయారీలో వినియోగించే ముడిపదార్థాలు త్వరగా మండే, విపరీతమైన పొగను వెదజల్లే స్వభావం కలిగి ఉంటాయి. దీంతో ఆ పొగకు ఊపిరాడక లోపలున్నవారు ప్రాణాలు కోల్పోయేందుకు అవకాశం ఎక్కువ. 1997లో దిల్లీలోని ఉపహార్ థియేటర్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో చిక్కుకున్న వారిలో ఎక్కువ మంది పొగకు ఊపిరాడకే ప్రాణాలు కోల్పోయారు. హాలు లోపలి నుంచి పొగ బయటకు వెళ్లేందుకు తగిన ఎగ్జాస్ట్ ఫ్యానల్‌లు లేకపోవడం, లోపల దట్టమైన పొగ కమ్ముకున్నప్పుడు సహాయ చర్యలు చేపట్టడం క్లిష్టంగా మారడం వంటివి కూడా ప్రమాద తీవ్రత, ప్రాణనష్టం పెరిగేందుకు కారణమవుతాయి.

60 శాతం కొత్తవారే: సినిమాహాళ్లకు వెళ్లే వారిలో 60 శాతం మంది కొత్తవారే ఉంటారనేది అగ్నిమాపక శాఖ అంచనా. హాలులో అగ్నిప్రమాదం జరిగితే ఎలా తప్పించుకోవాలి? ఏయే మార్గాల్లో బయటకు వెళ్లాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలకు సంబంధించి ప్రదర్శన ప్రారంభానికి ముందే దృశ్యసహితంగా ప్రసారం చేయాలి. థియేటర్‌లోని దీపాలు అన్నీ యూఎస్‌బీ అనుసంధానమై ఉండాలి. ఎమర్జెన్సీ, ఫుట్, బయటకు వెళ్లే మార్గాలను సూచించే దీపాలు నిరంతరం వెలుగుతూ ఉండాలి. ఇవేవీ సక్రమంగా పాటించడం లేదు. ఫలితం అగ్నిప్రమాదం జరిగితే లోపలంతా చీకటి కమ్మేయడంతో లోపలున్నవారు బయటపడేందుకు అవకాశం తక్కువ. ప్రమాద తీవ్రత పెరగడానికి ఇదీ కారణమవుతుంది.

అలంకరణ సామగ్రి మాటున ప్రమాదం: సినిమాహాళ్ల లోపలి భాగంలో అలంకరణ కోసం వినియోగించే వస్తువులు ఎక్కువగా మండే స్వభావం కలిగి ఉంటున్నాయి. ప్రధానంగా ఫాల్‌సీలింగ్ (పైభాగం), పక్క గోడల అలంకరణలో, సౌండ్ ప్రూఫింగ్ కోసం ఈ తరహా వస్తువులను వినియోగిస్తున్నారు. అలంకరణ వస్తువులను అతికించేందుకు వినియోగించే జిగురు ఆరకముందు మండే స్వభావం ఎక్కువ. దీంతో చిన్న ప్రమాదం జరిగినా క్షణాల్లో మంటలు రేగి తీవ్రత పెరుగుతోంది.

60శాతం థియేటర్లకు నిరభ్యంతర పత్రాలు లేవు: రాష్ట్రంలో సగటున ప్రతి వంద థియేటర్లకుగాను 60 థియేటర్లు ఎలాంటి నిరభ్యంతర పత్రాలు లేకుండానే నడుస్తున్నాయి. మల్టీప్లెక్స్‌ల్లో అయితే 30 శాతం వాటికి నిరభ్యంతర పత్రాలు లేవు. తాజాగా చీరాలలో దగ్ధమైన సురేష్‌మహల్ థియేటర్‌కు కూడా నిరభ్యంతర పత్రం లేదు. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే మంటలార్పేందుకు వీలుగా నీటినిల్వ కలిగిన ట్యాంకులు చాలా థియేటర్లలో అందుబాటులో లేవు. అగ్నిమాపక పరికరాల ఏర్పాటుకూడా మొక్కుబడిగానే మారుతోంది. భవనం చుట్టూ అగ్నిమాపక శకటాలు తిరిగేందుకు అవసరమైన ఖాళీ స్థలాన్ని విడిచిపెట్టడం లేదు.

ఉపహార్ విషాదం నుంచి పాఠం నేర్చుకుందాం

వినోదం కోసం సినిమాకు వెళ్తే విషాదమే మిగిలింది. ఆ రోజు.. 1997 జూన్13. దిల్లీలోని ఉపహార్ థియేటర్ ప్రాంగణం. థియేటర్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో లోపం వల్ల అగ్నిప్రమాదం జరిగి 59మంది ప్రాణాలు కోల్పోగా, మరో 103 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. థియేటర్‌లో భద్రతా ప్రమాణాలు లేకపోవడం ప్రమాద తీవ్రతను పెంచింది. మంటలతో పాటు పొగలు విస్తరించడంతో ఎటు పరుగు తీయాలో తెలియక తొక్కిసలాటలోనూ చనిపోయారు. ప్రాంగణం ద్వారాలకు తాళాలు వేసి ఉండటంతో ప్రేక్షకులు వెళ్లలేకపోయారు. అనధికారికంగా సీట్లు పెంచడంతో సరైన తోవ కూడా లేదు. ప్రాంగణంలో అనుమతి లేకుండా దుకాణాలు నిర్వహించడం కూడా లోపంగా గుర్తించారు. ఆ విషాదం నుంచైనా మనం పాఠం నేర్చుకోవాల్సి ఉంది.

నిరభ్యంతర పత్రాలు లేని థియేటర్లకు నోటీసులు

–కె.సత్యనారాయణ, డీజీ, అగ్నిమాపక సేవల విభాగం

అగ్నిమాపక శాఖ అనుమతులు లేని సినిమా థియేటర్లకు నోటీసులు జారీ చేశాం. నిరభ్యంతర పత్రాలున్న థియేటర్లలో నిబంధనలు సక్రమంగా పాటిస్తున్నాయా? లేదా పరిశీలించేందుకు బృందాలను ఏర్పాటు చేశాం.



బహుభాషా నటుడు ఉపేంద్ర కొత్త పార్టీ

- జనం సమస్యల్ని తీర్చేందుకే వస్తున్నా..
- పూర్తిగా రాజకీయాల్లోనే ఉంటానని వెల్లడి


నటుడు ఉపేంద్ర

ఈనాడు, బెంగళూరు: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రస్తుత రాజకీయ పక్షాలు దారుణంగా విఫలమైనందున జనం కష్ట నష్టాల్ని తీర్చేందుకు కొత్తగా రాజకీయ పక్షాన్ని ప్రారంభించనున్నట్లు కన్నడ, తెలుగు నటుడు ఉపేంద్ర ప్రకటించారు. బెంగళూరు నగర శివార్లలోని ఓ విలాస విడిదిలో ఆయన శనివారం మాధ్యమ ప్రతినిధులతో మాట్లాడారు. పార్టీకి ఇంకా పేరు పెట్టాల్సి ఉందన్నారు. 'కులం, మతం, ధనబలం, కండ బల రహిత రాజకీయాల్ని సాగించటమే నా ధ్యేయం. ఈ తత్వాన్ని, సిద్ధాంతాన్ని నమ్మిన వారు నాతో చేతులు కలప వచ్చు'అని పిలుపునిచ్చారు. 'నేను ప్రజా నాయకుణ్ని కాను. సేవకుణ్ని అసలే కాను. కేవలం కార్మికుడ్ని మాత్రమే. జనహితం కోసం పరిశ్రమిస్తాను. నన్ను అనుసరించే వారికీ ఇలాంటి అభిప్రాయాలే ఉండాలి. పార్టీలో పని చేయదలచిన వారంతా ఖద్దరు బదులు ఖాకీ దుస్తుల్ని ధరించాలి. ఖాకీ శ్రమకు, నిజాయితీకి ప్రతిబింబం'అని పేర్కొన్నారు. నేతలు రాజకీయాలకు బదులుగా ప్రజాకీయాల్ని సాగిస్తే జనం గోడు తీరుతుందని వ్యాఖ్యానించారు.

సినిమాల్ని వదులుకున్నా..: 'పూర్తి కాలం రాజకీయాల్నే చేస్తాను. అర్ధంతరంగా ఈ రంగం నుంచి విరమించబోను' అని భరోసా ఇచ్చారు. ఇందువల్ల తెలుగు, కన్నడ సినిమాల్లో నటించే అవకాశాల్ని వదలుకున్నానని చెప్పారు. ప్రారంభించిన ప్రజాకీయ వేదికను లక్ష్యాన్ని సాధించేంత వరకూ కొనసాగిస్తానన్నారు. నమ్మిన వారిని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ధనాన్ని ఆర్జించేందుకు కాకుండా జనం సమస్యల్ని తీర్చేందుకే రాజకీయ పార్టీని ప్రారంభించదలచినట్లు వివరించారు.

వ్యవసాయ పరిశోధన మండలి ఏర్పాటుకు తీర్మానం

- ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ పాలకవర్గం ఆమోదం
- పలు ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ పరిశోధన మండలిని ఏర్పాటు చేయాలని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకవర్గం తీర్మానించింది. దీంతో పాటు.. నాలుగేళ్లుగా భర్తీకి నోచుకోని 129 సహాయ, సహ ఆచార్యుల ఉద్యోగాల భర్తీకి పచ్చజెండా ఊపింది. కెరీర్ అడ్వాన్స్ పథకంలో ఉద్యోగులు 70 మందికి పదోన్నతులు కల్పించే మరో తీర్మానాన్ని వర్సిటీ ఆమోదించింది. శనివారం గుంటూరు రంగా వ్యవసాయవర్సిటీలో పాలకవర్గ సమావేశం జరిగింది. పాలకమండలి సభ్యులుగా ఉన్న శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు బి.సి. జనార్దనరెడ్డి, ఎం.గీతతో పాటు 14 మంది సభ్యులు, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరి జవహర్‌లాల్ హాజరయ్యారు. ప్రధానంగా వర్సిటీ పరిధిలో ఏర్పడిన ఖాళీలు అసిస్టెంటు ప్రొఫెసర్, అసోసియేట్, ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ, ఉద్యోగులకు పదోన్నతులు, విశ్వవిద్యాలయ అధికారుల రెగ్యులర్ విధానంలో నియామకంపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపిన అభ్యర్థులను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఉప కులపతి దామోదరనాయుడు సభ్యులకు తెలిపి వారి ఆమోదం పొందారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ.నం.64ను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేస్తున్న ఆందోళనపైనా సభ్యులు చర్చించారు. జి.ఒ.నం.64ను కొనసాగిస్తూనే వ్యవసాయ విద్య అమలు, కళాశాలల్లో ప్రవేశాలు, ఉద్యోగాలకు ఎంపిక తదితర విషయాలను పర్యవేక్షించేందుకు వ్యవసాయ పరిశోధన మండలిని ఏర్పాటు చేసేందుకు దామోదరనాయుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పశ్చిమగోదావరి జిల్లా విజయరాయిలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు, సిబ్బందిని ఇతర పరిశోధన స్థానాల నుంచి సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. తెనాలిలో ప్రతిపాదిత జొన్నల పరిశోధన స్థానంను ఐసీఏఆర్ ఆదేశాల మేరకు వర్షాధార ప్రాంతమైన నంద్యాలలో ఏర్పాటు చేసేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదించారు. లాంలో విశ్వవిద్యాలయ భవనాల నిర్మాణం, ఇతరత్రా అవసరాలకు 500 ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రిని కలిసి కోరనున్నామని దామోదరనాయుడు, రామ్మోహన్‌నాయుడు 'ఈనాడు'కు తెలిపారు.

ఉద్యాన సాగులో మూడోస్థానంలో ఏపీ

- ఈ నెల 15 నుంచి సేంద్రీయ, నర్సరీ ప్రదర్శన

ఈనాడు, అమరావతి: ఉద్యాన పంటల సాగులో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి వెల్లడించారు. గడచిన ఏడాదిలో ఉద్యాన పంటల వల్ల 34,000 కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని, 18 శాతం వృద్ధి రేటు సాధించామని వివరించారు. ఈ ఏడాది 23 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. శనివారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతుల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 15 నుంచి 18 వరకు విజయవాడ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో సేంద్రియ, నర్సరీ ఎక్స్ పో నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన జరిగాక ప్రథమంగా నిర్వహిస్తున్న ఈ ఎక్స్ పో ద్వారా ఉద్యాన రంగంలో ప్రాసెసింగ్, ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలను ఒకే వేదిక పైకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఎక్స్ పోను ప్రారంభిస్తారని, తర్వాతి రోజుల్లో సీఎం చంద్రబాబు ఎక్స్ పోను సందర్శిస్తారని ఆయన తెలియజేశారు.

18న ఒంగోలు జాతి పశువుల అభివృద్ధిపై చర్చ

ఈనాడు, అమరావతి: ఆగస్టు 18న విజయవాడ శ్రీరామా ప్యాలెస్‌లో ఒంగోలు జాతి పశుపోషకుల సమావేశం జరుగుతుందని రైతు నేస్తం ఎడిటర్ వై.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఒంగోలు జాతి అభివృద్ధిపై జరిగే గోష్ఠిలో పోషకులు, గోప్రేమికులు, పశువైద్యులు పాల్గొంటారని వివరించారు.



ఈనాడు

దీక్షా సమయం!


ఎల్లుండే- సర్వతంత్ర స్వతంత్ర భారతావని సప్తతి! 'ఇతర క్షోణిని లక్షలిచ్చినను గానీ పుట్టను... వేద పురాణ శాస్త్ర కృతిరాశి స్థానము ఈ మంగళ క్షితిపై గర్భదరిద్రుని ఇంటనయినన్ పుట్టించమని మధునాపంతుల వంటి సంస్కారులు దేవుణ్ని ప్రార్థించిన ఈ నేల- స్వేచ్ఛావాయువులు పీల్చుకున్న రోజది! 'మరుజన్మ అంటూ ఉంటే భారతదేశంలో గంగాతీరాన జన్మనిమ్ము!' అని మాక్స్ ముల్లర్ వంటి పాశ్చాత్యులు ప్రభువును వేడుకొన్న గొప్ప దేశమిది. 'జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి' అంటూ దేశభక్తులు పులకిత గాత్రులై పరవశంతో నృత్యం చేసే దేశమిది. ఓడ దిగుతూనే ఆనందాశ్రువులతో నేలను తడిపి మట్టిని నెత్తిన జల్లుకున్న మాన్యసోదరి నివేదితను గుర్తుచేసుకుంటే- ఈ దేశం అంటే ఏమిటో తెలుస్తుంది. ఇప్పటిలా- సం'కుల'పతులు కాకుండా, కులమతాలకు అతీతులైన జాతినేతలూ జాతీయనేతల తేజస్సుతో స్వాతంత్ర్య ఉద్యమస్ఫూర్తి సజీవంగా అలరారిన రోజుల్లో- 'ఒక్కటేరా భరతదేశం, ఒక్కటేరా భరతజాతి, ఎక్కడున్నా భారతీయులు ఒక్కటంటూ దిక్కులన్నియు పిక్కటిల్లగ చాటుదాం' అంటూ జెండాపండుగ రోజున జాతి జాతి అంతా ఉత్తేజంతో కదనుతొక్కేది. 'వందేమాతరం' అంటూ గొంతెత్తి నినదించేది. 'మేరా భారత్ మహాన్' అని మనసారా గర్వించేది. 'చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్థులంతా నడవవలెనోయ్ అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్' అంటూ కవులు వైతాళిక గీతాలు ఆలపించేవారు. జనం తన్మయత్వంతో గొంతు కలిపేవారు. వంత పాడేవారు.

'జెండా' అనేది ఏదో వస్త్ర విశేషం కాదు- అది దేశ సార్వభౌమత్వ మహత్వ చిహ్నం. 'జైహింద్' అనేది ఒక పదం కానేకాదు- దేశమాతకు మోదం కలిగించే సుస్వరవేదం! 'స్వరాజ్యం నా జన్మహక్కు' అన్న తిలక్ పిలుపు కేవలం నినాదం కాదు- నాటి ప్రజల గుండెచప్పుళ్లకు అక్షరానువాదం! దేవుణ్ని ఉద్దేశించి విశ్వనాథ 'నీవే దైవము నేను భక్తుడను తండ్రీ! నిన్ను ధ్యానించెదన్' అనడంతో సరిపెట్టుకోలేదు- 'నీవే భూమివి నేను కర్షకుడ, తండ్రీ! నిన్ను పండించెదన్' అంటూ అద్భుత భావన చేశారు. ఆ మాదిరిగా- ఈ దేశాన్ని మట్టిగా కాక సజీవ మాతృమూర్తిగా సంభావించగలిగితే, 'నీవే తల్లివి నేను పుత్రుడను జననీ! నీ రుణంబు చెల్లించెదన్' అనడం సాధ్యమవుతుంది. నిజానికి అదే తక్షణ అవసరం! ఈ జెండాపండుగ పూట కావలసినవి రివాజు గళాల నోటి చివరి తుంపరలు కావు- 'బహుజన్మ కృతపుణ్య పరిపాకమున చేసి భరతభూమిని జన్మపొందినాము' అన్న నిశ్చయబుద్ధిని యువత గుండెల్లో రగిలించే తేజోమయమైన వాక్కులు కావాలి. దేశం గురించి చిన్న వాక్యం రాసినా- గుండెను చీల్చుకుని వెచ్చటి నెత్తురుతో తడుస్తూ రావాలది! అప్పుడే దానికి అఖండమైన జీవశక్తి సమకూరుతుంది. ఒకానొక కాంతి పరివేషం(ఆరా) ఏర్పడుతుంది. మనసును తడపగలిగే వాక్యమే- మనిషిని నడపగలుగుతుందని కవులు గుర్తించాలి. 'మన ఈ దేశపు మట్టిలో ప్రతి కణంబందున్ గుబాళించు పావన విశ్వాసములు ఆత్మధర్మ ప్రతిబింబంబైన మేల్ కాంతులుం ఘనమై సత్కవి కావ్యరీతులు విహంగ స్నిగ్ధ గీతమ్ములై మనలం దగ్గర సేయు' అన్నారు కవి బులుసు వేంకటేశ్వర్లు. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో కవులు జాతిని సంఘటితం చేసే సత్కవిత్వాలను వెలయించాలి. ప్రతి రంగానికి చెందిన ప్రతి భావంతుడూ ఈ కోణంలో స్పందించగలిగితేనే, దేశ పునర్నిర్మాణ కృషి సాధ్యపడుతుంది. 'సాటి లేని జాతి, ఓటమెరుగని కోట నివురుగప్పి నేడు నిదురపోతుండాది' అన్న వేములపల్లి శ్రీకృష్ణ కవిత నేటికీ వర్తించడం దురదృష్టకరం. సూది కలుపుతుంది. కత్తెర విడదీస్తుంది. రాజకీయ నేతలు కత్తెర పాత్ర పోషిస్తున్నారు. దేశ ప్రజలు సూది పాత్ర పోషించవలసిన అవసరం ఏర్పడింది.

ఈ దేశానికి స్వాతంత్ర్యం తేలిగ్గా సిద్ధించలేదు. 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను. నేను సైతం విశ్వవృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను' అని మహాకవి అన్నట్లుగా ఇంటికో వీరసైనికుడు ముందుకొచ్చి ఆత్మబలిదానానికి సైతం సిద్ధపడడం- దక్కిన స్వరాజ్య ఫలం! బాపూజీ, పటేల్, నెహ్రూ, అంబేడ్కర్, మౌలానా, భగత్‌సింగ్, తిలక్, ప్రకాశం... ఎలాంటి నాయకులు వారంతా. ఎంతెంత గొప్పవాళ్లకు జన్మనిచ్చింది దేశం! వారి గొప్ప త్యాగాలతో చెమటతో నెత్తుటితో కదా, ఈ నేలకు స్వేచ్ఛ లభించింది! 'ఏ స్వాతంత్ర్యం నిమిత్తం ఎవరెవరో ఎందరో దేశసేవా భాస్వంతులై బాలవృద్ధులు... లాఠీ హతులై, ఉరికొయ్యల కవుగిలింత చేర్చిరో' గమనించమని శ్రీశ్రీ ఏనాడో సూచించాడు! 'దేశమనియెడి దొడ్డవృక్షం ప్రేమలను పూలెత్తవలెనోయ్ నరుల చెమటను తడిసి మూలం ధనం పంటలు పండవలెనోయ్' అని గురజాడ ఆశించింది ఎప్పటికీ శిరోధార్యమే. ఈ నేలతల్లితో, మన పేగుబంధాన్ని వివరిస్తూ రాయప్రోలు ఆలపించిన 'ఏ పూర్వపుణ్యమో ఏ యోగబలమో జనియించినాడవీ స్వర్గఖండమ్మున' అన్న దివ్యభావన గుండెపొరలను తాకితే 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా' మనతల్లి భూమి భారతిని మనసారా కీర్తించడం అలవడుతుంది. మనతల్లి నిండు గౌరవం నిలపడం సాధ్యపడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పంద్రాగస్టును 'సంకల్ప్ పర్వ్(సంకల్పదినం)'గా పాటించాలని కేంద్రం పిలుపిచ్చింది. స్వరాజ్య సమరయోధులు కలలుకన్న దిశగా ఈ దేశాన్ని రూపాంతరీకరణ చేసేందుకు ప్రతిన పూనాలని, ప్రజలు జాతినిర్మాతలుగా రూపొందాలని కేంద్రసిబ్బంది వ్యవహారాలశాఖ సూచించింది. శ్రీశ్రీ మాటల్లో 'ఇది మనకొక దీక్షా సమయం! ఇది మనకు పరీక్షా సమయం!' అది అక్షరాలా జన పునరంకిత దినం!

అవగాహన పెరిగితే అపరబ్రహ్మలే!

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన ఇనుమడిస్తున్నా- అవయవదానంపై ఇప్పటికీ అపోహలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రసార మాధ్యమాలు, సామాజిక మీడియా ద్వారా క్రమంగా కొంతమేరకైనా అవయవ మార్పిడికి సంబంధించిన శాస్త్రీయ అవగాహన విస్తరిస్తోంది. ఈ వేగం ఇంకా పెరగాల్సి ఉంది. రక్తం, కార్నియా మార్పిడి వంటివి ఇప్పుడు సాధారణమయ్యాయి. ప్రాణాలను కాపాడేందుకు లేదా పరిశోధనల కోసం ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి శరీర భాగాన్ని అమరుస్తున్నారు. బతికిఉన్నవాళ్ల నుంచి శరీర భాగాలను తీయడం ఒక పద్ధతి. చనిపోయినవారి నుంచి కొన్ని భాగాలను వెలికితీసి మరొకరికి అమర్చడం ఇంకో విధానం. మూత్రపిండాలు, కాలేయం, గుండె, క్లోమం, పేగులు, ఊపిరితిత్తులు, ఎముకలు, ఎముకల్లో మూలుగ (మజ్జ), చర్మం, కంటిలోని కార్నియాను ఈ రకంగా అమరుస్తున్నారు. అవయవదాన ప్రక్రియ కుటుంబసభ్యుల ఆమోదంతో పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. ఒక వ్యక్తి 'బ్రెయిన్‌డెడ్' అని వైద్యబృందం నిర్ధారించిన తరవాత- గుండె లేదా ఇతర భాగాలను వేరుపరచి ఇతరులకు అమరుస్తారు. అవయవ స్వీకర్తకు అన్ని రకాల పరీక్షలు చేసి, తగిన జాగ్రత్తల మధ్య చికిత్స చేస్తారు. ఈ మొత్తం వ్యవహారంలో జీవన్‌దాన్ సమన్వయకర్తలు కీలక పాత్ర పోషిస్తారు. కుటుంబసభ్యులకు తగిన అవగాహన కలిగించడంతోపాటు- ప్రభుత్వ, రవాణా, పోలీసు యంత్రాంగాలను తగిన విధంగా సంసిద్ధపరుస్తారు.



వెల్లివిరుస్తున్న సేవ

ప్రపంచంలో తొలిసారి అవయవదానం చేసిన దాత రోనాల్డ్ లీ హెరిక్. ఆయన తన కవల సోదరుడికి 1954లో మూత్రపిండాన్ని దానం చేశారు. ఈ చికిత్స నిర్వహించిన వైద్యుడు జోసెఫ్ ముర్రేకి 1990లో నోబెల్ బహుమతి ప్రదానం చేశారు. కేవలం ఐదు నిమిషాల జీవనకాలం ఉన్న ఓ చిన్నారి నుంచి మూత్రపిండాలను తీసి 2015లో మరొకరికి అమర్చారు. స్కాట్లాండ్ దేశానికి చెందిన 107 సంవత్సరాల మహిళ తన కంటిలోని కార్నియాను మరొకరికి దానం చేయడం ద్వారా అతి పెద్ద అవయవదాతగా చరిత్రలో నిలిచారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో అవయవ దానానికి సంబంధించి అనేక చట్టాలు రూపొందించారు. అర్జెంటీనాలో 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అవయవ దానానికి అర్హులేనని తీర్మానిస్తూ 2005 నవంబరులో చట్టం తెచ్చారు. బ్రెజిల్, చిలీ, కొలంబియాల్లోనూ ఇదే తరహా చట్టాలున్నాయి. ఐరోపాలోని వివిధ దేశాల్లో అవయవదానంపై పటిష్ఠ చట్టాలు అమలవుతున్నాయి. స్పెయిన్, ఆస్ట్రియా, బెల్జియంలలో అత్యధిక సంఖ్యలో అవయవదాతలు స్వచ్ఛందంగా తమ పేర్లు నమోదు చేసుకోవడం విశేషం. స్కాట్లాండ్‌లో పౌరులంతా అవయవదాన పత్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. భారత్‌లో కార్నియా మార్పిడి మాత్రమే పూర్తిస్థాయిలో అమలవుతోంది. ఇప్పుడిప్పుడే 'బ్రెయిన్‌డెడ్' భావన ప్రజలకు అర్థమవుతోంది. దేశంలో అవయవదానం కేవలం రక్త సంబంధీకుల మధ్యే ఎక్కువగా జరుగుతోంది. ఈ ప్రక్రియ వ్యాపార దృష్టితో జరగరాదన్న సమున్నతాశయంతో భారత ప్రభుత్వం 1994లో మానవ అవయవ మార్పిడి చట్టం తీసుకువచ్చింది. దీనికి 2011లో కొన్ని మార్పులు చేశారు. దేశంలో 2013లో మరణానంతర అవయవదాన సందర్భాలు అధికంగా నమోదయ్యాయి. ఆ ఏడాది దేశంలో 310మంది మరణించినవారి నుంచి 845 అవయవాలను స్వీకరించి, అవసరమైనవారికి అమర్చారు. తమిళనాడు, మహారాష్ట్రల్లో ఈ చికిత్సలు అత్యధికంగా జరిగాయి. తమిళనాడులో 2000లో ప్రారంభమైన మోహన్ ఫౌండేషన్ ఈ దిశగా అద్భుతమైన కృషి చేస్తోంది. తెలుగురాష్ట్రాలతోపాటు అనేక చోట్ల ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రధాన వైద్యశాలలతో సమన్వయం చేసుకుని ఈ సంస్థ ఎంతోమందిని అవయవదానానికి ప్రోత్సహిస్తోంది. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఎన్నో సంస్థలు ప్రారంభమయ్యాయి. తెలుగురాష్ట్రాల్లో జీవన్‌దాన్ కార్యక్రమం, కర్ణాటకలో అవయవ మార్పిడి ప్రాంతీయ సమన్వయ కమిటీ; కేరళలో మృతసంజీవని, 'కేరళ నెట్‌వర్క్ ఫర్ ఆర్గాన్ షేరింగ్'; మహారాష్ట్రలో ప్రాంతీయ అవయవ మార్పిడి సమన్వయ కేంద్రం, తమిళనాడులో అవయవ మార్పిడి నిర్వహణ సంస్థ; రాజస్థాన్‌లో నవజీవన్ వంటి సంఘాలు అవయవాలు పని చేయని లేదా వాటిని కోల్పోయినవారికి నూతన జీవితం ప్రసాదించే కృషి కొనసాగిస్తున్నాయి. తమిళనాడు, కేరళల్లో మోహన్ ఫౌండేషన్ సౌజన్యంతో అంతర్జాల అవయవదాన రిజిస్ట్రీ ప్రారంభమైంది. కేంద్ర ఆరోగ్య సంక్షేమ శాఖ జాతీయ అవయవ, కణ మార్పిడి సంస్థను ప్రారంభించింది.

సమన్వయానిదే ప్రధాన పాత్ర

అవయవాలు తగినన్ని అందుబాటులో లేకపోవడం, ఈ ప్రక్రియపై శాస్త్రీయ అవగాహన లేకపోవడం భారత్‌లో అతిపెద్ద సమస్యగా మారింది. సాధారణంగా బతికి ఉన్న దాతలనుంచి ఒక కిడ్నీ లేదా కాలేయంలో కొంత తీసుకుంటారు. ఇలాంటి దాతలు స్వీకర్తలకు రక్తసంబంధీకులై ఉండాలి. అరుదైన సందర్భాల్లో బయటివారి నుంచి తీసుకొంటారు. అన్ని పరీక్షల తరవాతే వీరినుంచి అవయవాలను స్వీకరిస్తారు. ఒక కిడ్నీ లేదా కాలేయంలోని కొద్దిభాగంతోనూ సాధారణ జీవితం గడపవచ్చు. రక్త క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులకోసం జీవించి ఉన్నవారి ఎముక నుంచి అరుదైన సందర్భాల్లో మూలుగ స్వీకరిస్తారు. 'బ్రెయిన్ డెడ్' వ్యక్తుల్లో గుండె పనిచేస్తుంటుంది. 'వెంటిలేటర్' సాయంతో వారి అవయవాలకు రక్త ప్రసరణ జరుగుతుంటుంది. అలాంటివారినుంచి రెండు కార్నియాలు, గుండె, కాలేయం, పాంక్రియాస్, రెండు మూత్రపిండాలు, రెండు ఊపిరితిత్తులు తీసుకోవడానికి వీలవుతుంది. ఆ రకంగా వారు వెంటనే తొమ్మిదిమందికి ప్రాణదానం చేయవచ్చు. రోడ్డుప్రమాదాల్లో గాయపడి మెదడు మూలకణాలు పనిచేయనివారు, మెదడులో రక్తం గడ్డకట్టినవారి నుంచి కూడా అవయవాలను స్వీకరించవచ్చు. తీవ్ర అనారోగ్యంతో, ఎయిడ్స్ వంటి వ్యాధులతో మరణించినవారు అవయవ దానానికి ఉపయోగపడరు. 'బ్రెయిన్‌డెడ్' అవయవ దాతలనుంచి కొన్నిసార్లు చర్మం, ఎముకలను తీసి భద్రపరుస్తారు. అవి కొద్దిమందికే ఉపయోగపడుతున్నాయి. అవయవ స్వీకర్తలు తొలుత తమ పేర్లను సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వద్ద నమోదు చేసుకోవాలి. రోగి వయసు, సమస్య తీవ్రత, అవసరాన్నిబట్టి ఏ అవయవ దానం అవసరమో వైద్య బృందం నిర్ధారిస్తుంది. దేశంలో అనేకమందికి మూత్రపిండాలు అవసరపడుతున్నాయి. కొందరిలో మూత్రపిండంతోపాటు క్లోమాన్నీ ఏకకాలంలో మారుస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం స్వీకర్త దీర్ఘకాలంపాటు వైద్య పర్యవేక్షణలో ఉండాలి. అవయవ మార్పిడికి సంబంధించి ప్రత్యేక శిక్షణ పొందిన వైద్యుల పర్యవేక్షణలోనే ఈ చికిత్సలు జరగాలి. కొన్ని ప్రత్యేక సౌకర్యాలున్న హాస్పిటళ్లలోనే ఈ చికిత్సలు చేయాల్సి ఉంటుంది. అవయవాలను అతి తక్కువ సమయంలో తీసుకురావడం అత్యంత సమస్యాత్మకమైంది. వైద్యులతోపాటు ప్రభుత్వ యంత్రాంగమూ పూర్తిస్థాయిలో సహకరించినప్పుడే ఈ కార్యక్రమం విజయవంతమవుతుంది. ప్రైవేటు వైద్యశాలల్లో ఇందుకు అయ్యే ఖర్చు భారీగానే ఉంటుంది. ఇప్పటికీ దేశంలో అవయవ మార్పిడి చికిత్సలు సామాన్యులకు అందుబాటులో లేవన్నది కఠిన వాస్తవం. కొన్నిసార్లు గుండెను తీసిన నాలుగు గంటల వ్యవధిలోనే స్వీకర్తకు అమర్చాల్సి ఉంటుంది. అందుకు ప్రత్యేక సౌకర్యాలు తప్పనిసరి. అందుకే ప్రభుత్వం ప్రాథమ్య ప్రాతిపదికన అత్యాధునిక వైద్య వసతుల ఏర్పాటుకు సంసిద్ధం కావాలి.

సామాజిక బాధ్యత

అవయదాన కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం రేకెత్తించాలి. పాఠశాల స్థాయి నుంచే ఆ మేరకు అవగాహన పెంచాలి. ప్రభుత్వంతోపాటు ప్రసార మాధ్యమాలూ చురుగ్గా ఉన్నప్పుడే ఈ కార్యక్రమం సజావుగా పట్టాలకెక్కుతుంది. వాహన రవాణా లైసెన్సు స్వీకరణ సమయంలోనే ప్రతి ఒక్కరితోనూ 'నేను అవయవ దాతను' అనే అంగీకార పత్రంపై సంతకం పెట్టించాలి. దేశంలోని ప్రతి కళాశాల, విశ్వవిద్యాలయంలోనూ ఇందుకు సంబంధించి ఒక సమన్వయకర్తను నియమించాలి. సమీప ప్రాంతాల్లో నిరంతరం పర్యటిస్తూ రక్తదానంతోపాటు ఇతర అవయవ దానాలపైనా ప్రజల్లో చైతన్యం రేకెత్తించడం వీరి బాధ్యత కావాలి. దేశంలోని ప్రతి వైద్య విద్యార్థికీ అవయవ దాన చైతన్య కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను కోర్సులో భాగంగా నిర్దేశించాలి. అవయవ దానం చేసినవారి కుటుంబీకులనుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ శస్త్రచికిత్స, వైద్య సేవలకు సంబంధించి వసూలు చేయరాదు. పైగా అవయవదాతల పేరిట కొంత మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయగలిగితే అది అద్భుతమైన ప్రోత్సాహకంగా ఉపకరిస్తుంది. అందుకోసం అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకొనేందుకు ఓ ప్రత్యేక కమిటీని నియమించాలి. అవయవ స్వీకర్త ప్రతి నెలా ఔషధాల కోసం కనీసం రూ.15వేల నుంచి రూ.20వేలు ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. కాబట్టి శస్త్ర చికిత్స అనంతరం వారికి కనీసం రెండు మూడేళ్లపాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు- కొంతమేర ఆర్థిక సాయమూ అందించాలి. పేదరికం వల్ల అవసరమైన మందులు కొనుగోలు చేయలేక, అనారోగ్య సమస్యలు తలెత్తి స్వీకర్తకు జరగరానిది జరిగితే మొత్తంగా అవయవదాన ప్రక్రియే అర్థంలేనిదవుతుంది. ప్రభుత్వం చట్టాలు చేసినా ఇప్పటికీ డబ్బుకోసం మూత్రపిండాలు అమ్ముకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. పేద ప్రజలను లక్ష్యంగా చేసుకొని దళారులు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేయాలి. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రతి జిల్లాకేంద్రంలోనూ ఒక అవయవ మార్పిడి కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి. కొన్ని సందర్భాల్లో అవయవాలను అత్యంత వేగంగా ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు విమానయాన సంస్థలు ప్రయాణ ఖర్చులకు ప్రత్యేక రాయితీలు ప్రకటించాలి. అవయవ స్వీకర్తలే అవయవ దానానికి సంబంధించిన ప్రచారకర్తలుగా మారి ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించాలి. అవయవ మార్పిడికి సంబంధించిన కార్యక్రమంలో ఆర్థిక లావాదేవీలు హద్దు మీరరాదు. ఏ మాత్రం గతితప్పినా నైతిక విలువలను పణంగా పెట్టి రోగులను వైద్యులే ఏమార్చే ప్రమాదాలు కొట్టిపారేయలేనివి. రోగులు చిన్నపాటి కోమాలోకి వెళ్ళినా 'బ్రెయిన్ డెడ్'గా చూపేందుకు వారు ప్రయత్నించవచ్చు. మరణించిన తరవాతా పది మంది జీవితాల్లో వెలుగు నింపే అవకాశాన్ని ఆధునిక వైద్యశాస్త్రం అందుబాటులోకి తెచ్చింది. ఈ అవకాశాన్ని ఓ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలి!

– డాక్టర్ పి. కృష్ణ ప్రశాంతి

స్ఫూర్తిదాయకంగా శ్రీలంక, న్యూజిలాండ్



కొన్ని దేశాల్లో అవయవదాతలకు చట్టపరంగా ఆర్థిక సాయమూ అందిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో అవయవ దాన కార్డును ప్రవేశపెట్టారు. 1992లో జపాన్‌లో 'బ్రెయిన్ డెత్'ను చట్టబద్ధం చేశారు. న్యూజిలాండ్ వంటి దేశాల్లో బతికి ఉన్నవారు సైతం అవయదానానికి ముందుకు వస్తున్నారు. అవయవదానాన్ని వ్యాపారంగా నిర్వహించడం ఆ దేశంలో శిక్షార్హమైన నేరం. శ్రీలంక 60 వేల కార్నియా దాన చికిత్సలతో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ఇతర దేశాలకు శ్రీలంక ఏటా వేలాది కార్నియాలు సరఫరా చేస్తోంది. పాశ్చాత్య దేశాల్లో ముఖ్యంగా అమెరికాలో అవయవదానం కోసం వేచిఉంటున్నవారి సంఖ్య అత్యధికం. అక్కడ ఏటా లక్షా 20వేలమంది తమకు అవయవాలు అవసరమంటూ పేర్లు నమోదు చేసుకుంటున్నారు. కేవలం 30వేలమందికే అవయవ మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయి. అక్కడ రోజూ 22మంది అవయవాలు అందక మరణిస్తున్నారు. ఆ రకంగా ఏటా ఎనిమిది వేలమంది చనిపోతున్నారు. పకడ్బందీ చట్టాలున్న అమెరికాలోనే పరిస్థితి ఇలా ఉంటే- ఇక భారత్‌లో ఎన్ని వేలమంది అవయవాలకోసం వేచి చూస్తున్నారో తేల్చిచెప్పడం కష్టం. దేశంలో కాలేయం, మూత్రపిండాలు, కార్నియా వంటి అవయవాలకోసం ఏటా వేల సంఖ్యలో వేచిచూస్తున్నారు. మధుమేహ వ్యాధి పీడితులు ఎక్కువగా మూత్రపిండాలు, పాంక్రియాస్ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారు.

ఫిరాయింపుల భస్మాసుర హస్తం!

అడ్డదారిన సాధించిన విజయాలకు అసలు విలువే లేదు పొమ్మన్నారు తొలి భారత ప్రధాని పండిత నెహ్రూ. మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్టీ కార్యవర్గ శ్రేణులకు ఆయన చేసిన ఆ ఉద్బోధ- ఇందిర జమానాకొచ్చేసరికే పరగడుపున పడిపోయిందని చెప్పక తప్పదు. తొలినాటి జనస్వామ్యం కాలక్రమంలో భజనస్వామ్యంగా, భోజనస్వామ్యంగా రూపాంతరం చెంది ధనస్వామ్యమై నేడు ధగధగలాడిపోతోంది. ఎక్కడ ఏ స్థాయిది అన్నదాంతో నిమిత్తం లేకుండా, ఎలా గెలిచామన్న ప్రస్తావనే రాకుండా, గెలిచామా లేదా అన్నదే ప్రధానం అనే రీతిగా... దేశంలో ఎన్నికల రాజకీయాలు రాటుతేలిపోయాయి! సాధారణ ఎన్నికలకే ఆ జాడ్యం పరిమితమైందనుకొంటే పొరపాటు. పెద్దల సభ ఎన్నికలూ నయా యుద్ధక్షేత్రాలై రాజ్యాంగ నియమాలూ విలువలూ కసిగా తెగిపడుతున్న తీరు ఆలోచనాపరుల్ని అమితంగా కలచివేస్తోంది. ఈ మధ్య గుజరాత్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల తతంగాన్ని చిత్తగిస్తే- శీలహీన రాజకీయాల విశృంఖలత్వం విస్తుగొలుపుతుంది!

'అధికారంలో కొనసాగడానికి అవినీతిని ఆశ్రయించం... అనైతిక పద్ధతులూ అవలంబించం... మా ఆత్మల్ని అమ్ముకోవాలనో, తాకట్టు పెట్టాలనో మేం అనుకోవడం లేదు'- పదమూన్నాళ్ల ప్రధానిగా 1996లో నిండుసభలో వాజ్‌పేయీ చేసిన ఉద్విగ్న ప్రసంగమది. 'ఇన్నేళ్లూ మేం నిబంధనలకు లోబడే ఆడుతున్నాం... తక్కినవాళ్లు తొండాట ఆడుతుంటే ఏం చెయ్యాలి?' అని ఆయనే మరో సందర్భంలో వాపోయారు. వాజ్‌పేయీ, అద్వానీల తదుపరి తరం అలాంటి గుంజాటనలేవీ పెట్టుకోలేదని గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు నిరూపించాయి. రాష్ట్ర అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 182. బలాబలాల్ని బట్టి అధికార భాజపా ఇద్దర్ని, విపక్ష కాంగ్రెస్ ఒకర్ని రాజ్యసభకు ధీమాగా నెగ్గించుకోగల వీలుంది. భాజపా జాతీయాధ్యక్షుడు, అపర చాణక్యుడు అమిత్ షా ఈసారి గుజరాత్ నుంచి పెద్దల సభకు నామినేషన్ సమర్పించడం ఉత్సుకత పెంచిన కీలకాంశం. తన పక్షాన మరో అభ్యర్థిగా కేంద్రమంత్రి స్మృతీ ఇరానీని బరిలోకి దింపిన కమలం పార్టీ- ఎప్పట్లాగే కాంగ్రెస్ తరఫున మరోసారి ఎన్నికకు సిద్ధమైన అహ్మద్ పటేల్ (సోనియా రాజకీయ కార్యదర్శి)కి గట్టిగా 'చెక్' పెట్టాలని నిర్ణయించింది. తెరచాటు రాజకీయం జోరందుకోవడమే తరువాయి... ఫిరాయింపులు జోరెత్తాయి, వివాదాలు రాజుకున్నాయి, విలువలు తెగిపడ్డాయి, ఆత్మలు అమ్ముడుపోయాయి!

శంకర్ సింహ్ వాఘేలా- ఎందరితోనో 'బాపూ' అని పిలిపించుకొనే ఈ రాజకీయ కురువృద్ధుడు గుజరాత్‌లో ఏర్పడిన మొట్టమొదటి భాజపా సర్కారును నట్టేట ముంచిన ఘనుడు! తనను కాదని అప్పట్లో కేశూభాయ్‌కి పట్టం కట్టడంతో భాజపాకు 'రాం రాం' చెప్పి, కాంగ్రెస్ దన్నుతో రాష్ట్రాన్నేలిన ఫిరాయింపుదారుడు! తరవాత తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన పెద్దమనిషికి- వచ్చే డిసెంబరు ఎన్నికల్లో హస్తం పార్టీ తనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే బాగుండునని పించింది. తన మద్దతుదారుల ద్వారా మహజరు సమర్పించినా, సోనియా పట్టించుకొనకపోవడంతో 'గుస్సా' మొదలైంది. అదను కోసం వేచి ఉన్న వాఘేలాకు, 2004-14 మధ్యకాలంలో తమను రాజకీయంగా వెంటాడిన అహ్మద్ పటేల్‌కు బుద్ధి చెప్పితీరాలన్న పంతం పూనిన అమిత్ షా లక్ష్యానికి జత కలిసింది. తనతో పాటు ఆరుగురితో పార్టీకి రాజీనామా చేయించిన వాఘేలా, మరికొందరు మద్దతుదారులతో కలిసి ఆడిన ఫిరాయింపు రాజకీయానికి, అమిత్ షా జోక్యం కొత్త కోరలు తొడిగింది. ఫిరాయించి వచ్చిన బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్ చేత భాజపా పక్షాన తృతీయ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయించడంతో రాజకీయ కాక ఊహాతీతంగా పెరిగి కాంగ్రెస్ అధిష్ఠానానికి ముచ్చెమటలు పట్టించింది. ఈ తరహా నేలబారు రాజకీయం కాంగ్రెస్ ఎన్నోసార్లు చేసింది. తనదాకా వచ్చేసరికి తత్వం బోధపడి- రాజ్యసభ ఎన్నికల్నీ క్యాంపు రాజకీయాలతో గరంగరంగా మార్చేసింది!

అహ్మద్ పటేల్ గెలుపునకు అవసరమైనంతమంది శాసనసభ్యులతో కాంగ్రెస్ బెంగళూరులో విడిది శిబిరం నిర్వహిస్తున్నప్పుడే- వారికి ఆతిథ్యం ఇస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ మంత్రి ఇళ్లు, కార్యాలయాల పైన ఆదాయపన్ను శాఖ దాడులు జరిగాయి. ఇదీ కాంగ్రెస్ కుటిల రాజకీయ చరిత్రలోని కూసువిద్యే! గొంగట్లో తింటూ వెంట్రుక లేరడం లాంటి ఈ వ్యవహారంలో- పార్టీ నిబద్ధతలు గాలికి కొట్టుకుపోగా, ఇద్దరు సభ్యుల పోలింగ్ సరళి నియమబద్ధం కాదన్నదానిపై రేగిన రగడ కేంద్ర ఎన్నికల సంఘం సముఖానికి చేరి తీవ్ర ఉత్కంఠ పెంచింది. నడిరాత్రి వేళ ఈసీ దగ్గరికి కేంద్రమంత్రులు బారులు తీరిన వైనం- ఎన్నికను భాజపా ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొందో ఎలుగెత్తి చాటింది. చట్ట నిబంధనలకే కట్టుబాటు చాటుతూ ఈసీ తీసుకొన్న నిర్ణయంతో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఫిరాయింపుదారుల ఓట్లు చెల్లకుండాపోగా, అహ్మద్ పటేల్‌ను ఆరు ఓట్ల తేడాతో విజయం వరించింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు పోయి పార్టీలు సమస్త విలువల్నీ కాలరాస్తే, రాజ్యాంగ సంవిధానానికి కట్టుబడిన ఈసీ ప్రశంసార్హంగా వ్యవహరించింది.


శంకర్ సింహ్ వాఘేలా

పుణ్యభూమి

పచ్చగా ఉన్నచోట తిని వెచ్చగా ఉన్నచోట పడుకొనే అవకాశవాదమే అన్నిచోట్లా గజ్జెకట్టి ఆడుతోంది. ధన, భుజ బలాల దన్నుతో ఎన్నికల రంగాన్ని దున్నేసి నెగ్గుకు రాగల గెలుపు గుర్రాలకే పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచిన తమను గద్దెనెక్కించే పార్టీ ఏదన్నదే ప్రతినిధులకు ప్రధానం అయిపోతోంది. సైద్ధాంతికంగా రాజకీయాలు గుల్లబారిపోయిన దుష్పర్యవసానమిది. రాజ్యసభ సీటు కోసం వందకోట్ల రూపాయలు వెదజల్లాల్సి వస్తోందని సీనియర్ కాంగ్రెస్ నేత చౌదరి బీరేందర్ సింగ్ 2013 జులైలో ప్రకటించినప్పుడు కలకలం రేగింది. డబ్బులు వెదజల్లి ధనరాశులు దండుకొనే లాభసాటి వ్యాపారంగా రాజకీయాలు దిగజారాక మోసాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. నిరుడు జూన్‌లో హరియాణా రాజ్యసభ ఎన్నికల్లో జరిగిన వైపరీత్యం నిశ్చేష్టపరుస్తుంది. ఓటు వెయ్యడానికి వెళ్లిన కాంగ్రెస్ సభ్యుడు అక్కడ వినియోగించాల్సిన అధీకృత పెన్నును మార్చేయడంతో- అతని తరవాత ఓటువేసిన డజనుమంది ఓట్లూ చెల్లకుండా పోయాయి! సొంత పార్టీలోని అసమ్మతి కుట్రలు, ఎదిరిపక్షంతో లోపాయికారీ అవగాహనతో సాగించే కుతంత్రాలూ ఏటికేడు పెరుగుతున్నాయనడానికి నిదర్శనలే ఇవన్నీ!

ఫిరాయింపుదారుల భస్మాసుర సంతతిని పెంచి పోషించడంలో పార్టీలన్నింటిదీ తిలాపాపం తలా పిడికెడు! అధికారంలో ఉన్న పార్టీ వివిధ పదవుల వల చేతపట్టి గోడదూకుడుగాళ్లను బుట్టలో పెట్టగలిగినా, రేపు ఓడలు బండ్లు అయ్యాక పరిస్థితేమిటి? ఫిరాయింపుదారుల నిషేధ చట్టం అమలులో ఉందన్న మాటేగాని, అది ఎందుకూ కొరగానిదిగా భ్రష్టుపట్టిపోయింది. రెండు పుష్కరాల క్రితం బ్రిటన్‌లో చట్టసభ సభ్యులు సైతం ఇలాగే విలువలకు సిలువ వేసి దిగజారిపోగా- లార్డ్ నోలన్ సారథ్యంలోని కమిటీ రాజకీయ వ్యవస్థకు లక్ష్మణరేఖలు గీసింది. నిస్వార్థం, వృత్తి నిబద్ధత, హేతుబద్ధత, జవాబుదారీతనం, పారదర్శకత్వం, నిజాయతీ, ఇతరులకు తామే ఆదర్శంగా నిలవడం- ఈ ఏడూ ప్రజాప్రతినిధులకు ఉండాల్సిన ప్రధాన లక్షణాలని స్పష్టీకరించింది. అలాంటి సజ్జన అభ్యర్థుల ఎంపిక మొదలు, సైద్ధాంతిక పోరాటమే అజెండాగా ఇక్కడి పార్టీల పనిపోకడలు సొంతం రూపాంతరం చెందాల్సిన అవసరం నేడు ఎంతో ఉంది. కాదూ, కూడదూ ఫిరాయింపుల కంపే ఇంపు అనుకుంటే- ఆ భస్మాసుర హస్తం మొత్తం వ్యవస్థనే బలిగొంటుంది. కాదంటారా?

– పర్వతం మూర్తి

అన్నం పరబ్రహ్మం

మనిషి జీవితాన్ని నిలబెట్టడానికి ఎన్నో ప్రాణులు తమ జీవితాల్ని సమర్పించుకుంటున్నాయి. ఈ సూక్ష్మాన్ని గ్రహిస్తే, అతడు తాను తీసుకునే ఆహారం పట్ల ఎంత కృతజ్ఞతగా ఉండాలో తెలుస్తుంది. ఆ పవిత్ర భావం కలిగినప్పుడు, మనిషి సహజంగా తనకు ఎంత అవసరమో అంతే ఆహారం తీసుకుంటాడు. వృథాకు తావుండదు.

ఏ రకమైన ఆహారం, ఏ విధంగా పనిచేస్తుందన్న అవగాహన ఎంతో ముఖ్యం. ఇద్దరు వ్యక్తులు- ఒకేలాంటి ఆరోగ్యం కలిగినవారు, ఒకే రకమైన పోషక విలువలు గల ఆహారం తీసుకున్నారు. ఒకరు ఎంతో ఆనందంతో స్వీకరిస్తే, మరొకరు పోషణ నిమిత్తం అని భావించారు. ఆనందంతో ఆహారం తీసుకున్న వ్యక్తికి, తక్కువ పరిమాణంలోని ఆహారం ఎక్కువ పోషణ అందించిందని వెల్లడైంది. దీనికి శాస్త్రీయపరమైన ఆధారముంది. జీవితం పట్ల అవగాహన కలిగిన ఎవరికైనా ఇదెంత యథార్థమో అర్థమవుతుంది. ఆహారాన్ని కృతజ్ఞతాభావం, పూజ్యభావంతో స్వీకరించినప్పుడు అది మహాప్రసాదం అవుతుంది. ఎంత పరిమాణంలో తీసుకున్నా, దేహావసరాలకు దోహదపడి అద్భుత ఫలితాలనిస్తుంది.

మరో ఆయువు తనలో భాగమవుతోందనే వాస్తవాన్ని మనిషి అవగాహన చేసుకోవాలి. ఆ విచక్షణ అతడికి అవసరం. గొప్ప సంతృప్తినిచ్చే ఈ భావాన్ని తెలుసుకుంటే చాలు. ఇదే ప్రేమ, భక్తి, ఆత్మసమర్పణ భావం! ఆధ్యాత్మిక స్థితిని చేరుకోవడానికి ఇది అంతిమ లక్ష్యం.

ఆహారం తీసుకునేముందు ధ్యానం చేయాలి. కళ్ళుమూసుకుని, శరీరానికి అవసరమయ్యే పవిత్ర ఆహారంగా భావించాలి. ఆహారం నమిలి తినాలి. అప్పుడే ఆనందం.

లోకంలో ఆహారం కనిపిస్తుంది... కదిలిస్తుంది... శారీరక మానసిక ఆధ్యాత్మిక ప్రభావాన్ని కలిగిస్తుంది. భీష్ముడు మరణశయ్యపై ఉన్నప్పుడు ఏం చెప్పాడు? దుష్ట ఆలోచనలు కలిగిన దుర్యోధనుడి ఆహారం తిన్న ఫలితంగానే- నిండు సభలో ద్రౌపది అవమానానికి గురవుతున్న సందర్భంలో తాను మానసికంగా బలహీనుణ్ని అయ్యానని, అంపశయ్య మీద పడుకున్నప్పుడే ఆ దుష్ఫలితం పోయిందనే కదా!

భగవంతుడికి ప్రసాదంగా సమర్పితమయ్యేది ఆహారం. యజ్ఞయాగాదుల్లో, అగ్నికి ప్రార్థనలో భాగంగా ఆహారాన్ని సమర్పించడం కృతజ్ఞతకు చిహ్నం.

ఆహారాన్ని నలుగురితోనూ పంచుకోవడం విశ్వప్రేమకు తార్కాణం. అది ఏకత్వ భావన కలిగిస్తుంది. ఏ పదార్థమైనా, అంతా ఏకమై ఆహార రూపంలో మనిషిలోకి చేరుతుంది. భుజించడం అనే ఒకే ఒక స్వల్పక్రియ ద్వారా, ఆ కలయిక విశేష అనుభవంగా రూపుదిద్దుకుంటుంది. సర్వం సృష్టికర్త ఇష్టానుసారమే! సంస్కృతంలో 'సహనా భవతు... సహనౌ భునక్తు...' అనే ప్రార్థన ఉంది. 'కలిసి ఉందాం, కలిసి భుజిద్దాం, కలిసి శక్తిని ఉత్పత్తి చేద్దాం. మన శక్తికి హద్దన్నదే లేదు, ఏ శత్రుభావమూ లేదు. శాంతి... శాంతి... శాంతి'- ఆ విధంగా ప్రతి మనిషీ తనను తాను సంసిద్ధుణ్ని చేసుకోవాలి.



అంతర్యామి

స్వీకరించేటప్పుడు, ఆహారం పట్ల పవిత్ర భావాన్ని అంతరంగంలో నిలపాలి. పరిపూర్ణ విశ్వాసంతో ఆస్వాదించాలి.

ఒక స్థితి నుంచి మరో స్థితిలోకి ఆహారం రూపాంతరం చెందుతుంది. ఒకప్పుడు మట్టి, కొన్నాళ్ళకు అందులో నుంచి మొక్క... ఒక్కో దశ దాటి అది రుచుల్ని సంతరించుకుంటుంది. చివరికి ఆహారమవుతుంది. ఆ తరవాత మనిషిలోకి చేరుతుంది. మట్టి-మానవ స్వభావంలోకి మార్పు చెందడం ఓ పరిణామాత్మక దశ. మనిషి సంకల్పిస్తే ఇదే మట్టిని భగవత్ స్వరూపంగా మార్చి పదిలపరచుకోవచ్చు.

దైవీగుణాలతో శాంతిని ప్రసరింపజేసే ఆహారాన్ని 'అన్నపూర్ణ'గా కొలుస్తాం. 'అన్నం బ్రహ్మం'- ఆహారమే దైవం. మానవ నిజజీవితంలో- పీల్చే గాలి, తాగే నీరు, నడిచే నేల... వీటి సమ్మిళితమే ఆహారం. అంతా దైవమయమే, అంతా ఊపిరి నిలిపేదే! దేనికదే ఉంటే, అది ఆహారం అనిపించుకోదు. అన్నీ కలిసినప్పుడే- మెతుకైనా, బతుకైనా... అప్పుడే ఏ జీవికైనా భవిష్యత్తు!

– మంత్రవాది మహేశ్వర్



దోనిపేటలో రొయ్యల చెరువుల గట్లను ధ్వంసం చేస్తున్న అధికారులు

రొయ్యల చెరువులు ధ్వంసం

'ఈనాడు- ఈటీవీ ఆంధ్రప్రదేశ్' కథనాలకు స్పందన

రణస్థలం, న్యూస్‌టుడే: సముద్రం ఒడ్డునే అక్రమంగా ఏర్పాటైన రొయ్యల చెరువుల తొలగింపు ప్రక్రియ ప్రారంభమయింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం దోనిపేటలో అక్రమంగా రొయ్యల చెరువులు ఏర్పాటైన వైనంపై శనివారం 'ఈనాడు'లో 'కన్నేసి...కడలి తీరాన్ని కబళించేసి' శీర్షికన ప్రచురితమైన చిత్రాలకు, 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్'లో ప్రసారమైన 'కబ్జా కోరల్లో తీరం' కథనాలకు జిల్లా అధికారులు స్పందించారు. అనుమతులు లేని చెరువుల ధ్వంసం చేయాలన్న జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దారు కె.శ్రీరాములు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది దోనిపేటలో చెరువులను ధ్వసం చేశారు. అక్కడి యంత్రాలు, గొట్టాలు, ఇతర పరికరాలు స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.



కిర్లంపూడిలో ముద్రగడ ఆధ్వర్యంలో నల్లగుడ్డలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఐకాస, కాపు సంఘాల నాయకులు

పాదయాత్రకు ఎందుకు అనుమతి తీసుకోవాలి?

అధికారులను నిలదీసిన ముద్రగడ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎందరో పాదయాత్రలు చేసినా ప్రభుత్వాల నుంచి అనుమతి తీసుకోలేదని, అలాంటప్పుడు మేమే అనుమతి ఎందుకు తీసుకోవాలని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం పోలీసులను ప్రశ్నించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి నుంచి ఐకాస, కాపు సంఘాల నాయకులు ముఖానికి, తలకు నల్లగుడ్డలు కట్టుకుని పాదయాత్రకు బయలుదేరారు. వీరిని రోజూ మాదిరే గేటువద్ద పోలీసు అధికారులు అడ్డుకోగా ముద్రగడ వారితో వాగ్వాదానికి దిగారు. తమను ఇంట్లో నిర్బంధించే కంటే జైలుకు పంపాలని పట్టుబట్టారు. కనీసం అక్కడైనా స్వేచ్ఛగా జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వీలుంటుందన్నారు. ఎన్నేళ్లయినా అధికారంలో ఉండాలని ముఖ్యమంత్రి కలలు కంటున్నప్పుడు.. మా సమస్య పరిష్కరించుకోవాలనే తపన మాకు ఉండరాదా అంటూ ప్రశ్నించారు. చట్టాన్ని ఎక్కడా ఉల్లంఘించకున్నా దేశద్రోహులుగా చిత్రీకరించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఐకాస రాష్ట్ర సహ కన్వీనర్లు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, న్యాయవాద ఐకాస రాష్ట్రనాయకుడు ఆరేటి ప్రకాష్, గుండా వెంకటరమణ, గౌతు స్వామి పాల్గొన్నారు.

పదును వచ్చినా.. అదను దాటింది!

- ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం
- మారుతున్న వర్షపాత లెక్కలు
- సాగు మెరుగుపడేనా?
- అన్నదాతలో కొనసాగుతున్న అయోమయం

ఈనాడు - అమరావతి



నెల నుంచి కనిపించని వానలు ఒక్కసారిగా పలకరించడంతో వర్షపాత లెక్కలు క్రమంగా మారుతున్నాయి. 32శాతం వరకు లోటులోకి వెళ్లిన అనంతపురం జిల్లా ఇప్పుడు 19.4 శాతానికి లోటు తగ్గి సాధారణ స్థాయికి చేరువైంది. 20 నుంచి 25శాతం లోటును ఎదుర్కొన్న కడప, చిత్తూరు, కర్నూలు జిల్లాలలో ఇప్పుడు ఎంత కురవాలో అంత మేర దాదాపు కురిసినట్లేననే దశకు చేరాయి. ప్రకాశం జిల్లాను వర్షం ముంచెత్తుతోంది. రాష్ట్రంలోని 90 శాతం మండలాల్లో వర్షాలు కురుస్తున్నా తొలకరి పంటలు నేలబారునే ఉసూరుమంటున్నాయి. పట్టెలు కమ్మాల్సిన పత్తి అడుగు ఎత్తులోనే కునారిల్లుతోంది. వేరుసెనగ వెలాతెలాపోతోంది. కంది పరిస్థితీ ఇంతే.

	లక్షల హెక్టార్లలో
ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం	42.06
సాగు కావాల్సిన విస్తీర్ణం	23.94
గతేడాది ఇదే సమయానికి	26.31
ఇప్పటిదాకా సాగైంది	20.20
గతేడాదితో పోలిస్తే తేడా	6.11

నాలుగైదు రోజుల నుంచి పడుతున్న జల్లులు వీటికి ప్రాణం పోస్తున్నా.. బీడుగా ఉన్న పొలంలో ఏం వేయాలనే ప్రశ్నే రైతులను వేధిస్తోంది. ఎండిన పంటలు ఎదిగేదెంత? దిగుబడులెంత? అనే సందేహాలూ వెన్నాడుతున్నాయి.

విత్తన కష్టం..: గతేడాదితో పోలిస్తే.. 6.11 లక్షల హెక్టార్లలో సాగు కోసం తెచ్చిన విత్తనాలను రైతులు ఇళ్లలోనే పెట్టుకున్నారు. వీటి కొనుగోళ్ల కోసం ఎకరాకు రూ. మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చు చేశారు. అదను దాటిపోవడంతో ఇందులో 90శాతం రైతులు మళ్లీ విత్తనాలు కొనుక్కోవాల్సిందే. వేరుసెనగనే తీసుకుంటే 4.41లక్షల హెక్టార్ల విత్తనాన్ని నిల్వచేశారు. ఇందుకు చేసిన ఖర్చు రూ. 441కోట్ల పైమాటే.

దెబ్బతిన్న పైర్లు..: అదనులో వానలు కురవక సాగైన విస్తీర్ణంలో కొంత దెబ్బతింది. రాయలసీమ జిల్లాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. జులైలో అనంతపురం జిల్లాలోని గోరంట్ల, గుమ్మగట్ట, కనేకల్, పరిగి, పెద్దాపూర్ తదితర 12 మండలాల్లో 50 మి.మీ.లోపు వర్షపాతమే నమోదైంది. కడప జిల్లాలోనూ పది మి.మీ. లోపు నమోదైన మండలాలు ఐదు ఉన్నాయి. మొత్తంగా పది వేల హెక్టార్లకుపైనే ఎండుముఖం పట్టి ఉంటుందని, మరో 60వేల హెక్టార్ల వరకు ఎండేందుకు సిద్ధంగా ఉందని అంచనా.

ప్రత్యామ్నాయంపైనే ఆశ

ఖరీఫ్ ఆశలన్నీ ఇక ప్రత్యామ్నాయంపైనే. గోదావరి, కృష్ణా డెల్టాల్లోని చివరి భూముల్లో వరి, కొన్ని జిల్లాల్లో మిరప మినహాయిస్తే మిగిలిన పత్తి, కంది, వేరుసెనగ సాగుకు అదను దాటిపోయినట్లేనని రైతులు చెబుతున్నారు. వారంలో వర్షాలు మెరుగుపడే అవకాశం ఉందని, సమయం మించిపోలేదని అధికారులు నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. వానలు వరసగా కురవకపోతే పైరు పెరగదనే అభిప్రాయంతో అన్నదాతలున్నారు. అపరాలు, తృణధాన్యాలవైపే వారు మొగ్గు చూపిస్తున్నారు. రాష్ట్రంలో ఆగస్టు 9 నాటికి పరిశీలిస్తే 20.20లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

- ★ కంది సాధారణ విస్తీర్ణం 2.75లక్షల హెక్టార్లకు 1.27 లక్షలే వేశారు. మిగిలిన 1.48లక్షల హెక్టార్లలో ఇతర పంటలు వేసుకోవాల్సిందే.
- ★ వేరుసెనగ 8.50లక్షల హెక్టార్లకు 4.09లక్షలే విత్తనం పడింది. ఇక్కడా మిగిలిన 4.41లక్షల ఎకరాల్లో అపరాలు, తృణధాన్యాల సాగుకే అవకాశాలున్నాయి.
- ★ పత్తి వేయాల్సింది ఆరు లక్షల హెక్టార్లైతే సాగైంది 4.43లక్షలే.
- ★ వరి సాధారణ విస్తీర్ణం 16.25లక్షల హెక్టార్లుంది. ఇప్పటికి 7.33లక్షల హెక్టార్లలో నాట్లు పడ్డాయి. చివరి భూములకు నీరు చేరక కొంతమంది నిరీక్షిస్తున్నారు. జలాశయాలు నిండక ప్రత్యామ్నాయ పంటలను వేసేందుకు 20శాతం మంది ఎదురుచూస్తున్నారు.
- ★ మొత్తంగా చూస్తే పది లక్షలకు పైగా హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధమవుతున్నారు.
- ★ ప్రత్యామ్నాయం కోసం వ్యవసాయశాఖ 75వేల టన్నుల పెసర, మినుము, మొక్కజొన్న, అలసంద, తృణధాన్యాల విత్తనాలను సిద్ధం చేసింది.

మేత కోసం సాగు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ వేరుసెనగ వేస్తున్నారు. దిగుబడి వస్తే సరి.. లేదంటే మేతకైనా ఉపయోగపడుతుందనే అభిప్రాయంతో వారున్నారు.

నెలాఖరుదాకా అనుకూలమే

నెలాఖరుదాకా వాతావరణం అనుకూలమేనని వాతావరణశాఖ సూచిస్తోంది. ఈ నెల 20 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీనివల్ల రాబోయే పది రోజుల్లో పంటల సాగు పెరగనుంది. ప్రస్తుత వర్షాలు 30 నుంచి 35 రోజుల వేరుసెనగకు అనుకూలమేనని వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. తెల్లదోమ, రసంపీల్చే పురుగులు తగ్గుతాయని చెబుతున్నారు.

కాపు కార్పొరేషన్ నిధుల వ్యయంపై విచారణ

- నిర్వహణలో పెద్దఎత్తున అక్రమాలు ఉన్నాయని ఫిర్యాదు
- మూణ్నాళ్లముచ్చటవుతున్న స్వయంఉపాధి యూనిట్లు

ఈనాడు అమరావతి: కాపుల సంక్షేమానికి కేటాయిస్తున్న నిధుల వినియోగంపై విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి విచారణ చేపట్టనున్నారు. కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అమరేంద్రపై వచ్చిన అభియోగాలపైనా విచారించనున్నారు. నిధుల కేటాయింపు, ఖర్చులపై లెక్కలు తేల్చేందుకు ప్రత్యేక ఆడిట్ నిర్వహణకు ప్రభుత్వ వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. కాపు కార్పొరేషన్ ఏర్పాటయ్యాక మొదటి ఏడాది (2015-16) రూ.వంద కోట్లు కేటాయించారు. 2016-17, 2017-18లో రూ.వెయ్యి కోట్ల చొప్పున కేటాయించారు.

- ★ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం విద్యోన్నతి కార్యక్రమంలో కేటాయిస్తున్న నిధులు దుర్వినియోగమవుతున్నట్లు ప్రధాన అభియోగం. ఈ కార్యక్రమం కోసం 2016-17లో రూ.40 కోట్లు కేటాయించారు. కాపు కార్పొరేషన్ ఇప్పటివరకు రూ.పది కోట్లకుపైగా ఖర్చు చేసింది. బోగస్ అభ్యర్థులను చూపించి డబ్బు వెనకేసుకోవడం, శిక్షణ కేంద్రాలకు చెల్లింపుల్లో కమీషన్లు చోటు చేసుకుంటున్నాయనే ఫిర్యాదులున్నాయి.
- ★ విదేశీ విద్య దీవెన కోసం గతేడాది రూ.45 కోట్లు కేటాయిస్తే ఇప్పటివరకు రూ.35 కోట్లకుపైగా ఖర్చు చేశారు. విదేశాల్లో చదువుతున్న 400 మందికి సాయం అందించినట్లు కార్పొరేషన్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విదేశీ విద్య పూర్తి చేసిన అభ్యర్థులకు చెల్లింపులు చేయడం, కార్యక్రమం ప్రారంభానికి ఒకటి రెండేళ్ల ముందు అక్కడి విశ్వవిద్యాలయాల్లో పీజీ పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరిన వారిని గుర్తించి మంజూరుచేయడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.
- ★ స్వయంఉపాధి కార్యక్రమంలో రాజకీయ సిఫార్సులకు ప్రాధాన్యమివ్వడంతో అత్యధిక యూనిట్లు మూణ్నాళ్ల ముచ్చటవుతున్నాయి. 2015-16లో ఇందుకోసం రూ. వంద కోట్లు ఖర్చు చేసి 14,500 మందికి లబ్ధి చేకూర్చారు. ఇందులో 50 శాతాన్ని రాయితీ కింద కార్పొరేషన్ అందిస్తే..మిగతా 50 శాతం బ్యాంకు రుణం ఉంటుంది. 2016-17లో రూ.450కోట్లు కేటాయిస్తే ఇప్పటివరకు రూ.370కోట్లు ఖర్చు చేశారు. 60 వేల మందికిపైగా స్వయంఉపాధి యూనిట్లు ఏర్పాటుచేశారు. రెండేళ్లలో ప్రారంభించిన యూనిట్లలో 35 శాతానికిపైగా మూతపడినట్లు అధికారవర్గాలే అంగీకరిస్తున్నాయి.
- ★ కాపు కార్పొరేషన్ ఛైర్మన్ రామానుజయ, మేనేజింగ్ డైరెక్టర్ అమరేంద్ర మధ్య సఖ్యత లోపం విచారణ వరకు దారి తీసిందనే వ్యాఖ్యలు వస్తున్నాయి. ఛైర్మన్ రామానుజయ ఎండీపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జోక్యం చేసుకొని మూడు నెలల కిందట రాజీ కుదిర్చినా మళ్లీ పరిస్థితి మామూలే అయింది. మేనేజింగ్ డైరెక్టర్ అమరేంద్ర తన తల్లి వైద్యం కోసం కార్పొరేషన్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ.13,00,564 ఖర్చు చేశారన్నది ఛైర్మన్ అభియోగం. నిబంధనలకు లోబడి ఈ నిధులు ఖర్చు చేశానని, దీన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం జీవో కూడా ఇచ్చిందని ఎండీ చెబుతున్నారు.

వైద్య కళాశాలల్లో లోపాలెన్నో..

ప్రత్యేక తనిఖీల్లో సమస్యల గుర్తింపు

ఈనాడు, అమరావతి: ప్రైవేట్ వైద్య కళాశాలల నిర్వహణ లోపాల్ని కేంద్రం వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాల ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉన్నట్లు గుర్తించింది. అలాగే నర్సుల కొరత, వేతనాల చెల్లింపులో అవకతవకలు చోటుచేసుకున్నట్లు, ఓపీ, ఐపీ విభాగాల నిర్వహణ తీరు, అర్హులైన వారు డీన్స్‌గా లేకపోవడం, వ్యర్థాల తొలగింపు విషయంలో కళాశాలల నిర్వహణను తప్పుబట్టింది. విద్యుత్తు సరఫరా అవసరాలకు తగ్గట్లుగా లేకపోవడం, వెబ్‌సైట్‌ను సక్రమంగా నిర్వహించకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రత్యేక తనిఖీల ద్వారా ఈ లోపాలను గుర్తించింది. విద్యార్థులు, ఆస్పత్రుల అవసరాలకు తగినట్లు నిర్మాణాలు లేకపోవడాన్ని, వసతి గృహాల నిర్వహణ తీరును కూడా కేంద్రం తప్పుబట్టింది. పలు కళాశాలల్లో 2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో ప్రవేశాల్ని జరిపేందుకు వీల్లేదని తెలిపింది. వీటిల్లో కొన్ని కళాశాలలు న్యాయపోరాటం చేసి, సీట్ల భర్తీకి మళ్లీ అనుమతులు పొందుతున్నాయి.

వేలాంకనికి నాలుగు ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: తమిళనాడులో వేలాంకని ఫెస్టివల్‌కు వెళ్లే భక్తుల కోసం నాలుగు ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ నుంచి సెప్టెంబరు 5వ తేదీన, వేలాంకని నుంచి తిరిగి సికింద్రాబాద్‌కు 9న ప్రత్యేకరైళ్లు అందుబాటులో ఉంటాయి. విజయవాడ నుంచి సెప్టెంబరు 6న, తిరిగి వేలాంకని నుంచి 8న రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో కాకినాడ నుంచి విజయవాడకు 5న, తిరిగి అక్కడినుంచి విజయవాడకు 10న రెండు ప్రత్యేకరైళ్లు నడిపిస్తున్నట్లు ద.మ.రై. సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ తెలిపారు.

ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతాం

మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.కృష్ణ

కోడుమూరు, న్యూస్‌టుడే: సమాజంలో అణగారిన ప్రజలపై కొనసాగుతున్న ఆధిపత్యం, పెత్తనాలకు వ్యతిరేకంగా పోరాడటమే మానవ హక్కుల వేదిక ధ్యేయమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.కృష్ణ పేర్కొన్నారు. శనివారం కర్నూలు జిల్లా కోడుమూరులో ఏడో జిల్లా మహాసభలను వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.దేవేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను కాపాడటమే వేదిక ఆశయమన్నారు. తాము ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదన్నారు. ఇసుక మాఫియా దాడులు, ఆదిమవాసుల మరణాల వంటి సంఘటనలపై పత్రికలు వాస్తవాలను ప్రపంచానికి తెలియజేయట్లేదని విమర్శించారు. మలేరియాతో మృతి చెందిన 16 మంది ఆదిమవాసుల గురించి 23 రోజుల వరకు పత్రికలు బహిర్గతం చేయలేదని తప్పుబట్టారు. దేశంలో సంఘ్ పరివార్ మతం ముసుగులో సాగిస్తోన్న అరాచకాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివనాగేశ్వరావు ఆరోపించారు.



సదస్సులో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.కృష్ణ


జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక: మానవ హక్కుల వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని వి.ఎస్.కృష్ణ, శివనాగేశ్వరావు నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడిగా కె.ఉరుకుందప్ప, ప్రధాన కార్యదర్శిగా యు.ఎం.దేవేంద్రప్ప, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, ఎస్.సూగూరప్ప, సి.కారప్ప, కార్యదర్శులుగా కె.శివశంకర్, ఆర్.మనోహర్, బి.సూర్యనారాయణను ఎన్నుకున్నారు. తొమ్మిది మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

వచ్చే ఎన్నికల్లో తెదేపాకు 140 సీట్లు: కళావెంకటరావు

రాజాం, న్యూస్‌టుడే: తెదేపాకు ప్రజల్లో ఆదరణ పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో తెదేపాకు 140 సీట్లు రావడం ఖాయమని మంత్రి కళా వెంకటరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజాం మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సర్వే చేయించారని, గత ఎన్నికల కంటే ఒక శాతం ఓట్లు తెదేపాకు పెరుగుతాయని తేల్చారన్నారు. ఈ లెక్కన 140 సీట్లకు తగ్గకుండా తెదేపా గెలుస్తుందని చెప్పారు. వైకాపా అధినేత జగన్‌ను చూసి జనం భయపడుతున్నారన్నారు. జైలుకు వెళ్లి వచ్చినా ఫరవాలేదు డబ్బు సంపాదిస్తే చాలు అన్నట్లుగా జగన్ తీరు ఉందన్నారు. గ్రామీణాభివృద్ధిలో భాగంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్, నీరు-చెట్టు పథకాలకు కేంద్ర ప్రభుత్వం రూ.4 వేల కోట్లు కేటాయిస్తే, చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.8,500 కోట్లకు పెంచి నిధులు మంజూరు చేసి తీసుకొచ్చారని, దీనివల్ల రహదారుల నిర్మాణం, చెరువులు, సాగునీటి కాలువల అభివృద్ధి జరిగిందని వివరించారు. వీటిని ఓర్వలేక వైకాపా ఎంపీలు నిధులు నిలిపేయాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ నెలాఖరుకు అయ్యేలా లేదు

- లక్ష్యాలు చేరుకోని ఫైబర్‌నెట్
- ఆగస్టుకల్లా లక్ష కనెక్షన్లూ కష్టమే
- నెల గడువు పొడిగించినా సాగని పనులు
- సెటాప్ బాక్సుల కొరతే అసలు సమస్య
- ఇతర సరఫరాదారుల కోసం టెండర్లు



ఈనాడు, అమరావతి: ఫైబర్‌నెట్ పథకం మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. నిర్దేశిత లక్ష్యాల ప్రకారం ఫైబర్‌నెట్ సంస్థ కనెక్షన్లు ఇవ్వలేకపోతోంది. మే నెలలోపే ఈ కనెక్షన్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించినా ఈ సంస్థ దాన్ని సాధించలేకపోతోంది. కనీసం జులైలోపు లక్ష గృహాలకు ఫైబర్‌నెట్ కనెక్షన్లు ఇచ్చి వారితో ముఖ్యమంత్రి ఒకేసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించాలని అనుకుంది. అయితే ఆ గడువు లోపు అన్ని కనెక్షన్లు ఇవ్వలేమని ఫైబర్‌నెట్ ఆశక్తత ప్రకటించింది. అదనంగా మరో నెల అవసరమంది. దీంతో ప్రజలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం మరింత ఆలస్యం కానుంది. ఆప్టికల్ ఫైబర్ కేబుల్(ఓఎఫ్‌సీ) నెట్‌వర్క్ ద్వారా కేబుల్‌టీవీ, అంతర్జాలం, వైఫై, టెలిఫోన్ కనెక్షన్లు ఇవ్వాలనేది ఫైబర్‌నెట్ లక్ష్యం. ఇందుకోసం ఇప్పటికే ఆ సంస్థ రూ.330కోట్లు వెచ్చించి 23,553 కిలోమీటర్ల పొడవునా కేబుళ్లను వేసింది. కనెక్షన్లు ఇవ్వడంలో మాత్రం వేగం అందుకోలేకపోతోంది.

బాక్సుల కొరతతో వెనకంజ..

ఫైబర్‌నెట్ కనెక్షన్ల ఆలస్యానికి కారణం సెటాప్ బాక్సుల కొరతే. ఈ కనెక్షన్లకు ఇవి ఎంతో కీలకం. 'జిపాన్' (జిగాబిట్ పాసివ్ ఆప్టికల్ నెట్‌వర్క్), ఐపీటీవీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్ టెలివిజన్) అనే రెండు రకాల సెటాప్ బాక్సులు అమర్చాల్సి ఉంది. మొత్తం 10 లక్షల బాక్సుల సరఫరాకు కొరియాకు చెందిన దాసన్, హైదరాబాద్‌కు చెందిన టెరాసాఫ్ట్, ఎంసీబీఎస్, కార్పస్, విశాఖపట్నంకు చెందిన యాగా టెక్నాలజీస్ సంస్థలు ముందుకొచ్చాయి. తొలిదశలో 3.50 లక్షల బాక్సులైనా పంపిణీ చేయాలనేది ఒప్పందం. ఇప్పటి వరకు ఆ సంస్థలు 34వేలు మాత్రమే సరఫరా చేశాయి. జీఎస్టీ రాక ముందు వరకు ఈ బాక్సుల ధరపై పంపిణీదారులకు, ఫైబర్‌నెట్ సంస్థకు మధ్య కొంత వివాదం నడిచింది. బాక్సుపైన రూ.500 అదనంగా భారం పడుతోందని, దీన్ని పరిష్కరించాలని పంపిణీదారులు కోరారు. ఇప్పుడు జీఎస్టీ రాకతో పన్ను సమస్య సమసిపోయింది

కొత్తగా టెండర్లు..

ఫైబర్‌నెట్ డిమాండుకు తగ్గట్లు ఇప్పుడున్న నాలుగు కంపెనీలు సెటాప్ బాక్సులు సరఫరా చేసే పరిస్థితి లేదు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయాలను యోచిస్తున్నారు. అదనంగా ఒకరిద్దరు పంపిణీదారులను పిలిపించి వారి నుంచీ బాక్సులు సేకరించాలని నిర్ణయించారు. కుదరకుంటే కొత్తగా ఈ బాక్సుల పంపిణీకీ మరికొందరు పంపిణీదారులను ఆహ్వానిస్తూ టెండర్లు పిలవనున్నారు.

కేబుళ్ల కొరత కూడా

సెటాప్ బాక్సులే కాక కేబుళ్ల కొరత కూడా ఫైబర్‌నెట్‌కు సమస్యగా మారుతోంది. అన్ని జిల్లాలను అనుసంధానిస్తూ 23వేల కిలోమీటర్ల పొడవునా ప్రధాన కేబుళ్లను వేసినా ఆయా జిల్లాల్లో గృహాలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు వాటిని అనుసంధానించడానికి అవసరమైన ఇతర కేబుళ్లు ఆ సంస్థ వద్ద లేవు. డిమాండుకు తగ్గట్లు తయారీ సంస్థలు కేబుళ్లను సరఫరా చేయలేకపోతున్నాయి.

ఎందుకీ ఆలస్యం...

- **కేబుళ్ల కొరత:** అన్ని జిల్లాలకు కేబుళ్లు వేసేసినా, వాటి నుంచి ఇళ్లకు అనుసంధానించడానికి ఇతర కేబుళ్లు అవసరం.
- సగటున ప్రతి ఇంటికీ 4 లేదా 6 కోర్ రకం కేబుల్ 10 నుంచి 15 మీటర్లు వేయాలి. అలాగే 2కోర్ రకం కేబుల్ 30 నుంచి 40 మీటర్లు అవసరం.
- **60వేల కిలోమీటర్లు:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విభాగాలను ఫైబర్‌నెట్‌తో అనుసంధానించాలంటే అవసరమయ్యే కేబుళ్ల పొడవు ఇది.
- **మానవ వనరుల లేమి:** కేబుళ్లు వేయడానికి తగిన మానవ వనరులు ఫైబర్‌నెట్ వద్ద లేవు. నైపుణ్యం ఉన్నవారూ తక్కువే. కేబుళ్లు వేయడానికి కావాల్సిన స్ప్లైసింగ్, స్ప్లిట్టర్స్ యంత్రాల కొరత ఉంది.
- **సెటాప్ బాక్సులు:** అత్యవసరంగా 3.50లక్షలు కావాలి. ఎంపికచేసిన నాలుగు పంపిణీ సంస్థలు ఇప్పటి వరకు 34వేల బాక్సులే సరఫరా చేశాయి.
- **జులై:** ఈ నెలాఖరులోపు లక్ష ఇళ్లకైనా కనెక్షన్లు ఇవ్వాలని సీఎం ఆదేశాలు. ఆగస్టు నెలాఖరుకైతేనే ఇవ్వగలమంటోంది ఫైబర్‌నెట్. ఇప్పుడు అదీ సాధ్యమయ్యే పరిస్థితి లేదు.

రాజ్యసభ టీవీ సీఈవో గురుదీప్ సింగ్ సప్పల్ రాజీనామా

దిల్లీ: రాజ్యసభ టీవీ సీఈవో పదవికి గురుదీప్ సింగ్ సప్పల్ రాజీనామా చేశారు. ప్రస్తుతం ప్రసారభారతి సీఈవోగా ఉన్న శశిశేఖర్ వెంపటికి అదనంగా ఆ బాధ్యతలను అప్పగించినట్లు రాజ్యసభ సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రుణమాఫీ మేం చేశాం.. మీ వైఖరేంటి?

- రాయచూరు సభలో భాజపాకు రాహుల్ సూటిప్రశ్న



రాయచూరు సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ తదితరులు

రాయచూరు(కర్ణాటక), న్యూస్‌టుడే : 'రైతు బాగుంటే దేశం సుభిక్షంగా ఉంటుందనే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, పంజాబ్‌లో రైతుల రుణాలను రద్దు చేశాం. ఆర్థిక ఇబ్బందులున్నా రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ స్పందించాయి. ఈ విషయంలో భాజపా వైఖరిని స్పష్టం చేయాలి' అని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ డిమాండు చేశారు. రాయచూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయం మైదానంలో శనివారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటైన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రైతు రుణాలు రద్దుచేస్తే దేశ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవుతుందని ఆర్థికమంత్రి అరుణ జైట్లీ చెప్పడాన్ని రాహుల్ తప్పుపట్టారు. పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేసినప్పుడు అది గుర్తురాలేదా? అని ప్రశ్నించారు. నవంబరులో మోదీ నోట్ల రద్దు నిర్ణయం వల్ల ఏర్పడిన ఇబ్బందులు ఇంకా తొలగలేదన్నారు. ప్రతి సభలో మోదీ కాంగ్రెస్ ఏమి చేసిందని ప్రశ్నిస్తున్నారనే విషయాన్ని ప్రస్తావిస్తూ.. యూపీఏ హయంలో ఉపాధి హామీ పథకం వల్ల లక్షల మంది ఉపాధి పొందుతున్నారని గుర్తుచేశారు. 2014 ఎన్నికల సమయంలో ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని.. ఇపుడేమో ఏటా లక్ష ఉద్యోగాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేక్ ఇన్ ఇండియాలో ఉద్యోగాల కల్పన ఏమైందని నిలదీశారు. కర్ణాటకలో సిద్దరామయ్య తక్కువ వ్యవధిలో 30వేల ఉద్యోగాలను భర్తీ చేశారని ప్రశంసించారు. కర్ణాటకలో అయిదేళ్లలో జరిగిన అభివృద్ధి పనుల నినాదంతో విధానసభ ఎన్నికలకు వెళతామని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

'కాంగ్రెస్ పార్టీ సాధ్యమయ్యే హామీలను ఇచ్చి, నెరవేరుస్తుందని రాహుల్ అన్నారు. కర్ణాటకలో హైదరాబాద్- కర్ణాటక ప్రాంతీయ అభివృద్ధి- స్వయం ప్రతిపత్తి కోసం ఆర్టికల్ 371(జె) అధికరణలో సవరణలు చేస్తామని 2009 ఎన్నికల సమయంలో పార్టీ భరోసా ఇచ్చిందన్నారు. 2013లో ఆ హామీని నిలబెట్టుకున్నామన్నారు. తద్వారా ఉత్తర కర్ణాటకలోని కీలక ప్రాంతాలకు మేలు జరుగుతుండటం హర్షణీయమన్నారు.





ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు



CA





వధువు కావలెను

Kapu 28 6' BE, MBA (IIM) 37L PA ★ 25 6' B.E (IIT) M.Tech (IIT) 30L PA ★ 26 5'8" MS 12L PA 20 Cr ★ 28 6' MD (DM) 15Cr ★ 28 5'11" B.E (Bits) MS 140K ★ 9989019945 (A)

క్షత్రియ: 27, 5'10", MBBS, MS, జనరల్ సర్జన్ చేసిన సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. ✆ 8125210356 (A)

కమ్మ, 27, 5'9", MBBS, MS, జనరల్ సర్జన్ చేసిన ఆంధ్రాలో మంచి ప్రాపర్టీ కల వరునికి తగిన ఆంధ్రా/ తెలంగాణ వధువు కావలెను. ✆ 8125210344 (A)

రజక: 27, 5'10", MBBS, MD, జనరల్ మెడిసిన్ చేస్తున్న సెటిల్డ్ ఆంధ్రా వరునికి ఆంధ్రా/ తెలంగాణ డాక్టర్/SWE వధువు కావలెను. ✆ 9494038701 (A)

Hindu, Mala/ 30/5'9"/ Data Scientist in USA/ Seeks Well Educated Traditonal bride. Call: 8978530671 (A)

Vysya/ B.Tech/ 5'9"/ 27/ 12 LPA/ 5 Cr ★ MBA/ 5'7"/ 28/ Business/ 100 Cr ★ B.Tech/ MBA, IIM/ 6'/ 27/ 18 LPA/ 5 Cr. కస్తూరి మ్యారేజెస్. ✆ 99632 32758, 0866-2431721. (B)

Padmasali/ M.Tech, IIT/ 5'9"/ 28/ 18 LPA ★ B.Tech, IIT/ 5'6"/ 26/ 24 LPA ★ B.Tech/ 5'9"/ 28/ BSNL ★ MD, Genl/ 5'10"/ 28. కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786, 0866-2438222. (B)

Velama/ B.Tech, IIT, MBA, IIM/ 5'8"/ 27/ 24 LPA ★ B.Tech/ 5'10"/ 28/ AEE (Govt) ★ B.Tech/ 5'9"/ 26/ Customs. కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771, 0866-2433788. (B)

Mala/ B.Tech/ 5'9"/ 26/ Railway ★ IRS/ 5'11"/ 31 ★ B.Tech/ 5'11"/ 28/ SBI ★ M.Tech/ 5'8"/ 29/ ONGC ★ MD, Genl/ 5'7"/ 28. కస్తూరి మ్యారేజెస్. ✆ 99632 32758, 0866-2433788. (B)

Kapu/ M.Tech/ 5'11"/ 25/ BEL (Govt)/ 10 Cr ★ B.Tech, IIT, MBA, IIM/ 5'8"/ 26/ 24 LPA/ 20 Cr ★ MS, Ortho/ 6'/ 27/ 20 Cr. కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771, 0866-2433788. (B)

Madiga/ B.Tech/ 5'8"/ 25/ LIC ★ M.Tech/ 29/ BEL ★ B.Tech/ 5'11"/ 27/ IOCL ★ B.Tech/ 5'11"/ HPCL ★ M.Tech/ 5'7"/ 28/ DRDO. కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786, 0866-2438222. (B)

Male/ 5'6"/ Fair/ 28/ Modikallu. Balija/ Setty Balija/ M.Tech/ Software/ 7L PA. Wanted Bride Same Caste/ 24-26Y/ 5'2"- 5'5"/ Fair/ Software Job. Contact: 9701863091 (A)

బ్రాహ్మణ/ మధ్వ/ 24/ 5'11"/ B.టెక్ / 6L. ★ మధ్వ/ 29/ 5'8"/ B.టెక్ / CTS/ 6L. ★ శ్రీవైష్ణవ/ 34/ 5'10"/ B.టెక్, MBA/ 18L. ★ వైఖానస/ 34/ 6'/ MSC/ 11L. ✆ 9030036501 (A)

కుమ్మరి / B.Tech, MBA/ C.Govt డిప్యూటీ మేనేజర్ (BHEL)/ 80,000 /PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854 (A)

బెస్త/ M.Tech/ IIT/ C.Govt/ ఇండియన్స్ ఎయిర్‌లైన్స్ ఆఫీసర్/ 13 Lakhs. PA/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A)

మాల/ M.Tech, IIT/ C.Govt Asst Exq. ట్రైనింగ్ ఆఫీసర్/ 1.2 LPM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9703794175. (A)

యాదవ/ B.Tech (IT)/ C.Govt సైంటిస్ట్ (DRDO)/ 75000/- PM 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885055185. (A)

మాదిగ/ B.Tech/ Govt A.E (R&B)/ 60,000/- PM / 5'9" ఎత్తు/ 27 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886512010. (A)

ముదిరాజ్/ B.Tech, MBA/ C.Govt J.T.O (BSNL)/ 70,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A)

కమ్మ/ కట్న ప్రసక్తి లేదు / B.Tech/ C.Govt బ్యాంక్ Asst మేనేజర్ (కెనరా బ్యాంక్) / 55,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి వధువు కావలెను. ✆ 9581317506 (A)

మాదిగ/ B.Tech, MBA/ Govt Asst మేనేజర్ (కెనరాబ్యాంక్)/ 55,000/- PM/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9642459724 (A)

కాపు / డైవర్సి కుల/ కట్న ప్రసక్తిలేని / 38/ 5'7"/ Fr/ MA/ MBA / వర్కింగ్, Hyd / 1 లక్ష. PM/ వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. అర్జెంటు ✆ 9160253545 అర్జెంట్. (A)

రెడ్డి/కుల / కట్న ప్రసక్తి లేని / 28/ 5'9"/ Fr/ B.Tech/ Sr. SWE/ Hyd/ 60,000/- PM/ చాలాచాలా వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయ కుటుంబపు వధువు కావలెను. అర్జెంట్. ✆ 8374883874 (A)

Vysya 27 5'10" BE (IIT) MS PWC $ 160 K Rich ★ 28 5'9" MBBS MD (Radio) 10 Cr ★ 26 5'11" BE MBA (US) CISCO 17L. Seeks Educated. ✆ 7661058171 (A)

Padmashali 27 5'9" MS P.Hd US Govt $ 150 K ★ 27 5'10" MBBS MS (Gen) Rich ★ 26 5'11" BE (IIT), MBA, IBM 15L. Rich. Seeks Educated ✆ 7661058171 (A)

Viswabrahmin 26 5'10" MS Microsoft $ 140 K Rich ★ 27 5'9" C.A MNC 16L. ★ 26 5'11" BE MBA (IIM) SONY 18L. Seeks Educated ✆ 7661058171 (A)

కుమ్మరి: BSC/ C.Govt. టెక్నీషియన్/ రైల్వేస్/ 40,000/- P.M. 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

విశ్వబ్రాహ్మణ్: B.Tech/ C.Govt స్టేషన్‌మాస్టర్/ రైల్వేస్/ 60,000/- PM 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007652 (A)

గౌడ: MBA/ C.Govt. Asst. మేనేజర్/ సిండికేట్ బ్యాంక్/ 60,000/- PM. 6' ఎత్తు 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

బ్రాహ్మణ, 24, 5'10", BE (BITS), 10L ★ 27, 5'10", M.Tech, 9L ★ 29, 5'7", M.Tech (IIT), 15L ★ 29, 5'8", BE, 25L ★ 28, 5'11", BE, MS (US) $ 90K, 9494096081 (A)

రెడ్డి 1987 5'11" B.Tech/ MS/ US/ 200k, 30Cr ★ 1990 5'6", B.Tech (IIT)/MBA/ US 90k. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో. 8885559579/ 9505551788 (A)

రెడ్డి 1988 5'7", B.Tech, 16.5L PA, B'Lore ★ 1987 5'8" B.Tech/ MBA/ HSBC 6.5L PA, నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో. 8885559579/ 9505551788 (A)

రెడ్డి 1984, 5'10", B.Tech, 8L PA ★ 1983 5'8" MBA/ 5L PA, Hyd. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో, సోమాజిగూడ, Hyd. 8885559579/ 9505551788 (A)

రెండవపెళ్లి వయస్సు 49 / BC / Govt Emp sal 70,000/- సొంత ఇల్లు / CNB తగిన అర్హతలు కలిగిన సాంప్రదాయమైన వధువు కావలెను. ✆ 7032091349. (o)

Yadava 28 5'9" B.Tech BHEL, Hyd. ✆ 9440831748 ★ 29 6'1" MBBS/ MD. Thirupathi ✆ 9440759945 ★ 29 6'0" MBBS/ MS Kadapa ✆ 9441735157 (A)

SC మాదిగ హిందూ/ 27/5'11"/ బిటెక్/ IAM రాయపూర్ MBA అయింది. టాటాస్టీల్ కంపెనీలో మేనేజర్ 1 లక్ష Pm వెల్‌సెటిల్డ్ హ్యాండ్‌సమ్ వరునికి వధువు కావలెను. Ph: 8712865419 (A)

Kamma ★ 28 5'11" BE (IIT) MS Amazon $ 120 US ★ 27 5'10" BE (IIT) MBA MNC 25La PA ★ 26 5'11" BE (IIT) MBA (IIM) Yesbank 20La PA ★ 25 5'10" MBBS MS (G.S) ★ 9177897786 (A)

Reddy ★ 27 6'1" BE MS Walmart $ 100 USA ★ 29 5'10" BE MBA TCS 12La PA ★ 29 5'7" BE MBA MNC 12La PA ★ 28 5'8" MBBS MS (General Surgery) ★ 7680876060 (A)

Kapu ★ 27 6' BE MS SWE MNC $ 130 USA ★ 28 5'11" BE (Bits) MBA (FMS) MNC 20La PA ★ 29 5'8" BE ME BOSCH 11La PA ★ 27 6 MBBS MS (G.S) ★ 7337320066 (A)

Yadava ★ 27 5'10" BE MS CSC $ 100 US ★ 29 5'6" BE ME R&D 15La PA ★ 28 6' BE Infosys 10La PA ★ 29 5'10" BE Honeywell 9La PA ★ 28 5'11" MS (Ortho) ★ 9848337378 (A)

Mala ★ 24 5'8" BE MNC 18La PA ★ 29 5'9" BE Wipro 10La PA ★ 25 5'8" BE Verizon 8La PA ★ 29 5'11" BE MBA CBRE 8La PA ★ 26 5'9" MBBS C.Govt ★ 9848134222 (A)

Castenobar ★ 28 5'10" BE MS Samsung $ 150 USA ★ 27 5'7" BE (IIT) MBA (IIT) MNC 18La PA ★ 27 5'9" BE MBA TCS 9La PA ★ 28 5'8" MS (Ortho) ★ 9391311444 (A)

కాపు/ డైవోర్డ్ అకౌంటెంట్ 39సం॥, ఎత్తు 5.7, విడో పిల్లలులేరు. రైల్వేస్ ఎంప్లాయ్ 64,000 PM, సొంత ఇల్లు, 12 ఎకరాల పొలం గల వరుడికి వధువు కావలెను. @ 70138 86194.(L)

బ్రాహ్మిణ్ 37, 5'7" B.Com, BBA 30K PM వరునికి డిగ్రి చదివిన సాంప్రదాయ వధువు కావలెను. డైరెక్ట్ ✆ 8686119306/ 9441215625 (A).

Kamma 30/ 6'/ 20L PA, MBA ★ 30/ 5'10"/ M.Tech/ 15L PA/ SWE ★ 28/ 6'/ MD/ Doctor. Ph: 9949233422/ Blue Trend Matrimonial - Hyd. (A)

CNB/ 39/ 5'9" MBA (UK) స్కూల్ బిజినెస్ 10L PA వరునికి US సిటిజన్/ వర్క్ పర్మినెంట్ వధువు కావలెను. ✆ 9959053051 msrinivasuk@yahoo.com (A)

కమ్మ: 28Y/ 5'11"/ B.Tech (IIT), MBA, IIM/ S/W in Chennai/ 2 Lakhs P/M/ 7 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 93909 14215 (D)

కాపు: 28/ 5'11"/ Fair/ B.Tech (IIT), MBA (IIM)/ Well settled Family వరునికి అందమైన వధువు కావలెను. 99636 06222 (D)

CNB: 28 Yrs/ B.Tech (IIT), MBA (IIM), 15 Lak P/A వరునికి తగిన OC, BC వధువు కావలెను. 97047 55573 (D)

Kapu/ 38/ 5'8" B.Tech Well Settled Working as Consultant in TCS at Canada Req. Suitable Educated Girl ✆ 9390414199 (A)

కమ్మ/MBA/5'11" ఎత్తు/30 సం॥లు బిజినెస్ చేస్తున్న వరుడికి కమ్మ/రెడ్డి వధువు కావలెను. నో బ్రోకర్స్. ✆: 7675956369 (P).

రెడ్డి వరులకు వధువులు కావలెను. అవినాష్‌రెడ్డి మ్యారేజెస్ (DV కోటిరెడ్డి) రోడ్డు-3 TV-9 ఎదురు కాలనీ, బంజారాహిల్స్, Hyd. www.avinashreddy.com, 9848011818 (A)

బ్రాహ్మణ: 34, 5'7" జాబ్: నేవీ, వెల్ సెటిల్డ్ వరుడికి చదువుకున్న వధువు కావలెను. గుడ్ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్. కుల ప్రసక్తి లేదు. నో బ్రోకర్స్ ✆ 9700663129 (A)

కాపు 26, 5'8", B.Tech (IIT), MBA (IIM), Asst మేనేజర్ MNC, 23Lakhs PA వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబపు వధువు కావలెను. ✆ 9959265078 (A)

గౌడ (కట్నప్రసక్తిలేదు) 27/5'10", B.Tech/ SWE/ Deloitte 85,000/-PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246964555 (A)

కమ్మ ఓన్లీసన్ 27, 5'9", B.Tech, MBA, SWE, HCL 12Lakhs PA వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. ✆ 9014933627 (A)

విశ్వబ్రాహ్మణ 27, 5'8", M.Tech, SWE, IBM, 70,000/-PM వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. ✆ 9866158793 (A)

యాదవ (కట్నప్రసక్తిలేదు) 27/5'10", B.Tech, SWE/ TCS 80,000/-PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246171703 (A)

Mala: V.V.Urgent/ B.Tech(ECE)/ 5'10"/ 28Y/ 10 కోట్ల ఆస్తి/నెలకు 6 వేల జీతంతో Govt జాబ్ చేస్తున్న వరునికై సంప్రదించండి. Ph: 8885592890 (A)

కాపు 26, 5'7", Fair B.Tech, IIT, IIM, Asst. Manager 23Lak PA 30, 5'8", B.Tech/ MS/USA/SWE, 250K PA, Well to do. ✆ 9346344474 (A)

రెడ్డి (కట్నప్రసక్తిలేదు) 28/5'9"/ M.Tech/ SWE/ HP/ 1 లక్ష PM ★ 26/ 5'10"/ B.Tech/ SWE/ 80K PM/ 5Cr ప్రాపర్టీగల వెల్‌సెటిల్డ్ వరులకు వధువులు కావలెను. ✆ 9246333320 (A)

రెడ్డి 29 6' పెయిర్ B.Tech EEE ఆడిటర్ జనరల్ ఆఫీసర్ C.Govt. 70వేలు PM వెల్‌సెటిల్డ్ వరుడికి అందమైన వధువు కావలెను. 9666567123 అర్జెంటు (A)

కాపు 1985 5'11" B.Tech, MBA (US), Sal: 2,00,000/- వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కల వరుడికి వధువు కావలెను. ✆ 7396883637 (A)

బ్రాహ్మిణ్ 1989 5'10" B.Tech Job in కాలిఫోర్నియా (US) Sal:- 1 Lakh Dollars (PA), వధులస గోత్రం వరుడికి వధువు కావలెను. (అర్జంట్) ✆ 9000804614 (A)

★ ★ ★

ఆర్యవైశ్య, 29, 5'7", 50 వేలు PM, Hyd ప్రొఫెషన్: ఫొటోగ్రఫీ, డిజైనర్ (Own బిజినెస్) గల వరునకు సాంప్రదాయ వధువు కావలెను. డైరెక్ట్. 7207295466 (A)

HIV+ ఉన్నవారికి మాత్రమే ఆర్యవైశ్య మరియు యాదవ వధువులు కావలెను. (వివరాలు గోప్యంగా ఉంచబడును) 89192 40784, సంప్రదించండి: Happen (I)

డైవర్సీ/కమ్మ/ 35 సం॥/5'5" ఎత్తు/Fair/MBA/ మేనేజర్/జీతం 50 వేలు/2 కోట్లు ఆస్తి గల వరునికి 1వ, 2వ సంబంధంగల కమ్మ వధువు కావలెను. 77021 51544, 93484 94999 (I)

30 ఏళ్ళ వయస్సుగల రెండు కళ్ళులేని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి కనీస విద్యార్హత గల వధువు కావలెను. కుల, కట్న ప్రసక్తి లేదు. చిత్తూరు. 99666 56811, 70106 75426 (D)

V.V.Boy, Kausikasa Goatram, DOB: 29-08-1986, Star: Mrugasira, Padam 4, Ht: 5'10" BE, PGDM, Wkg: ICICI Securities Ltd Hyderabad Seeks Aliance from Same Sect. Age Difference 2 to 5 Years Cont: 9849026271/ 9966400234 (A)

★ ★ ★

"యాదవ" "38" రెండో మ్యారేజ్ 5.7 ప్రైవేట్ జాబ్ 18,000/-. 50 లక్షల ఆస్తి ఉన్న వరునకు తగిన వధువు కావలెను. ✆ 94944 19479. (M)

నూర్ బాషా ముస్లిం వ: 27 సం॥లు, ఎత్తు: 5'7". డిగ్రీ చదివి వ్యాపారం చేస్తున్న యువకునికి మంచి కుటుంబం కల్గిన ముస్లిం వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్: 99637 75248. (M)

కమ్మ, 38 సం॥ 5'6", వ్యాపారం, వెల్‌సెటిల్డ్, 4 Cr కలిగిన వరునికి తగిన వధువు లేదా మొదటి/ రెండవ కమ్మ/ రెడ్డి వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర: ✆ 80191 25882. (B)

వైశ్యా/ 33/ వైట్/ 5.11/ B.Com బిజినెస్ 12 లక్షలు P/A. 50 లక్షల ప్రాపర్టీ గల వరుడికి వధువు కావలెను. Nodowry. 98851 91189. (M)

యాదవ, Software 1.2 లక్షలు P.M., ఎత్తు 5.8, రంగు: తెలుపు, ప్రాపర్టీ: 5 కోట్లు. వరుడికి అందమైన వధువు కావలెను. నో బ్రోకర్స్. 9989501327, 7780653865.(L)

కమ్మ 1990 5'9" B.Tech/ SWE/ US 75 K, 20 కోట్ల ఆస్తి కల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9618226996 (A)

రెడ్డి, ధనవంతుడు 48, 5'7", గవర్నమెంట్ ఆఫీసర్‌కు ఒంటరి ధనవంతురాలైన విడోయర్ కావలెను. వయస్సు, కుల ప్రసక్తి లేదు. నోబ్రోకర్స్. ✆ 8374215279. (L)

ఆర్యవైశ్య/ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బైబిల్ మిషన్)/ 31 సం॥/ MBA/5'6"/Axix బ్యాంకు ఉద్యోగం. 5,50,000/- సం॥నికి. ✆ 91779 55319 (I)

బ్రాహ్మణ 52Y, 5'4", Fair, Pvt. Job. వరుడుకు తగిన వధువు 35Y- 46Y కావలెను. FC (2వ పెళ్ళి, పిల్లలు వున్న) డైరెక్ట్. ✆ 86394 71626. (B)

రెడ్డి, విడో 40/ 5'6" తెలుపు, M.A. స్వంత బిజినెస్, నెలకు 2 Laks. వరుడికి వధువు విడో లేదా డైవర్సీ 35, 5'4" తెలుపు P.G. పిల్లలు ఉన్నా O.K. కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్. Cont. ✆ 91213 59388. (B)

కిరణ్ చౌదరి మ్యాట్రిమోని

పాణిగ్రహణం

Kamma Kiran Chowdary Matrimony: HO: Hyd, BO: Vijayawada for More Details: www.kiranmatrimony.com, Email: kra.anu@gmail.com 9866741795

వధువు కావలెను

Kamma 25, 5'10" MBA Own Business 2Cr PA Well Off ★ 26 6' IIT Khargpur Own Eng. College Well Off ★ 29, 5'11" MS Own SW Co. ✆ 9866741795

Kamma 25, 6' Dr. Residency Green Card 40 Cr. ★ 26, 5'10" Dr. Residency H1 USA ★ 28. 5'9" Dr. Cardiology USA Citizen ★ 31, 5'10" Dr. Neuro ✆ 9866741795

Kamma 26, 5'11" Dr. Residency 20Cr. ★ 27, 6' Dr.Resi USA Citizen 50 Cr ★ 26, 6'1" Dr. Dentist H1 USA ★ 28, 5'10" Dr. Dentist Own Clinic USA ✆ 9866741795

Kamma 24, 5'10" Dr.MD GM 16 Cr★ 26, 6'1" Dr.MS GS 50 Cr, ★ 27, 6' Dr. MD Radiology 60 Cr ★ 25/ 6' Dr. MS Artho 25 Cr★ 27, 5'10" Dr. MD Own Hosp. ✆ 9866741795

Kamma 28, 6' Dr. MD General Medicine Welloff ★ 28, 5'10" Dr. MS Artho 25Cr ★ 32, 6' Dr. Nurology 40 Cr ★ 30, 5'10" Dr. MS Ortho ✆ 9866741795

Kamma 24/6' EEE Bits Pilani MS 120 K 50 Cr ★ 25, 6'1" MBA 90K H1 USA 40 Cr ★ 26, 5'9" IIT Stanford USA Welloff 27/ 5'11" IIT ✆ 9866741795

Kamma 27, 5'10" B.Tech Microsoft 150 K H1 10Cr USA ★ 29, 6' MBA Finance CISCO 170K USA Citizen ★ 30, 5'11" MBA Fin. Newyork 9866741795

Kamma 25, 5'11" IIT CTS 13L 10 Cr. ★ 25, 6' B.Tech MBA Pune 18L 20 Cr ★ 27, 6'1" IIT Gouhati IIM Ahmadabad 70L, 9Cr. ★ 28, 5'9" BBM 20L PA ✆ 9866741795

Kamma 26, 5'10" B.Tech Vit Micro 20L 8Cr. ★ 27, 5'11" B.Tech MS. 18L 25Cr ★ 30, 5'7" B.Tech MS 16L 30 Cr. 30, 5'11" MS 140K AUS Citizen W.Off ✆ 9866741795

Kamma Divorce 27, 5'11" B.Tech Own Busi Welloff ★ 29, 5'10" BBA MS Chemical Industry Welloff ★ 28, 6' Dr. Cardiology. USA 30, 5'9" US ✆ 9866741795

Kamma Divorce 28, 5'10" B.Tech MS 180K H1 ★ 30, 6' MS IBM 190K Green Card ★ 32, 5'9" Dr. Resi 260K, 50Cr, 33, 5'10" BBM Busi Welloff ✆ 9866741795

వరుడు కావలెను

Kamma 24, 5'5" B.Tech MBA Busi, Welloff ★ 24, 5'6" Dr.MD GM Own Hosp. Welloff ★ 26, 5'8" M.Tech Own colleges 4cr, PA Welloff ★ 26, 5'7" Busi ✆ 9866741795.

Kamma 22, 5'6" Dr. US MLE Prepare USA 20Cr. 24, 5'7" Dr. Resi H1 USA ★ 25, 5'5" Dr.Resi Green Card USA 30Cr, 26, 5'3" Dr. Resi H1 ✆ 9866741795.

Kamma 24, 5'6" Dr. Dentist H1 USA 15Cr ★ 26, 5'6" Dr.Resi H1, 10Cr USA ★ 25, 5'7" Dr. Dentist Green Card USA ★ 28, 5'8" Dr. Resi H1 USA ✆ 9866741795.

Kamma 24, 5'8" Dr.MD GM 25Cr, 23, 5'7" Dr. MS Gen. Surgeon 30Cr ★ 24, 5'6" Dr.Gynic welloff, 24, 5'8" Dr.MD Dermatology welloff ✆ 9866741795.

Kamma 23, 5'4" Dr. Opthamology, welloff ★ 25, 5'5" Dr.MD Gen Medicine 40Cr ★ 26, 5'8" Dr.Neurology ★ 28, 5'5" Dr.MD S.Speciality welloff ✆ 9866741795.

Kamma 26, 5'5" Dr.MD, Dermatology own clinic welloff ★ 25, 5'4" Dr.BDS, 10Cr ★ 26, 5'6" Dr.Dentist 12cr ★ 27, 5'8" Dr. MD GM 90Cr ✆ 9866741795.

Kamma 22, 5'6" B.Tech VIT MS USA 14cr ★ 23, 5'5" BBA, MBA, USA 20Cr ★ 24, 5'6" BS USA Stanford Greencard 40cr ★ 25, 5'5" BITS Pilani MS 20Cr ✆ 9866741795.

Kamma 25, 5'5" NIT MS 110K Greencard USA ★ 27, 5'6" MS CISCO 150K H1 USA 10Cr. 29, 5'4" BITS MS, 135K USA Citizen 8Cr. ✆ 9866741795.

Kamma 21, 5'5" B.Tech, EEE 25Cr ★ 22, 5'6" BITS Hyd MBA Pune 30Cr ★ 24, 5'6" BITS Pilani MBA 25L, 10Cr, 25, 5'8" BITS MBA HW 23L ✆ 9866741795.

Kamma 23,5'4" IIT 19L 6Cr ★ 26, 5'6" B.Tech, MBA Google 24L, 5Cr ★ 27, 5'7" BITS hyd Microsoft 18L ★ 27, 5'6" BBM, MBA 10L 10Cr ✆ 9866741795.

Kamma Divorce 25, 5'4" B.Tech 10L 15Cr ★ 26, 5'8" MS Ph.D 110K H1 10Cr ★ 25, 5'5" Dr. MS GS, 30Cr. ★ 26, 5'7" BBA, MBA 20Cr ★ 32, 5'3" Dr. Resi ✆ 9866741795.

Kamma Divorce 27, 5'5" MS 100K H1 5Cr ★ 32, 5'3" B.Tech 50Cr ★ 28, 5'8" MBA 70Cr ★ 27, 5'6" Dr.MD Dermatology 15Cr ★ 25, 5'4" B.Pharma 5L 2Cr ✆ 9866741795.

గమనిక

పెళ్లిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునేముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Madiga/ B.Tech/ 5'3"/ 24/ HCL ★ B.Tech/ 5'4"/ 25/ BSNL ★ B.Tech, IIT/ 5'4"/ 26/ 12 LPA ★ B.Tech/ 5'4"/ 25/ IOB. కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786, 0866-2438222. (B)

Padmasali/ B.Tech/ 22/ HDFC ★ B.Tech/ 5'4"/ 22/ Accenture ★ B.Tech/ 5'3"/ 21/ Techmahendra/ 1 Cr ★ CA/ 5'5"/ 25/ 1 Cr. కస్తూరి మ్యారేజెస్. ✆ 81217 95786. (B)

Vysya/ B.Tech/ 5'4"/ 22/ Infosis/ 50L ★ B.Tech/ 5'3"/ 22/ 10 Cr ★ B.Tech, IIT/ 5'4"/ 27/ 18 LPA ★ MS Gynec/ 5'3"/ 25/ 1 Cr. కస్తూరి మ్యారేజెస్. ✆ 99632 32758. (B)

Kapu/ B.Tech/ 5'5"/ 26/ SBI ★ B.Tech/ 5'3"/ 23/ MNC/ 10 Cr ★ B.Tech, BITS/ 25/ 12 LPA ★ BEMS/ 5'4"/ 25/ 100K/ 3 Cr. కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771, 0866-2433788. (B)

క్రిస్టియన్, మాదిగ 5'2"/ 40Y. హోమియో డా॥ వధువుకు తగిన వరుడు కావలెను. నో బ్రోకర్స్. Ph: 8498033636. Email: emanphd@gmail.com (A)

గౌడ 1994 M.Tech/ SWE/ Hyd, 1992 SWE చెన్నై 1990/ B.Tech M.S/ USA, & 1991 M.Tech/ SWE కెనడా వధువులకు వరులు కావలెను. ✆ 9032310007 (A)

కమ్మ, 51, 5'5", ఫెయిర్, MA, వెల్‌సెటిల్డ్ విడో వధువుకి జాబ్/బిజినెస్ చేస్తున్న విడో/డైవర్సీ వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. నో బ్రోకర్స్. ✆ 9908675021, 9246282009 (A)

Caste No Bar 30Y, 5'2", Fair, BPT, Masters in Health Care, Canadian Citizen should relocate to Canada ✆ 9949074923, 8008524443 (A)

గౌడ/ ఏకైక కుమార్తె/ B.Tech/ C.Govt స్టెనోగ్రాఫర్ (రైల్వే)/ 28000/-PM/- 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9052296834 (A)

SC మాల/ B.Tech/ Govt బ్యాంక్ P.O (ఆంధ్రా బ్యాంక్)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 9581317506 (A)

విశ్వబ్రాహ్మణ/ B.Tech/ C.Govt బ్యాంక్ P.O (కెనరా బ్యాంక్)/ 45000/- PM/ 5'3" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010 (A)

ముదిరాజ్/ B.Tech/ Govt బ్యాంక్ P.O (ఆంధ్రా బ్యాంక్)/ 55000/-PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను.. ✆ 9642459724 (A)

గౌడ/ B.Tech/ Govt Asst మేనేజర్ (సిండికేట్ బ్యాంక్)/ 45000/-PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885050879 (A)

మున్నూరుకాపు/ M.Tech/ C.Govt.Asst మేనేజర్ (SBI)/ 40,000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను ✆ 9703978131 (A)

పద్మశాలి/ B.Tech (NIT)/ C.Govt.Asst మేనేజర్ (FCI)/ 40,000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను ✆ 8886957298 (A)

గౌడ/ B.Tech/ C.Govt J.T.O (BSNL)/ 35000/-PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను ✆ 9885299854 (A)

ముదిరాజ్/ B.Tech/ C.Govt. బ్యాంక్ క్యాషియర్ (సిండికేట్ బ్యాంక్)/ 28000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703794175 (A)

బ్రాహ్మణ/ రెండోపెళ్ళి/ 28/ 5'4"/ Pvt జాబ్/ 8,000/-PM/ అందమైన వధువుకు తగిన జాబ్/ బిజినెస్/ పురోహితం వరుడు కావలెను. ✆ 9030056547// 8309527614 (A)

కమ్మ/ 22/ 5'4"/ 10th ★ 25/5'5"/ ఇంటర్ ★ 21/ 5'6"/ ఇంటర్ వారంకే వీడో. వధువులకు వరులు కావలెను. ✆ 8297758446/ 9848816536 (A)

బ్రాహ్మణ/ 19/ 5'1"/ 6th ★ 22/ 5'3"/ 10th ★ 24/ 5'4"/ B.Com కట్నం ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పురోహితం OK. ✆ 9848819651/ 9848816536 (A)

Mala 24 5'5" BE MBA US Bank $ 85K 5Cr ★ 24 5'4" BE (Bits) Intel 65K ★ 26 5'5" MBBS Govt Doctor Seeks India/ Abroad ✆ 7207847377 (A)

Madiga Beautiful 24 5'5" BE H1 $ 90K 3Cr. ★ 24 5'3" BE (NIT) MBA Microsoft 65K ★ 23 5'4" BE, MNC Rich Seeks India/ Abroad ✆ 7207847377 (A)

Christian (BC-C) 25 5'4" MS AT & T $ 90K ★ 26 5'5" MBBS DGO Rich ★ 24 5'3" BE MBA (IIM) CTS 75K ★ 23 5'4" BE MNC Seeks India/ Abroad ✆ 7207847377 (A)

గంగపుత్ర, బెస్త: CA/ చార్టర్డ్ అకౌంటెంట్/ 50,000/- PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

వడ్డెర: B.Tech/ C.Govt P.O/ సిండికేట్ బ్యాంక్/ 35,000/- P.M, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

కమ్మ: M.Tech/ Govt. Asst. ఇంజనీర్/ ఇరిగేషన్ Dept/ 50,000/- PM, 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652 (A)

బ్రాహ్మణ, 24, 5'3", B.Com ★ 23, B.Tech, SWE, Infosys, 4L ★ 27, 5'4", BE, MS (US) ★ 25, MSc, Wkg, 3L ★ 28, MBBS, 4L ★ 9494309202 (A)

రెడ్డి 1991, 5'6", B.Arch./M Arch. US/ OPT Fair & Rich ★ 1992/ 5'5", B.Tech/ SWE Hyd. Fair, నవీన్‌రెడ్డి. 8885559579/ 9505551788 (A)

రెడ్డి 1993 5'6" LLB, Fair/ 15Cr, ★ 1989 5'4" B.Tech, 7.13L PA, Hyd. నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో, Hyd. ✆ 8885559579/ 9505551788 (A)

రెడ్డి 1992 5'5", B.Tech/ M.Tech (NIT) 4L. PA Amazon ★ 1992, 5' B.Tech, Wipro 3.6L PA నవీన్‌రెడ్డి. 8885559579/ 9505551788 (A)

కాపు/ 2nd మ్యారేజ్/ 42/ 5'4"/B.Com కులప్రసక్తి లేదు. సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9121376361 (A)

విశ్వబ్రాహ్మణ 2nd, 33, 5'4" Fair, B.Tech, SWE, 55,000/- PM వధువుకు తగిన 1 వ, 2 వ SWE/ IT వరుడు కావలెను. ✆ 8978509808 (A).

యాదవులకు ప్రత్యేకం. 24 5'3" B.Tech 5 Cr. ప్రాపర్టీ గల వధువుకు తగిన యాదవ వరుడు కావలెను. K.K.యాదవ్: 98493 06274 (I)

రాజమండ్రి/ కమ్మ/ 42సం॥ M.Tech. రైల్వేస్ ఇంజనీర్ 85,000 PM, సొంత ఇల్లు, పిల్లలులేరు. 34 ఎకరాల పొలం గల విడో వధువుకి వరుడు కావలెను. సంప్ర:70138 86194.(L)

తిరుపతి/ బలిజ నాయుడు/ 46సం॥ ఎత్తు 5.3, M.A., Ph.D., గవర్నమెంట్ స్కూల్ హెడ్‌మాస్టర్, 22 ఎకరాల పొలం, సూపర్ మార్కెట్ నడుపుచున్న విడో వధువుకి వరుడు కావలెను. @ 70138 86194.(L)

Kamma ★ 24 5'7" BE MS SWE MNC $ 90K ★ 24 5'4" BE MS Business 4Lakhs PM 20Cr ★ 24 5'7" MBBS MS (Gynaecology) 5Cr ★ 8008345606 (A)

Kapu ★ 25 5'6" BE MS SWE MNC $ 110K ★ 26 5'4" BE SWE Infosys 40K ★ 26 5'5" BE SWE Accenture 45K ★ 24 5'4" MD 20Cr ★ 9848944222 (A)

Reddy ★ 24 5'6" BE MS SWE CTS $ 80K ★ 26 5'3" BE SWE GE 75K ★ 26 5'4" BE SWE MNC 50K ★ 26 5'5" MBBS MS (ENT) ★ 9848535378 (A)

Padmasali ★ 27 5'2" BE MS SWE Google $ 158K ★ 25 5'2" BE ME SWE MNC 12 Lakhs PA ★ 27 5'6" BE TCS 40K ★ 27 5'6" MBBS MD ★ 7337320044 (A)

Gowda ★ 26 5'4" BE MS SWE MNC $70K ★ 25 5'3" SWE CTS 30K ★ 27 5'4" BE SWE MNC 30K ★ 27 5'5" MBBS MS (ENT) ★ 9177121213 (A)

Intercaste ★ 27 5'6" BE MS SWE MNC $80K ★ 27 5'4" BE SWE MNC 70K ★ 26 5'4" BE MS SWE Deloitte 40K ★ 24 5'4" MD ★ 7675818080 (A)

హైదరాబాద్/ వైశ్య/ 51సం॥ ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సొంత ఇల్లు, పిల్లలు అమెరికాలో సెటిల్డ్, 8 కోట్ల ఆస్థి గల విడో వధువుకి వరుడు కావలెను. సంప్ర:70138 86194.(L)

కుల ప్రశక్తి లేదు. చౌదరి 24, 5.4, Fair, B.Tech, 22 కోట్లు ఆస్థి, తండ్రి లేని అందమైన వధువుకు వరుడు కావలెను. 95150 85540, bhuma722@gmail.com (I)

ఓన్లీడాక్టర్స్ మ్యారేజ్‌లింక్స్: కమ్మ, 27, 5'5" MBBS, MD, DEO/ 50Cr గల అందమైన వధువుకి MBBS, MS, MD & MCH చేసిన తగిన వరుడు కావలెను. ✆ 9966808059 (A).

రెడ్డి, విడో, 36, 5'5" సొంత బిజినెస్, 50K PM, 5Cr ప్రాపర్టీ గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్థి పట్టింపులేదు, ఇల్లరికం ok. 9666376030/ 9505437430 (A)

రెడ్డి, లేట్ మ్యారేజ్/ 40/ 5'5" సొంత బిజినెస్ 80k, రెంట్స్, 35k/ సాంప్రదాయమైన వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్థి పట్టింపు లేదు.(ఇల్లరికం ok) 9948190622 (A)

కమ్మ/ విడో/ 34/ 5'4"/ Pvt జాబ్/ 25k/ రెంట్స్ 50k/ వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను/ కుల, ఆస్థి పట్టింపులేదు/ 8519914020/ 8519914060 (A)

రెడ్డి, విడో, 38, 5'5" ప్రవేట్ జాబ్, 40k PM, 5Cr ప్రాపర్టీ గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్థి పట్టింపు లేదు. 9014354354/ 9951619273 (A)

Reddy, 25Y/ 5'5"/ White/ B.Tech/ SWE, Visiontech/ 7 L PA/ 10 Crore property/ Only Daughter వధువుకి వరుడు కావలెను. Ph: 0877- 2230289, Cell: 93924 41433 (D)

రెల్లి (SC) 32 Yrs 5'4", M.B.B.S, Govt. Job చామనఛాయ Divorcee యువతికి డాక్టర్ / ఇంజనీర్ / Govt. Job కలిగిన Any Caste వరుడు కావలెను. 9866713944 (Q)

బ్రాహ్మణ, 24Y/ 5'4"/ Red/ B.Tech/ Well Settled/ Only Daughter వధువుకి Job/ Business వరుడు కావలెను. 73822 59832, 73822 59734 (D)

Kamma 28/ 5'6"/ 5L PA/ MBA ★ 26/ 5'7"/ 5L PA/ M.Tech ★ 27/ 5'5"/ MD/ 5L/ Doctor Ph: 9000487865/ Blue trend Matrimonial - Hyd (A)

మాదిగ CNB 28Y 5'4" MBBS అందమైన వధువుకి డాక్టర్ వరుడు కావలెను. సంప్ర॥ 8341752113/ 7386777614

క్షత్రియ/ రాజులు: 26Y/ 5'5"/ B.Tech (EEE)/ S/W in Hyd/ 50,000 P/M/ 5 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 93938 63645 (D)

పద్మశాలి: 23Y/ 5'3"/ B.Tech (CSE)/ S/W in Banglore well Settled ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97041 88499 (D)

బ్రాహ్మణ: 24Y/ 5'4"/ B.Tech (CSE)/ S/W, HCL/ 35,000 P/M/ Gold 80 Sav + 2 Sites + 50 Lakhs Cash ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 97045 66499 (D)

క్షత్రియ: 24 Yrs/ Fair Good Looking/ B.Tech (IT)/ S/W, MNC, 40,000 P/M, 1 Cr. ఆస్తిగల వధువుకు తగిన వరుడు కావలెను. 98665 36343 (D)

కమ్మ: 25 Yrs/ B.Tech (CSE)/ S/W, "CTS", 6 Lak P/A, Well to do Family వధువుకు వరుడు కావలెను. 96762 94499 (D)

గౌడ: 25/5'4"/ MBBS, MS గైనిక్ చేస్తున్న అందమైన వధువుకు తగిన డాక్టర్ వరుడు కావలెను. ✆ 7288969679 (A)

కమ్మ/ 24 Y/ 5'.5"/ ఫెయిర్/ డిగ్రీ/ Tech మహేంద్రలో ఉద్యోగం. మేనత్త ఆదరణలో పెరిగిన తల్లిదండ్రులు లేని ఏకైక వధువుకు సాంప్రదాయంగల వరుడు కావలెను. ఫోన్: ✆ 7794849790. (C)

కమ్మ వధువుకి వయస్సు 08-09-1978 హైట్ 5'2" (MS) వెరీ ఫెయిర్ USA నూజెర్సీలో జాబ్‌చేస్తున్న వధువుకు అమెరికాలో సెట్లయిన కమ్మ వరుడు కావలెను. ఫోన్: 97012 53525. (B)

రెడ్డి వధువులకు వరులు కావలెను. అవినాష్‌రెడ్డి మ్యారేజెస్ (DV కోటిరెడ్డి) రోడ్డు-3 TV-9 ఎదురుకాలనీ బంజారాహిల్స్, Hyd. www.avinashreddy.com, 9848011818 (A)

వరుడు కావలెను (బ్రాహ్మణ) 25-12-1988, B.Com బ్యాంక్ Employee (G) గర్‌గెయుస/ Reg Any Employe, any శాఖ. 9542421034/ 7997628107 (A)

వడ్డెర 24/5'5", B.Tech/ SWE/ Accenture 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246555529 (A)

రెడ్డి 23/5'5", B.Tech (CSE) MBA, SWE 8 Lakhs PA, 20Cr ప్రాపర్టీగల అందమైన వధువుకు ఇండియా/ అబ్రాడ్ వరులు కావలెను. ✆ 9032906177 (A)

కమ్మ/ 21Years/ 5'4"/ B.Sc/ 34Cr/ అందమైన వధువుకు చదువు/ ఆస్తిపాస్తులు/ కులప్రసక్తిలేని వరుడు కావలెను. ✆ 9700532939 (A)

పద్మశాలి 24/5'5"/ B.Tech/ SWE/ CAPGEMINI 35,000/-PM, V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246151501 (A)

కుమ్మరి 27/ 5'4" వెరిఫెయిర్ SR: SWE అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. అబ్రాడ్ అయినా పర్వాలేదు. ✆ 9885904303 (A)

కులపట్టింపు లేదు విశ్వబ్రాహ్మణ 35y/ 5'5"/ PG/ Govt జాబ్ 50K PM/ 2nd మ్యాచ్/ ఫెయిర్ పిల్లలు లేని అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. సంప్ర॥ 7893744393. (A)

రెడ్డి 24/ 5'5" B.Tech/ SWE/ IBM 35,000/-PM V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246333320 (A)

కమ్మ 23 5'6" పెయిర్ B.Tech SWE TCS 35,000/-PM వెల్‌సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను. సంప్రదించండి. 8019705648 (A)

SC మాల 24 5'5" B.Tech NIT ACTO C.Govt 35,000/-PM అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. అర్జెంటు ✆ 9533855373. (A)

రెడ్డి విడో 34/ 5'5" Fair MBA 15కో॥ ఆస్తి/ గోల్డ్‌షాప్/ నె॥3 ల॥ ఆదాయం. ఒంటరి వధువుకు (కుల ప్రశక్తి లేదు) వరుడు కావలెను. ✆ 7993094820 (A)

బ్రాహ్మిణ్ 1990 5'5" B.Tech, Sal:- 40,000/- PM, వెల్ సెటిల్డ్ ఫ్యామిలి కల వధువుకి వరుడు కావలెను. ✆ 7386443656 (A)

CNB విడో 1979 5'3" MBBS, Own క్లీనిక్ కల్గిన వధువుకు వరుడు కావలెను. 1వ, 2వ సంబంధాలకై ✆ 7075825246 (A)

SC మాదిగ 1982 5'4" B.Sc, Pvt జాబ్ 15000/- PM, వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కల వధువుకి వరుడు కావలెను. ✆ 9652195806 (A)

కాపు 1986 5'4" B.Tech MBA S.W.E, Wiproలో జాబ్ అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9000812993 (A)

రెడ్డి/ 1st మ్యారేజ్/ సాఫ్ట్‌వేర్/ 12 కోట్ల ప్రాపర్టిగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 8790788977 (A)

రెడ్డి/ 24/ 5'5"/ ఫెయిర్/ డిగ్రీ/ 22 Cr ప్రాపర్టి ప్రమాదంలో ఫ్యామిలి కోల్పోయి బాబాయ్ ఆద్వర్యంలో ఉన్న వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. (వాట్సప్) 9121736501 (A)

చౌదరి/ కుల ఆస్తి ప్రసక్తిలేదు/ B.Tech/ 5'5"/ 25 సం॥రాల/ పెళ్ళిఅయి భర్తను కోల్పోయిన 25 Cr కు వారసురాలైన వధువుకు వరుడు కావలెను. (వాట్సప్) 7993981640 (A)

రాజులు/ 26/ 5'5"/ ఫెయిర్/ ఇంటర్ 18 కోట్ల ప్రాపర్టి, యాక్సిడెంట్‌లో తండ్రిని కోల్పోయిన వధువుకు కుల ప్రసక్తిలేని మధ్యతరగతి వరుడు కావలెను. (వాట్సప్) 9121397201 (A)

కమ్మ/ లేట్ మ్యారేజ్/ కుల ఆస్తి ప్రసక్తిలేదు 34/ 5'5"/ ఫెయిర్/ డిగ్రీ/ 30 కోట్ల ఆస్తి ఎవరులేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. ఆర్థికంగా సపోర్ట్ (వాట్సప్) 7993700619 (A)

★ ★ ★

వరుడు కావలెను కాపు వయస్సు 24 హైట్ 5'3 చదువు B.Sc ఆస్తి 2.5 కోట్లు ✆ 92476 59899 (M).

HIV+ ఉన్నవారికి మాత్రమే కాపు వరుడు కావలెను. 89192 40784 (వివరాలు గోప్యంగా ఉంచబడును), సంప్రదించండి: Happen (I)

★ ★ ★



వరుడు కావలెను

Kapu 23 5'4" BE MNC 10Cr ★ 24 5'1" (CA) 3 Cr ★ 28 5'4" B.E (Bits) 20L PA ★ 25 5'4" MBBS MS (Gynic) ★ 26 5'4" MS 90K 3Cr ★ 26 5'5" M.Tech 6L PA 10Cr ★ 8790017711 (A)

Goud డైవర్సీ 32, 5'3" USA, MS, SWE 120K V.Fair hyd వధువుకు తగిన US లో వుండే వరుడు కావలెను. CNB: 9246523454 (A).

ముదిరాజ్, 25, 5'4", MBBS, MD, రేడియాలజీ చేస్తున్న అందమైన సెటిల్డ్ తెలంగాణ వధువుకి తగిన Any ఏరియా వరుడు కావలెను. ✆ 9581635726 (A)

రెడ్డి, 26, 5'5", MBBS, MD, రేడియాలజీ చేస్తున్న అందమైన సెటిల్డ్ ఆంధ్రా వధువుకి తగిన ఆంధ్రా/ తెలంగాణ వరుడు కావలెను. ✆ 8142540968 (A)

SC(C), 28, 5'4", MBBS, MS, గైనిక్ సూపర్ స్పెషాలిటీ చేస్తున్న వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9494038601 (A)

ఆర్యవైశ్య, 23, 5'4" 13 లక్షలు & 29, 5'3", 19 లక్షలు, రెండో పెళ్ళి, 34, 5'3" Govt 40 లక్షలు, 42, 5'2" 65 లక్షలు జి.సుప్రజాగుప్తా "మా సేవ" ✆ 9493163996 (A).

Hindu, S.C, Madhiga, Chennai Girl 26/ B.E. Seeks Groom Working in Central Govt./ MNC. Email: chandrasekaran1111@gmail.com (A)

SC హిందూమాల, ఎత్తు 5'6", 30Y, Asst. మేనేజర్ (ఆంధ్రా బ్యాంక్), 45,000/- PM వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 90001 51517/ 98494 65919. (B)

Velama/ B.Tech/ 5'3"/ 24/ Accenture ★ MBA/ 5'7"/ 22/ ICICI/ 1 Cr ★ B.Tech, IIT/ 25/ 12 LPA ★ MBBS/ 5'4"/ 25/ 2 Cr. కస్తూరి మ్యారేజెస్. ✆ 98482 17771, 0866-2433788. (B)

Mala/ B.Tech/ 5'4"/ 25/ Infosis ★ B.Tech/ 5'3"/ 25/ IOCL ★ B.Tech/ 5'5"/ 24/ DRDO ★ B.Tech/ 5'4"/ 26/ SBI. కస్తూరి మ్యారేజెస్. ✆ 99632 32758, 0866-2431721. (B)

హిందూ మాల, Gnt, Near Tenali, DB: 19/6/93, B.Tech, SWA Infosys (Hyd) జాబ్ గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లేక డాక్టర్ జాబ్ చేస్తున్న వరుడు కావలెను. 90004 09980 డైరెక్ట్ (I).

Hindu, Mala/ 27/ 5'5"/ Software Engineer Girl/ Seeks Well Settled Boy, Govt Job Preferred. Phone: 8978530671 (A)

క్రిస్టియన్ (మాదిగ) MBBS, 5', DOB 1988, PG కి ప్రిపేర్ అమ్మాయికి సమాన అర్హత. Govt/ PSU వరుడు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్. ✆ 7337213850. (C)

కమ్మ/ 26/ 5'4"/ B.Tech/ జాబ్ (Hyd) సాంప్రదాయ కుటుంబానికి చెందిన అందమైన వధువుకు తగిన వరుడు వెంటనే కావలెను. ✆ 94934 51861. (B)



వివాహ వేదిక

పీస్‌క్రిస్టియన్ మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల నుండి కన్వర్ట్ అయిన క్రిస్టియన్స్‌కు OC (కమ్మ, కాపు, రెడ్డీస్) BC, SC, ST 1&2 సంబంధాలు కలవు. ✆ 9246880866 (A).

కేవలం మాలమాదిగ ST, క్రిస్టియన్ మాప్రత్యేకత 1 వ, 2 వ లేటు, డైవర్సీ, విడోస్, Govt సాఫ్ట్‌వేర్ జాబ్స్ దేశ విదేశ సంబంధాలకై AP, తెలంగాణల్లో (3 బ్రాంచీలు) ✆ 7095940444.

SPL, Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, BDS, MDS & all Pharm కు 1వ, 2వ, లేటు దేశ, విదేశ సంబంధాలు అన్ని కులాలకు కుదుర్చబడును. Ph: 9866411588 (A).

డాక్టర్స్ డాక్టర్స్ MBBS, M.S, MD, DM MDS, BDS & All Pharmas 1వ/ 2వ & విడో దేశ/ విదేశీ సంబంధాలు అన్ని కులములకు కుదర్చబడును. ✆ 9676071211 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N శర్మ, Hyd ✆ 9248600342/ 8019207503 brahmininformationmatri@gmail.com (A)

ఓన్లీ Govt ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్ని మతాల, కులాల 1 వ, 2 వ, లేట్ విడో/ డైవర్స్‌లకై వివాహలు & Govt ఎంప్లాయిస్ సంబంధాలు కొరకు వెరిఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415 (A).

Whats App your Photo & Biodata to 9347262769. We will Send the suitable Matches. www. pellisandadi.com. Estd. 1999 (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www. gokulmarriage.com, Hyd. 9440831748, Gunt. ✆ 9440759945, VSP 9441735157 (A)

20 సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక. శ్రీసత్యసాయి వివాహవేదిక. ✆ 9849414098, 040-66317515 satyasaivivahavedika.com (A)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.comలో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాలు ఫోన్ నెంబర్లు ఫ్రీగా చూసుకోండి. ✆ 98497 44707 (I).

విశ్వబ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం, బ్రహ్మముడి గుంటూరు. ఇది విశ్వబ్రాహ్మణుల ప్రత్యేక సంస్థ. (ఉచిత సేవలు మరియు రుసుముతో కూడిన సేవలు లభ్యం) 0863-2261898, 94911 25725 (I)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

సువర్ణ అవకాశం రిజిస్ట్రేషన్ ఉచితం అన్ని కులాల వారికి దేశ, విదేశాలకు సంబంధించి ఉద్యోగ వ్యాపార సంబంధాలు చూడబడును. ✆ 96402 07111. (I)

Muslim మరియు దూదేకుల/ నూర్‌బాషా డాక్టర్స్, ఇంజనీర్స్ & ప్రభుత్వ ఉద్యోగము చేయు అన్ని ప్రాంతాల 1 వ, 2 వ వధూవరుల పెళ్ళి సంబంధాలకై సంప్ర॥ 9392420344 (A).

కమ్మవారికి దేశ/ విదేశ 1 వ, 2 వ వివాహాలకై డా॥, Eng, S/W Govt/ P జాబ్స్ బిజినెస్ & కమ్మ కన్వర్టెడ్ వారికి సంప్ర॥ శ్రీవారి కళ్యాణ వేదిక ✆ 9966655116/ 115. (A).

సుజిత మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 13 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీలకు ఫ్రీ. ✆ 7893688248 (A).

100% డైరెక్ట్ ఫో.నెం. తీసోకండి/ అన్ని మత, కులాలకు/ www.matrimonytoday.in లో ప్యాకేజ్ తీస్కున్న వారి డైరెక్ట్ ఫో. నెం.లు చూడండి. SWE/ డాక్టర్స్/ అబ్రాడ్/ రిచ్/ గౌట్/ బిజి, 1, 2వ, వందల ప్రొఫైల్స్ కలవు. 9392489648 (A)

క్షత్రియ, సూర్యవంశం, చంద్రవంశం, బట్రాజులు, MBBS, MD, B.Tech, M.S, Govt, హై॥ రేంజ్, జాబ్స్, వెల్ సెటిల్డ్ ఫ్యామిలీస్, 1st, 2nd అబ్బాయిలు, అమ్మాయిలు సంప్ర: M. ధనలక్ష్మి/ 8374514056 (A)

P.Supriya Reddy Rich Reddy Boys & Girls India & Abroad Matches, All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from All Regions. Contact: Srinagar Colony, Hyd. ✆ 040-23544820/ 23545762 Email: palletisupriyareddy@gmail.com (A)

అన్నికులముల వారికి కేవలం 10 రోజులలోనే సూటబుల్ మ్యాచ్ చూడబడును. ✆ 77803 99008, W/85002 04402. marriagelinkspraveena@gmail.com (B)

వర్మ మ్యారేజ్‌బ్యూరో: స్త్రీలకు ఫ్రీ. అన్ని కులాల వారికి 1వ, 2వ, విడో, ఒంటరి లేట్ పెళ్ళి & తోడు సంబంధాలు చూడబడును. రిజిస్ట్రేషన్ ఫీ: 1000/- ✆ 7993317309 (A)

శ్రీ గణేష్ మ్యారేజ్‌బ్యూరో వారి 25వ బ్రాంచి ప్రారంభ సందర్భంగా అన్నికులాల 1వ, 2వ, డైవర్సీ, లేటు వరులకు 50% డిస్కౌంట్. వధువులకు ఫ్రీగా సంబంధం కుదుర్చును. 7660971900 (A)

★ ★ ★

కళ్యాణమస్తు మ్యారేజ్ లింక్స్. ఫ్రీ సర్వీస్ అన్నికులాల హిందు, ముస్లిం, క్రిస్టియన్, 1వ, 2వ, లేట్ మ్యారేజ్ సంబంధాలకై ఫొటో, బయోడేటా వాట్సాప్: 99486 17156 (J)

★ ★ ★

విశ్వకర్మ మ్యారేజ్ బ్యూరో. ఫస్ట్, సెకండ్ పోస్ట్ సెటిల్‌మెంట్ జాబ్స్, బిజినెస్, డాక్టర్స్. ఫ్రీ రిజిస్ట్రేషన్. ✆ 99513 87172, 99125 11201. వాట్సప్. (M).

శాంతి మ్యారేజెస్ క్రైస్తవులకు (మాల, మాదిగ) ప్రథమ, ద్వితీయ వివాహములు ఉచితముగా కుదర్చబడును. 94418 51255, 99850 37179 (I).

శ్రీశర్మబ్రహ్మణ మ్యారేజీబ్యూరో ఎటువంటి కమీషన్‌లు లేవు. Reg. ఫీ మాత్రమే. ఏలూరు రోడ్డు, రామమందిరం దగ్గర, VJA. ✆ 81216 96979, 91776 76717. (B)

వనజరావు క్విక్ మ్యారేజెస్

పాణిగ్రహణం

దేశ విదేశాలలో లక్షలాది జంటల మదిలో కళ్యాణ గంటలు మ్రోగిస్తూ కోట్లాది కుటుంబాల కలయికకు సూత్రదారై అనేక బ్రాంచీలతో విస్తరించి అఖండ శిఖరాగ్రాన్ని అధిరోహించిన ఏకైక వివాహవేదిక వనజరావు క్విక్ మ్యారేజెస్. Ph: 9866667755, 9849033795, web: www.vanajarao.com

వధువు కావలెను

Kamma ★ 29, 6', BE, MS $ 150K, 50C ★ 28, 5'11", BE, TCS, 40C ★ 29, 5'10", BE, ME, 100C ★ 27, 5'10", MBBS, MD, 10C ★ 040-65888686/ 96 ★ 9959982228/9

Kapu ★ 30, 6', BE, MS $ 120K, 40C ★ 29, 6', BE, Own Company, 100C ★ 27, 5'10", ME, IPS, 20C ★ 28, 5'9", MBBS, MD 50C ★ 040-23741441 ★ 9989889191★

Reddy ★ 29, 5'9", BE, MS $ 120K, 25C ★ 25, 5'10", BE, MBA, 50C ★ 27, 5'9", BE, C-Govt, 20C ★ 29, 5'8", MBBS, MD, 10C ★ 040-23753886 ★ 9908891119

Brahmin ★ 30, 5'8", BE, MS $ 110K, 15C ★ 28, 5'11", BE, MBA, MNC, 12L ★ 26, 5'8", MBA, 20L, 10c ★ 27, 5'10", MBBS, MD ★ 040-23755624 ★ 9959982228/9

Vysya ★ 26, 5'8", BE, MS $ 90K, 20C ★ 28, 6', BE(IIT), MNC, 30L PA, 10C ★ 26, 5'9", BE, ME, Govt Officer 10L, 10C ★ 040-23753886 ★ 9959982228/9

Padmashali ★ 29, 5'11", BE, MS $ 100K, 10C ★ 30, 5'9", BE, MNC, 18L ★ 27, 5'8", BE, M.Sc(UK), 10C ★ 30, 5'8", MBBS, PG ★ 040-65888686/ 96 ★ 9908891119

Mudiraj ★ 29, 5'9", BE, MS $ 90K, 10C ★ 28, 5'8", BE(IIT), MBA, 15L, 10C ★ 27, 5'9", BE, 12L ★ 29, 6', MBBS, MD, 10C ★ 040-65592224/ 5 ★ 9849033795

Viswabrahmin ★ 28, 5'8", BE, MS $ 100K ★ 29, 6', BE, TCS, 12L PA ★ 30, 6' MBA(IIM), 15L ★ 29, 5'11", MBBS, PG, 10C ★ 040-65888686/ 96 ★ 9030650266

Madiga ★ 30, 5'10", BE, MS $ 100K ★ 31, 5'8", BE(IIT), MBA (IIM), 18L ★ 26, 5'8", BE, MNC 18L ★ 29, 5'8", MBBS, MD ★ 040-65888686/ 96 ★ 9959982228/ 9

Caste No Bar ★ 30, 5'9", BE (IIT), MS $ 160K, 30C ★ 27, 5'10", BE, MBA, Business, 50C ★ 29, 5'9", MBBS, MD, 10C ★ 040-65888686/ 96 ★ 9989997766

Divorcee- Kamma ★ 38, 5'10", BE, MS, SWE $ 160K, 25C ★ 32, 5'11", BE, MNC, 18L PA, 10C ★ 40, 5'11", MBA, 50C ★ 040-65888686/ 96 ★ 9989889191 ★

వరుడు కావలెను

KAPU ★ 25, 5'6", BE, MS $ 80K, 10C ★ 24, 5'4", B.Tech. 50C ★ 26, 5'7", BE, MBA, MNC, 25C ★ 24, 5'4", MBBS. PG. 100C ★ 040-65888686/96 ★ 9989997766

KAMMA ★ 26, 5'6"", BE. MS, $ 110K, 10C ★ 25, 5'7", BE, MBA, MNC. 15L, 30C ★ 24, 5'6", BE. Govt. 30C ★ 21, 5'5" MBBS, 100C ★ 040-23741441 ★ 98666-33988

REDDY ★ 25, 5'4", BE, MS, $ 60K. 20C ★ 23, 5'6", B.Tech. 50C ★ 26, 5'5", MBA. HR. MNC, 20C ★ 28, 5'3", MBBS, PG. 20C ★ 040-65888686/96 ★ 9866698833

VYSYA ★ 24, 5'4", BE, MS, SWE. $ 90K, 5C ★ 27, 5'4", BE, MNC, 12L, 5C ★ 26, 5'5", BE, MBA, 7L, 5C ★ 25, 5'4", BE, ME, 10C ★ 040-23755624 ★ 9014939391 ★

BRAHMIN ★ 24, 5'4" BE, MS, USA, 2C ★ 27, 5'4", BE. TCS, 9LPA, 5C ★ 23, 5'6", BE. MNC, 4LPA ★ 23, 5'3". MBBS, MD ★ 040-65888686/96 ★ 995998222819

MUNNURU KAPU ★ 23, 5'5". BE, MS. USA, 50C ★ 25, 5'3", B.Tech, MNC, 60C ★ 24, 5'5", BE. 20C ★ 26, 5'3", MBBS, MD, 20C ★ 040-23741441 ★ 98490-33795

VELAMA ★ 27, 5'4", BE, MS. $ 100K ★ 27, 5'5", BE. MBA (IIM), 14L, 6C ★ 25, 5'4", MBA, 5L, 10C ★ 26, 5'3". MBBS, MD, 10C ★ 040-65592224/5 ★ 9393823550

GOWDA ★ 27, 5'4", MBBS, MD (US), 10C ★ 28, 5'6", BE. MBA (IIM), MNC, 20C ★ 26, 5'3", BE. Owner, 60C ★ 25, 5'5", MBA, 4L, 5C ★ 040-65592224/5 ★ 9849033795

YADAVA ★ 26, 5'4". B.Tech, MBA, MNC, 6LPA, 25C ★ 23, 5'6", M.Tech, 2C ★ 24, 5'4". MSc, 5C ★ 27, 5'5". MBBS, PG, 6L ★ 040-65888686/96 ★ 9989944464 ★

MALA ★ 25, 5'5". BE, MS. $ 60K, 10C ★ 27, 5'4", BE, ME, SWE. 6LPA ★ 24. 5'8", BE, MNC. 5L, 10C ★ 26, 5'4". MBBS, MD ★ 040-65888686/96 ★ 995998222819

Divorcee - Kapu ★ 33, 5'6", BE, MNC, 12L, 10C ★ 37, 5'5", BE, MS. $ 200K, 50C ★ 30, 5'7", BSc, 20C ★ 28, 5'4", BE, 25C ★ 040-23741441 ★ 98666-33988

CA

వసుంధర



ప్రత్యేకంగా చెప్పాలా!


భర్త: ఏవోయ్! నా ఫ్రెండ్ వాళ్లావిడని ఏప్రిల్ ఫస్ట్ రోజున ఫూల్ చేయడానికి చాలా కష్టపడ్డాడట. నాకయితే ఆ అవసరం లేదనుకో..

భార్య: అవును మీకా అవసరం ఉండదు.

భర్త: ??

భార్య: మిమ్మల్ని చేసుకున్నప్పటినుంచే..ఫూల్ అవుతున్నాగా!

యాప్‌లన్నీ ఒకే చోట...



ఏ ఆన్‌లైన్ స్టోర్‌లో ఎలాంటి దుస్తులు అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవాలంటే.. రకరకాల యాప్‌లు మన ఫోనులో పెట్టుకోవాల్సిందే. పైగా దీని వల్ల ఫోను స్టోరేజీ వృథా. కొన్ని సార్లు ఏ డ్రెస్సును ఏ సైట్‌లో చూసామో కూడా మరిచిపోతుంటాం. దాంతో మళ్లీ అన్ని యాప్‌లు విడివిడిగా వెతకాల్సిందే. ఈ తికమకలను తొలగించేలా, సమయాన్ని మిగిల్చేలా అన్ని సైట్లను ఒకే వేదికలోకి తీసుకొచ్చింది విమెన్స్ స్టోర్. దాదాపు అన్ని ప్రముఖ ఆన్‌లైన్ స్టోర్లలో ఉన్న వస్త్రధారణకు సంబంధించిన దుస్తులన్నీ ఇందులో కనిపిస్తాయి.

పాలడబ్బాకాదు.. కొలతల డబ్బా..





టీవీలోనో, ఏదైనా పుస్తకంలోనో చూసి వంటకాలు చేసినప్పుడు వివిధ మోతాదుల్లో పదార్థాలు వాడాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ఈ పాలడబ్బా ఎంతో ఉపయోగపడుతుంది. పాలసీసా ఆకారంలో కనిపించే ఈ కొలతల డబ్బా రకరకాల మోతాదుల ప్రకారం ఉంటుంది. ఇందులో వివిధ నమూనాలుంటాయి. ఆ ప్రకారం పదార్థాలను కొలుచుకుని వాడుకోవచ్చు. అవసరం అయిపోయాక అన్నీ కలిపి మళ్లీ పెట్టేసుకోవచ్చు.

కొట్టాయం ఫిష్ కర్రీ


కావల్సినవి: చేప ముక్కలు - అరకేజీ, ఆవాలు - చెంచా, మెంతులు - పావుచెంచా, అల్లంవెల్లుల్లి ముద్ద - ఒకటిన్నర టేబుల్‌స్పూను, ఉల్లిపాయలు - ఎనిమిది, కారం - రెండు టేబుల్ స్పూన్లు, ధనియాలపొడి - ఒకటిన్నర టేబుల్‌స్పూను, పసుపు - అరచెంచా, కరివేపాకు - రెండు రెబ్బలు, ఉప్పు - తగినంత, కొబ్బరినూనె - పావుకప్పు.



తయారీ: ముందుగా కాసిని నీళ్లలో కారం, ధనియాల పొడీ, పసుపూ తగినంత ఉప్పూ వేసి ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేసి పొయ్యి మీద పెట్టాలి. అది వేడయ్యాక ఆవాలూ, మెంతులూ వేయాలి. అవి కూడా వేగాక అల్లంవెల్లుల్లి ముద్దా, ఉల్లిపాయముక్కలూ, కరివేపాకూ వేసి వేయించాలి. ఉల్లిపాయలు రంగు మారాక ముందుగా చేసుకున్న మసాలా వేసి బాగా కలిపి మంట తగ్గించాలి. నూనె పైకి తేలాక చేపముక్కలు వేసి మూత పెట్టేయాలి. కాసేపటికి ఇది గ్రేవీలా తయారవుతుంది. అప్పుడు దింపేయాలి.



అప్పట్లో వచ్చిన 'కెవ్వు కేక' పాట యువత గుండెల్లోనే కాదు.. వయసుమళ్లిన వాళ్లతోనూ కేక పెట్టించింది. ఉత్తరాది నుంచి వచ్చి తన గొంతులో తెలుగు పాటలోని సాహిత్యాన్ని మేళవించి, ప్రేక్షకులను ఒక ఊపు ఊపేసిన ఆ గాయని మరెవరో కాదు.. మమతాశర్మ. పాటకు ప్రాణం గొంతు. మమతా శర్మ తన గొంతునే ప్రాణంగా మార్చి.. తెలుగు యాసతో మాస్‌ను కలిపి... తెలుగువారినీ అభిమానులుగా చేసుకుంది. అదనే కాదు.. 'అయ్యో పాపం', 'వెల్‌కమ్ టూ సక్కూబాయ్', 'కాకి చొక్కా..' ఇవన్నీ ఆమె పాడినవే. తాజాగా 'జయ జానకి నాయక'లో 'ఏ ఫర్ యాపిల్'తో మళ్లీ మన ముందుకొచ్చేసిన ఆమె.. తనెవరో, గాయనిగా ఎందుకు మారిందో చెబుతోందిలా...





కెవ్వు కేక... కిక్కిచ్చింది!

చిన్న వయసులోనే నాన్న చనిపోతే.. మా అమ్మ నన్నూ, తమ్ముడిని కష్టపడి పెంచింది. చదువూ, సంగీతాన్నే మా ప్రపంచంగా మార్చింది తప్ప తన కష్టాలను మాకు ఎప్పుడూ చెప్పలేదు. నాక్కూడా ముందు నుంచీ సంగీతం అంటే ఇష్టం కావడంతో మొదట చదువుకోనని చెప్పా. కానీ అమ్మ రెండూ ఉండాలని అనడంతో డిగ్రీ పూర్తిచేశా. పదకొండేళ్లకే మొదటి స్టేజి షో చేశా. క్రమంగా అవకాశాలు పెరిగాయి. ఓ వైపు చదువుకుంటూనే అవకాశం ఉన్నప్పుడల్లా స్టేజి షోలు చేసేదాన్ని. అలా ప్రదర్శనలు ఇస్తున్నప్పుల్లా ఒకరి పాటలు పాడుతున్నానే కానీ.. నేను నా సొంత పాట ఎప్పుడు పాడే అవకాశం వస్తుందా అని అనుకునేదాన్ని. ఒకసారి అలా స్టేజ్‌షో చేస్తున్నప్పుడు ఓ బాలీవుడ్ సంగీత దర్శకుడు నన్ను కలిసి ఒకసారి తనతో మాట్లాడమన్నారు. నేను అలాగే వెళ్లి కలిశా.. అయితే ఆయన దగ్గర పాడటానికి రెండేళ్లు పట్టింది. కానీ ఆ పాటే నా జీవితాన్ని మలుపు తిప్పింది. అదే 'మున్నీ బదనామ్ హుయీ'. అది మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. అవకాశాలు పెరిగాయి.

దాంతోనే మొదలు...



క్రమంగా హిందీ పాటలు పాడుతున్నప్పుడే.. ఓసారి నటుడు సోనూసూద్ 'అ అంటే అమలాపురం' పాటను హిందీలో పాడించడానికి నన్ను పిలిపించారు. అప్పుడు నా గొంతు విన్న దేవీశ్రీ 'ఇది వద్దు. నీ గొంతుకో ప్రత్యేకత ఉంది. పల్లెటూరి గడుసుతనం వినిపిస్తోంది. అందుకే తెలుగులో నేరుగా పాడిస్తా..' అని అన్నారు. దాంతో ఆ పాట మానేసి ముంబయి వెళ్లిపోయా. నేను దాన్ని మర్చిపోయా కానీ.. చాలా తక్కువ సమయంలోనే దేవీశ్రీ నుంచి ఫోను వచ్చింది.. 'కెవ్వు కేక' పాడించారు. దాన్ని మొదట నేను ఇంగ్లిష్‌లో రాసుకున్నప్పుడు.. పల్లవి మాత్రమే రెండున్నర పేజీలు పట్టింది. ఇక చరణమైతే.. నాలుగు పేజీలు. కష్టమని అర్థమైంది కానీ తొలి తెలుగు పాట కాబట్టి దాన్నో సవాలుగా తీసుకున్నా. బాగా ప్రాక్టీస్ చేసి.. నాలుగు గంటల్లో రికార్డింగ్ పూర్తి చేశా. అది విన్న ఆయన అభినందించారు. అలా తొలిపాటతోటే తెలుగువారికి దగ్గరయ్యాను. 'కెవ్వు కేక' నాకు ప్రశంసలు తెచ్చిపెట్టాయి. హిందీలో ఆ పాటకు ఫిలింఫేర్ అవార్డు కూడా వచ్చింది. దాన్ని ప్రకటించి నన్ను పిలుస్తున్నప్పుడు సంతోషంతో అరిచేశా. ఏడ్చేశా కూడా. అయితే.. అది సంతోషంతో అనుకోండి.

భావాన్ని అర్థం చేసుకుంటా....

ఇప్పుడు హిందీ అనే కాదు.. తెలుగులోనూ అప్పుడప్పుడూ పాడుతున్నా. తాజాగా 'జయ జానకీ నాయక'లో 'ఏ ఫర్ యాపిల్'.. అందులో ఒకటి. దీన్ని నేనే పాడాలని పట్టుబట్టి మరీ పిలిపించారాయన. ఇప్పుడనే కాదు.. గతంలో కూడా నాకు సమయం లేదన్నా.. దేవీశ్రీ ముంబయి వచ్చి మరీ రికార్డు చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. అలాంటివాటిలో 'వెల్‌కమ్ టూ సక్కూ బాయ్' ఒకటి. సంగీత దర్శకులు ఎవరయినా సరే.. పాట చెప్పినప్పుడు ముందు ఆ భావాన్ని అర్థం చేసుకుంటా. సందర్భం తెలుసుకుంటా. ఆ తరవాత ఇంగ్లిష్‌లో రాసుకుని కాసేపు ప్రాక్టీస్ చేసి అప్పుడే రికార్డింగ్‌కి వెళ్తా. ఎలాంటి పాటయినా సరే.. రెండు గంటల్లో రికార్డింగ్ ముగించుకుంటాను. ఇప్పటివరకూ తెలుగులో దేవీశ్రీతోనే పని చేశా. చెన్నైలోనూ నాకు ఆయన తప్ప ఎవరూ తెలియదు. పాట అనుకున్నట్టు వచ్చేవరకూ కష్టపడటం, రాగాలూ, పదాలు పక్కాగా పలికించడం, ఎంత ఆలస్యమైనా సరే.. సాధన చేయడం.. ఇవన్నీ ఆయన దగ్గరే నేర్చుకున్నా. ఇప్పుడు వేరే పాటలు పాడుతున్నప్పుడు అవన్నీ నాకెంతో ఉపయోగపడుతున్నాయి.

అమ్మే కారణం...

ఇప్పటివరకూ మొత్తంగా తెలుగు, హిందీ, తమిళం, బెంగాలీ, నేపాలీ, మరాఠీ, కన్నడతో కలిపి.. చాలా పాటలే పాడి ఉంటా. ఒకవిధంగా నా ఇంతటి విజయానికి మా అమ్మే కారణం. ఎక్కడో గ్వాలియర్‌లో పుట్టిన నేను ఈ స్థాయికి ఎదగడం వెనుక ఆమె ఇచ్చిన ధైర్యం ఎంతో ఉంది. సమస్యల్లో ఉన్నప్పుడూ, పాటల కోసం ప్రయత్నిస్తున్నప్పుడూ, నిరుత్సాహానికి గురైనప్పుడూ ఆమే అండగా ఉంది. ముంబయి ఒక మహా సముద్రం. మనవద్ద ఎంత ప్రతిభ ఉన్నా పట్టించుకోరు. అయితే 11 ఏళ్లలోనే చిన్న మ్యూజిక్ గ్రూపును తయారు చేసుకుని స్టేజి ప్రోగ్రాములిచ్చేదాన్ని. ఆ దశ నుంచీ ఇక్కడకు వచ్చా. ఇప్పుడు నాకంటూ ప్రత్యేక మ్యూజిక్ బ్యాండ్ ఉంది. సినిమాల్లో పాడటంతోపాటూ అప్పుడప్పుడూ ప్రదర్శనలూ ఇస్తా. త్వరలో ఆల్బమ్‌లు కూడా చేయబోతున్నా. జీవితాంతం పాడాలన్నదే నా లక్ష్యం. నా విజయం వెనుక మరో కారణం మా వారు. ముంబయిలో అష్రఫ్ అలీతో పరిచయం అయ్యింది. కొన్నాళ్లకు అది ప్రేమగా మారింది. తొమ్మిదేళ్ల తరువాత పెళ్లి చేసుకున్నాం. అమ్మ తరువాత నన్ను అత్యంత ప్రేమించే వ్యక్తి ఆయన. నా తొలి విమర్శకుడూ ఆయనే.

– సీహెచ్. వసుంధరాదేవి

పెదవులు గులాబీల్లా...



అలంకరణ మొత్తం పూర్తయ్యాక పెదవులకు కాస్త లిప్‌స్టిక్ అద్దితే ఇంకాస్త అందంగా మెరిసిపోవచ్చు. వీటిల్లో బోలెడు రంగులూ, మరెన్నో ఛాయలూ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఎంచుకునేప్పుడే కాదు వేసుకునేటప్పుడూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. అందుకేం చేయాలంటే..

పెదవుల అంచులకు రాసే లిప్‌లైనర్‌ని తక్కువ అంచనా వేయొద్దు. ఇది పెదవుల ఆకృతిని చక్కగా కనపించేలా చేస్తుంది. లిప్‌స్టిక్ పెదవులంతా పరచుకోదు. అందుకే ముందు లిప్‌లైనర్‌తో పెదవుల బయట గీతలా గీసుకుని తరవాత రంగు వేసుకోవాలి.

ఎప్పుడూ ఒకే రంగుల్ని ప్రయత్నించడం సరికాదు. ఉదాహరణకు మీ దగ్గర న్యూడ్ మాటీ లిప్‌స్టిక్ పెట్టుకోవాలి. ఏదైనా ముదురు రంగుకు దాన్ని కాస్త కలిపి పెదవులకు వేసుకోవాలి. లేదంటే ముందుగా న్యూడ్‌మ్యాటీ లిప్‌స్టిక్‌ని రాసుకోవాలి. ఆ తరవాత మీరనుకున్న మరో రంగు లిప్‌స్టిక్‌ని వేయాలి. చివరిగా మరోసారి మొదటిదాన్ని కాస్త అద్దుకుంటే చాలు.

ముదురు రంగు వేసుకుంటుంటే పెదవుల చుట్టూ కాస్త కన్సీలర్ అద్దుకోవాలి. అలాగే పెదవులకు వేసుకున్న రంగు ఎక్కువ సేపు చెదిరిపోకుండా ఉండాలంటే... ముందుగా చాలా కొద్దిగా కన్సీలర్ రాసుకోవాలి. అదయ్యాక బేబీ పౌడరు అద్దుకుని అప్పుడు లిప్‌స్టిక్ రాసుకుంటే చాలు.



బంగారం-వెండి

12న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	30,150	30,100
ఆర్నమెంట్	-------	-------	28,100	28,000
వెండి (కిలో)	-------	-------	40,500	40,500
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	30,050	30,000	29,770	29,770
ఆర్నమెంట్	27,780	27,810	27,830	27,840
వెండి (కిలో)	40,000	40,400	39,700	39,700
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,200	30,200	-------	-------
ఆర్నమెంట్	27,780	27,780	2,783	2,784 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.41	42.40 గ్రా

బొద్దుగా ఉన్నా... ఏం వేసుకోవచ్చు?



? నాకు ఇరవై మూడేళ్లు. నాకీమధ్యే ఉద్యోగం వచ్చింది. ఆఫీసుకు రోజూ ఫార్మల్స్ వేసుకెళ్లాలనే నిబంధన ఉంది. నేను లావుగా ఉండటం వల్ల ప్యాంటూ, షర్టూ సౌకర్యంగా అనిపించడంలేదు. వాటిల్లో ఎలాంటివి ఎంచుకోవాలి? నాకు ఏవి నప్పుతాయి? సలహా ఇవ్వండి.

కార్తీక, నెల్లూరు.

మీరు ఫార్మల్స్‌గా ప్యాంటూ షర్ట్‌లను ఎంచుకునేప్పుడు పెన్సిల్‌కట్ ప్యాంటులకీ, పొడవాటి షర్ట్‌లకు ప్రాధాన్యం ఇవ్వండి. ఇవి మీకు చక్కగా నప్పుతాయి. దీని వల్ల మీరు సన్నగానూ కనిపిస్తారు. అలానే యాపిల్‌కట్ తరహాలో పొడవాటి షర్ట్‌లని, స్కిన్నీ జీన్స్ మీదకు ఎంచుకునే ప్రయత్నం చేయొచ్చు. వీలైనంతవరకూ ఒంటికి అతుక్కునే దుస్తుల్ని ఎంచుకోకపోవడం మంచిది. గౌన్లు, మినీలూ కాకుండా పొడవాటి స్కర్టు, టాప్, చుడీదార్ వంటివి ఎంచుకుంటే మంచిది. వీటితో పాటూ జీన్స్, జెగ్గింగ్‌లూ, లెగ్గింగ్ వంటివాటికి జతగా ప్రింటెడ్ షిఫాన్లు, క్రేప్ కుర్తాలూ, కుర్తీలూ బాగుంటాయి. ఇప్పుడు సిగరెట్ ప్యాంట్‌లూ, ట్రౌజర్‌ల వాడకం పెరిగింది. ఇవి కూడా మిమ్మల్ని చక్కగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి ప్రయత్నించి చూడండి.

నజరానా

తువాళ్లూ, న్యాప్‌కిన్‌లు ఉతికేందుకు కాస్త నిమ్మరసం కలిపిన వేడినీళ్లు వాడితే.. మురికి పూర్తిగా వదులుతుంది. సువాసనా వస్తాయి.

బార్బీ ఆకృతి కోసం... డంబెల్స్!

ఒక్కొక్కరి ఆకృతి ఒక్కోలా ఉంటుంది. కొందరికి యాపిల్ తరహాలో అంటే ఛాతీ దగ్గర లావుగా... నడుము కింద సన్నగా ఉంటుంది. మరికొందరిది పియర్ తరహా అయ్యుంటుంది. అంటే ఛాతీభాగం సన్నగా, నడుము అడుగునుంచీ లావుగా కనిపిస్తుంది. కానీ అందరూ ఇష్టపడే ఆకృతి అవర్‌గ్లాస్. అంటే ఛాతీ, నడుము కింద భాగం ఒకేలా ఉండి... మధ్యలో నడుము సన్నగా ఉంటుంది. అందరూ ఇలాగే ఉండాలనుకుంటారు. ఈ ఆకృతి కోసం మూడు కేజీల బరువు ఉండే డంబెల్స్‌ని తీసుకుని ఈ వ్యాయామాలు చేస్తే చాలు.







ఆల్టర్నేటివ్ షోల్డర్ ప్రెస్ అండ్ ట్విస్ట్: రెండు కాళ్ల మధ్య దూరం ఉంచి... రెండు చేతులతో రెండు డంబెల్స్‌ని పట్టుకుని ఛాతీకి సమాంతరంగా తేవాలి. ఇప్పుడు శరీరాన్ని కుడివైపు తిప్పి డంబెల్స్‌ని పైకెత్తాలి. ఇప్పుడు మళ్లీ ఎడమవైపు తిరిగి ఎడమచేతిలోని డంబెల్స్‌ని పైకెత్తి పట్టుకుని కాసేపయ్యాక చేతులు దింపేయాలి. ఇలా ఏడు సార్లు చేయాలి.

టోర్సో ట్విస్ట్: రెండు కాళ్ల మధ్య కాస్త ఎడం ఉంచి... రెండు చేతులతో ఒక డంబెల్‌ని పట్టుకోవాలి. కాళ్లను మాత్రం అలానే ఉంచి నడుమూ, ఛాతీ, తలా అన్నీ కుడివైపు తిప్పాలి. మళ్లీ ఎడమవైపు తిరగాలి. ఇలా ఏడుసార్లు మార్చిమార్చి చేయాల్సి ఉంటుంది.

లంజ్ అండ్ ట్విస్ట్: మోకాళ్ల మీద కూర్చుని ఒకటే డంబెల్‌ని తీసుకోవాలి. కుడి కాలుని తొంభైడిగ్రీల కోణంలో ముందుకు ఉంచి డంబెల్‌ని కుడిచేతివైపు తీసుకురావాలి. ఇలానే మరో వైపు కూడా చేయాలి. ఇలా ఏడు సార్లు చేయాల్సి ఉంటుంది.







డాక్టర్ మణిపవిత్ర
యోగా నిపుణురాలు
7702491110

విదేశీ మారకపు రేట్లు



(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.35	67.66	ఆస్ట్రేలియా డాలరు	46.03	53.33	కువైట్ దీనార్	175.64	218.79
పౌండ్ స్టెర్లింగ్	75.92	88.05	సింగపూర్ డాలరు	42.88	50.80	ఒమన్ రియాల్	154.71	177.05
యూరో	68.95	79.99	థాయ్ బాత్/100	175.72	210.16	సౌదీ రియాల్	15.52	18.39
జపనీస్ యెన్/100	53.44	61.99	బ్రెహెయిన్ దీనార్	158.11	181.10	యూఏఈ దిర్హమ్	15.88	18.56

ఈనాడు బిజినెస్ వారాంతం



కోడిగుడ్లు

12వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	343	వరంగల్	345
చిల్లరగా (ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	357
బెంగళూరు	370	చెన్నై	387
	13న	చిత్తూరు	380
విజయవాడ/గోదావరి	352	నమక్కల్	375

రిటర్న్‌లకు వేళాయె!



సతీష్ సరాఫ్

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం అమల్లోకి వచ్చి దాదాపు నెలన్నర అవుతోంది. ఇప్పటికే లక్షల సంఖ్యలో వ్యాపారులు జీఎస్‌టీ కింద నమోదయ్యారు. వీరిలో పాత పన్ను విధానాల నుంచి మారిన వారితో పాటు కొత్తగా నమోదు చేసుకున్న వారూ ఉన్నారు. నమోదు ప్రక్రియ వరకు సరే.. మరి రిటర్న్‌ల సంగతేమిటి.. పన్ను విధానం మారితే రిటర్న్‌ల స్వరూపమూ మారుతుంది కదా. అదే సమయంలో వ్యాపారుల్లో రకరకాల సందేహాలు ఉండటమూ సాధారణమే. ఇప్పుడిప్పుడే రిటర్న్‌ల హడావుడి ప్రారంభమైనందున, ఆ ప్రక్రియ ఎలా ఉంటుంది? వాటిని ఎప్పుడెప్పుడు ఏవిధంగా దాఖలు చేయాలో తెలుసుకుందాం.

జీఎస్‌టీ

వ్యాపార లావాదేవీలు, ఆదాయ వ్యయాలు, పన్నులు సహా వివిధ రకాల చెల్లింపుల వివరాలను వ్యాపారులు రిటర్న్‌ల రూపంలో ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. క్రయ విక్రయ, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి వ్యాపారులకు, ప్రభుత్వానికి మధ్య రిటర్న్‌లు ఓ వారధిగా పనిచేస్తాయన్నమాట. అయితే జీఎస్‌టీకి ముందటి పరిస్థితితో పోలిస్తే ప్రస్తుతం రిటర్న్‌ల ప్రక్రియ పూర్తిగా విభిన్నం. ఇప్పుడు జీఎస్‌టీ కింద నమోదైన వ్యాపారులు ప్రతి నెల రిటర్న్‌లను సమర్పించాలి. అదే సమయంలో వార్షిక రిటర్న్‌ల ఫైలింగూ ఉంటుంది. మరికొందరు వ్యాపారులు మూడు నెలలకోసారి రిటర్న్‌లు దాఖలు చేయాల్సి ఉంది.

మూడు విధాలా రిటర్న్‌లు

నెలవారీ రిటర్న్‌లలో భాగంగా మూడు రకాల ఫారాలను వ్యాపారులు సమర్పించాల్సి ఉంటుంది. అవి జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-2, జీఎస్‌టీఆర్-3. ఈ మూడింటి దాఖలుకు గడువు తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. సాధారణంగా ఒక నెలకు సంబంధించిన రిటర్న్‌లను మరుసటి నెలలో దాఖలు చేయాలి. అది ఎప్పుడెప్పుడన్నది పట్టిక-1లో చూడొచ్చు.

తొలి రెండు నెలలకు ప్రత్యేకం..

జీఎస్‌టీ ఇటీవలే ప్రారంభమైనందున తొలి రెండు నెలల (జులై, ఆగస్టుల)కు రిటర్న్‌ల ఫైలింగ్ విషయంలో ప్రత్యేక వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. రిటర్న్‌ల దాఖలుకు మరింత గడువు ఇచ్చింది. అయితే ఆలోపు జీఎస్‌టీఆర్-3బీ ఫారాన్ని దాఖలు చేయాలి. ఈ ఫారంలో ఇన్‌వాయిస్ వివరాలను విడివిడిగా కాకుండా అన్నింటిని కలిపి ఏకీకృత వివరాల రూపేణా సమర్పించాల్సి ఉంటుంది. అలాగే ఈ రెండు నెలలకు పన్ను చెల్లింపులను జీఎస్‌టీఆర్-3 ఫారంతో కాకుండా జీఎస్‌టీఆర్-3బీ తోనే వ్యాపారులు పన్ను చెల్లించాలి. జులై, ఆగస్టు నెలలకు సంబంధించి పన్ను రిటర్న్‌ల గడువు తేదీలు పట్టిక-2లో...

దాఖలు ఎలా..: జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌ల దాఖలుకు తొలుత జీఎస్‌టీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎస్‌టీ.జీఓవీ.ఐఎన్‌కు లాగిన్ అవ్వాలి. ఆ తర్వాత 'సర్వీసెస్' విభాగానికి వెళ్లాలి. ఇందులో 'రిటర్న్స్' అని ఉంటుంది. అందులో 'రిటర్న్స్ డ్యాష్‌బోర్డ్'కు వెళ్లి సంవత్సరాన్ని, ఏ నెలకు రిటర్న్‌లు దాఖలు చేస్తున్నామో ఆ నెలను ఎంపిక చేసుకోవాలి. అనంతరం సెర్చ్‌ను నొక్కితే మూడు బాక్స్‌లు

పట్టిక-1

రిటర్న్‌లు	గడువు తేదీ
జీఎస్‌టీఆర్-1	తర్వాతి నెల 10
జీఎస్‌టీఆర్-2	తర్వాతి నెల 15
జీఎస్‌టీఆర్-3	తర్వాతి నెల 20

పట్టిక-2

రిటర్న్	జులై	ఆగస్టు
జీఎస్‌టీఆర్-3బీ	ఆగస్టు 20	సెప్టెంబరు 20
జీఎస్‌టీఆర్-1	సెప్టెంబరు 5	సెప్టెంబరు 20
జీఎస్‌టీఆర్-2	సెప్టెంబరు 10	సెప్టెంబరు 25
జీఎస్‌టీఆర్-3	సెప్టెంబరు 15	సెప్టెంబరు 30

కాంపోజిషన్ పథకాన్ని ఎంపిక చేసుకున్న వ్యాపారులకు పట్టిక-1, పట్టిక-2 తేదీలు వర్తించవు.



కనిపిస్తాయి. జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌ల ఫైలింగ్‌కు ఇందులో కుడిచేతి వైపు ఉన్న బాక్స్‌ను ఎంపిక చేసుకోవాలి. అందులో వివరాలను పూర్తి చేశాక, పన్ను చెల్లింపుల నిమిత్తం 'పేమెంట్ ఆఫ్ ట్యాక్స్'ను క్లిక్ చేయాలి. ఇక్కడ నుంచి దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలోను, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ ద్వారాను, చలాను ద్వారా కూడా రూ.10,000 వరకు పన్ను చెల్లింపులు చేసుకోవచ్చు.

సిద్ధం చేసుకోండి..: జీఎస్‌టీఆర్-3బీ ఫారంలో ఏమేమి వివరాలు ఇవ్వాలో పట్టిక-3, 4, 5ల్లో చూద్దాం. రిటర్న్‌లను దాఖలు చేసే ముందు వీటిని సిద్ధం చేసుకుంటే మీ పని కూడా సులువవుతుంది. అంతేకాకుండా చెక్‌లిస్ట్‌గానూ ఇవి ఉపయోగపడతాయి.

లెక్క సరిపోవాలి..: జీఎస్‌టీఆర్-3బీ ఫారంలో పొందుపరిచిన పన్ను, టర్నోవరు వివరాలు, ఆ తర్వాత సమర్పించే జీఎస్‌టీఆర్-1, జీఎస్‌టీఆర్-2, జీఎస్‌టీఆర్-3 రిటర్న్‌ల వివరాలతోనూ సరిపోవాలి. ఏమైనా తేడావస్తే, ఆ మొత్తానికి వడ్డీ, జరిమానాతో కలిపి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌పైనా ప్రభావం పడుతుంది. అందువల్ల చాలా జాగ్రత్తగా జీఎస్‌టీఆర్-3బీ ఫారంను దాఖలు చేయడం మంచిది.

శుభారంభం అవ్వాలి..

జులై నెలకు సమర్పించే జీఎస్‌టీఆర్-3బీతో కొత్త పన్ను విధానం రిటర్న్‌ల ప్రక్రియ ప్రారంభమైనట్లే. భారత పరోక్ష పన్ను వ్యవస్థ సరికొత్త రూపానికి ఇది శుభారంభంగా నిలవాలని ఆశిద్దాం. అలాగే ఇబ్బందులకు తావు లేకుండా ప్రతి ఒక్క వ్యాపారి విజయవంతంగా రిటర్న్‌లను దాఖలు చేయాలని కోరుకుందాం.

(రచయిత చార్టర్డ్ అకౌంటెంట్)

గమనిక: జీఎస్‌టీలో రిటర్న్‌ల దాఖలు ప్రక్రియ ఎలా ఉంటుందనే విషయంపై కొంత అవగాహన తేవడంలో భాగంగా పై విషయాలు తెలియజేశాం. అయితే ఏదేని అంశంపై పూర్తిగా తెలుసుకోవాలంటే చట్టంలోని సంబంధింత నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

పట్టిక-5

మినహాయింపు/శూన్య రేటు/జీఎస్‌టీ వర్తించని సరఫరాలు

అంశం	అంతర్రాష్ట్ర	రాష్ట్రం లోపలి
కాంపోజిషన్ విధానం/మినహాయింపు/శూన్య రేటు కింద చేసిన సరఫరాలు	రూ.	రూ.
జీఎస్‌టీ వర్తించని సరఫరాలు	రూ.	రూ.

పట్టిక-3

చేసిన అమ్మకాల వివరాలు

అంశం	టర్నోవరు	పన్ను
శూన్య రేటు, మినహాయింపు★ ఉన్నవి కాకుండా చేసినటువంటి (అవుట్‌వర్డ్) సరఫరాలు/అమ్మకాలు	రూ.	రూ.
శూన్య రేటు (ఎగుమతులు, సెజ్‌లకు సరఫరా)	రూ.	రూ.
సరఫరాలు ఇతరత్రా సరఫరాలు (శూన్య రేటు, మినహాయింపు ఉన్నవి)	రూ.	రూ.
రివర్స్ ఛార్జీ కింద చేసిన (ఇన్‌వర్డ్) విక్రయాలు (నిర్దేశిత, సాధారణ రివర్స్ ఛార్జీ)	రూ.	రూ.
జీఎస్‌టీ వర్తించని సరఫరాలు	రూ.	రూ.
మొత్తం	రూ.	రూ.

★ పై సరఫరాల్లో అంతర్రాష్ట్ర సరఫరా వివరాలు	సరఫరా ప్రాంతం	ఐజీఎస్‌టీ టర్నోవరు	ఐజీఎస్‌టీ చెల్లింపు
జీఎస్‌టీ కింద నమోదుకాని వ్యాపారులు		రూ.	రూ.
కాంపోజిషన్ డీలర్లు		రూ.	రూ.
యూఐఎన్ డీలర్లు		రూ.	రూ.
మొత్తం			

(టర్నోవరు విలువలో ఇన్‌వాయిస్, డెబిట్ నోట్, క్రెడిట్ నోట్, తీసుకున్న అడ్వాన్స్, అడ్వాన్స్ కింది చేసిన సర్దుబాటు విలువలన్నీ కలిపి ఉంటాయానే విషయాన్ని ఇక్కడ గమనించాలి)

పట్టిక-4

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వివరాలు

ఐటీసీ వర్తింపు (పూర్తిగా/పాక్షికంగా)	ఐజీఎస్‌టీ/సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ/సెస్సు
వస్తు దిగుమతులు	రూ.
సేవల దిగుమతులు	రూ.
రివర్స్ ఛార్జీ కింద జరిపిన అమ్మకాలు	రూ.
ఇన్‌పుట్ సర్వీస్ పంపిణీదారు విక్రయాలు	రూ.
ఇతరత్రా ఐటీసీ	రూ.
మొత్తం	రూ.
సీజీఎస్‌టీ చట్టంలోని 42/43 నిబంధన ప్రకారం ఐటీసీ రివర్సల్	రూ.
సీజీఎస్‌టీ చట్టంలోని సెక్షన్ 17(5) ప్రకారం (ఐటీసీ వర్తించనవి)	రూ.

మీ సందేహం ➤ మా సమాధానం ?

❐ **మా టర్నోవరు రూ.20 లక్షల్లోపే. ఇతర రాష్ట్రాలకు వస్తువులు పంపితే జీఎస్‌టీ తప్పనిసరి అని మాకు తెలుసు. కానీ మేం ఇతర రాష్ట్రాల నుంచి వస్తువులను కొంటున్నాం. అక్కడి విక్రేత జీఎస్‌టీ కింద నమోదై ఉండాల్సిన పరిస్థితి. ఇపుడు మేం జీఎస్‌టీ కింద నమోదు కావాలా?**

– రామ్ ప్రదీప్

ఇతర రాష్ట్రాల నుంచి వస్తువులను తెప్పించుకుంటున్నప్పటికీ.. మీ టర్నోవరు రూ.20 లక్షల్లోపు అయినపుడు జీఎస్‌టీ కింద నమోదు కావాల్సిన అవసరం లేదు.

❐ **మాకు రూ.20 లక్షల పైబడిన వ్యాపార టర్నోవరు ఉంది. ప్రొప్రైటర్‌షిప్ కింద రూ.3 లక్షల వరకూ వాణిజ్య అద్దెలు లభిస్తాయి. మేం సంవిధాన పథకం(కాంపోజిట్ స్కీమ్)లో చేరవచ్చా. రూ.20 లక్షల పరిమితిలోకి అద్దె కూడా వస్తుందా?**

– ఎం. నాగరాజ

జీఎస్‌టీలో ఒక పాన్‌కు ఎంత టర్నోవరు ఉంది అని లెక్కవేస్తారు. వ్యక్తి లేదా కార్యకలాపాలపై కాదు. ఎవరైనా వ్యక్తి జీఎస్‌టీ కింద సేవలను అందిస్తున్నపుడు కాంపోజిషన్‌కు వెళ్లడం కుదరదు. రూ.20 లక్షల మినహాయింపు పరిమితి అనేది మీ వ్యాపార టర్నోవరు, వాణిజ్య అద్దెలను రెండింటినీ కలిపి లెక్కగడతారు.

❐ **జీఎస్‌టీ కింద పొందే ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను అవుట్‌పుట్ ఐజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ, సీజీఎస్‌టీలో ఎలా సర్దుబాటు చేస్తారు. ఐజీఎస్‌టీ బ్యాలెన్స్‌ను ఎస్‌జీఎస్‌టీ లేదా సీజీఎస్‌టీలో సర్దుబాటు చేయవచ్చా?**

– ఆర్.వి. కృష్ణా రావు

ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను పొందే సమయంలో అది ఐజీఎస్‌టీ, సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కింద వస్తుంది. ఐజీఎస్‌టీ క్రెడిట్‌ను తొలుత ఐజీఎస్‌టీ అవుట్‌పుట్ టాక్స్ లయబిలిటీ కింద సర్దుబాటు చేయవచ్చు. ఆ తర్వాత సీజీఎస్‌టీ.. అటుపైన ఎస్‌జీఎస్‌టీ కింద సర్దుబాటు చేసుకోవచ్చు. సీజీఎస్‌టీ క్రెడిట్‌ను ముందుగా సీజీఎస్‌టీ అవుట్‌పుట్ టాక్స్ లయబిలిటీ కింద; మిగతా ఐజీఎస్‌టీకి మళ్లించుకోవచ్చు. ఎస్‌జీఎస్‌టీ క్రెడిట్‌ను సైతం ముందు ఎస్‌జీఎస్‌టీ అవుట్‌పుట్ టాక్స్ లయబిలిటీకే వాడుకోవాలి. అంతే కానీ జీసీఎస్‌టీ క్రెడిట్‌ను ఎస్‌జీఎస్‌టీ అవుట్‌పుట్ టాక్స్ సర్దుబాటునకు; ఎస్‌జీఎస్‌టీ క్రెడిట్‌ను సీజీఎస్‌టీ అవుట్‌పుట్ టాక్స్ సర్దుబాటుకు ఉపయోగించుకోకూడదు. సర్దుబాటు అనంతరం ఏదైనా క్రెడిట్ మిగిలితే. . తదుపరి నెలలో ఉపయోగించుకునే వీలుంటుంది.

❐ **నేను నా భవంతిని ముత్తూట్ కంపెనీకి అద్దెకు ఇచ్చాను. జీఎస్‌టీ కింద 18 శాతాన్ని ఒప్పందంలో తగ్గిస్తామని.. ప్రతీ ప్రభుత్వ సెస్సునూ నేనే కట్టాలని అంటున్నారు. అద్దెలపైనా జీఎస్‌టీ వర్తిస్తుందా?**

– మారమ్ బాలరంగస్వామి, ఆత్మకూరు, కర్నూలు

ఏదైనా వాణిజ్య అవసరాల కోసం ఇచ్చిన స్థిరాస్తిపై అద్దె వస్తే దానిపై 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. అద్దెకున్న వ్యక్తి(ముత్తూట్ కంపెనీ) చెబుతున్నది నిజమే. మీరు కుదుర్చుకున్న ఒప్పందంలో ఉన్నట్లుగా ప్రభుత్వ పన్నులన్నీ మీరే చెల్లించాలి.

❐ **ఇద్దరు కాంపోజిషన్ డీలర్ల మధ్య జరిగే ఏ లావాదేవీలపై పన్ను పడుతుందో చెబుతారా?**

– కె.ఎన్.వి. రావు

ఇద్దరు కాంపోజిషన్ డీలర్ల మధ్య జరిగే లావాదేవీలు ఏ విధంగానూ కాంపోజిన్ అర్హతపై ప్రభావాన్ని చూపవు.

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలను మాకు పంపండి. మా మెయిల్ అడ్రస్:
businessdesk@eenadu.net;
eenadubusinessdesk@gmail.com

అదానీ పోర్ట్స్ లాభం రూ.710 కోట్లు

దిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ రూ.710.25 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.822.57 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 13.65 శాతం తక్కువ. అధిక పన్నులు ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. ఇక మొత్తం ఆదాయం రూ.2,85.14 కోట్ల నుంచి రూ.2,959.63 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు సైతం రూ.1,206.40 కోట్ల నుంచి రూ.1,867.43 కోట్లకు చేరాయి. గత త్రైమాసికంలో కంపెనీ 50 మిలియన్ టన్నుల సరకును రవాణా చేసిందని తెలిపింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభంలో 62% క్షీణత

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఏకీకృత ప్రాతిపదికన రూ.141.15 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.369.24 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 61.77 శాతం తక్కువ. ఇక మొత్తం ఆదాయం రూ.9,174.06 కోట్ల నుంచి రూ.8,871.29 కోట్లకు పరిమితమైంది. మొత్తం వ్యయాలు రూ.8,820.61 కోట్ల నుంచి రూ.8,757.64 కోట్లకు చేరాయి. పునరుత్పాదక ఇంధనం, గనులు, వ్యవసాయోత్పతుల వ్యాపారాలపై దృష్టి పెట్టామని, అంతర్జాతీయ స్థాయికి వీటిని తీసుకురావడమే తమ లక్ష్యమని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడించారు. గత త్రైమాసికంలో బొగ్గు ఎండీఓ అమ్మకాలు 1.6 ఎంఎంటీగా నమోదయ్యాయని అన్నారు.

రాణించిన జేకే సిమెంట్

దిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో జేకే సిమెంట్ స్టాండలోన్ ప్రాతిపదికన రూ.79.34 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.60.85 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 30 శాతం అధికం. ఇక మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,039.80 కోట్ల నుంచి 16.21 శాతం వృద్ధితో.. రూ.1,208.43 కోట్లకు చేరాయి. మొత్తం వ్యయాలు రూ.974.94 కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,123.77 కోట్లతో పోలిస్తే ఇవి 15.26 శాతం పెరిగాయి. వైట్ సిమెంట్ ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో కంపెనీ ఉంది. కంపెనీ వార్షిక సామర్థ్యం 6,00,000 టన్నులు.

ట్రూజెట్ స్వాతంత్ర్య దినోత్సవ తగ్గింపు

ఈనాడు, హైదరాబాద్: స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని విమాన ప్రయాణికులకు ప్రత్యేక ఆఫర్‌ను ట్రూజెట్ ప్రకటించింది. ప్రత్యేక ఆఫర్ కింద అన్ని కలిపి ఒక వైపు ప్రయాణానికి టికెట్ ధర రూ.815 నుంచి ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 25 వరకూ ప్రయాణం చేయడానికి వీలుగా ఆగస్టు 13 నుంచి 15 వరకూ టికెట్లు కొనుగోలు చేసిన వారికి ఈ తగ్గింపు వర్తిస్తుంది.

ఆర్‌కామ్ నష్టాల మోత



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రూ.1,210 కోట్ల ఏకీకృత నష్టాన్ని చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.90 కోట్ల లాభాన్ని ఆర్జించింది. రిలయన్స్ జియో రాకతో మొదలైన ధరల పోటీ కారణంగా వరుసగా మూడో త్రైమాసికంలోనూ కంపెనీ నష్టాలు నమోదు చేసింది. ఏకీకృత ఆదాయం సైతం రూ.5,361 కోట్ల నుంచి 33 శాతం క్షీణతతో రూ.3,591 కోట్లకు చేరింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో తీవ్రమైన పోటీ, భారత టెలికాం రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆర్‌కాం తెలిపింది. 'గత 20 ఏళ్లలోనే తొలిసారిగా టెలికాం రంగం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తోంది. ఫలితంగా ప్రభుత్వ ఆదాయం తగ్గడంతో పాటు ఆపరేటింగ్ మార్జిన్లు సైతం గణనీయంగా పడిపోయాయి. ఇప్పటికే ఉన్న రుణాల వల్ల వడ్డీ ఖర్చులు సైతం పెరిగాయి' అని వెల్లడించింది. గత త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ రుణ భారం వివరాలపై స్పష్టత ఇవ్వలేదు. అయితే బకాయిలు చెల్లించడానికి రుణదాతలు డిసెంబరు వరకు సమయం ఇచ్చారు. అంతకు ముందు ఆర్‌కాం రుణం రూ.45,000 కోట్లు ఉండొచ్చని అంచనా. ఈ నెల చివరకు సిస్టెమా శ్యామ్ కొనుగోలు ప్రక్రియ ముగియనుందని, తద్వారా మరో 8 టెలికాం సర్కిళ్లలో 850 బ్యాండ్ స్పెక్ట్రమ్ కంపెనీ చేతికి వస్తుందని తెలిపింది. టవర్ల వ్యాపార విక్రయం ద్వారా కంపెనీ రుణ భారం రూ.11,000 కోట్ల వరకు తగ్గొచ్చని ఆశిస్తోంది.

డీఎల్‌ఎఫ్ ఆదాయం రూ.2211 కోట్లు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో స్థిరాస్తి దిగ్గజం డీఎల్‌ఎఫ్ ఏకీకృత ప్రాతిపదికన రూ.109.01 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.261.85 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 58 శాతం తక్కువ. ఇక మొత్తం ఆదాయం రూ.2,025.28 కోట్ల నుంచి 9 శాతం పెరిగి.. రూ.2,211.24 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో డీటీ సినిమాస్‌ను పీవీఆర్ గ్రూప్‌నకు విక్రయించడం ద్వారా కంపెనీ రూ.329 కోట్లు ఆర్జించింది. దీంతో ఈ సారి లాభం తగ్గింది. డీఎల్‌ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్‌లో 40 శాతం వాటాను ప్రమోటర్లు విక్రయించేందుకు చర్చలు తుది దశలో ఉన్నాయని కంపెనీ వెల్లడించింది. ఈ లావాదేవీ ద్వారా రూ.13,000 కోట్లు రావొచ్చని అంచనా.

జోయాలుక్కాస్ ప్రచారకర్తగా కాజోల్



జోయాలుక్కాస్ నూతన ప్రచార కర్త, నటి కాజోల్‌తో జోయాలుక్కాస్ డైరెక్టర్ సోనియా అలుకాస్, కార్యనిర్వాహక డైరెక్టర్ జాన్ పాల్ అలుకాస్

హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల వ్యాపార సంస్థ జోయాలుక్కాస్ నటి కాజోల్ దేవగన్‌ను ప్రచార కర్తగా నియమించుకుంది. ఈమేరకు ఉభయుల మధ్య ఒప్పందం కుదిరింది. 'మా సంస్థకు కాజోల్ సరైన వ్యక్తి. నటిగా వివిధ పాత్రల్లో అసాధారణ ప్రతిభ కనబరిచింది. ఆమెను ప్రచార కర్తగా తీసుకోవడం సంతోషంగా ఉంది' అని జోయాలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) జోయాలుక్కాస్ అన్నారు. ఈ సంస్థకు భారత్ సహా 12 దేశాల్లో 140 విక్రయ కేంద్రాలున్నాయి. ప్రపంచ ప్రముఖ నగల వ్యాపార సంస్థల్లో ఒకటిగా జోయాలుక్కాస్ గుర్తింపు పొందింది. 'జోయాలుక్కాస్‌కు ప్రచార కర్తగా నన్ను నియమించుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఎండీ జాయలుక్కాస్ వ్యక్తిగత విజయాలు స్ఫూర్తిమంతంగా ఉంటాయి' అని నటి కాజోల్ అన్నారు. ప్రపంచానికే జోయాలుక్కాస్ ఒక ఆభరణంగా ఎదగాలన్న ఉద్దేశంతో సంస్థ చేపట్టబోయే వివిధ విస్తరణ కార్యక్రమాల్లో ఆమె పాలుపంచుకుంటారు.

తగ్గిన హిందుజా గ్లోబల్ లాభం

దిల్లీ: జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో హిందుజా గ్లోబల్ సొల్యూషన్స్ రూ.41.5 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.51.9 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 20 శాతం తక్కువ. మొత్తం నిర్వహణ ఆదాయం రూ.909.5 కోట్ల నుంచి 1.9 శాతం వృద్ధితో.. రూ.927.1 కోట్లకు పెరిగింది. జూన్ త్రైమాసికం సాధారణంగానే మోస్తారుగా ఉంటుందని, స్థిర మారక ప్రాతిపదికన 6.4 శాతం వృద్ధి సాధించామని కంపెనీ సీఈఓ పార్థా దేసర్కార్ తెలిపారు. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ మూలధనం, పెట్టుబడులు రూ.39.5 కోట్లుగా ఉంది. కంపెనీ చేతిలో 44,877 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇక ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.2.5 డివిడెండు చెల్లించనున్నట్లు కంపెనీ బోర్డు ప్రకటించింది.

బిర్లా కార్పొరేషన్ నిరాశాజనకం

జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో బిర్లా కార్పొరేషన్ ఏకీకృత ప్రాతిపదికన రూ.43.21 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.94.44 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. రిలయన్స్ సిమెంట్ కంపెనీను కొనుగోలు చేసిన నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం ఫలితాలతో పోల్చి చూడలేమని బిర్లా కార్పొరేషన్ తెలిపింది. ఇక మొత్తం వ్యయాలు రూ.968.99 కోట్ల నుంచి రూ.1,604.19 కోట్లకు చేరాయి.

గీతాంజలి జెమ్స్ ఆకర్షణీయం

జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో గీతాంజలి జెమ్స్ రూ.69.46 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.57.31 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 21.2 శాతం అధికం. అమ్మకాలు దూసుకెళ్లడం ఇందుకు కలిసొచ్చిందని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.3,710.43 కోట్ల నుంచి 51.22 శాతం వృద్ధితో.. రూ.5,611.06 కోట్లకు చేరింది. వజ్రాల వ్యాపార ఆదాయం రూ.834.82 కోట్ల నుంచి రూ.1,662.96 కోట్లకు, ఆభరణాల వ్యాపార ఆదాయం రూ.2,949.50 కోట్ల నుంచి రూ.4,258.12 కోట్లకు చేరాయి. వ్యయాలు రూ.5,461.73 కోట్ల నుంచి రూ.5,438.34 కోట్లకు తగ్గాయి.

హిందుస్థాన్ కాపర్ లాభం రూ.10 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ కాపర్ రూ.10.27 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.2.82 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. ఇక మొత్తం ఆదాయం రూ.219.26 కోట్ల నుంచి రూ.406.08 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు సైతం రూ.236.64 కోట్ల నుంచి రూ.407.40 కోట్లకు చేరాయి.

ఉల్లి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టండి

- రైతు బజార్లలో అందుబాటులో ఉంచండి
- అక్రమ నిల్వలపై దాడులు చేయండి
- వాక్‌దృశ్య సమావేశంలో సీఎం ఆదేశం



ఈనాడు, అమరావతి: ఉల్లి ధరల నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుబజార్లలో వెంటనే ఉల్లి అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టంచేశారు. అవసరమైతే రైతు బజార్లలో రాయితీతో విక్రయించే ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. ఉల్లిధరలు పెరుగుతున్న తీరు, రైతు బజార్లలో పరిస్థితి, వ్యాపారుల తీరుపై 'ఉల్లిగడ్డ బాంబు పేలనుందా' అన్న శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ముఖ్యమంత్రి వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖల కమిషనర్లు, రైతు బజార్ల రాష్ట్ర ముఖ్య కార్యనిర్వహణాధికారి తదితరులతో శనివారం వాక్‌దృశ్య సమావేశం నిర్వహించారు. ఉల్లి అక్రమ నిల్వలపై మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మేరకు నిల్వలను మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఉల్లి కొరత ఉందో 1100 కేంద్రం ద్వారా తెలుసుకుని ఆయా ప్రాంతాలకు ఉల్లి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లలో ఉల్లి అందుబాటును ప్రతి 2 గంటలకు ఒకసారి 1100 కేంద్రం ద్వారా సమీక్షించాలని మార్గదర్శనం చేశారు. రాష్ట్రంలోని ప్రజల అవసరాలను గుర్తించి..ఆ మేరకు మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ నుంచి ఉల్లిని సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

విస్తృత వైద్య సేవలు... పెరుగుతున్న రోగులు

- సర్కారీ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పన

ఈనాడు – అమరావతి

ఆరోగ్య భద్రత, భరోసాలకు తోడు.. ఎమర్జెన్సీ సేవలన్నీ అందుబాటులోకి వస్తుంటే పేద రోగులకు ఊరట కలుగుతోంది. వైద్యసేవలను వినియోగించుకునేందుకు రోగులు ముందుకు వస్తుండటంతో చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రులన్నీ నిండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా 32 నుంచి 35 లక్షల మంది రోగులు వివిధ స్థాయిల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యసేవలు పొందుతుండటం ఇందుకు అద్దం పడుతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రుసుములు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు అందుకుంటున్న రోగులసంఖ్య వృద్ధిచెందుతున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2014-15లో అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో కలిపి బయటి రోగుల(ఓపీ) విభాగంకింద 4,36,11,539మంది వైద్య సేవలను పొందగా ఈ సంఖ్య 2016-17 నాటికి 5,61,78,547కు చేరుకోవటం గమనార్హం.

మెరుగవుతున్న సౌకర్యాలు

ఆస్పత్రుల్లో భద్రతను పటిష్ఠం చేశారు. పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచారు. దుర్వాసన, అపరిశుభ్రం లేకుండా తగిన చర్యల్ని తీసుకుంటున్నారు. బేబి కిట్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పథకాల వల్ల ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ శుభ్రం చేసిన దుప్పటిని పడకలపై ఉంచేలా చర్యల్ని తీసుకున్నారు. త్వరలో బసవతారకరామ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టబోతున్నారు. బాలింతలకు వర్తింప చేయనున్నారు. ఇటీవలే మరణించిన వారి భౌతికకాయాల్ని ఉచితంగా వారి స్వస్థలాలకు చేర్చేందుకు 'మహాప్రస్థానం' కింద అంబులెన్సులను ముఖ్యమైన ఆస్పత్రుల్లో దశలవారీగా సమకూరుస్తున్నారు. పరికరాలు మరమ్మతులకు గురైతే వాటిని బాగు చేసేందుకు పీపీపీ విధానంలో ఓ సంస్థకు బాధ్యతల్ని అప్పగించారు. టెలీ రేడియాలజీ, ఎమ్మారై, సిటీస్కాన్ ఇతర సౌకర్యాలు క్రమేణ ముఖ్యమైన ఆసుపత్రుల్లోకి వస్తున్నాయి. రక్త పరీక్షలు, టెలీ రేడియాలజీ, సిటీ స్కాన్ సేవలు 2016 జనవరి నుంచి క్రమంగా అమల్లోకి వచ్చాయి. జూన్ 1, 2017 నాటికి 56 లక్షల మందికి ఉచిత రక్త పరీక్షలు జరిగాయి.

- రెండేళ్ల కిందటి వరకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 500 మంది రోగులు ఓపీ ద్వారా వైద్య సేవలను పొందారు. ఈ సంఖ్య ప్రస్తుతం 1000 నుంచి 1200 మధ్య నమోదవుతోంది. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 4000 మంది రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. రెండేళ్లతో పోలిస్తే ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది.
- ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో వైద్య సేవల్ని పొందేందుకు రోగులు తగిన ప్రాధాన్యమిస్తున్నారు. గుంటూరు సర్వజనాసుపత్రిలో సుమారు 3000 నుంచి 4000 మంది రోగులు ఇక్కడ ఓపీ ద్వారా సేవలు పొందుతున్నారు.
- కర్నూలు సర్వజన ఆస్పత్రిలో గతంలో ఓపీ రోజుకి 2000 ప్రాంతంలో ఉండగా ఈ సంఖ్య క్రమేణ మూడు వేల వరకు చేరుతోంది. తిరుపతి రుయాలో చేరే వారి సంఖ్య రోజుకి 600 నుంచి 700 వరకు నమోదవుతోంది. ఔట్ పేషంట్ రోగులు రోజుకి 1800 నుంచి 2000 మంది వరకు వస్తున్నారు. వైజాగ్ కేజీహెచ్‌లో ఈ ఏడాది జనవరిలో 44వేల మంది రోగులు ఇక్కడ ఓపీ విధానంలో వైద్య సేవలను పొందారు. జూన్ నాటికి ఈ సంఖ్య 56 వేలకు చేరుకుంది.



విజయవాడ పాత ఆసుపత్రిలో రోగుల రద్దీ

సేవలు	రోగుల సంఖ్య		
	2014–15	2015–16	2016–17
ఓపీ	43611539	47264737	56178547
ఐపీ (ఇన్‌పేషంట్)	2526211	2121879	3450016
ప్రసవాలు	259257	273500	301851
చిన్న శస్త్రచికిత్సలు	149719	1043121	1136406
పెద్ద శస్త్రచికిత్సలు	288027	319262	345790

సేవలు	2016–17	2017–18 ఏప్రిల్ నుంచి జూన్
ఓపీ	12544797	16304074
ఐపీ	891831	940384
ప్రసవాలు	75237	79883
చిన్న శస్త్రచికిత్సలు	50130	58927
పెద్ద శస్త్రచికిత్సలు	45727	54130

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం



రోగుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, వైద్యులను సమకూర్చేందుకు ప్రత్యేక చర్యల్ని తీసుకుంటున్నాం. గడిచిన రెండు సంవత్సరాల్లో ఆస్పత్రుల్లో రూ.350 కోట్లతో అవసరమైన నిర్మాణాలను చేపట్టాం. మరో 150 కోట్ల రూపాయలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అనారోగ్య నిర్ధరణ పరీక్షల కోసం రోగులు చేసే వ్యయం తగ్గుతోంది. 35 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. ఇవికాకుండా మరో 15 కేంద్రాల్ని ఏర్పాటుచేయబోతున్నాం. త్వరలో బాలింతలకు బసవతారకరామ కిట్ పథకాన్ని ప్రారంభించబోతున్నాం. బోధనాస్పత్రుల్లో వైద్యుల కొరతను అధిగమించగలుగుతున్నాం. జిల్లా ఆస్పత్రులు, ఇతర ప్రధాన ఆస్పత్రుల్లో గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్య నిపుణులను నియమించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇ-ఔషధి విధానం ద్వారా మందుల కొరత లేదు.

– పూనం మాలకొండయ్య, ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

పౌర సరఫరాల మంత్రి హెచ్చరిక

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కడుపు నింపాలన్న లక్ష్యంతో ఇస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. ఆయన శనివారం గుంటూరులోని పలు రేషన్ దుకాణాలు, మండల స్థాయి నిల్వ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏటీఅగ్రహారం శాంతినగర్‌లోని 174వ రేషన్ దుకాణాన్ని పరిశీలించిన సమయంలో బియ్యం శుభ్రంగా లేకపోవడం, 17.50 క్వింటాళ్ల నిల్వ తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. తర్వాత మండల స్థాయి నిల్వ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పలు బస్తాల నుంచి బియ్యాన్ని సేకరించగా..ఒక దానిలో శుభ్రం చేయని బియ్యం కన్పించడంతో మంత్రి ఆగ్రహించారు. పేదలకు దుమ్ముతో కూడిన బియ్యం పంపిణీ చేస్తే సహించేది లేదని సిబ్బందిపై మండిపడ్డారు. వే బ్రిడ్జి బిల్లులు లేకపోవడాన్ని గమనించిన మంత్రి ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జ్‌ను సస్పెండ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి వెంట మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎం.సుబ్బారావు, ఉన్నతాధికారులు ఉన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



దర్శనానికి వచ్చిన ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్

మంత్రాలయం, న్యూస్‌టుడే : తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ రాఘవేంద్రస్వామి దర్శనార్థం శనివారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. ఈయనకు శ్రీమఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు న్యాయమూర్తిని సత్కరించి ఆశీర్వదించారు. ఈయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి, హైదరాబాద్ జిల్లా న్యాయమూర్తి సంతోష్‌రెడ్డి, శ్రీమఠం అధికారులు మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, సహాయ మేనేజరు ఐపీ నరసింహమూర్తి, బిందుమాధవ్ తదితరులు ఉన్నారు.

బ్యాంకుల విలీనం తగదు

ఏపీయూబీ అధికారుల సంఘ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న దేబాశిష్ ఘోష్

పటమట (విజయవాడ), న్యూస్‌టుడే: సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినా.. బడా ఎగవేతదార్ల పేర్లను ప్రకటించని ప్రభుత్వం, మూలధన అవసరాల కోసం బ్యాంకులను విలీనం చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేబాశిష్ ఘోష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 26వ సర్వసభ్య సమావేశం విజయవాడలోని ఎగ్జిక్యూటివ్ క్లబ్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా దేబాశిష్ ఘోష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ వ్యతిరేక చర్యలను తిప్పికొట్టాలన్నారు. ఏఐబీఓసీ సలహాదారు మాడభూషి హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు సంఘాలు లేని బ్యాంకులను చూడాలని ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ నెల 22న జరగనున్న దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.ఎస్.రావు, విజయవాడ రీజనల్ హెడ్ రవీంద్రనాథ్, డిప్యూటీ రీజనల్ హెడ్ హైదరాబాద్ రంగనాథన్, రీజనల్ హెడ్ నెల్లూరు సయ్యద్ జవహర్, పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలని, పెద్ద డిఫాల్టర్ల పేర్లు ప్రకటించి బకాయిలు వసూలు చేయాలని, బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకించాలని తీర్మానించారు.

వరుస సెలవులు.. వాహనాలు బారులు..

కీసర(కంచికచర్ల గ్రామీణం), న్యూస్‌టుడే: వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి అనేకమంది కుటుంబాలతో స్వస్థలాలకు బయలుదేరారు. ఫలితంగా శనివారం ఉదయం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం కీసర టోలు వసూలు కేంద్రం వద్దకు వాహనాలన్నీ ఒక్కసారిగా చేరుకోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. సుమారు అర కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. టోలు వసూలు కేంద్రం అధికారులు, సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సాధారణ రోజుల్లో కన్నా శనివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సుమారు రెట్టింపు సంఖ్యలో వాహనాలు వెళ్లాయని టోలు వసూలు కేంద్రం మేనేజరు జయప్రకాష్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



కంచికచర్ల మండలం కీసర టోలు వసూలు కేంద్రం వద్ద బారులు తీరిన వాహనాలు

సాంకేతిక విద్యలో నాణ్యత పెంపునకు చర్యలు

3 సంస్థలతో త్వరలో ఒప్పందాలు

ఈనాడు, అమరావతి: సాంకేతిక విద్యలో నాణ్యత ప్రమాణాల పెంపునకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం చర్యలు తీసుకుంటోంది. సాంకేతిక విద్య నాణ్యత అభివృద్ధి కార్యక్రమం-3 (టీఈక్యూఐపీ-3)లో భాగంగా ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత, ఇంజినీరింగ్ విద్యా సామర్థ్యం పెంపునకు మూడు సంస్థలతో కళాశాలలు ఒప్పందం కుదుర్చుకోనున్నాయి. ఈ మేరకు ఒప్పంద బాధ్యతలను పరిశీలించాలని సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక కమిషనర్‌కు సూచిస్తూ ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అదిత్యానాథ్‌దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలతో ఉత్తరాఖండ్ జీబీపీఈసీ పౌరి గర్వాల్ ఒప్పందం కుదుర్చుకుంటుంది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలతో మధ్యప్రదేశ్ సాగర్‌లోని ఇందిరాగాంధీ ఇంజినీరింగ్ కళాశాల, కాకినాడ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలతో భువనేశ్వర్ సీఈటీ ఒప్పందాలు కుదుర్చుకోనున్నాయి. ప్రాజెక్టు సలహాదారుగా సాంకేతిక విద్య ప్రత్యేక కమిషనర్ వ్యవహరించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా అయా వర్సిటీలు, కళాశాలలకు కేంద్రం నిధులిస్తుంది.

భవనాలు కూల్చి రోడ్లేస్తే అభివృద్ధి కాదు

- అవినీతి సొమ్ము దెయ్యాలకిచ్చి పంపుతారు
- రుణమాఫీ గురించి అడిగిన రైతును బెదిరించారు
- నంద్యాల ప్రచారసభలో వైకాపా అధ్యక్షుడు జగన్ ధ్వజం



నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలో రోడ్డుషోలో మాట్లాడుతున్న జగన్

కర్నూలు: 'భవనాలు పడగొట్టి రోడ్లు వేస్తే అభివృద్ధి కాదు.. పేదలు, రైతుల కళ్లలో ఆనందం చూసినప్పుడే అభివృద్ధి' అని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నాలుగో రోజు రోడ్‌షోలో భాగంగా శనివారం నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలం ఒంటివెలగల, గోస్పాడు, శ్రీనివాసపురం, యాళ్లూరు, ఎం.కృష్ణాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. జగన్ మాట్లాడుతూ.. మూడున్నరేళ్లుగా చంద్రబాబు దోచుకున్న అవినీతి సొమ్మును దెయ్యాలకిచ్చి మీ దగ్గరకు పంపుతారని, ఓట్ల కోసం ఎర వేస్తారని పేర్కొన్నారు. కేసీ కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులు వైఎస్ హయాంలో రెండు పంటలను పండించేవారని, ఇప్పుడు ఒక్క పంటకు నీళ్ల కోసం నిరీక్షణ తప్పడం లేదని వివరించారు. చంద్రబాబు వచ్చినప్పుడు ఓ రైతు రుణమాఫీ కాలేదని అడిగితే.. రైతు వద్ద మైకు లాక్కొని ఆపై బెదిరించారని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కానప్పుడు రేషన్ దుకాణాల ద్వారా తొమ్మిది రకాల సరకులు అందించేవారని, ఇప్పుడు కేవలం బియ్యం తప్ప ఏమిస్తున్నారని ప్రశ్నించారు. నంద్యాలలో రహదారుల విస్తరణలో నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. తెదేపాకు ఓటు వేయకపోతే అభివృద్ధి ఆగిపోతుందని ఆందోళన చెందవద్దని, నంద్యాల అభివృద్ధిని తనకు వదిలేయండని భరోసానిచ్చారు. కర్నూలులో విమానాశ్రయం, ఆహార పార్కు, పారిశ్రామిక కారిడార్, ట్రిపుల్ ఐటీ వంటి ఎన్నో హామీలు ముఖ్యమంత్రి హోదాలో ఇచ్చిన చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చలేదని తెలిపారు. రైతులు, డ్వాక్రా మహిళలు, నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు ఓటు కోసం వస్తే గట్టిగా నిలదీయండని సూచించారు. 'అలాంటి వ్యక్తికి ఏ శిక్ష వేసినా తప్పులేదు కదా? ఉరి తీసినా తప్పులే'దంటూ వ్యాఖ్యానించారు. ఏడు వేల ఓట్లున్న యాళ్లూరులో విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదని తెలిసిందని, చంద్రబాబు పాలనకు ఇది అద్దం పడుతుందని ఆరోపించారు. నంద్యాల ఉపఎన్నికలు రావడంతో చంద్రబాబు, ఆయన మంత్రులు నంద్యాల రహదారులపై తిరుగుతున్నారని, వారికి ఇప్పటివరకు ఇక్కడి ప్రజలు గుర్తుకు రాలేదని విమర్శించారు.

సాక్షి టీవీలో ఏకపక్ష ఎన్నికల ప్రచారంపై నోటీసులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంపై సాక్షి టెలివిజన్ చీఫ్ ఎడిటర్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఈనెల 9 నుంచి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలలో పర్యటిస్తుండగా సాక్షి టీవీ ఛానల్‌లో ప్రతిరోజూ పదేపదే నాలుగైదు గంటల పాటు ఏకపక్షంగా ప్రసారం అవుతోందని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సభ్యులు తమ నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.సత్యనారాయణకు అందజేశారు. దీనిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన శనివారం సాక్షి టెలివిజన్ చీఫ్ ఎడిటర్‌కు నోటీసులు జారీ చేశారు. ప్రతిపక్షనేత, ఒకే వ్యక్తికి సంబంధించిన ప్రచార ప్రసారాలు చేస్తున్నందుకు ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోరాదో రెండురోజుల్లో సంజాయిషీ ఇవ్వాలంటూ ఆ నోటీసులో పేర్కొన్నారు.

పరిధులు దాటి వ్యాఖ్యలు: కేఈ



కర్నూలు, న్యూస్‌టుడే: జగన్ పరిణతి చెందిన రాజకీయ నాయకుడు కాదని.. ఆయన చేసే వ్యక్తిగత ధూషణలు పరిధులు దాటి ప్రజల హృదయాలను గాయపరుస్తున్నాయని ఇది ఆయన నియంతృత్వ పోకడకు నిదర్శనమని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి విమర్శించారు. శనివారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో మనం ఉన్నామనే విషయాన్ని ప్రతిపక్ష నాయకుడు పూర్తిగా మర్చిపోయారన్నారు. 'నంద్యాల ఉపఎన్నికలో ఓటమి భయంతోనే రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆహర్నిశలు శ్రమిస్తున్నందుకు చంద్రబాబును తుపాకీతో కాల్చాలా? ఉరి తీయాలా? ' అని కేఈ ప్రశ్నించారు.

అభివృద్ధికి అరాచకానికి మధ్య పోటీ



ఈనాడు, అమరావతి: నంద్యాల ఉప ఎన్నికలు అభివృద్ధికి, అరాచకానికి మధ్య పోటీ అని మంత్రి దేవినేని ఉమా పేర్కొన్నారు. ఆర్థిక లోటులో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విధాలా చంద్రబాబు అభివృద్ధి చేస్తోంటే కనీసం అమరావతి రాజధాని నిర్మాణ శంకుస్థాపనకు కూడా రాకుండా జగన్ అరాచకం సృష్టిస్తున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు అనుభవజ్ఞుడని, ఎంపీగా ఉండి కనీసం పార్లమెంట్‌లో కూడా మాట్లాడలేని అసమర్థుడు జగన్ అని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రులను మహిళలతో జగన్ తిట్టిస్తున్నాడని, దమ్ముంటే తమ ముందు చర్చకు రావాలి, ఏ విషయంపైనైనా సమాధానం చెప్పగలమని దేవినేని సవాల్ చేశారు. నీ కుటుంబం సర్పంచి నుంచి ముఖ్యమంత్రి వరకు పని చేసి కూడా పులివెందులకు నీళ్లు ఇవ్వలేకపోయిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందుల నియోజకవర్గానికి నీళ్లు ఇచ్చామని మంత్రి అన్నారు. అలాంటిది జగన్ వచ్చి గుండ్రేవుల పూర్తి చేస్తానంటే రైతాంగం నమ్మబోరన్నారు. గుండ్రావుల ప్రాజెక్టుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని, అంతర్రాష్ట్ర సమస్యలు లేకుండా అన్ని కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ఈ ప్రాజెక్టు కోసం కష్టపడి పని చేస్తున్నారని, అసలు నీకు కేసీ కాలువ అంటే ఏమిటో తెలుసా? అని ఉమా ప్రశ్నించారు.

టెర్మినల్ భవనం పరిశీలన

త్వరలోనే భద్రతా, తనిఖీ యంత్రాల రాక

ఈనాడు, అమరావతి: గన్నవరం విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదాను కల్పించడంతో.. ఆ దిశగా చర్యలు ఊపందుకున్నాయి. అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిపేందుకు వీలుగా పాత టెర్మినల్ భవనాన్ని రూ.2.50 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీనికి సంబంధించి కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ విభాగాల ఏర్పాటు కీలకమైన అంశం. ఇప్పటికే కస్టమ్స్ సిబ్బంది విమానాశ్రయ అధికారులతో సమావేశమై భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. ఇటీవల నలుగురు ఇమ్మిగ్రేషన్ అధికారులు విమానాశ్రయానికి వచ్చి టెర్మినల్ భవనాన్ని పరిశీలించారు. తనిఖీలకు అవసరమైన భద్రతా యంత్రాలు, కంప్యూటర్ సర్వర్ల కనెక్షన్లకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వెళ్లారు. ప్రస్తుతం టెర్మినల్ భవనానికి ఏలూరు నుంచి ప్రత్యేక కేబుళ్ల ద్వారా అంతర్జాలం సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే తనిఖీలకు అవసరమైన యంత్ర పరికరాలను తీసుకురానున్నారు. కస్టమ్స్ అధికారులు కూడా తమకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పరిశీలించారు. అలాగే మూడంచెల భద్రతా విధానాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి నిషేధిత పదార్థాలు, వస్తువులు, సరకును తీసుకెళ్లినా.. గుర్తించే స్కానింగ్ యంత్రాలను బిగించనున్నారు. విదేశీ సర్వీసులను నడిపేందుకు ముందుకు రావాలంటూ పలు విమానయాన సంస్థలతో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఆధ్వర్యంలో అధికారులు చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే ఈ చర్చలు తుది దశకు చేరనున్నాయని భావిస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అవినీతి నిర్మూలన

- ఏసీబీ డీజీ ఆర్‌పీ ఠాకూర్

నెల్లూరు, న్యూస్‌టుడే: ప్రతి అధికారి నీతిని జాయతీలతో విధులు నిర్వర్తించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఆర్‌పీ ఠాకూర్ పిలుపునిచ్చారు. భవిష్యత్తులో శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో అవినీతిని నిర్మూలిస్తామని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరులో నిర్మిస్తున్న ఏసీబీ భవనాన్ని పరిశీలించిన ఆయన దర్గామిట్టలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో నూతన ఏసీబీ కార్యాలయాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ నెల 14న తిరుపతిలో ఏసీబీ కార్యాలయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం నెల్లూరు, వైజాగ్, గుంటూరు, విజయవాడలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ భవనాలను వచ్చే ఏడాది మార్చికి పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. అవినీతిని అంతమొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 90 ట్రాప్ కేసులు, 27 అసెట్ కేసులు నమోదయ్యాయన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉన్నతాధికారులపైనే దృష్టి పెట్టామన్నారు. ఇటీవల సాంఘిక సంక్షేమ కార్యాలయాల్లో రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరిగాయని, కొన్ని లోపాలు, కీలక సమాచారాలు సేకరించి నివేదిక ప్రభుత్వానికి పంపామని చెప్పారు. స్పెషల్ కౌంట్ చట్టం చివరి దశలో ఉందన్నారు. ఇదే అమలైతే ప్రభుత్వానికి ఎంతో ఆదాయం చేకూరనుందన్నారు. త్వరలో ఈ చట్టం అమలవుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర అభివృద్ధి బాబుతోనే..

- హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: సమర్థపాలనతో నవ్యాంధ్రను అభివృద్ధి పథంలో నడిపించగల సామర్థ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన స్వర్గీయ ఎన్టీఆర్ దంపతులకు కుమారుడిగా పుట్టడం తన అదృష్టమన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ నరసింహస్వామి తమ ఇష్టదైవమన్నారు. ప్రతి రోజూ ఆయన స్తోత్రమంత్రం జపిస్తానని చెప్తూ. . ఏకబిగిన పది నిమిషాల పాటు నరసింహ స్వామి మంత్రోచ్చారణ చేశారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్టు ఉన్నప్పటికీ చంద్రబాబు అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. పట్టిసీమ తరహాలోనే పోలవరం ప్రాజెక్టును కూడా ముఖ్యమంత్రి పూర్తిచేసి తీరుతారన్నారు. ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప మాట్లాడుతూ తెదేపా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి దిశగా ముందుకెళ్తోందన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణను చూసేందుకు తెదేపా కార్యకర్తలు, అభిమానులు వెల్లువలా తరలివచ్చారు. జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. తరువాత పెద్దఎత్తున ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు.



లక్ష్మీనరసింహ స్వామికి పూజలు చేస్తున్న బాలకృష్ణ, చినరాజప్ప

ఓటర్లకు డబ్బు పంచుతున్నారు..

- శిల్పా కుటుంబంపై సోమిరెడ్డి ఆరోపణ



నంద్యాల , న్యూస్‌టుడే: వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులు ఒకవైపు ఓటర్లకు డబ్బులు పంచుతూ వీడియోలకు చిక్కుతుంటే, మరోవైపు ఆ పార్టీ అధినేత జగన్ రోడ్ షోల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు డబ్బుతో ఓట్లు కొనుగోలు చేస్తున్నారని ప్రచారం విడ్డూరంగా ఉందని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం నంద్యాలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ తీరు.. దొంగతనానికి వచ్చిన దొంగ కనుక్కోగానే దొంగ.. దొంగ.. అని అరిచినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. శిల్పా కుటుంబ సభ్యులు ఓటర్లకు డబ్బులు పంచుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న వీడియోపై జగన్ తక్షణం స్పందించాలని డిమాండు చేశారు. వైకాపాకు సాక్షి పత్రికను కరపత్రంలా చేశారని అందులో ఏకపక్షంగా వస్తున్న కథకాలను దృష్టిలో ఉంచుకొని ఆ పత్రిక ప్రచురణ ఖర్చును వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఎన్నికల ఖర్చుగా పరిగణించాలని ఈసీకి విజ్ఞప్తి చేశారు. సాక్షి పత్రిక, టీవీ సిబ్బంది కెమెరాలతో నంద్యాలకు వచ్చి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వీరి ఆటలు సాగవన్నారు. అనంతరం మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు జగన్ కంటికి కనిపించవని, నిజం చెప్పకపోవడమే ఆయన నైజమన్నారు.

జగన్ మాటతీరు మార్చుకో: మధు

అనంతపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రిపై జగన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయన మాటతీరును మార్చుకుని ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు హితవు పలికారు. అనంతపురంలో 3 రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రకమిటీ సమావేశాల్లో చర్చించి, తీర్మానించిన అంశాలను శనివారం ఆయన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. పంటలకు గిట్టుబాటు ధర, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు ఈ నెల 15 నుంచి 30 వరకూ దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, సీమలో కరవును నివారించేందుకు ప్రత్యేక నిధులను కేంద్రం విడుదల చేయాలని కోరారు.

హేమంత్‌కు గొల్లపూడి శ్రీనివాస్ అవార్డు



చెన్నై నగరంలోని మ్యూజిక్ అకాడమీలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో గొల్లపూడి శ్రీనివాస్ జాతీయ అవార్డు- 2016ను ఉత్తమ పరిచయ దర్శకుడిగా హేమంత్ ఎం.రావు రాష్ట్ర ఇన్‌ఛార్జి గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. 'గోధి బణ్ణ సాధారణ మైకట్టు' (కన్నడ) చిత్రానికి ఆయనకు ఈ అవార్డు వచ్చింది.

– న్యూస్‌టుడే, చెన్నై

ఈనాడు సినిమా

మరోసారి రాశి గానం


రాశీ ఖన్నా

రాశీ ఖన్నాలో ఎంత మంచి నటి ఉందో... అంత మంచి గాయని కూడా ఉంది. నటి కాక ముందు గాయని కావాలనే ఆమె కలలు కనే వారట. కానీ అనుకోకుండా కథానాయిక అయ్యారు. అయితే గానంలో ప్రతిభని గుర్తించిన పలువురు దర్శకులు, సంగీత దర్శకులు పాడే అవకాశాల్నిస్తూ రాశీ ఖన్నా కలల్ని కూడా నెరవేరుస్తున్నారు. ఇదివరకు 'జోరు' చిత్రంలో ఓ పాట పాడిన ఆమె ఇటీవల మలయాళంలో 'విలన్' కోసం కూడా గొంతు సవరించుకొంది. తాజాగా మరోసారి ఆమె తన గాన కళని ప్రదర్శించింది. నారా రోహిత్‌తో కలిసి నటిస్తున్న 'బాలకృష్ణుడు' చిత్రం కోసం రాశీ ఖన్నా ఓ పాట పాడింది. ఆ పాటని శ్రోతలకి వినిపించాలని ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని చెప్పింది రాశి. 'బాలకృష్ణుడు' సినిమాకి మణిశర్మ స్వరాలు సమకూరుస్తున్నారు.

రీల్ సంజయ్... రియల్ సంజయ్



సంజయ్ దత్ జీవితంలో విజయాలు, వివాదాలు... రెండూ ఉన్నాయి. కథానాయకుడిగా ఆయన జీవితం ఎంత ఆసక్తికరమో, తెర వెనుక జీవితమూ అంతే. అందుకే ఆయన జీవితాన్ని వెండితెరకు తీసుకొస్తున్నారు రాజ్‌కుమార్ హిరాణి. వెండితెర సంజయ్‌దత్‌గా రణ్‌బీర్‌కపూర్ నటిస్తున్నాడు. సంజయ్ తన జీవితంలో వివిధ దశల్లో ఎలా ఉండేవారో, దానికి తగ్గట్టు తనను తాను మార్చుకున్నాడు రణ్‌బీర్. ఆయన జీవితం గురించి చాలా విషయాలు తెలుసుకున్నాడు. అందులో కొన్ని రణ్‌బీర్‌కు సంజయ్‌దత్ స్వయంగా చెప్పారట. ఇప్పుడు రణ్‌బీర్‌తో సంజయ్ మాట్లాడుతున్న తీరు చూస్తుంటే అసలు విషయం ఏదో గోప్యంగా చెప్పి... 'నాలా నువ్వు నటిస్తున్నావు. జాగ్రత్తమరి' అంటూ చెబుతున్నట్టున్నారు సంజయ్. ఆయన చాన్నాళ్ల విరామం తర్వాత నటిస్తున్న 'భూమి' ట్రైలర్ వేడుకలో క్లిక్‌మన్న దృశ్యమిది!


కుదురుగా ఉండలేను



నా కాళ్ల కింద చక్రాలున్నాయంటోంది శ్రుతిహాసన్. అందుకే ఒక భాషకో.. ఒక చోటుకో పరిమితం కాకుండా అంతా తిరిగేస్తున్నానంటోంది. దక్షిణాదిలో అగ్ర కథానాయికగా కొనసాగుతున్న ఆమె హిందీలోనూ సత్తా చాటింది. దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకొన్న శ్రుతి చిన్నప్పట్నుంచి ఉన్న కొన్ని అలవాట్లు, పెద్దయ్యాక వృత్తిపై కూడా ప్రభావం చూపుతాయని అస్సలు ఊహించలేదంటోంది. "ఒక చోట కుదురుగా ఉండలేని మనస్తత్వం నాది. చిన్నప్పుడు ఆ విషయంలో ఇంట్లో వాళ్లతో ఎన్ని తిట్లు తినేదాన్నో. ఆ మనస్తత్వం పెద్దయ్యాక కూడా వదల్లేదు. కానీ అది మేలే చేసింది. పలు భాషల్లో నటించేందుకు కారణమై, ఇంతమంది ప్రేక్షకులకు నన్ను చేరువ చేసింది. అయితే దీనివల్ల కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. నేను ఏ పరిశ్రమలోకి వెళ్లినా 'నువ్వు ఇక్కడ ఉండడం లేదెందుకు?' అంటుంటారు. అయినా ఫర్వా లేదు. మంచి కథలు ఎక్కడి నుంచి వస్తే అక్కడ నటిస్తుంటా" అని చెప్పింది శ్రుతిహాసన్.

కష్టం వస్తదో, కార్పొరేట్ సిస్టమ్ వస్తదో రమ్మను!
చిత్రం: ఖైదీ నంబర్ 150
- పంపినవారు: రాయలు పతంజలి, మల్కాపురం
పంచ్ డైలాగ్

ఖమ్మంలో పాటల వేడుక


బాలకృష్ణ

బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'పైసా వసూల్'. శ్రియ, ముస్కాన్, కైరాదత్ కథానాయికలు. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. వి.ఆనంద్‌ప్రసాద్ నిర్మాత. సెప్టెంబరు 1న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ నెల 17న ఖమ్మంలో పాటల విడుదల వేడుకని నిర్వహించబోతున్నారు. అదే రోజునే ట్రైలర్‌ని కూడా విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం తెలిపింది. నిర్మాత మాట్లాడుతూ "ముందుగా ప్రకటించిన విడుదల తేదీ కంటే, నెల రోజులు ముందుగానే మా 'పైసా వసూల్' విడుదలవుతోంది. బాలకృష్ణతో ఆ సినిమా చేసినందుకు గర్వంగా ఉంది. ఆయన వేగం, పూరి జగన్నాథ్‌లోని స్పష్టత వల్లే ఇంత ముందుగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవల విడుదలైన స్టంపర్‌కి మంచి స్పందన లభిస్తోంది. ప్రేక్షకుల్లో మరిన్ని అంచనాలు పెరిగాయి. అందుకు దీటుగానే చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. బాలకృష్ణ నటన, పూరి జగన్నాథ్ సినిమాని తీర్చిదిద్దిన విధానం సినిమాకి ప్రధాన ఆకర్షణ. అనూప్ రూబెన్స్ స్వరపరిచిన గీతాలు అందరినీ అలరించనున్నాయి" అన్నారు. కబీర్ బేడీతో పాటు అలీ, పృథ్వీ, పవిత్రా లోకేష్, విక్రమ్‌జిత్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

రన్.. లైఫంటే రేసురా రన్
నీ కలల ఛేజురా రన్
గెలిచేంతవరకు రన్ రన్
రన్.. నిలబడకు ఎక్కడా రన్
తడబడకు ఎక్కడా రన్
సాధించేవరకు రన్ రన్

గీతం: రన్.. లైఫంటే రేసురా రన్
చిత్రం: బ్రూస్‌లీ, రచన: శ్రీమణి
- పంపినవారు: ఆర్.క్రిష్ణ, హిందూపురం
గీతోపదేశం

కొత్తగా భయపెట్టే ప్రయత్నం


మహి వి.రాఘవ్

"ఇప్పటిదాకా వచ్చిన హారర్ సినిమాల్లో మనుషులు దెయ్యాల్ని చూసి భయపడ్డారు. కానీ దెయ్యాలే మనుషులను భయపడితే ఎలా ఉంటుందనే ఓ కొత్త ఆలోచనతో మా చిత్రాన్ని తెరకెక్కించాం" అంటున్నారు మహి వి.రాఘవ్. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఆనందో బ్రహ్మ'. తాప్సి ప్రధాన పాత్రధారి. విజయ్ చిల్లా, శశిదేవిరెడ్డి నిర్మాతలు. ఈ నెల 18న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మహి శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు.

● "నేను తీసిన 'పాఠశాల' రచయితగా, దర్శకుడిగా నిరాశని కలిగించింది. అందుకే, అంతా మెచ్చే ఓ విభిన్నమైన కథని తెరకెక్కించాలనుకొన్నా. ఆ ఆలోచనలకి రూపమే 'ఆనందో బ్రహ్మ'. నవ్విస్తూనే భయపెట్టే చిత్రమిది. అయితే ఇందులో భయపడేది ఓ దెయ్యం. ఈ సినిమాలోని సరికొత్త అంశం ఇదే. సహజమైన లోపాలతో సతమతమవుతున్న నలుగురు కుర్రాళ్లని భయపెట్టాలని దెయ్యం ప్రయత్నం చేస్తుంది. కానీ వాళ్లు చేసే పనులకి దెయ్యానికే భయం పుడుతుంది. హృద్రోగంతో బాధపడే వ్యక్తిగా శ్రీనివాసరెడ్డి, రేచీకటి ఉన్న వ్యక్తిగా వెన్నెల కిషోర్, తాగుడుకి బానిసైన వ్యక్తిగా తాగుబోతు రమేష్, మతిస్థిమితం లేని వ్యక్తిగా షకలక శంకర్ తెరపై కనిపిస్తూ చేసే సందడి నవ్విస్తుంది".

● "తాప్సి భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. 'ఆనందో బ్రహ్మ'ని హిందీలోనూ తీసే ఆలోచన ఉంది. ఇదివరకు 'విలేజ్‌లో వినాయకుడు', 'కుదిరితే కప్పు కాఫీ' చిత్రాల నిర్మాణంలో భాగస్వామిగా వ్యవహరించా. నిర్మాణపనులు నిర్వహించడం కష్టం. అందుకే దానికి దూరమై కేవలం రచయిత, దర్శకుడిగానే పనిచేశా".

నేను కూడా హిట్ తీయగలను అని తెలిసింది


రానా, తేజ

"చాలా ఏళ్లుగా ఫ్లాప్ సినిమాలే తీస్తున్న నాకు... నేను కూడా హిట్ సినిమాలు తీయగలనని తెలిసింది. ఇక మీదట విజయవంతమైన సినిమాలే తీస్తా" అన్నారు తేజ. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'నేనే రాజు - నేనే మంత్రి'. రానా, కాజల్ జంటగా నటించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా శనివారం చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. తేజ మాట్లాడుతూ "ఈ కథ ముందుగా రానాకి వినిపించా. 'ఎప్పుడు చేద్దాం' అని అడిగాడు. సురేష్‌బాబు గారికి చెబితే 'ఇందులో కొన్ని లోపాలున్నాయ్' అన్నారు. నాకు కోపం వచ్చింది. 'మనం నిర్మాతని మార్చేద్దాం. మరొకరితో ఈ సినిమా చేద్దామ'న్నా. కానీ.. ఆ తరవాత సురేష్‌బాబు చెప్పింది నిజమే అనిపించింది. మధ్యలో పరుచూరి బ్రదర్స్ వచ్చారు. 'వాళ్లు చెప్పినట్టు నేను చేయను. నాకు నచ్చినట్టే చేస్తా' అన్నా. అయితే కొన్నిసార్లు నేను వాళ్ల దారిలో వెళ్లా. కొన్ని సందర్భాల్లో వాళ్లు నా దారికి వచ్చారు. పాజిటివ్, నెగిటివ్ రెండు తరహా పాత్రలూ చేయగలడు రానా. ఇలాంటి కథానాయకులు ఉన్నప్పుడే తెలుగులో కొత్త కథలొస్తాయి" అన్నారు. రానా చెబుతూ "ఈ సినిమాని రానా వన్ మ్యాన్ షో అని అందరూ అంటున్నారు. అది కేవలం మాట వరసకే. అందరూ కలసి పనిచేస్తేనే అది సినిమా అవుతుంది. కొత్త తరహా సినిమాలు చేసుకొంటూ వెళ్తా. అలాంటి సినిమాల్ని ఒక్క తెలుగువారే ఆదరిస్తారు. ఆ విషయం ఈ సినిమాతో మరోసారి రుజువైంద"న్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "తేజ కథ, మాటలు, స్క్రీన్‌ప్లే అన్నీ తానే రాసుకోగలడు. కానీ మాకూ ఇందులో చోటిచ్చాడు. భార్యని ప్రేమించే కథ ప్రేమకథే అవుతుందని ఈ సినిమా నిరూపించింద"న్నారు. "తేజది రాజీ పడని తత్వం. తనో వజ్రం. అయితే దానికి ఈమధ్య మెరుపు తగ్గింది. ఈ సినిమాతో మళ్లీ కళకళలాడుతోంద"న్నారు పరుచూరి గోపాలకృష్ణ. అన్ని రకాల భావోద్వేగాల్నీ బాగా పలికించారు రానా అని చెప్పారు సంగీత దర్శకుడు అనూప్. "సామెతలు బాగున్నాయని అంటున్నారంతా. అది తేజగారి సలహానే" అన్నారు మాటల రచయిత లక్ష్మీ భూపాల్.

కథ కోరినప్పుడు ఖర్చు పెట్టొచ్చు


రవీందర్‌రెడ్డి

"నటీనటులకంటే సాంకేతిక నిపుణుల్నే ఎక్కువగా నమ్ముతా. సాయిశ్రీనివాస్ వర్ధమాన కథానాయకుడే. కానీ కథ, సాంకేతిక నిపుణులపై నమ్మకంతోనే సినిమాకి ఖర్చు పెట్టాం. చిత్రానికి లభిస్తున్న స్పందన కొత్త ఉత్సాహాన్నిస్తోంది" అన్నారు మిర్యాల రవీందర్‌రెడ్డి. ఆయన నిర్మించిన చిత్రం 'జయ జానకి నాయక'. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడు. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి లభిస్తున్న స్పందన పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు మిర్యాల రవీందర్‌రెడ్డి. ఆయన చెప్పిన విషయాలివీ...

● "ఒక అగ్ర కథానాయకుడి సినిమా స్థాయిలో 'జయ జానకి నాయక'కి వసూళ్లు లభిస్తున్నాయి. బోయపాటి సినిమాలకి మాస్ ప్రేక్షకుల్లో బలం ఎక్కువగా ఉంటుంది. అది మరోమారు నిరూపితమైంది. సాయిశ్రీనివాస్, రకుల్‌ప్రీత్‌సింగ్ కెరీర్‌లోనే ఓ మంచి సినిమాగా నిలిచిపోతుంది. ఇందులో హంసలదీవి ఎపిసోడ్‌ను చూశాక, హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించారని మెచ్చుకొంటున్నారు. ఈ సినిమా మహిళా ప్రేక్షకులకీ నచ్చింది. సాంకేతిక నిపుణులు అత్యుత్తమ ప్రతిభని ప్రదర్శించారు".

● "కథను బట్టి అవసరం మేర ఖర్చుపెట్టేందుకు ఏమాత్రం వెనుకాడను. ప్రస్తుతానికి రెండు కథలు చర్చల్లో ఉన్నాయి. వి.వి.వినాయక్, శ్రీవాస్‌లతో తదుపరి చిత్రాల గురించి చర్చలు జరుపుతున్నాం. కథానాయకుడు గోపీచంద్‌తోనూ సినిమా తీసే ఆలోచన ఉంది. మళ్లీ బోయపాటి శ్రీనుతో ఓ పెద్ద సినిమా తీస్తా. ఏడాదికి ఒకటి చొప్పున కాన్సెప్ట్ చిత్రాల్ని నిర్మిస్తా".

అమితాబ్... బచ్చన్ ఎలా అయ్యారు!


ఇది విన్నారా!

అమితాబ్ శ్రీవాస్తవ తెలుసా..? అని ఎవర్నైనా అడిగితే తెల్ల మొహం వేస్తారు. కానీ అమితాబ్ బచ్చన్ ఎవరంటే మాత్రం తెలియనివాళ్లుండరు. నిజానికి అమితాబ్ బచ్చన్ అసలు పేరు అమితాబ్ శ్రీవాస్తవ. మరి ఆయన బచ్చన్ ఎలా అయ్యారనేదాని వెనుక ఓ ఆసక్తికర విషయముంది. అమితాబ్ తండ్రి ప్రసిద్ధ హిందీ రచయిత హరివంశరాయ్ బచ్చన్. ఆయన అసలు పేరు హరివంశరాయ్ శ్రీవాస్తవ. చిన్నప్పుడు ఆయన్ను ఇంట్లో ముద్దుగా బచ్చన్ (చిన్న పిల్లాడు అని అర్థం) అని పిలుచుకునేవారు. ఆయన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి వెళ్లినప్పుడు తన పేరుకు చివర బచ్చన్ అని కలుపుకున్నారు. కాలక్రమంలో హరివంశరాయ్ బచ్చన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఆయన వారసుడు అమితాబ్‌తో పాటు కుటుంబం మొత్తానికి బచ్చన్ అనేది ఇంటి పేరుగా మారిపోయింది.

వెండితెర ప్రణయానికి పాతికేళ్లు..!


షారుఖ్ ఖాన్, కాజోల్

అప్పుడెప్పుడో రాజ్ కపూర్ - నర్గీస్... ఆ తర్వాత అమితాబ్ బచ్చన్ - రేఖ... హిట్ పెయిర్‌కు ప్రతిరూపంలా నిల్చిన జోడీలివి. మరి షారుఖ్ ఖాన్ - కాజోల్..? వీరిది హిట్ పెయిర్ కాదు... సూపర్‌హిట్ పెయిర్! వారు కలసి తెరపై మెరిశారంటే... ప్రేక్షకుల గుండెల్లో కుచ్‌కుచ్ హోతా హై! దిల్‌వాలేగా.... దుల్హనియాగా... రొమాన్స్ పండించారంటే... మన మనసులను వారితోపాటే ఎక్కడికో లేజాయేంగే!! చిత్రసీమలో హిట్‌పెయిర్‌లు ఎన్ని ఉన్నా షారుఖ్-కాజోల్ జోడీకున్న ఆకర్షణే వేరు. ఆ జంటపై ప్రేక్షకుల్లో ఉన్నంత మోజు, వారి సినిమాలపై ఉన్నంత క్రేజు... ఇంకే జంటకూ లేదంటే అతిశయోక్తి కాదు. 24 ఫ్రేముల సాక్షిగా కలసికట్టుగా కనికట్టుచేసిన షారుఖ్, కాజోల్... ఈ ఏడాదితో వెండితెరపై విడివిడిగా పాతిక వసంతాలు పూర్తి చేసుకున్నారు. త్వరలో జోడీగా 25వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో షారుఖ్, కాజోల్ జోడీ వెనుక ఉన్న ఆసక్తికరమైన విశేషాలు మీకోసం.

అది 1989. టీవీ సీరియల్ 'ఫౌజీ' సూపర్‌హిట్. ప్రధాన పాత్రలో నటించిన కుర్రాడి నటన సూపర్‌డూపర్ హిట్. అతని పేరు షారుఖ్ ఖాన్. జస్ట్ షారుఖ్ ఖాన్. అతని వెనుక గొప్ప నేపథ్యమున్న కుటుంబమూ లేదు... అప్పటికి బాలీవుడ్ బాద్షా, కింగ్ ఖాన్ లాంటి బిరుదులూ లేవు. అదే తొలి సీరియల్ అయినా అదరగొట్టేశాడని, ట్రాజెడీ కింగ్ దిలీప్ కుమార్‌ను తలపిస్తున్నాడని ప్రశంసలొచ్చాయి. ఆ తర్వాత బాలీవుడ్ తలుపు తట్టడమే ఆలస్యం నాలుగు సినిమా అవకాశాలొచ్చేశాయి. అలా 1992లో 'దీవానా'తో తొలిసారి వెండితెరపై మెరిశాడు. ఆ సినిమా విజయం సాధించింది. అందులో రెండో కథానాయకుడిగా నటించిన షారుఖ్ ఉత్తమ తొలి చిత్ర నటుడిగా ఫిలింఫేర్ పురస్కారం అందుకుని సత్తా చాటాడు. అదే ఏడాది ఆయన నటించిన నాలుగు చిత్రాలు విడుదలయ్యాయి.

సరిగ్గా అదే ఏడాది: షారుఖ్ పరిచయమైన 1992లోనే కాజోల్ అనే కలువ కనుల కొత్త నాయిక వెండితెరపై వెలిగింది. అయితే షారుఖ్‌కు భిన్నంగా ఆమెది సినీ నేపథ్యమున్న కుటుంబం. తల్లి తనూజ బాలీవుడ్‌లో పేరున్న కథానాయిక. తండ్రి షోము ముఖర్జీ దర్శక నిర్మాత. తల్లి తరపు బంధుగణం కూడా బాలీవుడ్‌లోనే ఉంది. ఎలాంటి ప్రయత్నం చేయకుండానే 17 ఏళ్ల వయసులో 'బేఖుడి'లో కథానాయికగా అవకాశం వచ్చింది. అయితే ఆ చిత్రం ఫ్లాప్ అయింది. కానీ నేరేడులా నిగనిగలాడే కాజోల్ అందం, అభినయం ప్రేక్షకులకు నచ్చేశాయి. వెంటనే మరో చిత్రంలో అవకాశమొచ్చింది. అదింకేదో కాదు.. బాలీవుడ్ చరిత్రలోనే సూపర్‌హిట్ పెయిర్‌గా నిలిచిన షారుఖ్-కాజోల్ జోడీకి శ్రీకారం చుట్టిన 'బాజీఘర్'.

ఇద్దరూ కలిశారు... ఇరగదీశారు: ఒకే ఏడాది వేరు వేరు సినిమాలతో తెరకు పరిచయమైన ఆ అమ్మాయి... ఈ అబ్బాయి... తర్వాతి ఏడాదే కలసి జంటగా మెరిశారు. వెండితెరను సమ్మోహన సంద్రంలో ముంచెత్తారు. షారుఖ్-కాజోల్ జోడీతో వచ్చిన తొలి చిత్రంగా చరిత్రలో నిలిచిన 'బాజీఘర్' వెనుకా ఓ చరిత్ర ఉంది. ఈ చిత్రంలో కథానాయకుడి పాత్రను సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ లాంటి వారు తిరస్కరించారు. కారణం అది ప్రతినాయక ఛాయలతో ఉండటమే. కానీ షారుఖ్ దాన్నే ధైర్యంగా స్వీకరించి మెప్పించాడు. దాంతోనే ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ పురస్కారాన్నీ సాధించాడు. ప్రేక్షకులు షారుఖ్ నటన గురించే కాదు... మరో విషయం గురించి కూడా ఆసక్తిగా చర్చించుకున్నారు. అది షారుఖ్, కాజోల్ మధ్య కెమిస్ట్రీ. షారుఖ్‌లోని చమక్కు, కాజోల్‌లోని తళుక్కు కలిపి తెరపై మ్యాజిక్కు చేశారు.

డీడీఎల్‌జే... గుండెల్లో డీజే: 1995లో వచ్చిన 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే(డీడీఎల్‌జే)'తో షారుఖ్, కాజోల్ జోడీ కుర్రకారుకు హాట్ ఫేవరెట్‌గా మారిపోయింది. తెరపై రాజ్, సిమ్రన్ పాత్రల్లో వారు ప్రేమలో పడితే, వారి జోడీతో ప్రేక్షకులు ప్రేమలో పడ్డారు. షారుఖ్, కాజోల్ రొమాన్స్‌కు బాక్సాఫీసు కూడా ఫిదా అయిపోయింది. రికార్డు స్థాయిలో కనక వర్షం కురిపించింది. అంతేనా షారుఖ్, కాజోల్ ఇద్దరినీ ఫిలింఫేర్ పురస్కారాలు వరించాయి.

హిస్టరీ రిపీట్స్: 'డీడీఎల్‌జే'తో తమ గుండెల్లో డీజే మోగించిన ఆ జోడీని మరోసారి చూడాలని ప్రేక్షకులు తపించిపోయారు. మూడేళ్ల విరామం తర్వాత వారి కోరిక తీరుస్తూ ఈసారి 'కుచ్‌కుచ్ హోతా హై' అంటూ వచ్చారు. రాహుల్, అంజలి పాత్రలతో మనసులను మాయ చేసేశారు. వారి జోడీయే కాదు... బాక్సాఫీసు హిస్టరీ కూడా రిపీట్ అయింది. పురస్కారాలూ రిపీటయ్యాయి. దీంతో ఆ జోడీపై అభిమానం రెట్టింపైంది.

బాధలేదు... సంతోషమే: మరో మూడేళ్ల తర్వాత 'కభీ ఖుషీ కభీ ఘమ్' కోసం జోడీ కట్టారు షారుఖ్, కాజోల్. ఈ సినిమా పేరుకు అర్థం కొన్నిసార్లు సంతోషం, కొన్ని సార్లు బాధ అని. అయితే షారుఖ్, కాజోల్ జోడీని చూస్తే ప్రేక్షకులకు ఎప్పుడూ సంతోషమే. ఆ జోడీ ఉంటే నిర్మాతలకు ఎప్పుడూ కనకవర్షమే. ఈ చిత్రం కూడా సూపర్‌హిట్టైంది. ఆ తర్వాత వచ్చిన 'మై నేమ్ ఈజ్ ఖాన్', 'దిల్‌వాలే' చిత్రాల్లోనూ షారుఖ్, కాజోల్ జంట అదేస్థాయిలో అలరించి ఎవర్‌గ్రీన్ జోడీగా నిలిచింది.

పాతికేళ్ల పదనిసలు: ● పాతికేళ్లలో 8 చిత్రాల్లో నాయకానాయికలుగా నటించారు షారుఖ్, కాజోల్. ● షారుఖ్, కాజోల్ నటించిన డీడీఎల్‌జే మరాఠా మహల్ థియేటర్లో 20 ఏళ్లకు పైగా ప్రదర్శితమైంది. ● తమ కలయికలో వచ్చిన చిత్రాల్లో... షారుఖ్‌కు బాజీఘర్, కాజోల్‌కు కుచ్‌కుచ్ హోతాహై ఫేవరెట్ చిత్రాలట.

కోతి చేష్టలు



ఆకుల్లేక మొండిగా మారిన తాటిచెట్లివి. కృష్ణా జిల్లాలో విజయవాడ శివారు పెదపులిపాక నుంచి తోట్లవల్లూరు దాకా ఇదే పరిస్థితి. పొలాల్లోకి వచ్చే కోతుల దగ్గరకెళ్లే సరికి తాటిచెట్టెక్కి కూర్చుంటున్నాయి. రైతులు అక్కడి నుంచి వెళ్లగానే మళ్లీ వచ్చి పంట నాశనం చేస్తున్నాయి. ఈ సమస్య నివారించేందుకు రైతులు తాటిచెట్ల పైభాగాన్ని తొలగించారు.



ఈమె దోసపాటి చెన్నమ్మ. ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం వేములపాడు. గతేడాది శనగ పొలంలో కాపలాకు వెళ్లగా కోతులు దాడిచేశాయి. చేతులు, తలపై గాయాలయ్యాయి. రెండు నెలలపాటు కదల్లేకుండా చేశాయి. ఆసుపత్రిలోనే నెల గడపాల్సి వచ్చింది. నెలకు రూ.25 వేల పైనే ఖర్చయింది.



ఇంటిపై స్లాబ్ దెబ్బతింటే మరమ్మతు చేయించి నీటితో తడపడానికి అబ్బాయితో కలిసి పైకెళ్లాం. ఇంతలో కోతుల గుంపు మెట్లపై నుంచి డాబాపైకి వచ్చింది. కిందకొద్దామంటే మెట్ల వద్దే పొంచి ఉన్నాయి. తోలుతుంటే మీదకొచ్చాయి. చీర పట్టుకుని లాగడం ప్రారంభించాయి. ముగ్గురం వణికిపోయాం. వెనక్కి వెళ్తూ అంచుకు చేరాం. ఇంకో అడుగేస్తే కిందపడటమే. అరగంటకు పైగా వాటితో నరకం చూశాం. మా కేకలు గమనించి సమీపంలో టెన్నిస్ ఆడుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది వచ్చి వాటిని బెదరగొట్టి రక్షించారు. తలచుకుంటేనే భయమేస్తోంది.

–గుంటూరు జిల్లా గురజాలకు చెందిన పోలా మురళి, రజనీకుమారి ఆవేదన

ఈనాడు, అమరావతి

పల్లె, పట్టణమనే తేడా లేదు. ఇల్లు, పొలమనే భేదమూ లేదు. అంతా కోతులమయమే. పంటపొలాల్ని పీకేసి పాడు చేస్తున్నాయి. పండ్ల తోటల్ని నేలమట్టం చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను దర్జాగా దోచుకెళ్తుంటాయి. ఇంటి పెంకులను పీకేస్తాయి. బయట ఆరబెట్టిన వస్తువులను ఎత్తుకెళ్తాయి. అరటికాయలు పట్టుకెళ్లాలన్నా, కొబ్బరిచిప్పలు తీసుకెళ్లాలన్నా.. ఎటు నుంచి వానర గుంపు దాడిచేస్తుందనే భయం. ఆలయాలకు వెళ్లినా ప్రశాంతగా కూర్చోనివ్వవు. అదరవు, బెదరవు.. వాటి సంఖ్య ఎక్కువగా ఉంటే మనుషులపైనే దాడి చేస్తాయి.

- ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలంలో కోతుల కారణంగా వేరుశనగ సాగునే మానుకున్నారు. ఏటా ఇక్కడ సుమారు 500 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో సాగయ్యే పంట ఈ ఏడాది అసలే లేదు. వాన కురిస్తే మినుము వేసుకోవచ్చనే ఆలోచనలో రైతులు ఉన్నారు.
- కృష్ణా జిల్లా నూజివీడు ప్రాంతంలో కోతుల ధాటికి జడిసి వేరుశనగ సాగు నుంచి వైదొలగారు. మామిడి తోటలను కూడా వదిలేస్తున్న సందర్భాలు ఉన్నాయి. శనగతోపాటు పొట్టకొచ్చిన వరిని కూడా నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.
- అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మండలం చెట్టుపల్లి, గబ్బాడ, రెట్టవానిపాలెం గ్రామాల్లో వానర సంచారం ఎక్కువగా ఉంటోంది. ఒంటరిగా పొలానికి వెళ్లాలంటే జంకుతున్నారు. గుంపుగా ఉండటంతో దాడిచేస్తున్నాయి. నాతవరం మండలం ములగపూడిలోనూ కొబ్బరితోటలు పాడు చేస్తున్నాయి.
- విశాఖ జిల్లా కసిరెడ్డిపాడు, అప్పన్నదొరపాలెంలో 100 ఎకరాల్లో కాయగూరలు పండించేవారు. కోతుల బెడద తట్టుకోలేక సాగుమానేశారు.
- గుంటూరు జిల్లా మాచర్ల ప్రాంతంలో బత్తాయి, దానిమ్మ, మామిడి తోటలపై వానరాల దాడి అధికంగా ఉంది. పక్వానికి రాకున్నా కాయల్ని కోసి పడేస్తున్నాయి.

రూ.లక్షలతో ఇనుప చత్రాలు


కోతుల దాడుల నుంచి బయటపడేందుకు ఇనుపచత్రాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కిరాణా దుకాణదారులు వానరాలు చొరబడకుండా ఇనుప చత్రాలు అమర్చుకుంటున్నారు. డాబాలు, వరండాల్లోనూ రక్షణ ఏర్పాట్లు తప్పడం లేదు. ఇందుకు ఒక్కో ఇంటికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చుచేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు..

కోతుల్ని తోలబోతే తిరగబడతాయి. ఒంటరిగా ఉంటే మరింత తీవ్రం చేస్తాయి. వాటికి బెదిరిపోయి పలు సందర్భాల్లో మనుషులు ప్రమాదాల బారినపడుతున్నారు. కృష్ణా జిల్లా విస్సన్నపేటలో ఒక వ్యక్తి డాబాపైకి వెళ్లిన సమయంలో కోతుల రావడంతో తోలుతూ భయపడి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలై చనిపోయారు.



గుంటూరు జిల్లా పల్నాడులో కోతుల సమస్య అధికంగా ఉంది. నల్లమల ప్రాంతానికి సమీపంలో ఉండటంతో మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, నర్సరావుపేట, వినుకొండ ప్రాంతాల్లోని గ్రామాల్లోకి వస్తున్నాయి. పిల్లలను బడిలో వదిలిపెట్టి రావాలన్నా కుటుంబ సభ్యులు ఎవరో ఒకరు కర్రలు పట్టుకుని బయల్దేరాల్సిందే.



విశాఖ జిల్లా నర్సీపట్నం పొలాల సమీపంలో కోతుల గుంపు

పలు రాష్ట్రాల్లోనూ ఇదే సమస్య..

జమ్ము డివిజన్లో కోతుల వల్ల 15వేల హెక్టార్లలో పంటనష్టం జరుగుతోంది. ఏటా రూ.35 కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఉద్యాన పంటలనూ ఇవి వదలడం లేదు. మామిడి, జామ, ద్రాక్ష, బత్తాయి తోటల్లో ప్రవేశించి ఉత్పత్తులను ధ్వంసం చేస్తున్నాయి. దీనివల్ల ఏటా 9,500 టన్నుల పండ్ల ఉత్పత్తులు దెబ్బతింటున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ఏటా రూ.500కోట్ల మేర నష్టం వాటిల్లుతోంది. 1.56లక్షల హెక్టార్లలో పంటలను రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం కోతులకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేసినా ఫలితం కన్పించలేదు. టపాసులు పేల్చడం, తుపాకులతో పేలుళ్లు చేపట్టారు. పంటల మళ్లింపు పథకం అమలు చేశారు. కాపలా కోసం నేపాల్ తదితర ప్రాంతాల నుంచి పిలిపించారు. ఖర్చు భారీగా పెరిగినా నియంత్రణ అంతంత మాత్రమే. దీంతో సోలార్ కంచెపై దృష్టి పెట్టింది.

వేరుశనగ సాగు మానుకున్నా..

గతంలో 60 నుంచి 70 ఎకరాల్లో వేరుశనగ వేసేవాడిని. పగలు కోతులు, రాత్రివేళ అడవిపందుల బెడద ఎక్కువైంది. దీంతో సగం పొలం ఖాళీగా ఉంచాను. మిగిలిన దాంట్లో సజ్జ, జొన్న వేస్తున్నాను. మిరపలోకి రావు. అందుకే వేస్తే దానికీ ధర లేదు. నిమ్మ వేస్తే అందులోకి ప్రవేశించడం లేదు. అదైతే ముళ్లు గుచ్చుకుంటాయి.

– గంటా వెంకటేశ్వరరెడ్డి, హనుమంతునిపాడు, ప్రకాశం జిల్లా

కోతులకు శస్త్రచికిత్సలు చేయాలి

ప్రభుత్వం కోతుల్ని పట్టి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి. వాటిని అడవుల్లోకి తీసుకెళ్లి వదిలేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే రాబోయే రోజుల్లో ఏ పంట సాగు చేసే పరిస్థితి లేదు.

– దమ్మాలపాటి సాంబశివరావు, పాతకుంట్ల, విస్సన్నపేట మండలం

ప్రజల్లో అవగాహన కల్పించాలి

కోతుల సమస్య కొన్ని ప్రాంతాల్లో అధికంగానే ఉంది. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో పట్టి తెచ్చి మరోచోట వదిలేస్తున్నారు. దీనికోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయమై ఆలోచిస్తున్నాం. ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉంది. వాటి సంతతి పెరగకుండా శస్త్రచికిత్సలు చేయడంపై దృష్టి పెడుతున్నాం. కోతులంటే ప్రజల్లో సెంటిమెంట్ ఉంది. ఇది దెబ్బతినకుండా నియంత్రణ చర్యలు తీసుకుంటాం.

– కె.సుగుణాకరరెడ్డి, పీసీసీఎఫ్, వన్యప్రాణి సంరక్షణ విభాగం

కొండముచ్చులకు భలే గిరాకీ



పదుల సంఖ్యలో కోతులొచ్చినా ఒక్క కొండముచ్చు పారదోలుతుంది. అందుకే రైతులు వీటిని కొనుగోలు చేసి పొలాల్లో కాపలాగా ఉంచుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లోనూ విద్యార్థులపై కోతులు దాడి చేయకుండా ఉండేందుకు వీటిని వినియోగిస్తున్నారు. వందల సంఖ్యలో కోతులు వచ్చినప్పుడు ఒకటి రెండు కొండముచ్చులైతే ఏమీ చేయలేని పరిస్థితి ఉంటున్నా.. 70శాతం వరకు ప్రయోజనమే అనేది రైతుల అభిప్రాయం. అందుకే ధర ఎంతైనా వెనకాడటం లేదు. కృష్ణా జిల్లా విస్సన్నపేటలో కొండముచ్చుల పెంపకం పెద్దఎత్తున సాగుతోంది. 20 ఏళ్లకుపైగా వీరికి ఇదే ఆధారం. రాష్ట్రంలో ఎక్కడైనా కోతులు, కొండముచ్చులు పట్టాలంటే వీరినే పిలిపిస్తుంటారు. ఒక్కోదాన్ని పట్టినందుకు రూ.500 నుంచి పైన తీసుకుంటారు. 20 ఏళ్ల కిందట నూజివీడుకు చెందిన మామిడితోటలో పంటను నాశనం చేస్తున్న కోతుల వద్దకు కొండముచ్చు వచ్చింది. దీంతో అవి పారిపోయాయి. ఇది గమనించి కొండముచ్చు ప్రాధాన్యాన్ని గుర్తించారు. వీటిని పట్టుకోవడం ఒకరి వల్ల కాదు. అందుకే కొంతమంది కలిసి పట్టుకోవడం, పెంచడం, అమ్మడం చేస్తుంటారు. ప్రస్తుతం 40 కుటుంబాలు ఇదే పనిలో నిమగ్నమయ్యాయి. ఏడాదికి సుమారు 200పైగా కొండముచ్చుల్ని అమ్ముతున్నారు. కొండముచ్చును మచ్చిక చేసుకుంటేనే అది వెంట తిరుగుతుంది. అందుకే రైతులే ఇక్కడకొచ్చి రెండుమూడు రోజులుంటారు.

ఈ నెల 28న అమిత్ షా రాక

- మూడు రోజుల పర్యటన ఏర్పాట్లపై భాజపా నేతల సమీక్ష

ఈనాడు, అమరావతి: త్వరలో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా విజయవాడ రానున్న సందర్భాన్ని పురస్కరించుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై రాష్ట్ర భాజపా దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా విజయవాడలో శనివారం భాజపా అధ్యక్షుడు హరిబాబు, మంత్రులు కామినేని శ్రీనివాస్, మాణిక్యాలరావు, పార్టీ నేత కన్నా లక్ష్మీనారాయణ తదితరులు జిల్లా నేతలతో సమావేశమయ్యారు. అమిత్‌షా పర్యటన, రోడ్ మ్యాప్ తదితరాలపై చర్చించారు. ఈనెల 28వ తేదీ ఉదయం అమిత్ షా విజయవాడకు చేరుకుంటారని, 30వ తేదీ సాయంత్రంతిరుగు పయనమవుతారని మంత్రి కామినేని శ్రీనివాస్ సమావేశం అనంతరం తెలిపారు. పర్యటనలో భాగంగా ఆయన వాణిజ్య, పరిశ్రామిక వర్గాలు, విద్యా సంస్థల ముఖ్యులతో విడివిడిగా సమావేశమవుతారని, ఎస్సీ వర్గానికి చెందిన ఓ కుటుంబ సభ్యులతోభోజనం చేస్తారని వెల్లడించారు.

పాక్‌లో పేలుడు: 17 మంది మృతి

కరాచి: పాక్‌లోని బలూచిస్థాన్ రాజధాని క్వెట్టా నగరంలో శనివారం జరిగిన భారీ పేలుడులో 17 మంది మరణించగా, 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. భద్రత అధికంగా ఉండే పిషిన్ బస్ స్టాపు ప్రాంతంలో ఈ పేలుడు సంభవించడం గమనార్హం. ఫ్రాంటియర్ కార్ప్స్ దళానికి చెందిన సైనికులు వెళ్తున్న ట్రక్కుపై ఈ బాంబును ప్రయోగించాలని ఉగ్రవాదులు భావించారని బలూచిస్థాన్ హోం మంత్రి మిర్‌సర్ఫ్‌రాజ్ బుగ్తి తెలిపారు. దీనిని అక్కడ నిలిపి ఉన్న బస్సులో పెట్టారని, అది పేలడంతో సామాన్యులు ప్రాణాలు కోల్పోయారని వివరించారు.



ముత్యాల పట్టుచీరను ప్రదర్శిస్తున్న అన్వర్

ముత్యాల పట్టుచీర

ధర్మవరం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు, డిజైనర్ అన్వర్ ముత్యాల పట్టుచీరను రూపొందించారు. కొత్తపేటకు చెందిన ఆయన మగ్గంపై నేసి, డిజైన్ చేసిన ముత్యాల పట్టుచీరను శనివారం ప్రదర్శించారు. పైట కొంగును ముత్యాలతో, మధ్య భాగాన్ని అద్దాలతో తీర్చిదిద్దినట్టు, తయారీలో 800 ముత్యాలను ఉపయోగించినట్లు ఈ సందర్భంగా అన్వర్ పేర్కొన్నారు. చీర తయారీకి నలుగురు కార్మికులు, 14 రోజులపాటు శ్రమించినట్టు చెప్పారు.



అతి సూక్ష్మం.. అందాల సుందరం

తాజ్‌మహల్ చిత్రాన్ని ఏకంగా గుండుసూది తలపై చిత్రీకరించి అద్భుతమే చేశాడు విశాఖ జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాకకు చెందిన హస్తకళాకారుడు, జాతీయ అవార్డు గ్రహీత, శ్రీశైలపు చిన్నయాచారి. ఈ సూక్ష్మ కళాఖండం బ్రహ్మజెముడు ముళ్లతో తయారు చేయడం విశేషం. ఐదురోజులపాటు శ్రమించి 1.5 మిల్లీమీటర్ల సైజులోనే అత్యంత సుందరంగా తాజ్‌మహల్‌ను బొమ్మను తీర్చిదిద్దారు. – న్యూస్‌టుడే, ఎలమంచిలి

ఆదర్శ పాఠశాలలకు నిబంధనలు

ఈనాడు, అమరావతి: ఆదర్శ పాఠశాలల పర్యవేక్షణ, తనిఖీలు, సెలవులు మంజూరుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక నిబంధనలను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఏర్పాటు చేసిన ఈ బడులకు పర్యవేక్షించేందుకు ఇప్పటివరకు సరైన వ్యవస్థ లేదు. డిప్యూటీ డీఈఓలకు తనిఖీ బాధ్యతలు అప్పగించినా నామమాత్రంగా మారాయి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ నిబంధనలను రూపొందించి ఆయా పాఠశాలలకు పంపించింది. ఉపాధ్యాయులకు 4 నెలల వరకు సెలవులు ఇచ్చే అధికారం ప్రిన్సిపాళ్లకు, ప్రిన్సిపాళ్లకు 4 నెలల వరకు, ఉపాధ్యాయులకు 6 నెలల వరకు సెలవులు ఇచ్చే అధికారం డిప్యూటీ డీఈఓలకు, ఇంతకంటే ఎక్కువ రోజులు సెలవులు మంజూరు చేసే అధికారం డీఈఓ, ఆర్జేడీలకు అప్పగించారు. పాఠశాలలను ఎంఈఓ, డిప్యూటీ డీఈఓలు తనిఖీలు చేసి, ఆ వివరాలను డీఈఓకు పంపించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఏదైనా తప్పు చేస్తే వివరణ కోరుతూ తాఖీదులు జారీ చేసే అధికారం ప్రిన్సిపాళ్లకు ఇచ్చారు. వివరణ, నోటీసులతో కూడిన పూర్తి నివేదికను డిప్యూటీ డీఈఓలకు పంపించాల్సి ఉంటుంది. ప్రిన్సిపాళ్లు ఏదైనా తప్పు చేస్తే వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చే అధికారం డీఈఓకు కల్పించారు. ప్రతినెలా జీతాల బిల్లును రూపొందించి 20 నుంచి 25 తేదీలోపు ప్రిన్సిపాళ్లు.. డీఈఓ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.

ఉగ్రదాడులూ పొరుగు సేవలకు!

- పాక్‌లో అమలు చేస్తున్న ఐఎస్

దిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాల నిర్వహణను కూడా 'పొరుగు సేవల'కు అప్పగిస్తున్నారు. పాకిస్థాన్‌కు సంబంధించినంత వరకు ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థ ఇదే పని చేసింది. ఆ దేశంలో ఉగ్రవాద దాడులు చేసే బాధ్యతలను లష్కర్ ఇ ఝంగ్వి, జమాత్ ఉల్ అహ్రార్ (తెహ్రిక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ చీలిక వర్గం)లకు అప్పగించినట్టు ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. అఫ్గానిస్థాన్‌లో 'అనుకూల భాగస్వాముల' జాబితాను రూపొందించింది. ఐరాస భద్రతా మండలి పరిధిలోని అల్‌ఖైదా ఆంక్షల కమిటీకి 'విశ్లేషణాత్మక సహాయం.. ఆంక్షల పర్యవేక్షణ బృందం' సమర్పించిన 20వ నివేదికలో ఈ విషయాన్ని పేర్కొంది. ఇస్లామిక్ స్టేట్‌నే ఇప్పుడు ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ ద లెవాంట్ (ఐఎస్ఐఎల్) అని కూడా పిలుస్తున్నారు. ఈ నివేదిక ప్రకారం..దక్షిణాసియాలోని ఉగ్రవాద ముఠాలపై ఆధిపత్యం కోసం అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్‌లు పోటీ పడుతున్నాయి. అల్‌ఖైదా అధినేత అయిమన్ అల్ జవహరి అఫ్గన్-పాక్ సరిహద్దులోనే ఉన్నట్టు భావిస్తున్నారు. దాంతో భద్రత కోసం అల్‌ఖైదా ప్రముఖ నేతలు, ప్రాంతీయ నేతలు ఆఫ్గాన్ తాలిబన్లకు సహకరిస్తున్నారు. అల్‌ఖైదా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ స్థానికంగా ప్రభావం చూపుతున్నారు. భారత ఉపఖండంలో అల్‌ఖైదా (ఎక్యూఐఎస్) పేరిట ఉన్న బృందంలో 200 మంది 'యోధులు' ఉన్నారు. వీరు దక్షిణ అఫ్గానిస్థాన్‌లో దాడుల నిర్వహణపై సలహాలు, శిక్షణ ఇస్తుంటారు. ఇక్కడి ఇస్లామిక్ స్టేట్ శాఖకు అగ్రనాయకత్వమే నిధులు సమకూర్చుతోంది.

అమరావతి వెలుగులకు కడప 'పవర్ బ్యాంకు'

- రాజధానికి పటిష్ఠ విద్యుత్తు పంపిణీ వ్యవస్థ
- రూ. 1400 కోట్లతో నిర్మాణ పనులు
- ప్రత్యేక ప్రత్యామ్నాయ పంపిణీ లైన్ల నిర్మాణం
- అనంత సౌరవిద్యుత్తూ ఇక్కడికే...

కడప, ఈనాడు: రాజధాని అమరావతిలో పటిష్ఠ విద్యుత్తు పంపిణీ వ్యవస్థ ఏర్పాటుకు ముమ్మరంగా పనులు సాగుతున్నాయి. అమరావతి వెలుగులకు కడప 'పవర్ బ్యాంకు'గా మారుతోంది. ఇప్పటివరకు కడప జిల్లాలో 400 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్లు మాత్రమే ఉన్నాయి. రామగుండం, నాగార్జునసాగర్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్తు కడప పంపిణీ లైన్ల ద్వారా కోలార్, చిత్తూరు, గుత్తి, రాయచూర్ తదితర ప్రాంతాలకు సరఫరా అవుతోంది.

వేంపల్లి వద్ద కట్‌పాయింట్..

కడపలో 765 కేవీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీన్ని తిరువేలం - షోలాపూర్ లైనుకు అనుసంధానించనున్నారు. నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



కడప సమీపంలోని పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిట్ స్టేషన్

తమిళనాడులోని కూడంకుళంలో ఉత్పత్తయ్యే అణువిద్యుత్తుతో పాటు.. ఇతరత్రా మార్గాల్లో వచ్చే విద్యుత్తు షోలాపూర్ లైను ద్వారా తిరువేలి, ఆంధ్రప్రదేశ్‌లోని వేంపల్లె, కర్నూలు మీదుగా కర్ణాటకలోని రాయచూర్, మహారాష్ట్రలోని షోలాపూర్ వరకు వెళుతోంది. షోలాపూర్ నుంచి ఉత్పత్తయ్యే థర్మల్ విద్యుత్తు అదేలైనుకు అనుసంధానమై ఉంది. ప్రస్తుతం కడప జిల్లాలోని వేంపల్లె వద్ద కట్‌పాయింట్ పెట్టారు. అక్కడ నుంచి చిలకలూరిపేట 765 కేవీ కేంద్రానికి.. ఆపై అమరావతికి అనుసంధానమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



కొత్తగా ఏర్పాటవుతున్న 765 కేవీ జీఐఎస్ పవర్‌హౌస్

వేగంగా పలు వ్యవస్థలు..

- అనంతపురం జిల్లాలోని నంబులపూలకుంట వద్ద ఉత్పత్తి అవుతున్న సౌరవిద్యుత్తు కడపకే వచ్చేలా 400 కేవీ విద్యుత్తు లైను నిర్మాణం జరుగుతోంది.
- నంబులపూలకుంట - కడప మధ్య 68 కిలోమీటర్ల మేర 400 కేవీ లైను నిర్మిస్తుండగా..ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మరోవైపు 765 కేవీ లైనుకు సంబంధించి టవర్ల నిర్మాణం జరుగుతోంది. కడప ట్రాన్స్‌మిట్ స్టేషన్ వద్ద కొత్త పవర్‌హౌస్‌ల నిర్మాణాన్ని టాటా సంస్థ చేపట్టింది. జీఐఎస్ (గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్స్) యార్డులను తీర్చిదిద్దుతున్నారు.
- రూ.1400 కోట్ల వ్యయంతో ఏర్పాటవుతున్న ఈ నూతన వ్యవస్థతో అమరావతికి విద్యుత్తు సరఫరా కీలకంగా మారుతోంది.

మరో రెండు మార్గాలు

అమరావతికి కడప నుంచే కాకుండా మరో రెండు మార్గాల్లోనూ సరఫరా ఉండేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒడిశాలోని అనుగోల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పలాస, తూ.గో.లోని వేమగిరి, చిలకలూరిపేటను కలుపుతూ పంపిణీ లైను నిర్మిస్తున్నారు. ఇది 2018 జులై నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. వేమగిరి-చిలకలూరిపేట మధ్య పనులు జరుగుతున్నాయి. మహారాష్ట్రలోని వార్ధా నుంచి వరూరు మీదుగా వరంగల్ లైను ద్వారా చిలకలూరిపేటకు అనుసంధానిస్తున్నారు. ఇది రెండేళ్లలో పూర్తికానుంది. మొత్తంగా అమరావతికి సుమారు రూ.3 వేల కోట్ల వ్యయంతో పటిష్ఠ విద్యుత్తు పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అమరావతిలో రూ.5 వేల కోట్లతో భూగర్భ విద్యుత్తు వ్యవస్థ (అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్) ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం.

పరిపాలన ట్రైబ్యునల్ తీర్పులను అమలు చేయాలి

- ఏపీ సీఎస్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పరిపాలన ట్రైబ్యునల్ (ఏపీఏటీ) పలు సందర్భాల్లో ఇచ్చిన తీర్పులను సంబంధిత ప్రభుత్వ శాఖలు అమలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రైబ్యునల్ ఆదేశాలపై శాఖల సమీక్ష నిర్వహించి వాటి అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఆ ఉత్తర్వులను నిర్దిష్ట గడువులోపు అమలు చేస్తామని హామీనిస్తూ న్యాయస్థానంలో ప్రమాణపత్రం దాఖలు చేయాలని ప్రధాన కార్యదర్శికి సూచించింది. ఏపీఏటీ ఇచ్చే ఉత్తర్వులను అమలు చేయకపోవడం న్యాయపాలనను అపహాస్యం చేసినట్లేనని ఘాటుగా వ్యాఖ్యానించింది. వ్యాజ్యంపై విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించే విషయమై మూడు వారాల్లో ఉత్తర్వుల జారీకి అధికారులను ఆదేశిస్తూ ఫిబ్రవరి 2014లో ఇచ్చిన ఏపీఏటీ ఉత్తర్వులను అమలు చేయలేదంటూ తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వెంకటేశ్వరరావు మరికొందరు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటీషనర్లు క్రమబద్ధీకరణకు అనర్హులైనందున ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని తెలిపారు. ఏపీఏటీ ఇచ్చిన న్యాయసంబంధ ఉత్తర్వులను విస్మరించడం తగదని హైకోర్టు పేర్కొంది. అపరిష్కృతంగా ఉన్న ఏపీఏటీ తీర్పులను నిర్దేశిత గడువులోపు అమలు చేస్తామని హామీనివ్వాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

పదేళ్లలో ఫార్మా పరుగులు

- ఔషధ రంగ సదస్సులో విజయవాడ పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: రాబోయే పదేళ్లలో ఔషధ(ఫార్మా) రంగంలో గణనీయ ప్రగతి ఉండబోతోందని విజయవాడ నగర పోలీసు కమిషనర్ గౌతం సవాంగ్ అన్నారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కళాశాలలో జరుగుతున్న మూడు రోజుల ఫార్మోరియా సదస్సులో శనివారం ఆయన పాల్గొన్నారు. ఫార్మా రంగంలో అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతానికి ఫార్మశీ విద్యార్థులకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కాస్త తక్కువగా ఉన్నా.. భవిష్యత్తులో అనూహ్య స్థాయిలో రాబోతున్నాయన్నారు. తదనుగుణంగా విద్యార్థులు పరిశోధనలపై ప్రత్యేకంగా దృష్టిసారించి, తగిన నైపుణ్యాలను సాధించాలని సవాంగ్ సూచించారు. అప్పుడే అవకాశాలను తేలికగా అందిపుచ్చుకోవచ్చని ఆయన అన్నారు. నగర వాతావరణంలో కాలుష్యం తీవ్రత పెరిగి, రకరకాల వ్యాధులు ప్రబలుతున్నందున. . వాటికి తగ్గ ఔషధాల తయారీపై విద్యార్థులు ఆసక్తి చూపించాలన్నారు. కొత్త ఆలోచనలను ప్రోత్సహించడానికి ఫార్మోరియాలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. వృత్తిపై స్థిరత్వాన్ని, గౌరవాన్ని పెంపొందించేందుకు ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు కృషిచేయాల్సి ఉందన్నారు. కేర్ హాస్పిటల్స్ వైస్ ఛైర్మన్ ఎన్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రుల్లో క్లినికల్ ఫార్మాసిస్టుల పాత్ర పెరుగుతోందన్నారు. ఫార్మశీ రంగంలో సాంకేతికతను జోడించడం ద్వారా రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు వీలుంటుందని టైకీ ఇన్నోవేషన్స్ సీటీవో నరేన్ దామ పేర్కొన్నారు. ఓమ్నీ హాస్పిటల్స్ సీఈఓ విక్రమ్ మాట్లాడుతూ.. క్లినికల్ ఫార్మాసిస్టుల పాత్ర ప్రస్తుతం చాలా ప్రధానంగా మారిందన్నారు. అందుకే ఫార్మశీ విద్యార్థులు అదనపు నైపుణ్యాలపై దృష్టిసారించాలన్నారు. ఫార్మా-డి చదువుకునే ఇక్కడి విద్యార్థులకు విదేశాలలో ఉన్న అవకాశాలను లండన్‌లో క్లినికల్ ఫార్మసిస్టుగా పనిచేస్తున్న వరుణ్ చంద వివరించారు. ఫార్మోరియా రెండోరోజు సదస్సులో భాగంగా.. విద్యార్థులకు ఉపాధిని అందించడానికి అవసరమైన కీలక ఒప్పందాలను చేసుకున్నారు. అపోలో ఆస్పత్రుల్లో ఫార్మసిస్టులుగా విద్యార్థులను తీసుకునేందుకు, ఆదిత్య బిర్లా గ్రూప్, ముంబయికి చెందిన భక్తి వేదాంత హాస్పిటల్స్‌లో ప్రతి మూడు నెలలకు విద్యార్థులకు వృత్యంతర శిక్షణ ఇచ్చేందుకు, బయో క్వెస్ట్ సంస్థలో మెడికల్ రైటింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు కీలకమైన ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు టైకీ ఇన్నోవేషన్స్ సీఈవో భాను ప్రతాప్ వెల్లడించారు.



సదస్సులో పాల్గొన్న ఫార్మశీ విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ గౌతమ్ సవాంగ్

రెండు నెలల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయ పనులు

- సెప్టెంబరులో వర్సిటీ స్నాతకోత్సవం
- ఉప రాష్ట్రపతికి ఆహ్వానం
- తొలి పాలకమండలి సమావేశంలో ఉప కులపతి వెల్లడి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్మాణ పనులు రెండు నెలల్లో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని ఆచార్య ఎన్.జి.రంగా వర్సిటీ ఉప కులపతి వి.దామోదరనాయుడు తెలిపారు. శనివారం గుంటూరుకు సమీపంలోని రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో తొలిసారిగా విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం జరిగింది. శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, ఎమ్మిగనూరు, విజయనగరం ఎమ్మెల్యేలు బి.సి.జనార్దనరెడ్డి, ఎం.గీత, ఇతర పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో ఉద్యోగాల భర్తీ, విశ్వవిద్యాలయ నిర్మాణానికి అవసరమైన భూ కేటాయింపు, జీవో నంబరు 64ను వ్యవసాయ విద్యార్థులు వ్యతిరేకిస్తున్న అంశాలపై చర్చించారు.

సమావేశం అనంతరం ఉప కులపతి 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని 500 ఎకరాల్లో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినా.. ఇప్పటికి 200 ఎకరాలు మాత్రమే కేటాయించారని, మరో 300 ఎకరాలు కేటాయించాలని కోరుతూ పాలకమండలి సభ్యులు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేయనున్నారని తెలిపారు. వర్సిటీ స్నాతకోత్సవాన్ని సెప్టెంబరులో నిర్వహించనున్నామని, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును ముఖ్య అతిథిగా ఆహ్వానించామని వెల్లడించారు.

మురుగు నీటి సరఫరా

- గ్రామాలలో మంచినీరు గగనమే
- నెలలు తరబడి శుభ్రతకు నోచుకోని ట్యాంకులు
- 90శాతం ప్రాంతాల్లో అప్పుడప్పుడూ క్లోరినేషన్
- నీటి పరీక్షలను మరిచిన పంచాయతీలు
- పట్టించుకోని ఇంజినీర్లు
- పలు మండల కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి
- శుద్ధిచేయని నీటితో వ్యాధుల శివాలు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే యంత్రాంగం

గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పలు కార్యక్రమాలు తీసుకొస్తున్నా..ఏటా వందలాది కోట్లు వ్యయం చేస్తున్నా.. నిర్వహణలో లోపంతో ప్రజలకు మంచినీరు దొరకడం గగనమవుతోంది. దీంతో గ్రామాల్లోనూ ప్రైవేటు ప్లాంట్లు, మంచినీటి కేన్లపైనా ప్రజలు భారీగా డబ్బులు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ నిర్వహణపై క్షేత్రస్థాయిలోని సిబ్బంది శ్రద్ధ కనబరచడం లేదు. పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లు జిల్లా, మండల కేంద్రాలకే పరిమితం కావడంతో ప్రజలకు శుభ్రత లోపించిన నీరే దిక్కవుతోంది. రాష్ట్రంలోని 45 శాతానికిపైగా పల్లె ప్రజలు ఇప్పటికీ గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అందిస్తున్న శుభ్రత లోపించిన నీటినే వినియోగిస్తున్నట్లు తాజాగా ఒక సర్వేలోనూ వెల్లడైంది. అనేక జ్వరాల, ఇతర వ్యాధులకు ఇదే నీరు కారణమవుతున్నట్లు భారత గ్రామీణ ప్రజాస్వామ్య మండలి ఆధ్వర్యంలోని సర్వే బృందం ఇటీవల గుర్తించింది.



నెల్లూరు జిల్లా ఉదయగిరి మండల కేంద్రంలో మురుగునీరు సరఫరా అవుతున్న కారణంగా ఏడాది కాలంగా ప్రజలు కుళాయి ట్యాపు చుట్టూ గుడ్డలు కట్టి నీళ్లు పట్టుకుంటున్నారు. క్లోరినేషన్ లేకుండా నీటిని సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు.



గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలో మూడు గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే రక్షిత తాగునీటి పథకం నిర్వహణ అధ్వానంగా ఉంది. 2010-11లో రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ఈ పథకాన్ని చేపట్టినా నిర్వహణ లోపంతో ప్రస్తుతం మాదలకు మాత్రమే నీటి సరఫరాను పరిమితం చేశారు. క్లోరినేషన్ సక్రమంగా చేయడం లేదు. శుద్ధి చేసిన జలాలు మాత్రమే సరఫరా చేయాలన్న ఆదేశాలు అమలుకావడం లేదు.

ఏం చేయాలి .. ఏం చేస్తున్నారు?

- ప్రతి 15 రోజులకోసారి రక్షిత మంచినీటి ట్యాంకుల్లో అప్పటివరకు ఉన్న నీటిని తొలగించి బ్లీచింగ్‌తో శుభ్రం చేయాలి. ఉదయం 8 గంటలకల్లా ఈ ప్రక్రియ పూర్తి చేసి సాయంత్రం 5 గంటల వరకు ఎండ బెట్టాకే తదుపరి మళ్లీ ట్యాంకుల్లోకి నీరు పంపే ఏర్పాట్లు చేయాలి.

○ నాలుగైదు నెలలకోసారైనా ఈ విధంగా ట్యాంకులను శుభ్రం చేస్తున్న దాఖలాల్లేవు. కేవలం పంపింగు, సరఫరా వరకే క్షేత్రస్థాయిలోని సిబ్బంది పరిమితం అవుతున్నారు. శుభ్రం పేరుతో నీటి సరఫరాను నిలిపివేస్తే ప్రజలు గగ్గోలు పెట్టే అవకాశం ఉందన్న కారణం చూపించి వీటి జోలికి వెళ్లడం లేదు.

- ట్యాంకుల్లోకి నీటిని పంపింగ్ చేశాక విధిగా బ్లీచింగ్ కలపాలి. క్లోరినేషన్ చేసైనా ప్రజలకు సరఫరా చేయాలి. ఇందుకోసం గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారు. మండల స్థాయిలో ఇంజినీర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

○ బ్లీచింగ్/క్లోరినేషన్ రోజూ చేయాలన్న ఆదేశాలు ఆచరణకు నోచుకోవడం లేదు. 90 శాతం మండలాల్లో దాదాపు ఇదే పరిస్థితి. ఇంజినీర్లు పెద్దగా దృష్టి సారించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదు. 10 శాతం మండలాల్లోనే బ్లీచింగ్ నిల్వలున్నాయి.

- ఆరు నెలలకోసారి విధిగా నీటి పరీక్షలు నిర్వహించాలి. క్లోరిన్, లవణాల శాతాన్ని తెలుసుకునేలా నమూనాలు సేకరించి లేబొరేటరీలకు పంపాలి. పరీక్షల్లో తాగేందుకు అనువుగా లేవని వెల్లడైతే సరఫరాను నిలిపివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

○ ఏడాదికోసారైనా గ్రామీణ ప్రాంతాల్లో నీటి పరీక్షలు నిర్వహించడం లేదు. గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజినీర్లు వస్తున్నా సరఫరాపై పర్యవేక్షణకే పరిమితమవుతున్నారు. 65 శాతం మండలాల్లో నీటి నమూనాలు సేకరిస్తున్న దాఖలాల్లేవు.



నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం మందాలనాయుడుపల్లెలో క్లోరినేషన్‌కు నోచుకోని తాగునీటి ట్యాంక్

- నీటి సరఫరాలో భాగంగా పైపుల మధ్యలో వేర్వేరు కారణాలతో లీకేజీలు ఏర్పడితే 24 గంటల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. పైపులు బాగా పాడైనా, లీకేజీకు ఆస్కారం ఉంటుందని భావించినా ప్రజారోగ్య దృష్ట్యా సాధ్యమైనంత వేగంగా కొత్తవి వేయాలి.

○ లీకేజీలపై 43 శాతం మండలాల్లో తదుపరి చర్యల్లేవు. 623 ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. పైపుల్లోకి మురుగు నీరు చేరుతున్న విషయం తెలియక గ్రామీణ ప్రజలు ఇదే నీటిని తాగుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. నిధుల కొరత పేరుతో పాడైన వాటి స్థానంలో కొత్త పైపులూ వేయడం లేదు.

రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి

సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు :	561
రక్షిత తాగునీటి పథకాలు :	33,985
నేరుగా నీటిని అందించే పథకాలు :	11,773
చేతిబోర్లు :	20,31,162
నీటి సౌలభ్యం కలిగిన ప్రాంతాలు :	23,493
పాక్షికంగా నీటి సదుపాయంగల ప్రాంతాలు :	24,425

ఆ సీట్ల భర్తీ తదుపరి కౌన్సెలింగ్‌లో..

- గాయత్రి మెడికల్ టెక్నాలజీలో 150, నిమ్రాలో 150 సీట్ల భర్తీకి అనుమతులు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: విశాఖపట్టణంలోని గాయత్రి విద్యాపరిషత్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీలో 150 సీట్లు, కృష్ణా జిల్లా జూపూడిలో నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 150 వంతున సీట్ల భర్తీకి అనుమతులు మళ్లీ వచ్చినందున తదుపరి కౌన్సెలింగ్‌లో వీటిని చేర్చనున్నారు. ఈ రెండు కళాశాలలతోపాటు దేశవ్యాప్తంగా పలు కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లకు అనుగుణంగా సదుపాయాలు, అధ్యాపకులు లేనందున ప్రవేశాలకు అనుమతి ఇవ్వకూడదని భారత వైద్య మండలి(ఎంసీఐ) కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆమోదించింది. దీనిపై పలు కళాశాలల యాజమాన్యాలు భారత సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఆ కళాశాలల యాజమాన్యాలు సమర్పించే పత్రాలను మరోసారి పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఈ నెల ఒకటిన ఉత్తర్వులు జారీచేస్తూ పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు. దీంతో ఈ నెల 4న ఈ కళాశాలల ప్రతినిధులు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ ముందు హాజరై వారి వాదనలను వినిపించి సంబంధిత పత్రాలను సమర్పించారు. వీటిని పరిశీలించిన ఈ కమిటీ సభ్యులు పై రెండు కళాశాలల్లో ప్రవేశాలకు అనుమతి ఇవ్వాల్సిందిగా సిఫార్సు చేసింది.

మలివిడత కౌన్సెలింగ్ ముగింపు!: యాజమాన్య కోటా బి, సి సీట్ల భర్తీకి మలివిడత కౌన్సెలింగ్ శుక్రవారంతో మొదలై శనివారంతో ముగిసింది. ఎంబీబీఎస్ బి కేటగిరి సీట్లు అన్నీ భర్తీ అయ్యాయి. సి కేటగిరిలో 142 సీట్లు మిగిలాయి. దంత వైద్య విద్యలో 125 సీట్లు బి కేటగిరిలో, 160 సీట్లు సి కేటగిరిలో మిగిలాయి.

ఎదురుచూపులు!: పీజీ సూపర్‌స్పెషాలిటీ సీట్ల భర్తీ తీరుపై కేంద్రం నుంచి అధికారిక సమాచారం కోసం ఎదురుచూస్తున్నామని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి రవిరాజ్ తెలిపారు. అన్ని రాష్ట్రాలు మాదిరిగానే తామూ ఈ సీట్ల భర్తీ 371 డి ప్రకారం రాష్ట్రంలో ఎలా జరుగుతుందో తెలియచేస్తూ కేంద్రానికి వివరాలు పంపించినట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో ఈ సీట్ల భర్తీ జరిగినా రాష్ట్ర సీట్లు ఇక్కడి విద్యార్థులతోనే భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఇదే విషయమై అధికారిక నిర్ధారణ కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. మరోవైపు.. ఈ సీట్ల భర్తీకి దేశవ్యాప్తంగా విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్ మొదలైందన్నారు.

హిజబ్ తొలగించినందుకు రూ.55 లక్షల పరిహారం

లాస్‌ఏంజెలెస్: ముస్లిం మహిళ ప్రాథమిక హక్కులకు భంగం కలిగించిన అమెరికాలోని కాలిఫోర్నియా పోలీసులు ఆ బాధితురాలికి సుమారు రూ.55లక్షలు (85వేల డాలర్లు) పరిహారంగా చెల్లించనున్నారు. క్రిస్టీ పావెల్ అనే మహిళ తన భర్తతో కలిసి కారులో వెళుతుండగా పోలీసులు అడ్డగించారు. చోరీ ఆరోపణలపై ఆమెను అదుపులోకి తీసుకుని లాకప్‌లో బంధించారు. ముఖానికున్న హిజబ్ (ముసుగు వస్త్రం)ను బలవంతంగా తొలగించి ఫొటో తీశారు. క్రిస్టీ పావెల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2016లో జరిగిన ఈ ఘటనపై అమెరికన్ ఇస్లామిక్ రిలేషన్స్ కౌన్సిల్ తాజాగా తీర్పును వెలువరిస్తూ బాధితురాలికి రూ.55 లక్షల పరిహారాన్ని చెల్లించాలని ఆదేశించింది.

బాదంతో మంచి కొవ్వు మెరుగు



న్యూయార్క్: రోజూ పిడికెడు బాదం పప్పు తీసుకుంటే శరీరంలో మంచికొవ్వు స్థాయిలు పెరుగుతాయని తాజా అధ్యయనంలో తేలింది. అంతేకాదు కొవ్వుల పని తీరూ మెరుగు పడుతుందని వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ వర్సిటీ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. 48 మంది దీనిలో పాల్గొన్నారు. వీరిని రెండు వర్గాలుగా విభజించి... ఒకరికి రోజూ 43 గ్రాముల బాదం పప్పు తినమని సూచించారు. మరో వర్గానికి కేకులు తినమని చెప్పారు. రోజువారి ఆహారంలో మాత్రం ఎలాంటి మార్పులూ చేయలేదు. ఆరు వారాల పాటు రెండుసార్లు ఈ పరిశోధన సాగింది. అనంతరం వీరిలో హైడెన్సిటీ లైపోప్రోటీన్ (హెచ్‌డీఎల్- దీన్నే మంచికొవ్వు అని కూడా పిలుస్తారు) స్థాయిలు, పనితీరును పరీక్షించారు. దీంతో బాదం తీసుకున్న కొందరిలో హెచ్‌డీఎల్ స్థాయిలు 19 శాతం వరకూ పెరిగాయని వెలుగులోకి వచ్చింది. వీటి పనితీరు కూడా 6.4 శాతం మెరుగుపడిందని తేలింది. 'హెచ్‌డీఎల్ ఓ సంచిలా పనిచేస్తుంది. మొదట చిన్నగా ఉండే ఇది... శరీరంలోని వివిధ భాగాల నుంచి కొవ్వును గ్రహిస్తూ పెద్దదవుతుంది. అనంతరం కాలేయంలో ఈ కొవ్వు విచ్ఛిన్నమయ్యేందుకు సహకరిస్తుంది. రోజూ బాదం తీసుకుంటే ఈ క్రియ మరింత మెరుగుపడుతుంది. గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది'అని పరిశోధనలో పాలుపంచుకున్న క్రిస్ ఎథెర్టన్ తెలిపారు.




నకిలీ ఉత్పత్తులను ఇట్టే కనిపెట్టొచ్చు!



* "స్మార్ట్ సాంకేతికత" అభివృద్ధి


న్యూయార్క్: నకిలీ ఉత్పత్తులను ఇట్టే కనిపెట్టే అధునాతన పరిజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. ప్రత్యేక అల్గారిథమ్‌ల సాయంతో అమెరికాలోని న్యూయార్క్ వర్సిటీ నిపుణులు దీన్ని సిద్ధంచేశారు. దీని కోసం బూట్లు, బొమ్మలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్త్రాలు ఇలా 30,00,000 ఉత్పత్తుల చిత్రాలతో ఓ సమాచార నిధిని ఏర్పాటుచేశారు. ఈ ఉత్పత్తుల వివరాలను సూక్ష్మస్థాయిలో సేకరించారు. దీనికి విశ్లేషణ పరిజ్ఞానాన్ని (అల్గారిథమ్‌లను) జోడించి ఓ స్మార్ట్‌ఫోన్ యాప్‌గా మనముందుకు తీసుకొచ్చారు. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న ఫోన్ కెమెరా ఫోకస్‌ను ఉత్పత్తులపై పెడితేచాలు. సీల్ విప్పకుండానే అది నకిలీదో కాదో తెలిసిపోతుంది. క్షణాల్లోనే ఈ పనంతా పూర్తవుతుందని, 98 శాతం కచ్చితత్వంతో ఇది ఫలితాలను ఇస్తుందని పరిశోధనలో పాలుపంచుకున్న భారత సంతతి శాస్త్రవేత్త లక్ష్మీనారాయణన్ సుబ్రమణ్యం చెప్పారు.

వంద రెట్లు అధికవేగంతో... సమాచార బట్వాడా



వాషింగ్టన్: ఎలక్ట్రానిక్ పరికరాల సమాచార బట్వాడా (డేటా ట్రాన్స్‌మిషన్)లో విప్లవం! తొలిసారిగా వాయువేగంతో సెకనుకు 50 గిగాబైట్ల సమాచారాన్ని పరిశోధకులు పంపగలిగారు. దీనికోసం "టెరాహెర్ట్జ్ మల్టీప్లెక్సర్"లను ఉపయోగించారు. ప్రస్తుత చరవాణి సమాచార బట్వాడాలో అత్యధిక వేగం కంటే.. ఇది వంద రెట్లు ఎక్కువ. భిన్న సంకేతాలను ఒకే ఛానెల్ గుండా పంపడాన్ని మల్టీప్లెక్సింగ్ అంటారు. స్వర, డిజిటల్ సమాచార బట్వాడా దీని ఆధారంగానే జరుగుతుంది. ప్రస్తుతం దీనికి అత్యధిక పౌనఃపున్య టెరాహెర్ట్జ్ తరంగాలను జోడించడంతో అమెరికాలోని బ్రౌన్, ఫ్రాన్స్‌లోని లిల్లీ వర్సిటీల నిపుణులు తాజా వేగాన్ని అందుకోగలిగారు. మెరుపు వేగంతో సమాచారాన్ని బట్వాడాచేసే భవిష్యత్తుతరం నెట్‌వర్క్‌కు ఈ పరిశోధన బాటలేస్తోంది. తాజా మల్టీప్లెక్సర్‌లో రెండు లోహఫలకాలున్నాయి. వీటిని ఎదురెదురుగా ఏర్పాటుచేశారు. దీనిలో ఓ ఫలకానికి నిలువుగా సన్నని రంధ్రం చేశారు. ఈ రెండు ఫలకాలమధ్య టెరాహెర్ట్జ్ తరంగ పుంజం ప్రసరించినప్పుడు.. కొన్ని తరంగాలు రంధ్రం గుండా వెళ్లి సమాచార బట్వాడాకు తోడ్పడతాయి.

ఒత్తిడి భారం ఎక్కువైన ఉద్యోగాలు ఆరోగ్యానికి హానికారకాలు



★ అలాంటి విధుల కంటే నిరుద్యోగిగా ఉండటమే మేలు

లండన్: తక్కువ వేతనాలు లేదా అత్యధిక ఒత్తిడి ఉన్న ఉద్యోగాలు చేసే వారికి ఆరోగ్య సమస్యల ముప్పు అధికం. ఒక్కమాటలో చెప్పాలంటే..., అలాంటి ఒత్తిడి లేదా తక్కువవేతనాలకు పనిచేసే వారి కంటే ఉద్యోగం సద్యోగం లేకుండా ఉండే వారే ఆరోగ్యకరంగా ఉంటారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. మాంఛెస్టర్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 35-75 ఏళ్ల మధ్య వయసు ఉన్న వెయ్యిమందిని వీరు తమ అధ్యయనం నిమిత్తం ఎంపిక చేసుకున్నారు. వారంతా కూడా 2009-2010 మధ్య నిరుద్యోగులుగా ఉన్న వారే కావడం గమనార్హం. ఆ తర్వాత మరికొన్ని సంవత్సరాల పాటు వారందరి ఆరోగ్యపరిస్థితిని... హార్మోన్ల తీరుతెన్నులను....ఒత్తిడికి సంబంధించిన ఇతరత్రా పరిణామాలను శాస్త్రీయంగా పరిశీలించారు. నాణ్యమైన..ఒత్తిడి రహితమైన ఉద్యోగాల్లో ఉన్నవారిలో ఆరోగ్యసూచీ చక్కగా ఉండగా...తద్విరుద్ధమైన స్వభావం ఉన్న విధులు చేపట్టిన వారిలో అనారోగ్య లక్షణాలు సుస్పష్టంగా గుర్తించగలిగినట్లు పరిశోధకులు తెలిపారు.

స్పర్శతోనే దెబ్బతిన్న అవయవాలు పూర్వస్థితికి



★ అధునాతన పరికరం అభివృద్ధి

వాషింగ్టన్: చర్మకణాలను మనకు అవసరమైనట్లుగా మార్చుకునేందుకు తోడ్పడే ఓ అధునాతన పరికరాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. కేవలం స్పర్శతోనే ఇది చక్కని ఫలితాలనివ్వడం విశేషం. దెబ్బతిన్న కణజాలం, రక్తనాళాలు, నాడులను దీని సాయంతో పూర్వస్థితికి తీసుకొచ్చే వీలుంది. టిస్యూ నానోట్రాన్స్‌ఫెక్షన్ (టీఎన్‌టీ) సాంకేతికత ఆధారంగా అమెరికాలోని ఒహైయో స్టేట్ వర్సిటీ నిపుణులు ఈ పరికరాన్ని అభివృద్ధిచేశారు. పందులపై దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. వాటి చర్మకణాలను రక్తనాళాల్లోని కణాలుగా మార్చగలిగారు. రక్తసరఫరా నిలిచిపోయిన వాటికాళ్లలో ఈ కణాలను ప్రవేశపెట్టారు. దీంతో వారం రోజుల్లోనే నాళాల్లో రక్త సరఫరా మెరుగుపడిందని, రెండో వారానికి వాటి కాళ్లు పూర్వస్థితికి వచ్చాయని పరిశోధకులు తెలిపారు. మరోవైపు పక్షవాత బాధిత ఎలుకలపైనా ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. చర్మ కణాలను నాడీకణాలుగా మార్చి వాటికి ఎక్కించారు. దీంతో వాటి మెదడు పూర్వస్థితికి వచ్చింది. ఈ పరిశోధనలో భారత సంతతికి చెందిన చందన్ సేన్ పాలుపంచుకున్నారు. 'ఈ పరికరంలో రెండు ప్రధాన భాగాలున్నాయి. వాటిలో నానోచిప్ మొదటిది. ఇది మన శరీరంలోని కణాలకు సమాచారాన్ని చేరవేయడంలో తోడ్పడుతుంది. ఈ సమాచారాన్ని కణాల రూపాంతరీకరణకు ఉపయోగించే సాంకేతికత రెండోది. ఈ ప్రక్రియకు స్వల్ప మోతాదులో విద్యుత్తు అవసరం. రోగులపై ఈ విద్యుత్తు ఎలాంటి ప్రభావాన్ని చూపించదు. ఈ పరికరంతో చర్మ కణాలను తాకినవెంటనే మనం కోరుకున్నట్లు రూపాంతరం చెందుతాయి. సెకనులోనే ఈ పని పూర్తవుతుంది. 98 శాతం కచ్చితత్వంతో ఇది పనిచేస్తుంది'అని సేన్ చెప్పారు.

చిటికెలో రంగులు మార్చే స్మార్ట్ కిటికీ

బోస్టన్: చిటికెలో రంగులు మార్చే స్మార్ట్ కిటికీని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది నిమిషంలోనే పారదర్శకం నుంచి నల్ల రంగులోకి మారిపోవడం విశేషం. దీనిలో విద్యుత్ వాహకత కలిగిన గాజును ఉపయోగించారు. ఉపరితలంపై లోహ అయాన్ల పూతవేశారు. ఇది విద్యుత్ సాయంతో కాంతిని నిరోధించడం, ప్రసరింప చేయడం చేస్తోంది. ఉష్ణోగ్రతలకు అనుగుణంగా దీన్ని ఎప్పటికప్పుడు ఇట్టే మార్చుకోవచ్చని అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ నిపుణులు తెలిపారు. ఈ తరహా స్మార్ట్ కిటికీలను కొన్ని విమానాల్లో ఇప్పటికే ఉపయోగిస్తున్నారు. టంగ్‌స్టన్ ఆక్సైడ్ లాంటి లోహాలతో తయారుచేయడంతో వీటి ధర కాస్త ఎక్కువగా ఉంటోంది. ఇవి పారదర్శకం నుంచి నల్ల రంగులోకి మారేందుకు 20 నిమిషాల వరకూ సమయం పడుతుంది. అయితే తాజా స్మార్ట్ కిటికీ తయారీలో ఈ సవాళ్లను అధిగమించామని పరిశోధకులు మైఖెల్ మెక్‌గీ తెలిపారు.

నిర్మాణ పనులపై 12% జీఎస్టీతో ఉపశమనం

- పూర్తిస్థాయిలో ప్రభావంపై స్పష్టతకు కమిటీ

ఈనాడు - అమరావతి



ప్రభుత్వ నిర్మాణ పనులపై 12% పన్ను విధింపునకు జీఎస్టీ మండలి నిర్ణయాన్ని తీసుకోవడంతో ఉపశమనం లభించినట్లయిందని వాణిజ్యశాఖ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. వ్యాట్ అమల్లో ఉన్నప్పుడు ఐదు శాతం పన్ను పడేది. నిర్మాణ అవసరాలకు అనుగుణంగా కొనుగోలు చేసిన సిమెంట్, స్టీలు, ఇతర వాటిపై గుత్తేదారులు పన్నులు కట్టేవారు. దీనిని జీఎస్టీ విధానంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో తిరిగి పొందే అవకాశం ఉంది. జీఎస్టీ కింద విధించిన 12%వల్ల పెద్దగా నష్టమేమీ రాదన్న అభిప్రాయాన్ని వాణిజ్యపన్నుల శాఖ అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. తొలుత పేర్కొన్న విధంగా జీఎస్టీ 18% కాకుండా 12%కు పరిమితం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రానికి లేఖ రాశారు. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే విధంగా కేంద్రాన్ని కోరాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తాజా జీఎస్టీ మండలి సమావేశంలో 18% నుంచి 12%కు పరిమితం చేస్తూ నిర్ణయం జరిగింది.

నాపరాయి పరిశ్రమల యజమానులకు ఊరట

తాజా జీఎస్టీ మండలి సమావేశం ద్వారా నాపరాయి పరిశ్రమల యజమానులకు ఊరట లభించింది. రాయలసీమలో లభ్యమయ్యే బేతంచర్ల 'నాపరాయి'ని మార్బుల్స్, టైల్స్ స్థానంలో తొలుత చేర్చారు. ఇది జీఎస్టీలో 28% శ్లాబులో చేరింది. దీని వల్ల పరిశ్రమల కార్యకలాపాలు స్తంభించాయి. దీనిని ఐదు శాతం పరిధిలోనే కొనసాగించాలని పరిశ్రమల యజమానులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రం దృష్టికి ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా తీసుకువెళ్లారు. తర్జనభర్జనల అనంతరం నాపరాళ్ల వరకు 5% ఖరారు చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ వెల్లడించింది. తద్వారా పరిశ్రమల యజమానుల్లో 90% మందికి న్యాయం చేకూరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నాపరాయి టైల్స్‌ను మాత్రం 28% శ్లాబులోనే ఉంచారు. నాపరాయి టైల్స్ వాడుక తక్కువని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ప్రత్యేక కమిటీ ఏర్పాటు

ప్రాజెక్టుల పనులపై జీఎస్టీ ప్రభావం ఎలా ఉంటుంది, పరిష్కారమార్గాలు ఏమిటి? ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై వివిధ ఇంజినీరింగు విభాగాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు, వర్క్సు అకౌంట్స్ డైరక్టర్, వాణిజ్య పన్నులశాఖ ఉన్నతాధికారితో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. జలవనరుల శాఖలో ప్రతి ఏటా 10వేల కోట్ల రూపాయల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనిపై జీఎస్టీ ప్రభావం ఎంత పడుతుంది, మొత్తం మీద భారం ఎంత అన్నది లెక్కించి చెప్పేందుకు కొంత సమయం పడుతుంది. ఆయా పనుల అంచనాలు, అందులో వాడే వస్తు సామగ్రిని బట్టి దీని భారం లెక్కించాల్సి ఉంటుంది. లేబర్, మెటీరియల్‌పై జీఎస్టీ వివిధ రకాలుగా ఉంది. పైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను మినహాయించాల్సి ఉంటుంది. ఏ ప్రాజెక్టుకు ఆ ప్రాజెక్టులో ఏ ప్యాకేజికి ఆ ప్యాకేజిని బట్టే భారాన్ని గణించాల్సి ఉంటుంది. ఇంతవరకు పూర్తి స్థాయిలో ఇంజినీరింగు పనులకు సంబంధించి ఎంత భారం పడుతుందన్నది లెక్కించలేదు. జలవనరుల శాఖ, ఆర్అండ్‌బీ, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్ శాఖ తరపున నిర్మాణ పనులు భారీగా జరుగుతున్నాయి.

ఆ చెల్లింపులు వ్యాట్ ఆధారంగానే!

జూన్ 30వ తేదీకి ముందు జరిగిన నిర్మాణ పనులు బిల్లులు చెల్లింపుల కోసం అధికారులకు ఇప్పుడు అందుతున్నాయి. జులై ఒకటో తేదీ నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అంతకుముందు జరిగిన నిర్మాణ పనుల బిల్లుల విషయంలో ఎలాంటి విధానాన్ని అనుసరించాలన్న దానిపై స్పష్టతనివ్వాలని జీఎస్టీ మండలిని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అక్కడి నుంచి సమాధానం వచ్చే వరకు జూన్ 30వ తేదీ వరకు అమల్లో ఉన్న వ్యాట్ విధానాన్ని అనుసరించి బిల్లుల చెల్లింపులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అధికారికంగా నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ మేరకు వాణిజ్య పన్నుల శాఖ జిల్లాలకు సమాచారాన్ని పంపింది.

మనకేదీ తెలుగు అకాడమీ..!

- 10వ షెడ్యూల్‌లోని సంస్థ సేవలు ఏపీలో అందని వైనం
- పోటీ పరీక్షల సామగ్రి, ఉన్నత విద్య పుస్తకాలు లభించక ఇబ్బందులు

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యకు అవసరమైన పుస్తకాల ముద్రణ.. సాహిత్యం, భాషాభివృద్ధికి కృషిచేసే తెలుగు అకాడమీ ఏర్పాటుపై ఏపీలో అడుగు ముందుకు పడడం లేదు. ఉమ్మడి ఏపీలో రూపుదాల్చిన ఈ సంస్థ 49ఏళ్లు పూర్తి చేసుకొని 50వ పడిలోకి అడుగిడింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పదో షెడ్యూల్‌లో ఉన్న ఈ సంస్థ విభజన పూర్తికాకపోవడంతో ఏపీలో ఎలాంటి సేవలు అందడం లేదు. విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్, డిగ్రీ, బీఈడీ, డీఈడీ పుస్తకాలతోపాటు టెట్, ఎంసెట్, పోటీ పరీక్షల మెటీరియల్‌ను ఈ సంస్థ ముద్రించేది. పోటీ పరీక్షల్లో ఏదైనా ఒక జవాబుపై వివాదం ఏర్పడితే తెలుగు అకాడమీనే ప్రామాణికంగా నిలుస్తుంది. ఇంతటి ప్రాధాన్యమున్న సంస్థ సేవలు గత రెండేళ్లుగా రాష్ట్రంలో నిచిలిపోయాయి. విజయవాడ, గుంటూరు, తిరుపతి, అనంతపురం, విశాఖపట్నం జిల్లాల్లో ప్రాంతీయ కేంద్రాలున్నా పుస్తకాల ముద్రణ లేక వీటి సేవలు అంతంతగానే మారాయి.

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు..: బీఈడీ, డీఈడీ పాఠ్యాంశాల్లో మార్పులు చేశారు. సంబంధిత పుస్తకాలు లభించని పరిస్థితి.. డిగ్రీలోనూ సెమిస్టర్ పద్ధతిని అమలుచేస్తున్నారు. సంబంధిత పుస్తకాలు మార్కెట్‌లో లభించక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం తెలుగు అకాడమీద్వారానే పుస్తకాల ముద్రణ నిర్వహిస్తోంది. బీఈడీ, డీఈడీలాంటి వాటిల్లో తెలంగాణాలోని పాఠ్యాంశాలు 75-80శాతం అక్కరకొస్తుండటంతో కొందరు విద్యార్థులు వాటిని కొనుక్కుంటున్నారు. మరోవంక, ఇంటర్మీడియట్ పుస్తకాల ముద్రణ దాదాపుగా నిలిపివేసి, ప్రైవేటు వారికి అప్పగించేస్తున్నారు. ఎంసెట్ మెటీరియల్‌ను అకాడమీ ముద్రిస్తుంది. రెండేళ్లుగా ఏపీకి ముద్రణ సాగడం లేదు. కొందరు పాతవాటినే వినియోగించుకుంటుండగా.. మరికొందరు కళాశాలలు ఇచ్చే మెటీరియల్‌పై ఆధారపడుతున్నారు.

పోటీ పరీక్షలకు సొంతంగానే..: పోటీ పరీక్షల మెటీరియల్‌ను తెలుగు అకాడమీ ముద్రిస్తుంది. ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో ఎక్కువగా విభజనానంతర సమస్యలపై ప్రశ్నలు వస్తున్నాయి. దీనిపై కచ్చితమైన సమాచారం లభించడం లేదు. చాలమంది విద్యార్థులు అంతర్జాలం, పత్రికలు, ఇతరత్రా పుస్తకాల ద్వారా సొంతంగానే మెటీరియల్‌ను సమకూర్చుకుంటున్నారు. తెలుగు అకాడమీ.. నిపుణులు, ప్రొఫెసర్లు, రచయితలు తదితరుల నుంచి సమాచారాన్ని సేకరించి ముద్రిస్తుంది. వీటినే ప్రామాణికంగా తీసుకుంటారు. ప్రస్తుతం అకాడమీ పుస్తకాలు లేనందున వేటిని ప్రామాణికంగా భావించాలని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలుగు అకాడమీని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

'బీసీ బిల్లుకు అన్ని పార్టీలూ సానుకూలం'

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు కేంద్ర ప్రభుత్వంతోపాటు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ సానుకూలంగా ఉన్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, శాసనసభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన 'ఛలో దిల్లీ' వివరాలను శనివారం హైదరాబాద్‌లో విలేకరులకు వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు అంశాన్ని ప్రధాన ఎజెండాగా తీసుకుంటామని ప్రతిపక్ష పార్టీలు హామీ ఇచ్చాయన్నారు.

పిడుగుపాటుకు పేలిన సెల్‌ఫోన్..

యువకుడికి గాయాలు



ఆస్పత్రిలో బాధితుడు చంటి

పద్మనాభం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొడ్డి చంటి (23) శుక్రవారం సాయంత్రం బహిర్భూమికని శివారులోని చెరువు వద్దకు వెళ్లాడు. అదే సమయంలో సమీపంలో పిడుగు పడగా ఆ ధాటికి ఆయన జేబులోని సెల్‌ఫోన్ పేలింది. ఎడమకాలి తొడభాగం నుజ్జయింది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని వైద్యులు చెప్పినట్లు చంటి ఆవేదన వ్యక్తం చేశాడు.

14న ముఖ్యమంత్రితో కాపు సంఘాల ప్రతినిధుల భేటీ

రాజకీయ రిజర్వేషన్లు అవసరం లేదని చెబుతాం: చినరాజప్ప

ఈనాడు అమరావతి: కాపు సామాజిక వర్గానికి చెందిన వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 14న సమావేశమవుతున్నారు. విజయవాడలో వెన్యూ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సమావేశం జరుగుతుంది. తూర్పుగోదావరి జిల్లా నుంచి కాపు సామాజిక వర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులంతా ఈ సమావేశంలో పాల్గొంటారు. వారి ఆధ్వర్యంలో 2 వేలమంది కాపు సామాజికవర్గ ప్రతినిధులు సమావేశానికి హాజరు కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుల్ని కూడా ఈ సమావేశానికి ఆహ్వానించినట్లు ఉపముఖ్యమంత్రి, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. కాపులకు రాజకీయ రిజర్వేషన్లు అవసరం లేదని, ఉద్యోగ, విద్యా రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, ఆర్థికంగా తోడ్పాటునందించాలని సీఎంను కోరనున్నట్టు ఆయన వెల్లడించారు.

అటవీ ఉత్పత్తుల రవాణాకు ఆన్‌లైన్ అనుమతులు

ఈనాడు, అమరావతి: వ్యాపార సరళతర నిర్వహణలో భాగంగా అటవీఉత్పత్తుల రవాణా నిబంధనలను ప్రభుత్వం కొంతమేర సడలించింది. సరళతరం చేయడంలో భాగంగా దరఖాస్తు మొదలు, అనుమతుల ప్రక్రియనంతటినీ ఆన్‌లైన్ చేసింది. ప్రతి పనికి నిర్ణీత కాల పరిమితిని పేర్కొంది. ఖరీదైన ఎర్రచందనం విషయంలో మాత్రం ప్రభుత్వం ఈ మినహాయింపునివ్వలేదు. ఆన్‌లైన్ అనుమతులను అక్రమార్కులు అనుకూలంగా మార్చుకుంటారని భావిస్తోంది.

మెదడు వాపు.. అంతులేని ముప్పు!

- ఇప్పటికీ యూపీ, బిహార్‌లో ఎక్కువే
- దోమలతో జాగ్రత్త పడటమే నివారణ

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్ గోరఖ్‌పూర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో గత ఐదు రోజుల వ్యవధిలో మెదడువాపు సమస్యతో సుమారు 60 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో మరోసారి అందరి దృష్టి ఈ వ్యాధిపై పడింది. మెదడువాపు వల్ల సంభవించిన ఇన్ఫెక్షన్లు తదితర కారణాలతో మరణాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ఇప్పటికే మెజిస్టీరియల్ విచారణకూ ఆదేశించారు. ఇటీవల కొన్నేళ్లుగా యూపీ, బిహార్‌లలో ఈ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. యూపీ ప్రభుత్వం ఈ ఏడాది మేలో 38 సునిశిత ప్రాంతాలుగా పేరొందిన జిల్లాల్లో టీకాల కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. తాజా ఉదంతంలో గోరఖ్‌పూర్ బాబా రాఘవ్‌దాస్ వైద్యకళాశాల ఆస్పత్రి మెడికల్ వార్డుల్లో ఇన్ఫెక్షన్లు, ఆక్సిజన్ సరఫరాలో అవాంతరం చోటుచేసుకోవడం వంటి పలు కారణాలతో మరణాలు చోటుచేసుకున్నట్లు చెబుతున్నారు. ఆక్సిజన్ కొరత వల్లే మరణాలు సంభవించాయన్న ఆరోపణల్ని ఆస్పత్రి సిబ్బంది తిరస్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో చిన్నారుల్ని వేధిస్తున్న ఎన్‌సెఫలైటిస్ (మెదడువాపు వ్యాధి) మరోసారి చర్చ మొదలైంది.

ఎన్‌సెఫలైటిస్ అంటే..: మెదడులో తీవ్రస్థాయి ఇన్‌ఫ్లమేషన్ కారణంగా ప్రాణాంతకంగా మారే అరుదైన సమస్య. ఆకస్మికంగా బయటపడి, వేగంగా వృద్ధి చెందడం దీని లక్షణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిబారిన పడిన వారికి తీవ్రస్థాయి వైద్య చికిత్స అవసరమవుతుంది.

కారణాలేమిటి: ఈ వ్యాధి అన్ని వయసుల వారిలోనూ తలెత్తవచ్చు. కాకపోతే.. చిన్నారులు, వృద్ధులకు ముప్పెక్కువ. ఇది వైరల్ ఇన్ఫెక్షన్ ద్వారా వ్యాపిస్తుంది. ఒక్కోసారి మెదడులోని సొంత రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున మెదడు కణజాలంపై దాడి చేయడం వల్ల కూడా ముప్పు తలెత్తే అవకాశం ఉంటుంది. కొన్ని అరుదైన సందర్భాల్లో బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు, పరాన్నజీవులు, ఇతర ఇన్ఫెక్షన్ వ్యాధుల వల్లకూడా రావచ్చని తెలుస్తోంది. కాకపోతే ఇది ఒకరి నుంచి మరొకరికి సోకదు.

జపనీస్ ఎన్‌సెఫలైటిస్ అంటే..: ఆసియా ప్రాంతంలో అత్యంత సాధారణంగా కనిపించే వైరల్ ఎన్‌సెఫలైటిస్‌లలో ఒకటి జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్(జేఈవీ). దోమల ద్వారా పుట్టే ఫ్లావివైరస్‌తో వ్యాపిస్తుంది. డెంగీ, ఎల్లో, వెస్ట్‌నైల్ వైరస్‌ల తరహాకు చెందినదే. జేఈవీ ఎక్కువగా చిన్నారులపైనే ప్రభావం చూపుతుందనీ, వయోజనులకు సహజంగానే నిరోధకత ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) చెబుతోంది. వ్యాధి సంభవించినపుడు జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. 250 కేసుల్లో ఒకదానిలో వ్యాధి తీవ్రస్థాయికి మారుతుంది. అకస్మాత్తుగా తీవ్రస్థాయి జ్వరం, తలనొప్పి, కోమా, మూర్ఛ, బిగుసుకుపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి.

అందుబాటులో ఉన్న చికిత్స ఏమిటి?: అన్ని రకాల మెదడువాపు వ్యాధులూ ఒకే తరహా లక్షణాలను కనబరచడం వల్ల వీటిలో వైవిధ్యాన్ని గుర్తించడం వైద్యులకు కష్టమవుతుంది. రోగ నిర్ధరణ సందర్భంగా ఇది వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చిందా, ఇతరత్రా కారణాలేమైనా తోడయ్యాయా అనే దిశగా నిర్ధరించాల్సి ఉంటుంది. జ్వరాన్ని తగ్గించడం, వాపు కారణంగా మెదడుపై పడే ఒత్తిడిని తొలగించడం అత్యంత కీలకమైన విషయం. యూకేలోని ఎన్‌హెచ్‌ఎస్ వైద్యులు స్టీరాయిడ్ ఇంజక్షన్లు, యాంటీబయాటిక్స్, నొప్పి నివారిణి ఔషధాల్నీ ఉపయోగిస్తుంటారు.

వ్యాధిని నివారించడమెలా?: వ్యాధిని ప్రభావవంతంగా నివారించే పలు రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయి. తట్టు, మంప్స్, రుబెల్లా టీకాలు ఇందుకు తోడ్పడతాయి. ఎన్‌సెఫలైటిస్‌కు కారణమయ్యే వైరస్‌లతో కూడిన దోమలుండే ప్రాంతాల్లో వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

భారత్‌లో వ్యాధి పరిస్థితి ఏమిటి? తీవ్రత ఎంత?: భారత్‌లో మరణాలకు ఎక్కువగా జపనీస్ ఎన్‌సెఫలైటిస్ కారణమవుతున్నట్లు తెలుస్తోంది. భారత వైద్య పరిశోధన మండలి నివేదిక ప్రకారం.. దేశంలో జేఈవీని తొలిసారిగా 1955లో గుర్తించారు. తమిళనాడు ఉత్తర ఆర్కాట్ జిల్లాలో కేసులు నమోదయ్యాయి. 1972 నుంచి వ్యాధి ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, అసోం, బిహార్, మణిపూర్, గోవా, పుదుచ్చేరి, కర్ణాటక వంటి కొత్త ప్రాంతాలకూ వ్యాపించినట్లు నివేదిక పేర్కొంది. దక్షిణ భారత్‌లో 16 ఏళ్లలోపు వారు బాధితులు కాగా, ఉత్తర భారత్‌లో అన్ని వయసుల వారూ దీనిబారిన పడ్డారు. 2014 నాటికి దేశంలో మెదడువాపు వ్యాధితో 550 మరణాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

యూపీ ఘోరంపై కదిలిన ప్రభుత్వాలు

- వైద్య కళాశాల ప్రిన్సిపల్‌పై తక్షణ వేటు
- ఉన్నత స్థాయి విచారణకు ఆదేశాలు
- పరిస్థితిపై ప్రధాని మోదీ సమీక్ష
- పాపం పసివాళ్లపై సర్వత్రా ఆక్రోశం
- నిధులు వచ్చినా చెల్లింపులో జాప్యం: యూపీ మంత్రి వెల్లడి

గోరఖ్‌పూర్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో అభం శుభం తెలియని పసికందులు పిట్టల్లా రాలిపోతుండడంపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తీవ్రంగా స్పందించాయి. ఈ దుర్ఘటనపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండడంతో ప్రభుత్వాలు రెండూ తమ వంతు చర్యల్ని చేపట్టడానికి రంగంలో దిగాయి. ఒకపక్క ఘటనపై దర్యాప్తు జరిపిస్తూనే మరోపక్క దోషుల్ని తేల్చడంపై దృష్టి సారించాయి. దురదృష్టకర ఘటనలు చోటు చేసుకున్న 'బాబా రాఘవ్‌దాస్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి' ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్ మిశ్రను యూపీ ప్రభుత్వం తక్షణం సస్పెండ్ చేసింది. ఆక్సిజన్ సరఫరాదారుడికి చెల్లింపులు చేయడంలో ఆయన నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించారని ప్రభుత్వం భావించింది.


గోరఖ్‌పూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

5 రోజుల్లో 60 మంది మృతి!

ఆసుపత్రిలో 5 రోజుల్లో వివిధ కారణాలతో 60 మంది పిల్లలు మృతి చెందినట్లు వార్తలు వెలువడుతుండడం అన్ని వర్గాలనూ కలచివేస్తోంది. ఈ ఘటనపై నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించిన యూపీ ప్రభుత్వం మెజిస్టీరియల్ దర్యాప్తునకు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోనూ ఉన్నత స్థాయి విచారణ మొదలయింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రెండ్రోజుల క్రితమే ఈ ఆసుపత్రిని సందర్శించి, పిల్లల వార్డునూ తనిఖీ చేశారు. శనివారం ఆయన అత్యవసర సమీక్ష అనంతరం హడావుడిగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆక్సిజన్ కొరత వల్ల ఎవరూ చనిపోలేదని స్పష్టం చేశారు. ఒకవేళ అదే జరిగితే అది అత్యంత హీనమైన చర్య అవుతుందన్నారు. అయినా ఆక్సిజన్ సరఫరా చేయాల్సిన గుత్తేదారు పాత్రపైనా విచారణ జరిపిస్తామని చెప్పారు. మెదడువాపు చాలా కాలం నుంచి యూపీలో సమస్యగా ఉందన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు: మౌర్య

లఖ్‌నవూ: గోరఖ్‌పూర్ ఆసుపత్రి ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య విలేకరులకు తెలిపారు. ముఖ్యమంత్రి ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారనీ, దోషులెవరో తేలిన తర్వాత చర్యలు ఉంటాయనీ చెప్పారు. పరిస్థితిని సమీక్షించడానికి ఆరోగ్యశాఖ మంత్రి సిద్ధార్థ్ నాథ్ సింగ్, వైద్యవిద్యా శాఖ మంత్రి అశుతోష్ టాండన్‌లు గోరఖ్‌పూర్‌కు బయల్దేరారు. గోరఖ్‌పూర్ ఎస్పీ మాత్రం ద్రవ ఆమ్లజని కొరత వల్ల 21 మంది చనిపోయినట్లు నివేదించారని హోం శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. 'బకాయిలు చెల్లించకపోతే ఆక్సిజన్‌ను నిలిపివేస్తామని ఆగస్టు ఒకటో తేదీన వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు గుత్తేదారు లేఖ రాశారు. ఆ లేఖను డైరెక్టర్ జనరల్‌కు పంపించారు. 7వ తేదీనే కళాశాల ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. గుత్తేదారుకు చెల్లింపులు మాత్రం 11వ తేదీన జరిగాయి. ఈ జాప్యానికి కారణాలనూ దర్యాప్తులో తేలుస్తామని' యూపీ ఆరోగ్య విద్యా శాఖ మంత్రి అశుతోష్ టాండన్ తెలిపారు.

అనుప్రియ పటేల్‌కు ప్రధాని ఆదేశం

దిల్లీ: యూపీలో చోటు చేసుకున్న ఘోరంపై ప్రత్యక్ష పరిశీలన నిమిత్తం వెంటనే గోరఖ్‌పూర్ వెళ్లాల్సిందిగా కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్, ఆరోగ్య శాఖ కార్యదర్శి సి.కె.మిశ్రలకు ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. పరిస్థితిని ప్రధాని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని ఆయన కార్యాలయం తెలిపింది. ఆరోగ్యశాఖ మంత్రి జె.పి. నడ్డా ఆదేశాలపై నిపుణుల బృందాన్నీ గోరఖ్‌పూర్‌కి పంపించారు. నివేదిక సమర్పించాల్సిందిగా రాష్ట్ర వైద్య శాఖను ఆయన ఆదేశించారు.

ఆక్సిజన్ నిలిపివేతే కారణం: సాక్షి మహరాజ్

ఉన్నావ్ (యూపీ): గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో పసికందులు ప్రాణాలు కోల్పోవడానికి ఆక్సిజన్ సరఫరా నిలిపివేతే కారణమని భాజపా ఎంపీ సాక్షి మహరాజ్ స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే: కాంగ్రెస్

దిల్లీ: యూపీ ఆసుపత్రి ఘటన దృష్ట్యా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆరోగ్యశాఖ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్‌లు నైతిక బాధ్యత తీసుకుని రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడానికి బాధ్యులైన వారందరిపై నేరపూరిత నిర్లక్ష్యం కింద కేసులు నమోదు చేయాలని పార్టీ అధికార ప్రతినిధి మనీష్ తివారీ శనివారం విలేకరుల సమావేశంలో విజ్ఞప్తి చేశారు. గోరఖ్‌పూర్ వెళ్లిన సీనియర్ కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ కూడా ఇదే డిమాండ్ చేశారు. నెపాన్ని వైద్యులపై నెట్టేయడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలన్నారు. రాష్ట్ర అటు యూపీలో కూడా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఇదే విధమైన డిమాండ్ చేశాయి.

ప్రాణాలు పోయాక మేలుకున్నారు

- హడావుడిగా కొంతమొత్తం చెల్లించారు!
- ముందే లేఖరాసి అశక్తత వ్యక్తం చేశాం
- ఆక్సిజన్ పంపిణీదారు వెల్లడి

లఖ్‌నవూ/గోరఖ్‌పూర్

అభంశుభం తెలియని చిన్నారుల జీవితాలను అర్ధాంతరంగా చిదిమేసిన గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆసుపత్రిలో 'ఆక్సిజన్ సరఫరా నిలిపివేత' వ్యవహారంలో కొన్ని నివ్వెరపోయే నిజాలు తాజాగా వెలుగుచూశాయి. ఆ ఆసుపత్రిలో ఆక్సిజన్ నిలవచేసి వివిధ విభాగాలకు సరఫరా చేసే విధులు నిర్వహించే ఉద్యోగులు గురువారం(పదోతేదీ) ఉదయమే పరిస్థితిని గమనించి ఉలిక్కిపడ్డారు. ఆసుపత్రి స్టోర్‌లో ఆక్సిజన్ నిల్వలు అడుగంటుతున్నాయనీ...బహుశా ఆ రోజు రాత్రి గడవటం కూడా కష్టమని భయాందోళనలు వ్యక్తం చేస్తూ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసరుకు పదేపదే విన్నవించారు. అయినా.. ప్రయోజనం లేకపోయింది. 30 మంది పసిబిడ్డల ప్రాణాలు గాలిలో కలిసిపోయిన తర్వాత కానీ... బీఆర్‌డీ ఆసుపత్రి అధికారులు మేలుకుని స్పందించలేదు. 48 గంటల వ్యవధిలో 30 మంది చిన్నారులు చనిపోయిన తర్వాత హడావుడిగా రూ.20 లక్షల 84 వేలను సదరు ఆక్సిజన్ సిలిండర్ల పంపిణీదారుకు చెల్లించారు. బీఆర్‌డీ ప్రభుత్వ ఆసుపత్రిలో భారీ లొసుగుల ఆరోపణలు ఈ దయనీయ ఘటనతో ఒక్కసారిగా వాస్తవ రూపం దాల్చి కలవరపరచేలా కళ్లెదుట నిలిచాయి.

జీతాలకే గతిలేదు

ఈ ఆసుపత్రిలో మెదడువాపు వ్యాధి పునరావాస విభాగంలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, వార్డ్‌బాయ్‌లు. ..ఇతరత్రా సిబ్బంది ఎవరికీ గత రెండేళ్లుగా జీతాలు సరిగా రావడం లేదు. నవజాత శిశు సంరక్షణ విభాగంలో సిబ్బంది గత ఆరునెలలుగా జీతంరాళ్లను కళ్ల చూసి ఎరుగరు. వైద్యుల కొరత కూడా ఆసుపత్రిని పట్టి పీడిస్తోంది. నలభై మంది చిన్నారులను చూడటానికి కనీసం ఒక్క వైద్యుడు కూడా లేడు.

ప్రభుత్వ సారథ్యంలోని బాబా రాఘవ్ దాస్ (బీఆర్‌డీ) వైద్యకళాశాల ఆసుపత్రికి ఎంతో కాలం నుంచీ 'పుష్పా సేల్స్' సంస్థ ఆక్సిజన్ సిలిండర్లను పంపిణీ చేస్తోంది. రాజస్థాన్‌లోని రేవారిలో ఉన్న 'ఐనాక్స్' కంపెనీ నుంచి కొనుగోలు చేసిన ఆక్సిజన్ సిలిండర్లను 'పుష్పాసేల్స్' పంపిణీ మాత్రమే చేస్తుంది. అయితే, సకాలంలో ఆసుపత్రి నుంచి బకాయిల చెల్లింపు జరగలేదు. ఆసుపత్రి చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఒక్కరూపాయి కూడా రాలేదనీ...తమ వద్ద నిధుల్లేవంటూ ఆసుపత్రి అధికారులు ఎప్పటికప్పుడు తిప్పి పంపారనీ 'పుష్పాసేల్స్' సంస్థ ప్రతినిధి దీపాంకర్ శర్మ చెప్పారు. బకాయిల వసూలుకు ఫిబ్రవరి నుంచీ ఆసుపత్రి చుట్టూ కాళ్లరిగేలా తిరిగానన్నారు. ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రను కూడా కలుసుకుని విషయాన్ని వివరించానన్నారు.

బకాయిల మొత్తం ఆగస్టు ఒకటో తేదీ నాటికి రూ.63,65,702కు చేరుకుంది. ఇకపై ఇలాగే అరువుమీద ఆక్సిజన్ సిలిండర్లను అందచేయలేమనీ...తాము ఆక్సిజన్‌ను కొనుగోలు చేస్తున్న 'ఐనాక్స్' యాజమాన్యం కూడా డబ్బు చెల్లించనిదే ఇవ్వలేమంటూ నిష్కర్షగా చెప్పినట్లు దీపాంకర్ శర్మ తెలిపారు. అప్పటికీ తమ సొంత డబ్బు వెచ్చించి కూడా కొంతకాలం పాటు సరఫరా ప్రక్రియను కొనసాగించామన్నారు. అదే విషయాన్ని వివరిస్తూ ఈ నెల 8వ తేదీ బీఆర్‌డీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు లేఖ రాశామన్నారు. బకాయిల మొత్తాన్ని తక్షణం చెల్లించాల్సిందిగా కోరామన్నారు. తమకు కూడా 'ఐనాక్స్' ఆక్సిజన్ పంపడం లేదనీ...మరో నాలుగైదు రోజుల వరకూ మాత్రమే సరఫరా చేయగలుగుతామనీ... ఇక ఆపై తమ వల్ల కాదని కూడా చివరిసారిగా స్పష్టం చేసినట్లు చెప్పారు.

ఇంత వివరంగా తమ బాధను తెలియచెప్పినప్పటికీ.. ...బీఆర్‌డీ వైద్యకళాశాల వారు పట్టించుకోనేలేదనీ గత్యంతరం లేనిస్థితిలో ఆక్సిజన్ సిలిండర్ల సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. చివరకు పసికూనలు చనిపోయిన తర్వాత హడావుడిగా తమకు హడావుడిగా రూ.20 లక్షల 84 వేలను చెల్లించారన్నారు.

అసలే ఆ ప్రాంతం....

నిజానికి గోరఖ్‌పూర్‌లోని బీఆర్‌డీ ఆసుపత్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాకాలంలో మెదడువాపు ముప్పు ముంచు కొస్తుంది. ఈ ఏడాది జనవరి నుంచీ ఆగస్టు 8వ తేదీ వరకూ బీఆర్‌డీలో మెదడువాపుతో 476 మంది రోగులు చికిత్సకోసం చేరగా 117 మంది మరణించారు. ఇవే వార్డుల్లో.... అదే సమయంలో(అంటే 30 మంది చిన్నారులు మృత్యువాత పడిన) 18 మంది పెద్దవారు మరణించినప్పటికీ... ఆ చేదు నిజం దాదాపుగా మరుగున పడిపోయిన విషయం గమనార్హం.

ఎప్పుడైతే 'పుష్పాసేల్స్' సంస్థ బకాయిల కోసం పట్టుబడుతూ...ఇకపై తాము ప్రాణవాయువును సరఫరా చేసేదే లేదని చెప్పిందో...అప్పుడే స్థానిక మీడియా కూడా ఆసుపత్రి వర్గాలను హెచ్చరించింది. పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారన్న వార్త దావానలంలా వ్యాపించడంతో మీడియా అక్కడికి హడావుడిగా పరిగెత్తి వెళ్లిన తర్వాతే జిల్లా కలెక్టరు విలేకరులనుద్దేశించి మాట్లాడటం గమనార్హం.


గోరఖ్‌పూర్‌లోని ఆసుపత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆక్సిజన్ సిలిండర్లు సరిగ్గా పనిచేస్తున్నాయో, లేదో సరి చూస్తున్న ఆసుపత్రి ఉద్యోగి

కశ్మీరులో ఎదురు కాల్పులు ఇద్దరు సైనికుల మృతి

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఉగ్రవాదులు, భద్రత దళాల మధ్య శనివారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు సైనికులు మరణించారు. ముగ్గురు గాయపడినట్లు పోలీసులు శనివారం రాత్రి తెలిపారు. గాయపడిన సైనికుల్లో ఒకరు కెప్టెన్ అని వెల్లడించారు. ఉగ్రవాదుల ఉనికిపై సమాచారం అందుకున్న భద్రత దళాలు జైనాపోరా ప్రాంతంలోని అవ్‌నీరా గ్రామంలో గాలింపు చర్యలు చేపట్టాయి. విషయాన్ని పసిగట్టిన ఉగ్రవాదులు సైనికులపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో, భద్రత సిబ్బంది ఎదురు కాల్పులు జరిపినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. గాయపడిన సైనికులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కుప్‌వారా జిల్లా కలారోస్ ప్రాంతంలోని సైనిక భవనం వద్ద శుక్రవారం రాత్రివేళ ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో జవాను ఒకరు గాయపడ్డారు.

పాక్ సైన్యం కాల్పుల్లో జవాను సహా ఇద్దరి మృతి

జమ్మూ: నియంత్రణ రేఖ వెంబడి జమ్మూ-కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో పాక్ సైన్యం శనివారం కాల్పులకు తెగబడటంతో ఒక జవాను(42), మరో మహిళ(40) మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 5.15 గంటల ప్రాంతంలో పాక్ సైనికులు చిన్న తుపాకులు, ఆటోమేటిక్ ఆయుధాలు, మోర్టార్లతో కాల్పులకు దిగారు. గొహ్లాద్ కల్రాన్ గ్రామంలో ఒక ఇంటిలోకి మోర్టార్ షెల్స్ దూసుకెళ్లడంతో రఖియా బీ అనే మహిళ మృతి చెందారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కృష్ణ ఘాటీ సెక్టార్‌లో మరోసారి భారత శిబిరాలపైకి పాక్ సైనికులు కాల్పులకు తెగబడ్డారు. భారత సైన్యం దీటుగా జవాబివ్వడంతో పరస్పరం కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన నయిబ్ సుబేదార్ జగ్‌రామ్ సింగ్ తోమర్ ప్రాణాలు కోల్పోయారు.

చిక్కినట్టే చిక్కి తప్పించుకున్న ముసా

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో కరుడుగట్టిన ఉగ్రవాది జకీర్ ముసా.. భద్రతా దళాలకు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నాడు. సైనిక బలగాలపై రాళ్లు రువ్విన ఆందోళనకారులు అతడిని తప్పించడంలో సాయపడ్డారు.

హిజ్బుల్ ముజాహిదీన్ నుంచి వేరుపడిన ముసా.. అల్‌ఖైదా సాయంతో అన్సార్ ఘజావతుల్ హింద్ అనే సొంత ముష్కర ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. తన స్వగ్రామం నూర్‌పొరాలోని ఓ ఇంట్లో ఒక అనుచరుడితోపాటు మకాం వేసినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం భద్రతా దళాలు.. పీర్ మొహల్లా, షా మొహల్లా, డాగర్‌పొర, నూర్‌పొరా గ్రామాలను చుట్టుముట్టాయి. ఈ సమయంలో స్థానిక ఆందోళనకారులు భద్రతా దళాలపై రాళ్లు రువ్వడం మొదలుపెట్టాయి. బాష్పవాయు గోళాలతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. చీకటి పడటంతో భద్రతా దళాలు గాలింపును నిలిపివేశాయి. శనివారం గాలింపును తిరిగి కొనసాగించాయి. అయితే ఉగ్రవాదుల జాడ కనిపించలేదు. రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులను ఆసరాగా చేసుకొని చీకటి మాటున పరారై ఉంటారని భావిస్తున్నారు.

జెండా పండుగకు తిరుపతి సిద్ధం

- ఏర్పాట్లను పర్యవేక్షించిన జీఏడీ కార్యదర్శి శ్రీకాంత్
- పూర్తిస్థాయిలో పరేడ్‌కు సన్నద్ధమైన పోలీస్ యంత్రాంగం

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే

ఏడు పదుల జెండా పండుగకు.. ఏడు కొండల చెంత ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. రాష్ట్ర స్థాయి వేడుకలకు ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఏర్పాట్లలో నిమగ్నమైంది. శనివారం ఆంధ్రప్రదేశ్ సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, చిత్తూరు జిల్లా కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, ప్రొటోకాల్ డైరెక్టర్ లెఫ్టినెంట్ కల్నల్ అశోక్‌బాబు ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం జీఏడీ కార్యదర్శి శ్రీకాంత్ సాయంత్రం అధికారులతో అంతర్గతంగా సమీక్షించారు. చిత్తూరు కలెక్టర్ ప్రద్యుమ్న, ఏపీఎస్పీ ఐజీ మీనా, అనంతపురం రేంజి డీఐజీ ప్రభాకర్ రావు, ఏపీఎస్పీ డీఐజీ విజయకుమార్, తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, జేసీ గిరీషా, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరికిరణ్, సబ్‌కలెక్టర్ నిశాంత్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కీర్తి, జేసీ 2 చంద్రమౌళి ఇతర అధికారులు పాల్గొన్నారు. గ్యాలరీల్లో 5,580 మందికి వీలుగా సీట్లు కేటాయించారు. వీటిలో 2,160 వీవీఐపీలు, వీఐపీలకు నిర్దేశించగా, 3,420 విద్యార్థులు, సాధారణ ప్రజానీకానికి కేటాయించారు. ఎ1, ఎ2, బి1, బి2 గ్యాలరీలను వీవీఐపీలు, వీఐపీలకు కేటాయించారు.


సిద్ధమవుతున్న తారకరామా మైదానం

ముఖ్యమంత్రి వేదిక వద్ద ఏర్పాట్ల బాధ్యతను చిత్తూరు డ్వామా పీడీ కూర్మనాథ్‌కు అప్పగించారు. వీఐపీ గ్యాలరీ బాధ్యతలు డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాశ్‌రెడ్డికి కేటాయించారు..

నేటితో పూర్తవ్వాలి..: పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు ఆదివారం రాత్రికల్లా పూర్తి కావాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న యంత్రాంగాన్ని ఆదేశించారు.

ఆకట్టుకున్న పరేడ్: స్వాతంత్ర్య వేడుకల నమూనా ప్రదర్శన ఆకట్టుకుంది. పోలీస్ శాఖతో పాటు ఎన్‌సీసీ, సైనిక్‌స్కూలు, రెడ్‌క్రాస్ సొసైటీ, స్కౌట్, మాజీ సైనికులు ఎలాంటి తడబాటు లేకుండా కవాతు నిర్వహించారు. ఈ పరేడ్‌ను ఏపీఎస్పీ ఐజీ మీనా పర్యవేక్షించారు.

ప్రధాని పంద్రాగస్టు ప్రసంగంపై ప్రజల నుంచి ఆలోచనలు

దిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ఎర్రకోట బురుజులపై నుంచి తాను చేయబోయే ప్రసంగంలో ప్రజల ఆలోచనలకూ స్థానం కల్పించాలని ప్రధాని నిర్ణయించారు. దేశ రూపాంతరీకరణపై బలమైన ప్రభావం చూపిస్తాయనుకునే అంశాలను, ఆలోచనలను, సూచనలను ప్రధానికి చేరవేయడానికి 'నరేంద్ర మోదీ యాప్'ను గానీ, మైగవ్ వెబ్‌సైట్‌ను గానీ ప్రజలు ఉపయోగించుకోవచ్చని ఆ వర్గాలు తెలిపాయి.

వెనెజువెలాపై అమెరికా సైనిక చర్య..!

- మాకున్న ఐచ్ఛికాల్లో అదీ ఒకటి
- అక్కడ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది: ట్రంప్

వాషింగ్టన్

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత అక్కడ నెలకొన్న పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారిన దృష్ట్యా సైనిక చర్యకు పాల్పడాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. తమకున్న అనేక ఐచ్ఛికాల్లో అదొకటని చెప్పారు. అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్, ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ, జాతీయ భద్రత సలహాదారుడు హెచ్.ఆర్. మెక్‌మాస్టర్‌లతో సమావేశం అనంతరం శనివారం ఆయన ఈ ప్రకటన చేశారు. 'ఇది (వెనెజువెలా) మా పొరుగునే ఉన్న దేశం. అమెరికా దళాలు ప్రపంచమంతటా, అనేకానేక సుదూర ప్రాంతాల్లోనూ విస్తరించి ఉన్నాయి. వెనెజువెలా దూరంగా ఏమీ లేదు. అవసరమైతే అక్కడ సైనిక చర్య చేపట్టడం కూడా మా ఐచ్ఛికాల్లో ఒకటి' అని ట్రంప్ చెప్పారు. అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు వెర్రితనమనీ, అత్యంత అతివాదమనీ వెనెజువెలా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పడ్రినో పేర్కొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డొనాల్డ్ ట్రంప్

ప్రతిపక్ష ఆధిపత్యం ఉన్న జాతీయ అసెంబ్లీ స్థానంలో 545 మంది సభ్యులతో 'రాజ్యాంగ నిర్మాణ సభ'ను జులై 30న మదురో తన మద్దతుదారులతో ఏర్పాటు చేయడంతో వివాదం రాజుకొంది. వెనెజువెలా రాజధాని కారకస్ సహా వివిధ నగరాల్లో నిరసనకారులు వీధుల్లో వెల్లువెత్తి ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మదురోను ట్రంప్ ప్రభుత్వం నియంతగా పేర్కొంది. ఆయనపైనా, మరో 25 మంది తాజా/ మాజీ అధికారులపైనా ఆంక్షలు విధించింది. ఆ ప్రభుత్వం మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తోందనీ, ప్రజాస్వామ్యాన్ని తక్కువచేసి చూస్తోందనీ ఆక్షేపించింది. మదురో నుంచి వచ్చిన ఫోన్‌కాల్‌ను మాట్లాడడానికి ట్రంప్ నిరాకరించారని శ్వేతసౌధం తెలిపింది. అణచివేతకు గురవుతున్న ఆ దేశ ప్రజలకు అమెరికా బాసటగా నిలుస్తుందనీ, అక్కడ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాక ఆ దేశ నేతతో మాట్లాడడానికి ట్రంప్‌నకు ఆనందమేనని పేర్కొంది.

అణు, జీవ దాడిపై ప్రతిస్పందనకు సన్నద్ధమవుతున్న భారత్

దిల్లీ: రెండు అణ్వస్త్ర దేశాల నడుమ ఉండటంతో భారత సైనిక దళాలు తమ సన్నద్ధతను మెరుగుపరచుకుంటున్నాయి. భవిష్యత్‌లో దేశంపై రసాయన, జీవ, రేడియోధార్మిక, అణు (సీబీఆర్‌ఎన్) ఆయుధాలతో దాడి జరిగితే తట్టుకోవడానికి, వాటిపై అత్యవసర ప్రతిస్పందనకు ఒక శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. సైనిక దళాల వైద్య సేవల (ఏఎఫ్‌ఎంఎస్) విభాగం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. "భవిష్యత్‌లో సంప్రదాయేతర యుద్ధ ముప్పు పెరుగుతోంది. దీన్ని తట్టుకోవడానికి శిక్షణ కార్యక్రమం సిద్ధమైంది" అని రక్షణ శాఖకు అనుబంధంగా ఏర్పడిన స్థాయీ సంఘం తన నివేదికలో పేర్కొంది. చైనా, పాకిస్థాన్‌లతో సంబంధాలు నానాటికీ క్షీణిస్తున్న నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి.

ప్రధాని పేరుతో అక్రమ వసూళ్లు

కేసు నమోదు చేసిన సీబీఐ

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ పేరుతో అక్రమంగా విరాళాలు సేకరిస్తున్న ఓ హౌసింగ్ సొసైటీపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కేసు నమోదు చేసింది. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో నరేంద్రమోదీ విచార్ మంచ్ పేరుతో జేపీ సింగ్ అనే వ్యక్తి, మరి కొంత మందితో కలిసి ప్రజల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారని సీబీఐ దాఖలు చేసిన ప్రాథమిక దర్యాప్తు నివేదికలో పేర్కొంది. సొసైటీ ప్రధాని పేరును దుర్వినియోగం చేసిందని అందులో పేర్కొంది. సొసైటీ వెబ్‌సైట్‌లో అధ్యక్షుడు, ఇతర సభ్యులతో పాటు ప్రధాని చిత్రాలు కూడా ఉన్నాయి.

ఇరోమ్ షర్మిలా వివాహానికి తొలగిన అడ్డంకి

కొడైకెనాల్: మణిపూర్ పౌరహక్కుల ఉద్యమకారిణి ఇరోమ్ షర్మిలా వివాహానికి ఎట్టకేలకు అడ్డంకి తొలగిపోయింది. ఆమె తన భాగస్వామి, బ్రిటన్‌కు చెందిన డెస్మాండ్ క్యుటిన్హోను వివాహం చేసుకోవడానికి దరఖాస్తు చేయడంపై తలెత్తిన అభ్యంతరాలను కొడైకెనాల్ సబ్‌రిజిస్ట్రార్ కొట్టేశారు. వీరు జులై 12న ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం వివాహం చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. పర్వతప్రాంతంలో ఈ జంట నివాసం ఉండటం వల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని స్థానిక సామాజిక కార్యకర్త వి. మహేంద్రన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం ఇంతకు ముందే వివాహం జరిగినా, వివాహ వయస్సు రాని పక్షంలో, మానసిక పరిస్థితి సరిగాలేకపోతే అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చని కానీ ఇలాంటి వాటిని పరిగణించలేమని సబ్‌రిజిస్ట్రార్ తెలిపారు. మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆమె తన భాగస్వామితో కలిసి కొడైకెనాల్‌లో నివాసముండేందుకు ఇక్కడికి వచ్చారు.

కర్ణాటక నీటి విడుదల అనుమానమే?

ప్రయత్నాలను ముమ్మరం చేసిన తెలంగాణ ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: ఆలమట్టిలోకి ప్రవాహం తక్కువగా ఉండటం, రబీ అవసరాల దృష్ట్యా తెలంగాణ విజ్ఞప్తి మేరకు 15 టీఎంసీలను విడుదల చేయడం కష్టమేనని కర్ణాటక అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. మరికొంతకాలం చూసిన తర్వాతనే దీనిపై నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. మరోవైపు నీటి విడుదల కోసం కర్ణాటకపై తెలంగాణ మరింత ఒత్తిడి తేనున్నట్లు తెలిసింది. మంత్రి, అధికారుల స్థాయిలో చర్చలు జరపడంతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలతో కూడిన ఓ ప్రతినిధి బృందాన్ని కూడా పంపే ఆలోచనతో ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఈ సీజన్ ప్రారంభమైన తర్వాత మొదటి 70 రోజుల్లో శ్రీశైలంలోకి మూడు టీఎంసీలు మాత్రమే వచ్చాయి. నీటి మట్టం 778.2 అడుగులే ఉంది. నాగార్జునసాగర్ పరిస్థితి దయనీయంగా ఉంది. నీటి మట్టం 500.4 అడుగులకు పడిపోయింది. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నారాయణపూర్ నుంచి 15 టీఎంసీలు విడుదల చేయాలని మంత్రి హరీశ్‌రావు కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రి పాటిల్‌కు లేఖ రాశారు. 15 టీఎంసీలు కాకుండా కొంత తక్కువ ఇవ్వాలన్నా ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందనే అభిప్రాయాన్ని కర్ణాటక అధికారులు వ్యక్తం చేసినట్లు తెలిసింది.

ప్రతిభ ఆధారంగా ఏకరూప దుస్తులు!

- కేరళలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థ నిర్వాకం

మలప్పురం: ఒకే తరగతి గదిలోని విద్యార్థులకు వేర్వేరు ఏకరూప దుస్తులు (యూనిఫామ్) నిబంధన విధించిన కేరళలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులు, విద్యాధికారుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. పాందిక్కాడ్‌లోని అల్ ఫరూఖీ ఆంగ్ల మాధ్యమం పాఠశాల ప్రతిభ ఆధారంగా విద్యార్థులను విభజించి వారికి వేర్వేరు ఏకరూప దుస్తులు నిర్ణయించింది. ఈ చర్య తమ పిల్లల పట్ల వివక్ష చూపేలా ఉందని, వారి పసిమనసులను గాయపరిచేలా ఉందని తల్లిదండ్రులు జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. సీబీఎస్‌ఈకి అనుబంధంగా ఉన్న ఈ పాఠశాలలో తనిఖీలు జరిపిన అధికారులు రెండు రకాల ఏకరూప దుస్తుల విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించారు. అయినా ఆ ఆదేశాలను పట్టించుకోకపోవటంతో గట్టి చర్యలకు అధికారులు ఉద్యుక్తుల వ్వగా... చివరకు తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నట్లు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది.

కూలిన అమెరికా ఎఫ్‌-18 యుద్ధవిమానం

దుబాయి: అమెరికాకు చెందిన ఎఫ్‌-18 యుద్ధ విమానం శనివారం బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కూలిపోయింది. ఈ ప్రమాదం నుంచి పైలట్ క్షేమంగా బయటపడ్డాడని అమెరికా అధికారులు తెలిపారు. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న యూఎస్ఎస్ నిమిట్జ్ యుద్ధవిమాన వాహకనౌక నుంచి బయలుదేరిన ఈ విమానం ఇంజిన్‌లో లోపాలు తలెత్తడంతో బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్ బేస్‌లో దించడానికి పైలట్ ప్రయత్నించాడని, అది సాధ్యపడక పోవడంతో విమనాశ్రయంలో కూలిపోయినట్లు కమాండర్ బిల్ అర్బన్ తెలిపారు.

పెరిగిన ఉద్రిక్తత!

- అమెరికా-ఉత్తర కొరియా మాటల యుద్ధం
- కాలుదువ్వితే కఠిన చర్యలు: ట్రంప్
- 30 లక్షల మంది పోరుకు సిద్ధం: ఉ.కొరియా
- క్షిపణులు మోహరిస్తున్న జపాన్

వాషింగ్టన్, బీజింగ్, సియోల్, టోక్యో

అమెరికా, ఉత్తర కొరియాల మధ్య రోజురోజుకూ ఘర్షణ వాతావరణం పెరుగుతోంది. శనివారం జరిగిన సంఘటనలు దీనిని ధ్రువపరుస్తున్నాయి. మాటల యుద్ధం హద్దులు దాటి సవాళ్లు, ప్రతిసవాళ్లకు దారితీసింది. తమకు హాని తలపెట్టాలని చూస్తే కఠిన చర్యలు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌కు హెచ్చరించారు. అమెరికాకు వ్యతిరేకంగా పోరాడేందుకు సైన్యంలో చేరుతామంటూ 30.50 లక్షల మంది ముందుకొచ్చారని ఉత్తర కొరియా అధికారులు ప్రకటించారు. పరిస్థితులను గమనిస్తున్న సమీపదేశమైన జపాన్ తన క్షిపణి వ్యవస్థను సన్నద్ధం చేస్తోంది. 'ఈ రాత్రికే యుద్ధం ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామ'ని అమెరికా రక్షణ శాఖ అధికారులు, 'తుపాకులకు లాకులు వేసి మందుగుండు లోడు చేశామ'ని సాక్షాత్తూ ట్రంప్ ప్రకటించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇలాంటి ఉద్రికత్త వాతావరణాన్ని చల్లబరిచే సామర్థ్యం భారత్‌కే ఉందని అమెరికా నౌకాదళ కమాండర్ ఒకరు అభిప్రాయపడడం గమనార్హం.

మాపై కన్నేస్తే ఖబడ్దార్: ట్రంప్

అమెరికా, దాని మిత్రుల భూభాగంపై కన్నేస్తే కఠిన చర్యలు తప్పవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌కు మరోసారి హెచ్చరించారు. 'ఆయన ఒక హెచ్చరిక..అదీ బహిరంగ హెచ్చరిక చేస్తే (... వాస్తవానికి ఉన్, ఆయన కుటుంబ సభ్యులు గత కొన్నేళ్లుగా హెచ్చరిస్తునే ఉన్నారు...)నిజంగా, చాలా త్వరగా పశ్చాత్తాపపడాల్సి వస్తుంద'ని ప్రకటించారు. 'ఉత్తర కొరియా తెలివితక్కువతనంతో వ్యవహరిస్తే సైనికపర పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాం. కిమ్ జోంగ్ ఉన్ మరో మార్గాన్ని ఎన్నుకుంటారని ఆశిద్దామ'ంటూ ట్రంప్ ట్వీట్ చేశారు. ముఖ్యులతో సమావేశమయిన అనంతరం ట్రంప్ ప్రకటన చేస్తూ 'శాంతియుత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు

ఉద్రిక్తతలు పెంచే ప్రకటనలు వద్దు: జిన్‌పింగ్

ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చొరవ తీసుకొని డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేశారు. 'కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం, చర్యలు చేపట్టడాన్ని సంబంధిత పక్షాలూ మానుకోవాలి' అని హితవు పలికారు. రెచ్చగొట్టే, ఉద్రిక్తతలు పెంచే వ్యవహారశైలిని ఉత్తర కొరియా విడిచిపెట్టాల్సి ఉంటుందని ఇద్దరు అధ్యక్షులూ అభిప్రాయపడ్డారని శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి.

భారత్ చొరవ తీసుకుంటే బాగుంటుంది

ఉద్రికతలు తగ్గించడంలో భారత్ చొరవ తీసుకుంటే బాగుటుందని అమెరికా పసిఫిక్ కమాండ్ అధిపతి అడ్మిరల్ హ్యారీ హ్యారిస్ అభిప్రాయపడ్డారు. ఎలాంటి పాత్ర పోషించాలో ఆ దేశమే నిర్ణయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. 'భారత దేశమయితే గట్టిగా చెప్పగలదు. వారు వింటారు కూడా. పరిస్థితి తీవ్రత ఏమిటో ఉత్తర కొరియాకు అర్థమయ్యేలా చెప్పగలదని భావిస్తున్నా' అని వ్యాఖ్యానించారు.



ఉత్తరకొరియా దాడులు చేస్తే ప్రతిదాడి చేయడానికి వీలుగా జపాన్‌లోని కొనన్ వద్ద అత్యాధునిక క్షిపణుల మోహరింపు

జపాన్ అప్రమత్తత

అమెరికాకు చెందిన గ్వమ్ ద్వీపంపై క్షిపణులు ప్రయోగిస్తామని ఉత్తర కొరియా ప్రకటించిన నేపథ్యంలో జపాన్ తన పేట్రియాట్ క్షిపణులను సిద్ధం చేసింది. షిమానే, హిరోషిమా, కోచిల్లో పేట్రియాట్ అడ్వాన్స్‌డ్ కేపబిలిటీ-3 (పేక్-3) క్షిపణులను మోహరించింది. ఎహిమేలో క్షిపణి విధ్వంసక వ్యవస్థను ఏర్పాటు చేసింది.

అమెరికా బి-1 బాంబులు సిద్ధం

గ్వమ్ దీవిలో అమెరికా సూపర్‌సోనిక్ బి-1 బాంబులను సిద్ధం చేసింది. బి-1బి లాన్సర్ బాంబర్లను మోహరించామంటూ ట్రంప్ వాటి ఫొటోలను ట్విట్టర్‌లో పెట్టారు. అమెరికా వైమానిక దళానికి ఈ బాంబులు వెన్నెముకలాంటివి. గ్వమ్ దీవిలోని అండర్‌సెన్ విమాన స్థావరంలో ప్రస్తుతం ఇలాంటివి ఆరు ఉన్నాయి. ఇవి కాకుండా ఎఫ్‌-22, ఎఫ్‌-35 యుద్ధ విమానాలు, బి-2 బాంబులు కూడా ఇక్కడ ఉన్నాయి.

14 నిమిషాల్లో చేరనున్న ఉ.కొరియా క్షిపణి

ఉత్తర కొరియాలో క్షిపణి ప్రయోగిస్తే అది 14 నిమిషాల్లో గ్వమ్ దీవిపై పడుతుంది. గ్వమ్ దీవి తీరానికి 25 కి.మీ. దూరంలో సముద్రంలో పడేలా హ్వాసాంగ్-12 అనే మధ్యతరహా శ్రేణి క్షిపణులను ఆరింటిని ప్రయోగించాలని ఉత్తర కొరియా సైనికాధికారులు భావిస్తున్నట్టు ఆ దేశ అధికార మీడియా ప్రకటించింది.

ఎన్‌డీఏలోకి జేడీయూ!

- అమిత్‌షా ఆహ్వానం
- 19న లాంఛనంగా నిర్ణయం
- ఎన్‌డీఏ కన్వీనర్‌గా నీతీశ్!
- రాజ్యసభా పక్షనేతగా శరద్ యాదవ్‌కు ఉద్వాసన

దిల్లీ/పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఆధ్వర్యంలోని జేడీయూ.. భాజపా నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డీఏ)లో చేరేందుకు రంగం సిద్ధమైంది. దిల్లీలో భాజపా అధ్యక్షుడు అమిత్ షాతో శుక్రవారం నీతీశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జేడీయూని ఎన్‌డీఏలోకి ఆహ్వానించినట్లు అమిత్ షా శనివారం ట్విట్టర్‌లో తెలిపారు. కాగా ఎన్‌డీఏలో చేరే విషయమై ఈనెల 19న పట్నాలో జరిగే జేడీయూ జాతీయ కార్యనిర్వాహక సమావేశం సందర్భంగా లాంఛనంగా నిర్ణయం తీసుకోనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత కేసీ త్యాగి తెలిపారు.

నీతీశ్‌కు కీలక బాధ్యతలు! జేడీయే ఎన్‌డీఏలో చేరిన అనంతరం ఆ పార్టీకి కేంద్ర మంత్రివర్గంలో 2 స్థానాలు కేటాయించడం ఖాయమేనని రాజకీయ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. అలాగే నీతీశ్‌ను ఎన్‌డీఏ కన్వీనర్‌గా చేసే అవకాశం కూడా ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. జాతీయ స్థాయిలో నీతీశ్‌కు సముచిత ప్రాధాన్యం కల్పించాలని ప్రధాని మోదీ యోచిస్తున్నట్లు ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నీతీశ్ దక్షత, వ్యవస్థాపక నైపుణ్యాలు ఇతర రాష్ట్రాల్లో ఎన్‌డీఏను పటిష్టపరిచేందుకు ఉపయోగపడతాయని ఆయన సన్నిహితుడొకరు తెలిపారు.

జేడీయూ పక్షనేతగా ఆర్.సి.పి.సింగ్: రాజ్యసభలో జేడీయూ సభాపక్ష నేత పదవి నుంచి శరద్ యాదవ్‌ను ఆ పార్టీ ఎంపీలు తొలగించారు. సీనియర్ నేత ఆర్.సి.పి.సింగ్‌ను ఆ స్థానంలో నియమించారు. ఈమేరకు పార్టీ రాజ్యసభ సభ్యులంతా ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడును కలిసి, కొత్తనేత నియామక లేఖను అందజేసినట్లు జేడీయూ నాయకుడొకరు తెలిపారు. ఇటీవల బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు జేడీయూ భాజపాతో జతకట్టగా.. ఆ నిర్ణయాన్ని అదే పార్టీకి చెందిన కీలక నేత శరద్ యాదవ్ వ్యతిరేకించిన సంగతి తెలిసిందే.

నాతోనే నిజమైన జేడీయూ.. శరద్: నిజమైన జేడీయూ పార్టీ తనతోనే ఉందని.. నీతీశ్‌తో ఉన్నది 'సర్కారీ' జేడీయూ అని శరద్ యాదవ్ వ్యాఖ్యానించారు. బిహార్ పర్యటనలో ఉన్న యాదవ్ మాట్లాడుతూ తమ పార్టీ ఇప్పటికీ ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో కూడిన మహాకూటమిలో భాగమేనని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. జేడీయూ ఒక్క నీతీశ్ కుమార్ పార్టీ కాదని.. అతనికి చెందిన పార్టీ మాత్రమేనని వివరణ ఇచ్చారు.

డోక్లాంపై చైనా అపరిపక్వ వైఖరి

- భారత్ ఎంతో పరిణతితో వ్యవహరిస్తోంది
- అమెరికా వ్యూహ నిపుణుడి వ్యాఖ్య

వాషింగ్టన్: భారత్, చైనాల మధ్య తీవ్ర ప్రతిష్టంభనకు కారణమైన డోక్లాం వివాదంలో భారత్ ఎంతో పరిణతితో వ్యవహరిస్తోందని అమెరికా వ్యూహ నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు. అదే సమయంలో చైనా వ్యవహరిస్తున్న తీరును కౌమారవయస్సు పిల్లల చేష్టలతో పోల్చారు. సరిహద్దు వివాదంలో దిల్లీ స్పందన సరైన రీతిలో ఉందని, వివాదంపై వెనకడుగు వేయటం కానీ చైనా మాదిరిగా పరుషపదజాలాన్ని ఉపయోగించటం కానీ చేయకుండా ఎంతో సంయమనాన్ని పాటిస్తోందని యూఎస్ నావల్ వార్ కాలేజ్ ఆచార్యులు జేమ్స్ ఆర్ హోమ్స్ అన్నారు. బలమైన పొరుగుదేశంతో సరిహద్దు వివాదాన్ని కొనసాగిస్తున్న చైనా వైఖరి అసాధారణమైనదిగా పేర్కొన్నారు. "సముద్రజలాల్లో ఆధిక్యాన్ని సాధించాలని చైనా కోరుకుంటున్నట్లయితే ఇరుగుపొరుగు దేశాలతో సమస్యలు తలెత్తని విధంగా సరిహద్దులను సుస్థిరపరచుకోవాలి" అని హోమ్స్ వ్యాఖ్యానించారు. హిమాలయాల పరిధిలో భారత్‌తో ఘర్షణ పడటం ఏవిధంగా చూసినా సహేతుకమైన చర్య కాబోదన్నారు. డోక్లాం వివాదంలో అమెరికా ఎందుకు మౌనం వహిస్తుందని ప్రశ్నించగా...ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే పలు అంశాలతో తలమునకలుగా ఉందని తెలిపారు. "డోక్లాం వివాదం తీవ్రతరమైన పక్షంలో అమెరికా మద్దతు భారత్‌కు లభించే అవకాశమే అధికం. అయితే, ప్రధాని మోదీ, ఆయన సలహాదారులు అమెరికా జోక్యాన్ని కోరుకోవటంలేదు. దీ నివల్ల అంతగా ఉపయోగం ఉండకపోవచ్చు" అని జేమ్స్ హోమ్స్ అన్నారు.

దౌత్యమార్గాల్లో పరిష్కరించుకోవాలి: అమెరికా కమాండర్: భారత్‌చైనాల మధ్య వివాదం ఆందోళనకరమైన అంశమేనని, ఇరుపక్షాలు దౌత్యపరమైన మార్గాల్లో విభేదాలను పరిష్కరించుకోవాలన్నదే తమ దేశ వైఖరని అమెరికా పసిఫిక్ కమాండ్‌కు చెందిన కమాండర్ అడ్మిరల్ హ్యారి బి హ్యారిస్ అభిప్రాయపడ్డారు. రెండు బలమైన దేశాల మధ్య ఘర్షణ ప్రమాదకరమన్నారు. దక్షిణ, తూర్పు చైనా సముద్ర ప్రాంతాల్లో చైనా ఘర్షణ పూరిత వైఖరితో ఉందని, అక్కడి యథాతథ స్థితిని మార్చాలని ఆ దేశం ప్రయత్నిస్తోందన్నారు. అలాంటి పరిస్థితి డోక్లాంలో పునరావృతం కాకుండా భారత్ దృఢవైఖరిని కనబరచాలని హ్యారిస్ అన్నారు.

అసంపూర్తిగానే ముగిసిన సైనికాధికారుల భేటీ: డోక్లాం వివాదానికి సంబంధించి శుక్రవారం నాటి భారత్, చైనాలకు చెందిన సీనియర్ సైనికాధికారుల సమావేశం (ఫ్లాగ్ మీటింగ్) ఎలాంటి పురోగతిలేకుండానే ముగిసింది. డోక్లాం నుంచి భారత సైనికులు వెనక్కు వెళ్లాలన్న వైఖరినే చైనా సైనికాధికారులు పునరుద్ఘాటించారని భారత వర్గాలు వెల్లడించాయి.

చైనా త్రిముఖ యుద్ధ వ్యూహం!

- డోక్లాం విషయంలో... భారత్‌పై ప్రయోగం
- దక్షిణ చైనా సముద్ర వివాదం నాటి విధానాలతో ముందుకు


దిల్లీ: భారత్‌పై చైనా "త్రిముఖ యుద్ధ వ్యూహం" ప్రయోగిస్తోందా...? మూడు మార్గాల్లో నుంచి చాప కింద నీరులా దెబ్బ తీస్తోందా? అవుననే అనిపిస్తోంది తాజా పరిణామాలు చూస్తుంటే! డోక్లాం ప్రతిష్టంభనలో చైనా ప్రతి అడుగూ ఈ వాదనకు మరింత బలం చేకూరుస్తోంది.

ఏమిటీ వ్యూహం? ప్రజలు/మీడియా, మానసిక, న్యాయ పోరాటాలతో శత్రువులను దెబ్బతీయడమే త్రిముఖ యుద్ధ వ్యూహం. 2003లో చైనా సైన్యం దీన్ని తెరమీదకు తెచ్చింది. 2010లో దీనికి మరింత పదును పెట్టింది. ' 'దక్షిణ చైనా సముద్రం" సహా పలు వివాదాస్పద అంశాల్లో చైనా దీన్నే అస్త్రంగా ప్రయోగించింది. ప్రస్తుతం డోక్లాం విషయంలోనూ అవే సూచనలు కనిపిస్తున్నాయి.

ఫిలిప్పీన్స్‌పై తొలి అస్త్రం: తొలిసారిగా ఈ వ్యూహాన్ని ఫిలిప్పీన్స్‌పై చైనా అమలుచేసింది. దక్షిణ చైనా సముద్రంపై చైనా ఆధిపత్యానికి వ్యతిరేకంగా 2016లో ఐరాస సముద్ర సంబంధిత హక్కుల ట్రైబ్యునల్ (యూఎన్‌సీఎల్‌వోఎస్) తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఫిలిప్పీన్స్‌కు ఆనాడు విజయం దక్కినా ఫలితం లేకుండా పోయింది. చైనా త్రిముఖ వ్యూహాన్ని ఉపయోగించి ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యూటెర్ట్‌ను తనవైపునకు తిప్పుకొంది. దీంతో చైనా అధిపత్యాన్ని ఫిలిప్పీన్స్ అంగీకరించినట్లయింది.

మీడియాను ప్రభావితం చేస్తూ..: డోక్లాం వివాదంలో దేశీయ, అంతర్జాతీయ మీడియాను ప్రభావితం చేసేందుకు చైనా ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా తమ చర్యలకు అందరూ వత్తాసు పలికేలా చేసుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. 2012నాటి మూడు దేశాల కూడలి (ట్రై జంక్షన్) ఒప్పందాన్ని తమకు అనుకూలంగా మీడియాలో నిర్వచించుకోవడం దీనిలో భాగమే. ముఖ్యంగా మీడియాను అడ్డుపెట్టుకొని భారత్ అడుగులు పడకుండా చేసేందుకు ప్రయత్నిస్తోంది.

మానసికంగానూ...: తాము చెబుతున్న కథలు, ఇస్తున్న వివరణలు, చేస్తున్న వ్యాఖ్యలు భారత మీడియా సంస్థల్లోనూ వచ్చేలా చైనా జాగ్రత్త వహిస్తోంది. దీంతో భారత ప్రభుత్వ వాదనపై భారతీయుల్లో సందేహాలు రేకెత్తించాలని, డోక్లాం నుంచి బలగాలను వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తేవాలని భావిస్తోంది. విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌ను అబద్ధాల కోరుగా అభివర్ణించడమూ దీనిలో భాగమే. సిక్కిం విషయంలో తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటామని, కశ్మీర్ అంశంలో జోక్యం చేసుకుంటామని వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. భారత సైన్యం సామర్థ్యాన్ని తక్కువచేసి చూపించడం, విస్మయానికి గురిచేయడం లాంటి ఉద్దేశాలే దీనికి వెనకున్నట్లు కనిపిస్తోంది.



న్యాయ పోరాటాలతో...: డోక్లాం విషయంలో భూటాన్ తమ సార్వభౌమత్వాన్ని అంగీకరించిందని గతవారం చైనా అధికారులు తెలిపారు. ఈ వ్యాఖ్యలను భూటాన్ ఖండించింది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన మాత్రం విడుదలచేయలేదు. ఆనాడు ఫిలిప్పీన్స్ కూడా ఇలానే చేసింది.

సూర్యగ్రహణ సమయంలో 'బల్లి మనిషి' కనిపించొచ్చు

- తన పౌరులకు దక్షిణ కరోలైనా రాష్ట్ర హెచ్చరిక


వాషింగ్టన్: సాంకేతిక పరిజ్ఞాన పరంగా ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న అమెరికాలో విచిత్ర జాఢ్యాలకూ కొదవలేదు. ఈ నెల 21న సంభవించబోయే సంపూర్ణ సూర్యగ్రహణం సమయంలో కొన్ని అతీంద్రియ పరిణామాలు చోటుచేసుకోవచ్చని దక్షిణ కరోలైనా రాష్ట్ర అత్యవసర నిర్వహణ విభాగం (ఎస్‌సీఈఎండీ) తన కౌంటీల్లోని పౌరులకు హెచ్చరిక జారీ చేసింది. సూర్య గ్రహణమనేది అంతరిక్షంతో ముడిపడిన అంశం కాబట్టి.. గ్రహాంతరవాసులతో కూడిన ఫ్లయింగ్ సాసర్ల వంటివి కనిపించొచ్చన్నది ఈ హెచ్చరిక సారాంశమై ఉంటుందనుకుంటే మనం బోల్తా పడినట్లే. అందుకు భిన్నంగా.. విచిత్రమైన భారీ 'బల్లి మనిషి' తారసపడవచ్చని ఆ సందేశం చెబుతోంది.

అయితే ఇదేదో జనాన్ని ఆటపట్టించడానికి చేసిన ప్రకటన కాదని అధికారులు చెబుతున్నారు. దక్షిణ కరోలైనాలో ఇలాంటి బల్లి మనిషి దర్శనమిచ్చిన ఉదంతాలు లోగడ చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఒక మ్యాప్‌ను కూడా విడుదల చేశారు. అలాగే సౌర గ్రహణం కనిపించే ప్రాంతాలనూ అందులో చూపారు. అక్కడి వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సంపూర్ణ సూర్యగ్రహణంతో ముడిపడి ఉన్న అతీంద్రియ పరిణామాలపై ఇటీవల మీడియాలో వచ్చిన వార్తలకు స్పందనగా ఈ మ్యాప్‌ను విడుదల చేసినట్లు ఎస్‌సీఈఎండీ తెలిపింది. "సూర్యగ్రహణం సమయంలో ఈ బల్లిమనిషి మరింత చురుగ్గా మారతాడా అన్నది మాకు తెలియదు. అయితే లీ, సమ్టర్ కౌంటీల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని కోరింది.

ఈ బల్లి మనిషిని తొలిసారి 1988లో క్రిస్టోఫర్ డేవిస్ అనే వ్యక్తి చూసినట్లు చెబుతారు. అప్పట్లో అతడి వయసు 17 ఏళ్లు. అతడి కథనం ప్రకారం.. మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతడు.. తన కారులో ప్రయాణిస్తున్నాడు. స్కేప్ ఓర్ స్వాంప్ అనే ప్రదేశం వద్దకు చేరుకోగానే టైరు పంక్చరైంది. దీంతో అతడు టైరును మార్చాడు. తిరిగి కారులోకి ప్రవేశించే సమయంలో తనకు 30 గజాల దూరంలో చింతనిప్పుల్లాంటి ఎర్రటి కళ్లతో కూడిన భూతం ఒకటి కనిపించినట్లు అతడు తెలిపాడు. ఒక్క క్షణం పాటు అతడు కొయ్యబారిపోయాడు. అంతలోనే తేరుకొని.. ఒక్క ఉదుటున కారులోకి ప్రవేశించి, కారును ముందుకు దూకించాడు. ఈ జీవి.. అతడి కారు పైకప్పు మీదకు దూకింది. దాన్ని తోసివేసేందుకు అతడు ప్రయత్నించాడు. కానీ గంటకు 40 మైళ్ల వేగంతో కారు దూసుకెళుతున్నప్పటికీ అది కొద్దిదూరం పాటు నిలకడగానే ఉంది.

డేవిస్ కథనం.. అప్పట్లో అంతర్జాతీయంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. నెల రోజుల తర్వాత ఇద్దరు పోలీసులు కూడా 'అలాంటిదేదో ఉన్నట్లు' తాము నిర్ధారణగా చెప్పగలమని పేర్కొన్నారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాల్లో దక్షిణ కరోలైనాలోని పలువురు దీన్ని చూసినట్లు చెబుతారు. 2015 లోనూ అది కనిపించినట్లు పేర్కొన్నారు.

నరకం చూపిన బస్సులు



- బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు 26 గంటల సమయం
- పన్నులు తప్పించుకోడానికి అడ్డదారుల్లో .. అడవి మార్గాల్లో ప్రయాణం
- ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం.. పిల్లలకు పాలు లేక ఇబ్బందులు
- ఒకరి నిశ్చితార్థం నిలిచిపోయింది.. మరొకరి సీమంతం ఆగిపోయింది
- ప్రైవేటు ట్రావెల్స్‌పై ప్రయాణికుల ఆగ్రహం.. పోలీసులకు ఫిర్యాదు

ఈనాడు, హైదరాబాద్
హోస్పేట, న్యూస్‌టుడే

బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు పదిగంటల్లో రావాల్సిన ప్రైవేట్ ట్రావెల్ బస్సులు 26 గంటలు ప్రయాణించాయి.. అందులో ప్రయాణించినవారికి అడుగడుగునా నరకాన్ని చూపించాయి. ఈ బస్సు యాజమాన్యాల నిర్వాకం వల్ల శుభకార్యాలు కూడా ఆగిపోయాయి. మార్నింగ్ స్టార్ ట్రావెల్స్‌కు చెందిన నాలుగు బస్సుల్లో బెంగళూరు నుంచి 120 మంది ప్రయాణికులు టికెట్లు కొనుక్కున్నారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు బస్సులు అక్కడ బయలుదేరాయి. శనివారం ఉదయం 6 గంటలకు లేచి చూడగా.. బస్సులు ఇంకా బెంగళూరు పరిసర ప్రాంతాల్లోనే చక్కర్లు కొడుతున్నాయి. అదేమని ప్రశ్నిస్తే.. బెంగుళూరు-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని.. అందుకే కొద్దిగా ఆలస్యమవుతుందని డ్రైవర్లు చెప్పారు. కాని హైదరాబాద్ చేరేసరికి రాత్రి 9 గంటలైంది. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు బెంగళూరులో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి.. హైదరాబాద్‌లోని అరాంఘర్‌కు శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంది.

ఏం జరిగింది?

బెంగళూరు నుంచి హిందూపురం, అనంతపురం, కర్నూలు మీదుగా రావాల్సిన బస్సుల్ని బెంగళూరు, హోస్పేట రహదారుల్లోని అడవి మార్గాల్లో తీసుకువచ్చారనేది ప్రయాణికుల ఆరోపణ. అలాగే దారి సుంకాలను తప్పించుకోడానికి అడ్డదారుల్లో తీసుకువచ్చారని కొందరు చెబుతున్నారు. దీనికితోడు రాత్రి బెంగళూరు దాటిన కొద్దిసేపటికే ఒకచోట కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభ ఉందంటూ పోలీసులు 3 గంటలపాటు బస్సులు, ఇతర వాహనాలను నిలిపేయడంతో మరింత ఆలస్యమైంది. ఇవన్నీ కలిసి ప్రయాణికులకు నరకయాతన తప్పలేదు. గంటలు గడిచినా హైదరాబాద్‌కు చేరకపోవడంతో డ్రైవర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

డ్రైవర్ల నిర్లక్ష్యం

మహిళలు, చిన్నారులు ఆకలవుతుందని చెప్పినా డ్రైవర్లు సరిగా స్పందించలేదని ప్రయాణికులు వాపోయారు. మార్నింగ్ స్టార్ బస్సులు శనివారం సాయంత్రం 5 గంటలు దాటాక అడవిదారుల్లోంచి బయటపడి జాతీయ రహదారిపైకి అడుగుపెట్టాయి. అప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్న ప్రయాణికులు జడ్చర్ల వద్ద నాలుగు బస్సులను ఆపేశారు. అక్కడ రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు బస్సుల నిర్వాహకులను ఫోన్‌లో ప్రశ్నించారు. 'అవును సార్.. ఒక్కోసారి ఆలస్యమవుతుంది.. భరించాలంటూ' దురుసుగా సమాధానమిచ్చారు. అధికారుల స్పందనా అంతంతమాత్రంగా ఉండడంతో ప్రయాణికులు మిన్నకున్నారు. చివరకు శనివారం రాత్రి 9 గంటల సమయంలో వారి బస్సులు ఆరాంఘర్ చౌరస్తాకు చేరుకున్నాయి. ప్రయాణికుల్లోని ఒక యువకుడి నిశ్చితార్థం వాయిదా పడగా.. ఒక యువతి సీమంతం ఆగిపోయింది. మరొకరు పెళ్లి కోసం వచ్చారు. కాని అప్పటికే పెళ్లి తంతు పూర్తికావడంతో ఆవేదన చెందారు. ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చూశారు. పాలు లేక పిల్లలు రోదించారు.

పోలీసులకు ఫిర్యాదు..

హైదరాబాద్‌కు చెందిన ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు బెంగళూరులో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరింది. హైదరాబాద్‌లోని అరాంఘర్‌కు శనివారం మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. దీంతో ఆగ్రహించిన ప్రయాణికులు బస్సును నేరుగా రాజేంద్రనగర్ పోలీస్ ఠాణాకు తీసుకువచ్చారు. బెంగళూరు నుంచి హైదరాబాద్ ప్రయాణానికి 16 గంటల సమయం తీసుకోవడంతో తామంతా ఇబ్బందిపడ్డామని, పైగా సాధారణ ఛార్జీకన్నా నాలుగింతలు ఎక్కువగా వసూలు చేసినవాళ్లు కనీసం సకాలంలో గమ్యానికి చేర్చకుండా ఇబ్బందిపెట్టారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రూ.550 ఉన్న టికెట్ ధరకు రూ. 2,500 వసూలు చేశారని బస్సు నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యజమాని చెప్పినట్లే చేశాం..

యాజమాన్యం ఆదేశాల మేరకే వారు చెప్పిన మార్గంలో బస్సులను తీసుకువచ్చానని డ్రైవర్ పోలీసులకు చెప్పాడు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ఉమేందర్ తెలిపారు.

అద్దెది కాదు.. అసలు గర్భమే!


- డీఎన్ఏ ఫలితంతో ముగిసిన సరోగసీ వివాదం

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని పేట్లబుర్జు ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో అద్దె గర్భం (సరోగసీ) కాన్పు వివాదానికి తెరపడింది. గతనెల 20న ఓమహిళకు సరోగసీ కాన్పు జరిగిందని ప్రచారమైంది. ఈ వ్యవహారంలో కాన్పు జరిగిన మహిళది అసలు గర్భమేనని జన్మించినది ఆమె శిశువేనని డీఎన్ఏ పరీక్షల నివేదికలో తేలింది. మహబూబ్‌నగర్‌కు చెందిన లక్ష్మణ్ (38), వెతెంకటమ్మ (26) దంపతులు కుటుంబ కలహాలతో కొన్నాళ్లుగా వేరుగా ఉంటున్నారు. వెంకటమ్మ హయత్‌నగర్‌లో నివసిస్తోంది. ఈక్రమంలో అద్దె గర్భం కోసం ఆమెను అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అరుణ సంప్రదించింది. గుంటూరుకు చెందిన సుధారాణి, శైలేశ్ దంపతులకు అద్దెగర్భంలో బిడ్డను ప్రసవిస్తే రూ.5 లక్షలు ఇస్తారని చెప్పింది. ఇందుకు ఆమె ఒప్పుకుని తన పేరును సుధారాణిగా మార్చుకుంది. ఆమెకు సనత్‌నగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఆమె భర్తతో కలిసున్న సమయంలోనే నెల తప్పడంతో సరోగసీ ద్వారా ఐవీఎఫ్ చికిత్స చేసే అవకాశం లేదని తెలియడంతో అద్దెగర్భం కోసం సంప్రదించిన దంపతులు ఒప్పందం నుంచి తప్పుకున్నారు. గతనెల 20న వెంకటమ్మను మధ్యవర్తి అరుణ పేట్లబుర్జు ఆస్పత్రిలో కాన్పు కోసం చేర్పించారు. అదేరోజు ఆడ శిశువుకు జన్మనిచ్చి అద్దెగర్భం ఒప్పందం వివరాలను ఆస్పత్రి వర్గాలకు తెలిపింది. సమాచారం అందుకున్న డీఎంహెచ్ఓ పద్మజ చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతనెల చివరివారంలో పోలీసులు వెంకటమ్మ, ఆమెకు జన్మించిన శిశువు, భర్త లక్ష్మణ్‌కు ఎఫ్ఎస్ఎల్‌లో డీఎన్ఏ పరీక్షలు చేయించారు. డీఎన్ఏ నమూనాలన్నీ ఒకేరీతిన ఉన్నాయంటూ నివేదిక అందిందని శనివారం చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఫలితాల సాధనే పరిశోధన లక్ష్యం కావాలి

- ఆలస్యమైనా నిరాశ చెందకూడదు
- భౌతిక శాస్త్రంలో నోబెల్ గ్రహీత డాక్టర్ టకాకి కజిత

ఈనాడు, విశాఖపట్నం: పరిశోధకులు ఆవిష్కరణలు, ఫలితాల సాధనే లక్ష్యంగా శోధనలు సాగించాలని.. జాప్యం జరుగుతున్నా నిరాశ చెందరాదని భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి విజేత జపాన్ శాస్త్రవేత్త డాక్టర్ టకాకి కజిత ఉద్బోధించారు. ప్రపంచ ప్రఖ్యాత 'యూనివర్సిటీ ఆఫ్ టోక్యో'లో కాస్మిక్ కిరణాల పరిశోధన కేంద్రం అధిపతిగా విధులు నిర్వర్తించిన ఆయన శనివారం గీతం విశ్వవిద్యాలయ 37వ వ్యవస్థాపక దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. న్యూట్రినోలు కూడా ఎలక్ట్రాన్లలాంటివేనన్న ఆయన వాటిపై పరిశోధన చేసినట్టు తెలిపారు. అందుకోసం భూగర్భంలో 50వేల టన్నుల సామర్థ్యంతో కామియోకాండే డిటెక్టర్‌ను నిర్మించాల్సి వచ్చిందని వివరించారు. ఆశించిన ఫలితాలు సాధించడానికి 12ఏళ్ల సమయం పట్టిందని వివరించారు. సంక్లిష్ట పరిశోధనల్లో వ్యక్తిగతంగా కన్నా బృందాలుగా ఏర్పడి ముందుకెళ్తే అద్భుత ఫలితాలు రాబట్టడానికి అవకాశం ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. తనకు మార్గదర్శిగా వ్యవహరించిన ఆచార్యుడు కూడా నోబెల్ బహుమతి గ్రహీతేనని వివరించారు. న్యూట్రినోలపై తదుపరి పరిశోధనలను భారతీయ పరిశోధకులు కొనసాగించగలరంటూ టకాకి కజిత ఆశాభావం వ్యక్తం చేశారు. గీతం అధ్యక్షుడు ఎం.వి.వి.ఎస్. మూర్తి మాట్లాడుతూ డాక్టర్ టకాకి 2015లో కెనడా దేశ భౌతికశాస్త్రవేత్త ఆర్థర్ బి మెక్‌డొనాల్డ్‌తో కలిసి నోబెల్ అందుకున్నారని వివరించారు. గీతం ఛాన్సలర్ డాక్టర్ కోనేరు రామకృష్ణారావు మాట్లాడుతూ గాంధేయ విలువల ప్రబోధమే లక్ష్యంగా విద్యాబోధన చేస్తున్నామని వివరించారు. గీతం వీసీ ఆచార్య ఎం.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ గీతం పరిశోధకులు ఇప్పటి వరకు వివిధ పరిశోధనలకు సంబంధించి 16 పేటెంట్లను సాధించారని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ టకాకి కజితను దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. గీతం వర్సిటీలో జపాన్ భాషలో డిప్లొమో కోర్సును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి పాఠ్యప్రణాళికను డాక్టర్ టకాకి చేతుల మీదుగా ఆవిష్కరించారు.



నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ టకాకి కజితను సన్మానిస్తున్న గీతం అధ్యక్షుడు ఎం.వి.వి.ఎస్.మూర్తి. చిత్రంలో గీతం ఛాన్సలర్ డాక్టర్ కె.రామకృష్ణారావు, వీసీ ఎం.ఎస్.ప్రసాదరావు

కర్ణాటక విజయమే కీలకం

- పార్టీ శ్రేణులకు అమిత్‌షా పిలుపు
- ముఖ్యమంత్రి అభ్యర్థిగా యడ్యూరప్ప

ఈనాడు- బెంగళూరు: వచ్చే ఏడాది జరగనున్న కర్ణాటక విధానసభ ఎన్నికల్లో విజయానికి పార్టీ శ్రేణులు క్రమశిక్షణగల సైనికుల్లా పోరాడాలని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా పిలుపునిచ్చారు. కర్ణాటక దిగువసభ ఎన్నికల వ్యూహరచన కోసం శనివారం నగరానికి వచ్చిన ఆయన విమానాశ్రయం వద్ద పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. 'వచ్చే ఎన్నికలను భాజపా రాష్ట్ర సమితి అధ్యక్షుడు యడ్యూరప్ప సారథ్యంలోనే ఎదుర్కొంటాం. ఎన్నికల్లో గెలిచి తీరుతాం. ఆయనే మన ముఖ్యమంత్రి అభ్యర్థి' అని పునరుద్ఘాటించారు. అవినీతికూపంగా మారిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలనే ప్రజల అభిమతాన్ని నెరవేర్చేందుకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. 'కర్ణాటకలో భాజపా ప్రభుత్వమే ఏర్పాటుకానుందని అవగాహన కల్పించేందుకే ఇక్కడికి వచ్చా. కేంద్ర సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రజలకు బాగా అవగతమయ్యేలా ప్రచారం చేయాలి' అని దిశానిర్దేశం చేశారు. ప్రధాని మోదీ ఫిబ్రవరి, మార్చి నెలల్లో దక్షిణాదిన విజయ రథయాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో భాజపా విజయపతాకను ఎగురవేయడమే ఆయన యాత్ర లక్ష్యమని వివరించారు. 2014 తర్వాత జరిగిన ఎన్నికల్లో భాజపాకు తిరుగులేని ప్రజాదరణ లభిస్తోందని చెప్పారు. దక్షిణ భారతానికి ప్రవేశద్వారమైన కర్ణాటకలో భాజపా కోసం తలుపులు మరో మారు తెరచుకోవటం ఖాయమని పేర్కొన్నారు. అమిత్‌షా మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో 150 కంటే ఎక్కువ స్థానాలను గెలిచి తీరుతామని ముఖ్యమంత్రి అభ్యర్థి యడ్యూరప్ప తెలిపారు. విమానాశ్రయం వద్ద కమలనాథులు అమిత్‌షాకు ఘనస్వాగతం పలికారు.

యువీ నిలుస్తాడా?

శ్రీలంకతో వన్డేలకు జట్టు ఎంపిక నేడే



దిల్లీ: 2019 వన్డే ప్రపంచకప్‌కు రెండేళ్లు కూడా సమయం లేదు. సెలక్టర్లు సీనియర్లను పక్కనబెట్టి కప్పు దిశగా కుర్రాళ్ల మీదే దృష్టిపెడితే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ధోని, యువరాజ్ సింగ్‌ల విషయంలో ఓ నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్న మాట విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్‌కు ఆదివారం జట్టును ఎంపిక చేయనున్న ఎమ్మెస్కే ప్రసాద్ బృందం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి నెలకొంది. ధోని విషయంలో హఠాత్తుగా నిర్ణయం తీసుకునే, అతడిపై వేటు వేసే సాహసం చేయకపోయినా గత కొన్ని సిరీస్‌ల నుంచి భారత జట్టుకు ఆడుతున్న యువరాజ్‌ను సెలక్టర్లు పక్కన పెట్టొచ్చన్న ఊహాగానాలు నడుస్తున్నాయి. లేదా చివరి అవకాశం కింద యువీని ఈ సిరీస్‌లో ఆడించొచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. గాయంతో ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమై, భారత్-ఎ జట్టు తరఫున సత్తా చాటిన మనీష్ పాండే వన్డే జట్టులోకి పునరాగమనం చేయడం లాంఛనమే. ధోనికి ప్రత్యామ్నాయం అవుతాడని భావిస్తున్న పంత్‌కూ జట్టులో చోటు దక్కొచ్చు.



ఆనంద్‌కు రెండో స్థానం

సెయింట్ లూయిస్ (అమెరికా): ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ సింక్వఫీల్డ్ కప్ చెస్ టోర్నీని ఉమ్మడిగా రెండో స్థానంతో ముగించాడు. వెస్లీ సో (అమెరికా)తో చివరి గేమ్‌ను డ్రాగా ముగించిన ఆనంద్ టోర్నీలో 2 విజయాలు, 7 డ్రాలతో 5.5 పాయింట్లు నెగ్గాడు. మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే, 5.5 పాయింట్లు) ఆనంద్‌తో సమానంగా నిలిచాడు. ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వచియర్ లాగ్రేవ్ (6) టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

భారత్ ఖాతాలో మరో కాంస్యం

అస్తానా: ఆసియా షాట్‌గన్ ఛాంపియన్‌షిప్‌లో భారత జోరు కొనసాగుతోంది. శనివారం షీరాజ్, మైరాజ్ అహ్మద్‌ఖాన్, వీర్‌సింగ్ బజ్వాలతో కూడిన పురుషుల స్కీట్ టీమ్ కాంస్య పతకం గెలుచుకుంది. వ్యక్తిగత స్కీట్ విభాగంలో షీరాజ్ షేక్ నాలుగో స్థానంతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. ఈ టోర్నీలో భారత్ ఇప్పటివరకూ ఏడు పతకాలు సాధించింది.

భారత అండర్-19 జట్టుదే సిరీస్



శుభ్‌మన్ గిల్

బ్రిస్టన్: ఇంగ్లాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను భారత అండర్-19 జట్టు రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో కైవసం చేసుకుంది. శనివారం మూడో వన్డేలో భారత్ 169 పరుగులతో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. మొదట శుభ్‌మన్ గిల్ (147; 127 బంతుల్లో 17×4, 2×6) మెరుపులతో భారత్ 7 వికెట్ల నష్టానికి 327 పరుగులు చేసింది. అనంతరం కమలేష్ (3/20), గిల్ (2/9)ల ధాటికి ఇంగ్లాండ్ 158 పరుగులకే కుప్పకూలింది. బాంటన్ (59) ఒక్కడే కాస్త పోరాడాడు.

బెంగళూరు నుంచి మలేసియాకు

తరలిపోయిన అండర్-19 ఆసియాకప్

దిల్లీ: అండర్-19 ఆసియాకప్ క్రికెట్ టోర్నీ భారత్ నుంచి తరలిపోయింది. షెడ్యూల్ ప్రకారం నవంబరులో బెంగళూరు ఈ టోర్నీకి ఆతిథ్యమివ్వాలి. ఐతే భద్రత కారణాలతో తమ జట్టును పంపేందుకు నిరాకరించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ).. టోర్నీని భారత్ వెలుపల నిర్వహించాలని ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ)ని కోరింది. బీసీసీఐ ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంతో టోర్నీని కౌలాలంపూర్‌లో నిర్వహించాలని ఏసీసీ నిర్ణయించింది.

ఛాంపియన్స్

200మీ. మళ్లీ షిప్పర్స్‌దే



మహిళల 200 మీటర్ల పరుగులో డాఫ్నె షిప్పర్స్ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. శుక్రవారం నువ్వానేనా అన్నట్టుగా సాగిన పోరులో ఈ నెదర్లాండ్స్ అమ్మాయి 22.05 సెకన్లలో రేసు ముగించింది. వరుసగా రెండోసారి ప్రపంచ అథ్లెటిక్స్‌లో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. ఐవోరి కోస్ట్ అథ్లెట్ మేరీ జోస్ టా లా (22.08) సెకన్లో మూడొందుల వంతు తేడాతో రజతానికి పరిమితమైంది. 22.15 సెకన్లతో షానె మిల్లర్ (బహామాస్) కాంస్యం సొంతం చేసుకుంది. మిగతా విభాగాల్లో అమెరికా అథ్లెట్ల హవా కొనసాగుతోంది. మహిళల లాంగ్‌జంప్, స్టీపుల్ ఛేజ్ విభాగాల్లో స్వర్ణం అమెరికానే ఎగరేసుకుపోయింది. లాంగ్‌జంప్‌లో బ్రిట్నీ రీజ్ (7.02 మీటర్లు) విజేతగా నిలవగా.. స్టీపుల్‌ఛేజ్‌లో ఎమ్మా కోబర్న్ (అమెరికా) స్వర్ణం సొంతం చేసుకుంది.

బోల్ట్ ముందుండి..!



- రిలే ఫైనల్లో జమైకా
- వేగంలో అమెరికా, బ్రిటన్ వెనకే

"కెరీర్‌లో ఆఖరి రేసుకు సిద్ధంగా ఉన్నాను. ఐతే బాధపడాల్సిన సమయం కాదిది. ప్రస్తుతం నాలోని భావనలను వర్ణించడానికి మాటలు చాలడం లేదు. ప్రేక్షకుల నుంచి లభిస్తున్న మద్దతు అద్భుతం. ఏదో తెలియని ఉత్సాహం ఇప్పుడు నాలో ఉంది" – బోల్ట్

లండన్

జమైకా పరుగుల చిరుత ఉసేన్ బోల్ట్ రేసులో ఎప్పుడూ ముందుంటేనే అందం..! రేసు ఆఖరికి వచ్చేసరికి విజయానందంలో తనతో పోటీపడేవారెక్కడున్నారోనని అతడు తల పక్కకు తిప్పి చూస్తేనే ఆకర్షణ..! పరుగుకు వీడ్కోలు చెబుతున్న బాధో ఏమో గానీ.. ఈ దృశ్యాలు లండన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇంకా కనిపించలేదు. మరి కెరీర్లో చివరి పరుగు పోటీలోనైనా ఆ పాత బోల్ట్‌ను చూడగలమా..? ప్రపంచ అథ్లెటిక్స్‌లో తొమ్మిది స్వర్ణాలతో తిరుగులేని రికార్డు కలిగిన ఉసేన్ పది పసిడి పతకాలతో కెరీర్‌కు ఘనంగా ముగింపు పలుకుతాడా..? గతంతో పోల్చుకుంటే ఈసారి స్వర్ణం సాధించేందుకు బోల్ట్ చాలా కష్టపడాల్సిన పరిస్థితి. వ్యక్తిగత విభాగంలో మాత్రమే కాదు.. రిలేలోనూ అతడికి పరిస్థితులు అనుకూలంగా లేవు! శనివారం 4×100 మీటర్ల రిలే రెండో హీట్స్‌లో పోటీపడిన జమైకా 37.95 సెకన్లలో రేసు ముగించి అగ్రస్థానంలో నిలిచింది. ఆఖరి అంచెలో బ్యాటన్ అందుకున్న బోల్ట్ ఎలాంటి పొరపాటు చేయకుండా లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఐతే టైమింగ్‌లో జమైకాకు రెండు, మూడు స్థానాల్లోని ఫ్రాన్స్ (38.03 సెకన్లు), చైనా (38.20 సెకన్లు)లకు పెద్దగా తేడా ఏమీ లేదు. మొత్తం హీట్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే వేగంలో జమైకా మూడో స్థానంలో నిలిచింది. తొలి హీట్స్‌లో అమెరికా (37.70 సెకన్లు) అగ్రస్థానంలో నిలవగా.. బ్రిటన్ (37.76 సెకన్లు) రెండో స్థానం సాధించింది. అమెరికా ఈ సీజన్‌లో అత్యంత వేగవంతమైన సమయాన్ని నమోదు చేయడం విశేషం. ఫైనల్లో అమెరికా అథ్లెట్లు ఇదే రీతిలో పరుగెడితే మాత్రం.. ఉసేన్ బోల్ట్ స్వర్ణంతో కెరీర్ ముగించడం అంత తేలికేం కాదు. జపాన్, టర్కీ, కెనడా కూడా ఫైనల్‌కు అర్హత పొందాయి. తాను పోటీపడిన చివరి ఆరు రిలేల్లో బోల్ట్ జమైకాకు స్వర్ణాన్ని అందించాడు. ఐతే.. ఇంతకుముందులా ఇప్పుడు పావెల్, యాష్‌మీడ్, కార్టర్‌ల మద్దతు అతడికి లేదు. అనుభవజ్ఞుడు ఉన్నాడంటే అది బ్లేక్ మాత్రమే. మరి ఈ సవాల్‌ను అధిగమించి బోల్ట్ చివరి పరుగును పసిడిమయం చేసుకుంటాడా?

రిలేలో విఫలం: 4×400 మీటర్ల రిలే ఫైనల్ చేరడంలో భారత జట్లు విఫలమయ్యాయి. పురుషుల తొలి హీట్స్‌లో మహ్మద్ కున్హు, జాకబ్ అమోజ్, మహ్మద్ అనాస్, అరోకియా రాజీవ్‌లతో కూడిన భారత బృందం 3 నిమిషాల 2.08 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఐదో స్థానంలో నిలిచింది. తొలి మూడు స్థానాల్లోని జట్లు ఫైనల్‌కు అర్హత పొందాయి. మహిళల విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా పరుగు తీసిన జిస్న మాథ్యూ, పూవమ్మ, అనిల్డ థామస్, నిర్మలలతో కూడిన భారత జట్టుపై అనర్హత వేటు పడింది.

సగం సగం

- తొలి రోజు నువ్వానేనా
- చివరి టెస్టుకు ఆసక్తికర ఆరంభం

- సత్తా చాటిన ధావన్, రాహుల్
- కళ్లెం వేసిన లంక స్పిన్నర్లు
- భారత్ 329/6



"రాజు లాగా ఆడినపుడు ఔటవడంలోనూ రాజసం ఉండాలని నేను సరదాగా అంటుంటా. నేనీ రోజు దూకుడుగా బ్యాటింగ్ చేశాను. అలా ఆడే ఔటయ్యాను కూడా. తొలి రోజు మేం మెరుగైన స్కోరే చేశాం. ఇప్పుడు క్రీజులో ఉన్నవాళ్లు బాగా ఆడతారు కాబట్టి భారీ స్కోరు చేయగలమని ఆశిస్తున్నాం" –ధావన్

ధావన్ 119

40వ ఓవర్ అయిపోవస్తోంది.. పరుగులేమో 188.. ఒక్కటంటే ఒక్క వికెట్ పడలేదు.. రన్‌రేట్ 5కు చేరువగా ఉంది. . భారత ఓపెనర్లు ఏ తడబాటూ లేకుండా స్వేచ్ఛగా ఆడేస్తున్నారు.. శ్రీలంక జట్టులో నిస్తేజం కనిపిస్తోంది.. అప్పటి పరిస్థితి చూస్తే భారత్ తొలి రోజే స్కోరు 400 దాటేసేలా.. తొలి రోజే మ్యాచ్‌పై పట్టు బిగించేసేలా.. మూడో టెస్టు కూడా ఏకపక్షంగా సాగిపోయేలా కనిపించింది.

కానీ ప్రతికూల పరిస్థితుల్లో లంక పుంజుకుంది. చక్కటి పోరాట పటిమను ప్రదర్శించింది. బౌలింగ్‌లో, ఫీల్డింగ్‌లో స్ఫూర్తిమంతమైన ప్రదర్శనతో సిరీస్‌లో తొలిసారి మ్యాచ్ తొలి రోజు భారత్‌కు గట్టి పోటీ ఇచ్చింది. మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చింది. ఓ దశలో 188/0 ఉన్న భారత్.. తొలి రోజు ఆటను 329/6తో ముగించింది. ఇప్పటికీ భారత్ మెరుగైన స్థితిలోనే ఉంది కానీ.. ఈ మ్యాచ్ తొలి రెండు టెస్టుల్లా ఏకపక్షంగా అయితే సాగదన్నది స్పష్టం.



మలింద 3/40

ఏ సెషన్లో ఎన్ని?

భారత్ బ్యాటింగ్

లంచ్‌కు ముందు	
ఓవర్లు	27
పరుగులు	134
వికెట్లు	0

లంచ్ తర్వాత	
ఓవర్లు	29
పరుగులు	101
వికెట్లు	3

టీ తర్వాత	
ఓవర్లు	34
పరుగులు	94
వికెట్లు	3

పల్లెకెలె

భారత్-శ్రీలంక టెస్టు సిరీస్‌లో తొలిసారి ఓ మ్యాచ్ నువ్వానేనా అన్నట్లుగా ఆరంభమైంది. ఇప్పటికే సిరీస్ చేజార్చుకున్న లంక.. నామమాత్రమైన చివరి టెస్టులో పోరాట పటిమ చూపింది. టాస్ గెలిచి వరుసగా మూడో మ్యాచ్‌లోనూ మొదట బ్యాటింగ్ చేసి, ఘనంగా ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌కు లంక బౌలర్లు కళ్లెం వేశారు. ఓపెనర్లు రాణించినా.. మిడిలార్డర్ విఫలమవడంతో భారత్.. ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. శిఖర్ ధావన్ (119; 123 బంతుల్లో 17×4) ఫామ్ కొనసాగిస్తూ సిరీస్‌లో రెండో శతకం అందుకున్నాడు. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (85; 135 బంతుల్లో 8×4) సత్తా చాటాడు. ఐతే వీళ్లిద్దరూ ఇచ్చిన మెరుపు ఆరంభాన్ని భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆట రెండో అర్ధంలో తడబడి వికెట్లు కోల్పోయింది. పెద్దగా అనుభవం లేని స్పిన్నర్లు మలింద పుష్పకుమార (3/40), సండకాన్ (2/84) భారత్‌ను దెబ్బ తీశారు. ఆట ఆఖరుకు సాహా (13), పాండ్య (1) క్రీజులో ఉన్నారు. రెండో రోజు వీళ్లిద్దరూ ఎంతసేపు బ్యాటింగ్ చేస్తారన్నదానిపై భారత్ ఎంత స్కోరు చేస్తుందో ఆధారపడి ఉంటుంది. పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తున్న నేపథ్యంలో మ్యాచ్‌లో మున్ముందు బ్యాటింగ్ చేయడం కష్టమే.

అలా మొదలై..: మూడో టెస్టు తొలి రోజు సగం ఆట వరకు భారత్ తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తే.. రెండో సగంలో లంక పైచేయి సాధించింది. 39.2 ఓవర్లలో భారత్ వికెట్ నష్టపోకుండా 188 పరుగులు చేస్తే.. తర్వాతి 50.4 ఓవర్లలో ఏకంగా 6 వికెట్లు కోల్పోయి 141 పరుగులే చేయడం గమనార్హం. దీన్ని బట్టే శనివారం ఆట ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. తొలి సెషన్లో లంక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బ తీసేలా సాగింది భారత ఓపెనర్ల ఆట. ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఔటయ్యే ప్రమాదం తప్పించుకున్న ధావన్.. ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. అతడి క్యాచ్ స్లిప్‌లో చేజారడం లంకేయులపై ప్రభావం చూపింది. అప్పటికి ధావన్ స్కోరు 1. తర్వాత అతను వన్డే తరహాలో ధాటిగా ఆడుతూ లంక బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీశాడు. అతను 45 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేయడం విశేషం. రాహుల్ కూడా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. అతను 67 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. రాహుల్ కూడా 29 పరుగుల వద్ద జీవనదానం పొందాడు. ఇటు ధావన్, అటు రాహుల్ పోటీ పడి షాట్లు ఆడుతూ.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించడంతో తొలి సెషన్లో లంక దిక్కు తోచని స్థితిలో పడింది. రన్‌రేట్ దాదాపు 5తో సాగడం విశేషం. లంచ్ విరామానికి 27 ఓవర్లలో భారత్ 134/0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. ముఖ్యంగా ధావన్ స్పిన్నర్ల బౌలింగ్‌లో చాలా దూకుడుగా ఆడుతూ సెంచరీకి చేరువయ్యాడు.

ఇలా ముగిసింది..: ఆట ఏకపక్షంగా సాగిపోతున్న సమయంలో శ్రీలంక ఎట్టకేలకు 40వ ఓవర్లో పోటీలోకి వచ్చింది. ఒకే టెస్టు అనుభవమున్న స్పిన్నర్ పుష్పకుమార లంకకు తొలి వికెట్ అందించాడు. అరంగేట్ర టెస్టులో విఫలమైన నేపథ్యంలో తొలి సెషనంతా పుష్పకుమారకు బంతే ఇవ్వని లంక కెప్టెన్ చండిమాల్.. 40వ ఓవర్లో అతణ్ని దించాడు. ఐతే అతను తన తొలి ఓవర్లోనే రాహుల్‌ను ఔట్ చేశాడు. అతడి క్యాచ్‌ను లాంగాన్‌లో కరుణరత్నె అందుకున్నాడు. ఆ వెంటనే ధావన్ సెంచరీ పూర్తయింది. తర్వాత అతను ఎంతోసేపు క్రీజులో నిలవలేదు. రాహుల్ లాగే ధావన్ కూడా భారీ షాట్‌కు ప్రయత్నించే వెనుదిరిగాడు. అతడి వికెట్టూ పుష్పకుమారకే దక్కింది. ధావన్ క్యాచ్‌ను చండిమాల్ కళ్లు చెదిరే రీతిలో అందుకున్నాడు. జోరుమీదున్న ఓపెనర్లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేర్చిన ఉత్సాహంలో లంక.. భారత్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేసింది. బౌలర్లు క్రమశిక్షణతో, సరైన ప్రదేశాల్లో బంతులేస్తూ బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టారు. గత మ్యాచ్‌తో పోలిస్తే మలింద లెంగ్త్ మార్చి బంతులేశాడు. పిచ్ నుంచి సహకారం అందడంతో ఎక్కువగా గుడ్, ఫుల్ లెంగ్త్ బంతులతో బ్యాట్స్‌మెన్‌కు సవాలు విసిరాడు. అతడి బౌలింగ్‌లో పరుగులు చేయడం కష్టమైంది. 18 ఓవర్లలో మలింద 40 పరుగులే ఇవ్వడం విశేషం. మరో స్పిన్నర్ సండకాన్ కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. టీకి ముందే పుజారా (8).. సండకాన్ బౌలింగ్‌లో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చాడు. విరామానంతరం కాసేపటికే రహానె (17) మలింద బంతిని అర్థం చేసుకోలేక బౌల్డయ్యాడు. ఆట చివరి గంటలో భారత్ ఇంకో రెండు వికెట్లు కోల్పోయింది. మరో ఎండ్‌లో సంయమనంతో బ్యాటింగ్ చేసిన కోహ్లి (42; 84 బంతుల్లో 3×4) కూడా ఆఫ్ సైడ్ ఆవల పడ్డ బంతిని డ్రైవ్ చేసే ప్రయత్నంలో స్లిప్‌లో చిక్కాడు. క్రీజులో కుదురుకున్న అశ్విన్ (31) కూడా ఇంకో పది నిమిషాల్లో ఆట ముగియబోతుండగా ఔటయ్యాడు. తొలి సెషన్లో 4.96గా ఉన్న భారత రన్‌రేట్ తర్వాతి రెండు సెషన్లలో 3.48, 2.76కు పడిపోవడమే కాక.. ఈ రెండు సెషన్లలో భారత్ మూడేసి వికెట్ల చొప్పున కోల్పోవడాన్ని బట్టి లంక ఎలా పుంజుకుందో అర్థం చేసుకోవచ్చు.

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ (సి) చండిమాల్ (బి) పుష్పకుమార 119; రాహుల్ (సి) కరుణరత్నె (బి) పుష్పకుమార 85; పుజారా (సి) మాథ్యూస్ (బి) సండకాన్ 8; కోహ్లి (సి) కరుణరత్నె (బి) సండకాన్ 42; రహానె (బి) పుష్పకుమార 17; అశ్విన్ (సి) డిక్వెలా (బి) ఫెర్నాండో 31; సాహా బ్యాటింగ్ 13; పాండ్య బ్యాటింగ్ 1; ఎక్స్‌ట్రాలు 13 **మొత్తం:** (90 ఓవర్లలో 6 వికెట్లకు) **329; వికెట్ల పతనం:** 1-188, 2-219, 3-229, 4-264, 5-296, 6-322; **బౌలింగ్:** విశ్వ ఫెర్నాండో 19-2-68-1; లహిరు కుమార 15-1-67-0; కరుణరత్నె 5-0-23-0; దిల్‌రువాన్ పెరీరా 8-1-36-0; సండకాన్ 25-2-84-2; పుష్పకుమార 18-2-40-3




7 వరుసగా రాహుల్ 50+ స్కోర్ల ఇన్నింగ్స్‌లు. అతను వరుసగా అత్యధిక ఇన్నింగ్స్‌ల్లో 50+ స్కోర్లు చేసిన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. ఎవర్టన్ వీక్స్ (వెస్టిండీస్), ఆండీ ఫ్లవర్ (జింబాబ్వే), చందర్‌పాల్ (వెస్టిండీస్), సంగక్కర (శ్రీలంక), క్రిస్ రోజర్స్ (ఆస్ట్రేలియా) ఈ జాబితాలో ఉన్నారు. తర్వాతి ఇన్నింగ్స్‌లోనూ 50 దాటితే అతనొక్కడి పేరిటే రికార్డుంటుంది.

2 ఈ సిరీస్‌లో ధావన్ శతకాలు. ఓ సిరీస్‌లో రెండు సెంచరీలు చేయడం అతడికిదే తొలిసారి.

6 టెస్టుల్లో ధావన్ సెంచరీలు. ఇందులో ఐదు విదేశాల్లోనే సాధించినవే.

188 ధావన్, రాహుల్ జోడించిన పరుగులు. శ్రీలంకలో శ్రీలంకపై భారత్‌కు ఇదే అత్యుత్తమ తొలి వికెట్ భాగస్వామ్యం.




టైటాన్ రైడర్‌ను పట్టేసిన యూపీ ఆటగాళ్లు

ఓటమి నం.6

తెలుగు టైటాన్స్‌కు మరో పరాజయం

బెంగళూరు: ప్రొ కబడ్డీ ఐదో సీజన్లో తెలుగు టైటాన్స్ తన పరాజయాల పరంపరను స్వల్ప విరామంతో మళ్లీ కొనసాగించింది. ఐదు వరుస ఓటముల తర్వాత ఓ మ్యాచ్‌ను టైగా ముగించిన టైటాన్స్.. మళ్లీ పరాజయం చవిచూసింది. శనివారం తెలుగు జట్టు 32-39తో యూపీ యోధాస్ చేతిలో ఓడింది. ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన టైటాన్స్‌కు మొత్తంగా ఇది ఆరో ఓటమి. కెప్టెన్ రాహుల్ చౌదరి ఎప్పట్లాగే జట్టును గెలిపించడానికి విఫలయత్నం చేశాడు. అతను 12 పాయింట్లు సాధించడం విశేషం. కానీ సహచరుల నుంచి అతడికి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదు. ప్రథమార్ధంలో 13-14తో వెనుకబడ్డ టైటాన్స్.. రెండో అర్ధభాగంలో 16-14తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 24-22తో గెలుపు దిశగా సాగుతున్నట్లే కనిపించింది. కానీ చివరి నిమిషాల్లో యూపీ ఆటగాళ్లు దూకుడుగా ఆడి టైటాన్స్‌కు షాకిచ్చారు. ఈ సీజన్లో నాలుగు మ్యాచ్‌లే ఆడిన యూపీ 15 పాయింట్లు గ్రూప్-బిలో మూడో స్థానంలో ఉంటే.. ఎనిమిది మ్యాచ్‌లాడిన టైటాన్స్ కేవలం 12 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. గ్రూప్-ఎలో జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ 29-25తో దబాంగ్ దిల్లీని ఓడించింది. గుజరాత్ ఆటగాడు సచిన్ 8 రైడ్ పాయింట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఇక 'క్రికెట్లో' తలదూర్చను



దిల్లీ: రాజస్థాన్ క్రికెట్ సంఘం(ఆర్‌సీఏ)లో ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ కథ ముగిసింది. ఆర్‌సీఏలోని నాగౌర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష పదవికి అతడు రాజీనామా చేశాడు. మళ్లీ తాను క్రికెట్ పరిపాలనలోకి అడుగు పెట్టనని కూడా ప్రకటించాడు. ఈ మేరకు తన రాజీనామా లేఖను బీసీసీఐ ముఖ్య కార్యనిర్వాహక అధికారి రాహుల్ జోహ్రికి పంపాడు. ఆర్థిక అవకతవకలకు సంబంధించి 2010లో మోదీని బీసీసీఐ బహిష్కరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేసిన కేసులు కూడా ఉన్నాయి. దీంతో చాలా కాలం నుంచి మోదీ లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నాడు. అక్కడి నుంచే రాజస్థాన్ క్రికెట్ సంఘాన్ని శాసిస్తూ వచ్చాడు. బీసీసీఐకి ఇది ఆగ్రహం తెప్పించింది. ఆర్‌సీఏను నిషేధించింది. ఆ సంఘానికి నిధుల విడుదలను కూడా ఆపు చేసింది. మోదీ రాజీనామాతో మళ్లీ ఆర్‌సీఏను బీసీసీఐ గుర్తించే అవకాశం ఉంది.



పేరుపాలెం తీరానికి కొట్టుకువచ్చిన డాల్ఫిన్ మృతదేహం

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్‌లోని కనక దుర్గా బీచ్‌కు శనివారం డాల్ఫిన్ కళేబరం కొట్టుకువచ్చింది. సముద్రంలో మృతి చెందిన ఆ జీవి అధిక పోటు ప్రభావంతో ఒడ్డుకు కొట్టుకువచ్చి ఇసుక తిన్నెలపై చిక్కుకొని ఇలా నిలిచిపోయింది. సముద్రంలో చేపల వేట సాగించే మరపడవలు, చమురు నిక్షేపాలను అన్వేషిస్తున్న సంస్థలకు చెందిన బోట్లు తగలడం వల్లనో, కాలుష్యం ప్రభావంతోనో ఈ జీవులు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. 6 నెలల క్రితం ఇలాగే మూడు డాల్ఫిన్ మృతదేహాలు కొట్టుకువచ్చాయి. **-న్యూస్‌టుడే, మొగల్తూరు**

నందన్‌కానన్ జూలో తెల్లపులి మృతి

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని నందన్‌కానన్ జంతు ప్రదర్శనశాలలో కుసుం అనే తెల్లపులి శనివారం మృతి చెందింది. నందన్ కానన్ జూలో 1999 డిసెంబర్ 27న కుసుం శ్రేయా, రామ్ అనే పులులు కుసుంకు జన్మనిచ్చాయి. 18ఏళ్లు నిండిన కుసుం వృద్ధాప్యానికి చేరుకోవడంతో గతనెల జులైలో అనారోగ్యానికి గురైంది. దీంతో ఎన్‌క్లోజర్ నుంచి ఫీడింగ్ ఛాంబర్‌కు పులిని తరలించి అక్కడే వైద్యులు చికిత్స చేస్తుండేవారు. గత 10 రోజులుగా పులి నడవలేని స్థితికిచేరుకుంది. 3రోజులుగా ఆహారంకూడా తీసుకోలేక శనివారం మృతి చెందింది.

'రెండాకుల' సాధనే లక్ష్యం..!

- ఈసీ ద్వారా శశికళ, దినకరన్‌లకు అడ్డుకట్ట
- పళని, పన్నీర్ వర్గాల పక్కా ప్రణాళిక
- ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక నిర్వహించండి: దీప



అన్నాడీఎంకే పార్టీ చిహ్నం

చెన్నై: అధికారంలో ఉన్నా వర్గాలుగా చీలిపోవడంతో అన్నాడీఎంకే ప్రస్తుతం ఆటుపోట్లను ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో వరుసగా రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ... జయలలిత మరణం తర్వాత అష్టకష్టాలను చవిచూస్తోంది. ఇంతవరకు ఆమె నిర్వర్తించిన ప్రధాన కార్యదర్శి పదవి ఇప్పుడు మరోసారి చర్చనీయాంశం అయింది. ఎంజీఆర్ ఉన్నంతవరకు ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రిగానూ ఆయనే కొనసాగారు. తర్వాత జానకీ రామచంద్రన్ కొద్దికాలం ముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. అనంతరం పార్టీని జయలలిత నడిపించారు. ఆమె కూడా సీఎం, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవులను అధిష్ఠించారు. ఆమె మరణంతో ఆ రెండు పదవులను చేపట్టాలనుకున్న శశికళ జైలుపాలు కావడం, తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు పార్టీని ముక్కలు చేశాయి. దీంతో ఇంతకాలం కొనసాగిన జోడు పదవుల సంప్రదాయం ఇకపై అన్నాడీఎంకేలో కనుమరుగు కానుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ప్రధానకార్యదర్శి పదవికోసం పీటముడి

పన్నీర్, పళని వర్గాలు ఏకమవడానికి చర్యలు ప్రారంభమైనప్పుడు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవిపై పీటముడి పడింది. ముఖ్యమంత్రిగా పళనిస్వామిని కొనసాగించి పన్నీర్‌ను ఉప ముఖ్యమంత్రిగా చేయడానికి పళని వర్గం అంగీకరించింది. ఆ మేరకు అన్నాడీఎంకే రెండు వర్గాల మధ్య ఒప్పందం జరిగింది. ఉప ముఖ్యమంత్రితోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి కూడా ఇస్తేనే అనే మెలికను పన్నీర్ వర్గం తెరపైకి తెచ్చిందని సమాచారం. టీటీవీ దినకరన్ దూకుడుకు కళ్లెం వేయడానికి గానూ దీనికి కూడా పళనిస్వామి వర్గం అంగీకరించిందని తెలిసింది. మరోవైపు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నికలు నిర్వహించాలని జయలలిత మేనకోడలు దీపా జయకుమార్ తాజాగా ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.

ఈసీ నిర్ణయం తరువాతే..

ఇప్పటికే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ఉప ప్రధాన కార్యదర్శి పదవుల్లో ఉన్న శశికళ, దినకరన్‌ల నియామకం విషయం ఈసీ పరిధిలో ఉంది. ఆ నియామకాలు చెల్లవని ప్రకటించాలని పన్నీర్‌సెల్వం వర్గం ఈసీని కోరింది. అక్కడి నుంచి స్పష్టమైన ప్రకటన వస్తే వెంటనే విలీనమవ్వాలని, లేకుంటే ఆలోచించాలనే ధోరణిలో ఆ వర్గం ఉందని ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో దినకరన్, శశికళలను పూర్తిగా పార్టీకి దూరం చేసి ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి పదవులను పంచుకుని ముందుకు సాగడమే లక్ష్యంగా పళని, పన్నీర్ పావులు కదుపుతున్నారు. ఎన్నికల సంఘం స్తంభింపజేసిన పార్టీ గుర్తు రెండాకుల చిహ్నాన్ని సాధించుకోవడానికి ఇంతకంటే వేరే దారిలేదని వారిద్దరు సమాధానం చెబుతున్నారు. తద్వారా దినకరన్ వైపు వెళ్లే ఎమ్మెల్యేలను కట్టడి చేయవచ్చని, ప్రభుత్వం పూర్తి కాలం అధికారంలో కొనసాగుతుందని పళనిస్వామి తన వర్గానికి నచ్చ చెబుతున్నట్లు తెలుస్తోంది.

గుండెపోటుతో వరుడు హఠాన్మరణం

- ముహూర్తానికి కొన్ని గంటల ముందు ఘటన



పెళ్లి కొడుకుగా రవీంద్ర

ముంబయి, న్యూస్‌టుడే: మరికొన్ని గంటల్లో మూడుముళ్లు వేసి కొత్త జీవితానికి స్వాగతం పలకాల్సిన వరుడు గుండెపోటుతో కన్నుమూసిన విషాద ఘటన ఇది. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా మీరజ్‌కు చెందిన రవీంద్ర పిసే(27)కు కొల్హాపూర్ జిల్లా కస్‌బాబవ్‌డాకు చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. శనివారం ఉదయం మీరజ్‌టాక్లీ రోడ్డులోని షాహీదర్బార్ మంగళహాల్‌లో ఉదయం 11.45గంటలకు పెళ్లి జరగాల్సి ఉంది. పెళ్లికొడుకు రవీంద్ర, కుటుంబసభ్యులు మండపానికి బయల్దేరేందుకు ఉదయం 8.30గంటలకు సిద్ధమవుతుండగా, ఛాతినొప్పితో రవీంద్ర అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా రవీంద్ర అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దివ్యాంగుల కోసం స్మార్ట్ కుర్చీ

బాలాసోర్: ఒడిశా యువ శాస్త్రవేత్త నీలా మధబ్ బెహెరా(19) ఓ స్మార్ట్ కుర్చీని అభివృద్ధి చేశారు. మెదడు నుంచి వెలువడే సూక్ష్మతరంగ పౌనఃపుణ్యంతో నియంత్రించేందుకు వీలుగా ఉన్న ఈ కుర్చీ.. దివ్యాంగులకు వరంగా మారే అవకాశముంది! సూక్ష్మతరంగాల ఆధారంగా స్మార్ట్ కుర్చీ ముందుకు, వెనుకకు కదులుతుందని బెహెరా వెల్లడించారు. దృష్టి సంబంధిత లోపాలతో బాధపడుతున్నవారు కూడా హెడ్‌ఫోన్ వంటి ఓ ప్రత్యేక పరికరాన్ని ధరించి.. కుర్చీని ఉపయోగించవచ్చునని తెలిపారు. స్మార్ట్ కుర్చీ అభివృద్ధి కోసం తాను మూడు నెలలు శ్రమించానని.. రూ.30 వేలు ఖర్చయ్యాయని పేర్కొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00